










# ఉపాధ్యాయుల కరదీపిక
# తెలుగు

## 8, 9 తరగతులు




రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

## మాతృస్తవము

*- గరిమెళ్ళ సత్యనారాయణ*

వందనమిదె గైకొనుమీ - భారత జననీ
భారత జననీ - మాపాలిటి రాణీ ॥వందన॥

నందనుల బ్రోవుమీ - ఆనందదాయినీ
ఆనందదాయినీ - మునిబృంద వందినీ ॥వందన॥

ముప్పది కోట్ల జనమునకు - మూలమాతవు
మూలమాతవు - మాపాలి నేతవు ॥వందన॥

మాదు భాగ్యములకునెల్ల - మహితకర్తవు
మహితకర్తవు - మా యఘువిహర్తవు! ॥వందన॥

ఉపనిషత్తులుద్భవించె యుదరమందున
ఉదరమందున - అవి నిదుర చెందునా! ॥వందన॥

సకల పురాణేతిహాససారభరితవు
సారభరితవు - ఓంకార మహితవు ॥వందన॥

సకల సంపదలకు నీవు సంగ్రహంబవు
సంగ్రహంబవూ! గర్వసంహారంబవు ॥వందన॥

సాత్విక విరోధమునకు జన్మశాఖవు
జన్మశాఖవు - పటుజనసమేతవు ॥వందన॥

యుద్ధశకము మాన్పునట్టి బుద్ధిశాలివి
బుద్ధిశాలివీ - అనిరుద్ధ ప్రజ్ఞవీ ॥వందన॥

స్వరాజ్యదీక్ష గొనిన సత్యమూర్తివి
సత్యమూర్తివీ - అసహాయవర్తివీ ॥వందన॥

## తెలుగుతోట

*- కందుకూరి రామభద్రరావు*

ఎంత చక్కనిదోయి ! ఈ తెలుగు తోట
ఎంత పరిమళమోయి ! ఈ తోట పూలు
ఏ నందనము నుండి
యీ నారు తెచ్చిరో!
ఏ స్వర్ణదీ జలము
లీ మడుల కెత్తిరో!
ఇంత వింతల జాతు లీ తోటలో పెరుగు
ఈ తోట యేపులో నింత నవకము విరియు!
ఏ యమృత హస్తాల
ఏ సురలు సాకిరో
ఏ యచ్చరల మురువు
లీ తీరు దిద్దెనో!
ఈ పూల పాలలో నింత తీయందనము!
ఈ లతల పోకిళ్ళ కింత ఒయ్యారమ్ము!
ఏ మహత్తర శక్తు
లీ తోటలో గలవొ!
ఏ దివ్య తేజమున
కీ పూలలో నెలవొ
ఈ తోటపై గాలి యింతమెయి సోకెరా!
ఈ నీరసిలు బ్రదుకె యింత చివురింపనా!
మాయమ్మ వలపు వలె
రవి బింబ దీప్తివలె
హిమనగోన్నతి వోలె
ఋషివాక్కు మహిమవలె
నా యెడందను రేపు నా తెలుగు తోటలో
పాడుకొన నిండోయి ! పలవింపనిండోయి!

# ఉపాధ్యాయుల కరదీపిక

## తెలుగు

## 8, 9 తరగతులు

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

## రూపొందించినవారు

**శ్రీ వి.శరత్‌బాబు,** తెలుగు పండిత్, అంబర్‌పేట్, హైదరాబాదు జిల్లా.

**శ్రీ వి.చెన్నయ్య,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), జగిద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.

**శ్రీ సిహెచ్.వి.ఎస్.ఎన్.శర్మ,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), తూర్పుగోదావరి జిల్లా.

**శ్రీ మువ్వల రాంబాబు,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), జి కోడూరు, విశాఖపట్నం జిల్లా.

**డా॥ దోనెపూడి నరేశ్‌బాబు,** తెలుగు పండిట్, గోస్పాడు, కర్నూలు జిల్లా.

**డా॥ యస్.రఘు,** తెలుగు పండిత్, నామవరం, నల్లగొండ జిల్లా.

**శ్రీ ఎ. భానుప్రకాశ్,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), లోనికలాన్, మెదక్ జిల్లా.

**శ్రీ ఎల్.ఎమ్.ప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), హైదరాబాదు జిల్లా.

**శ్రీ పి.మాధవి,** తెలుగు పండిత్, భారతీయ విద్యాభవన్, హైదరాబాదు జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్,** స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), మహబూబ్‌నగర్ జిల్లా.

## విషయనిపుణులు, ఎడిటింగ్

**శ్రీ సువర్ణ వినాయక్,**
కో-ఆర్డినేటర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

**డా॥ డి.సాంబమూర్తి,**
విశ్రాంత ప్రధానాచార్యులు,
ఉపాధ్యాయ విద్యాకళాశాల,
వరంగల్.

**డా॥ పోరంకి దక్షిణామూర్తి**
విశ్రాంత ఉపసంచాలకులు, తెలుగు అకాడమి, హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,**
సంచాలకులు,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

## ముఖ్య సలహాదారులు

**శ్రీమతి వి.ఉషారాణి, I.A.S.,**
కమీషనర్, పాఠశాలవిద్య, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# ముందుమాట

విద్యార్థి సర్వాంగీణ వికాసం లక్ష్యంగా పాఠ్యపుస్తకాలు రూపొందించే ప్రయత్నం గత మూడు సంవత్సరాలుగా సాగుతున్నది. ఈ ప్రయత్న ఫలంగానే గత సంవత్సరం 3, 6, 7 తరగతుల పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఈ సంవత్సరం 4, 5, 8, 9 పుస్తకాలు మారాయి.

దేశ అవసరాలకనుగుణంగా, మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జాతీయ పాఠ్యప్రణాళికలో మార్పులు చేయడం, ఆ మార్గదర్శకాల ననుసరించి, రాష్ట్ర అవసరాలను నెరవేర్చే దిశలో ప్రాంతీయస్థాయిలో పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకొనిరావడం సహజమైన విషయాలే. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ రూపొందించిన పుస్తకాల గురించి ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కలిగితేనే అవి ఉద్దేశిత లక్ష్యాల సాధనకు దోహదం చేయగలుగుతాయి. ఆ ప్రయత్న సాఫల్యంకోసం, 8, 9 తరగతుల కొత్త తెలుగు పుస్తకాల అవగాహన, వినియోగసంబంధమైన సమగ్ర సమాచారంకోసం ఈ కరదీపికను రూపొందించారు.

పాఠ్యగ్రంథాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవడానికి దోహదం చేయడమే కరదీపిక ప్రధాన లక్ష్యం. పుస్తకాన్ని అవగాహన చేసుకోవడమంటే కేవలం అందులోని విషయాన్ని అర్థం చేసుకోవడంతోపాటు, ఆ విషయానికి నేపథ్యం, పుస్తకం తత్త్వం, అభ్యాసాల తత్త్వం, లక్ష్యసాధనకు ఏర్పరచుకున్న మార్గాలను ప్రయోగించడంలో మెలకువలూ అర్థంచేసుకున్నప్పుడే పుస్తకంపట్ల పూర్తి అవగాహన కలుగుతుంది. ఇది జరగాలంటే పాఠ్యగ్రంథం ఆమూలాగ్రం చదవాలి. అంటే ముందుమాట మొదలుకొని, 'పదవిజ్ఞానం' దాకా అన్ని అంశాలనూ అవగాహన చేసుకోవాలి.

సాధారణంగా 'పాఠ్యబోధన' అంటే పాఠాలను పూర్తిచేయడమనే అపోహ ఇప్పటికీ కొంతమంది ఉపాధ్యాయుల్లో ఉన్నది. ఈ చట్రంలోనుంచి బయటికొచ్చి, ఏ పాఠం ఏ ఉద్దేశంతో నిర్దేశించారు? ఏ అభ్యాసం ద్వారా ఏ లక్ష్యం సాధించాలి? ఏ ఏ ప్రశ్నలు ఏం ఏం ఆశిస్తున్నాయి? అనే విషయాలు లోతుగా ఆలోచించగలిగినప్పుడే ఉపాధ్యాయులు పాఠాన్ని అర్థవంతంగా బోధించడంతోపాటు, అనుకున్న లక్ష్యాలు సాధించడంలో తమవంతు పాత్ర సమర్థంగా పోషించగలుగుతారు. ఇది జరగాలంటే ముందుమాట, ఉపాధ్యాయులకు సూచనలు, పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలను బాగా అధ్యయనం చేయాలి.

సంగీత వాద్య యంత్రం ఎంత ఖరీదైనదైనా, అందులో ఎన్ని సౌకర్యాలూ సౌలభ్యాలున్నా, దాన్ని ఉపయోగించే వాద్యకారుడు సమర్థుడు కాకపోతే అది నిరర్థకమైనట్లే! పాఠ్యపుస్తకం ఎంత గొప్పగా ఉన్నా ఉపాధ్యాయుడు దాన్ని సరిగ్గా వినియోగించలేకపోతే అది ప్రయోజనశూన్యంగానే మిగులుతుంది. భాషాబోధకులు తమ శక్తిసామర్థ్యాలతో సంకల్పశుద్ధి, జిజ్ఞాస, పట్టుదల, కార్యసాధనాసక్తి, పిల్లలకు మేలుచేయాలన్న చిత్తశుద్ధితో కృషిచేయడం ద్వారా తనను తాను మెరుగుపరచుకొని ఉత్తమ ఫలితాల సాధనలో ముందుంటారు. పాఠ్యపుస్తకం ప్రభావవంతంగా తరగతి గదిలో ఉపయోగించడానికి అవసరమైన యోజనను, పాఠాల అమరికలోని ఆంతర్యాన్ని, బోధనలో అనుసరించాల్సిన వ్యూహాలను, అభ్యాసాలు చేయించడంలో మెలకువలను, తరగతి నిర్వహణ సామర్థ్యాన్ని గురించి కరదీపిక వివరంగా తెలియజేస్తుంది.

వీటితోపాటు మూల్యాంకన విధానాలు, ఉపాధ్యాయుని సంసిద్ధత, బోధనకు ఉపకరించే వనరులు, విశేషాంశాలు వంటి మరికొన్ని అంశాలు చేర్చారు. భాషోపాధ్యాయులు కరదీపికను అనుసరించి, పాఠ్యపుస్తకాన్ని సమగ్రాధ్యయనం చేయడంతోపాటు, పాఠ్యబోధనను నూతన విధానంలో వినియోగించినప్పుడే కొత్తపుస్తకాల లక్ష్యం నెరవేరుతుంది.

ఈ ప్రయత్నం సమగ్రంగా, సంపూర్ణంగా, విజయవంతంగా పూర్తికావడంలో అందరికీ బాధ్యత ఉందన్న విషయం మరువరానిది. ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ కృతజ్ఞతాపూర్వకంగా అభినందిస్తూ, పాఠ్యపుస్తకాల ప్రయోజనం నెరవేరడంలో అందరూ తమవంతు సహకారం అందిస్తారని ఆకాంక్షిస్తున్నాం.

సంచాలకులు
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్.

తేది : 30-04-2013
స్థలం : హైదరాబాదు

# విషయసూచిక


| వ.సం | అధ్యాయం పేరు | పేజి సంఖ్య |
|---|---|---|
| 1. | పాఠ్యపుస్తకం – తాత్త్వికత – అవగాహన | 5 |
| 2. | సామర్థ్యాలు – అభ్యాసాలు – అవగాహన | 9 |
| 3. | బోధనప్రణాళిక వ్యూహాలు – సోపానాలు | 25 |
| 4. | పాఠ్యపథకం – మాదిరి పాఠ్యపథకాలు | 32 |
| 5. | కొరియోగ్రఫీ | 157 |
| 6. | పాఠ్యబోధనకు భాషోపాధ్యాయుడు ఎలా తయారుకావాలి? | 160 |
| 7. | నూతన పాఠ్యపుస్తకాల బోధనకు ఉపకరించే వనరులు | 164 |
| 8. | నూతన పాఠ్యపుస్తకంలోని పాఠాలకుపకరించే విశేషాంశాలు | 169 |
| 9. | నిరంతర, సమగ్ర మూల్యాంకనం – నమూనా ప్రశ్నలు – ప్రశ్నపత్రాలు | 181 |
| | అనుబంధం | 211 |

# 1 పాఠ్యపుస్తకం - తాత్త్వికత - అవగాహన

**ఉపోద్ఘాతం :**

ఇతరులను సరిగా అర్థంచేసుకొంటూ బాధ్యతాయుతులైన పౌరులుగా పిల్లలందరూ రూపొందేందుకు ఉన్నత ప్రమాణాలుగల నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరి అందజేయడమే రాష్ట్రదృక్పథం. ఈ దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పనను చేపట్టింది. పిల్లల్ని ఆలోచింపజేసేలా, పిల్లలకున్న సహజ శక్తిసామర్థ్యాలను వినియోగించుకొంటూ నేర్చుకోవడానికి పాఠ్యపుస్తకాలు దోహదపడాలని సూచించింది.

ఇలా APSCF మార్గదర్శకాలననుసరించి నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించారు. విద్య ప్రాథమిక ఉద్దేశం పిల్లలందరూ బాధ్యతాయుతులైన పౌరులుగా తయారవడం. మన సంస్కృతిసంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రశంసిస్తూ సామాజిక మార్పుకు దోహదపడే వ్యక్తులుగా పిల్లలను తీర్చిదిద్దడమే ఈ పాఠ్యపుస్తకాల ధ్యేయం.

ఈ నూతన పాఠ్యపుస్తకాల తాత్విక అంశాలను అవగాహన చేసుకొనేముందు కింది ప్రశ్నల గురించి ఆలోచించండి. చర్చించండి.

1. *పాఠ్యపుస్తకాలు ఏ ఏ కీలక సూత్రాలు ఆధారంగా తయారయ్యాయి?*
2. *నూతన పాఠ్యపుస్తకాలలోని ప్రత్యేకతలు ఏమిటి?*
3. *8, 9 తరగతుల నూతన పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలను ఏ అంశాలను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేశారు?*
4. *పాఠ్యపుస్తకాలలో ఏ ఏ ప్రక్రియలను పరిచయం చేశారు?*
5. *ముందుమాటలోని ప్రధానాంశాలు ఏమిటి?*
6. *"ఉపాధ్యాయులకు సూచనలు" లో ప్రధానంగా ఏ ఏ అంశాలను చర్చించారు?*

పై ప్రశ్నలను చర్చించుకుంటూ 8, 9 తరగతుల పాఠ్యపుస్తకాలను పరిశీలించినట్లయితే ప్రధానంగా కొన్ని కీలక సూత్రాలను మనం గమనించవచ్చు. అవి:

**(అ) నూతన పాఠ్యపుస్తకాల తయారీకి ఆధారమైన కీలక సూత్రాలు:**

- భాషా విద్యా ప్రమాణాల సాధనకు దోహదపడడం.
- ఆలోచనాత్మకమైనదిగా ఉండటం (Thought provoking).
- పరస్పర ప్రతిచర్యలకు కేంద్రంగా ఉండడం (Interactive Centric).
- తోటివారి ద్వారా, అదనపు పఠన సామగ్రి ద్వారా, సమాజ సభ్యుల ద్వారా నేర్చుకోవడానికి దోహదపడడం.
- ఉన్నత వైఖరులు, మానవత్వపు విలువలు – సంబంధాలు పెంపొందించడానికి ఉద్దేశించినదిగా ఉండడం.
- భాషావినియోగ సామర్థ్యం పెంపొందించడం, వైవిధ్యభరిత వినియోగానికి ప్రాధాన్యమిచ్చేదిగా ఉండడం.
- సంస్కృతిసంప్రదాయాలు, కళలు, సాహితీప్రక్రియలకు సంబంధించిన పాఠ్యాంశాలు ఉండడం.
- అదనంగా ఇచ్చిన అంశాలు స్వయం అధ్యయనానికి దోహదపడేవిగా ఉండడం.
- సోపాన క్రమంలో బోధించడానికి వీలుగా పాఠాల అమరిక ఉండడం.

  దైనందిన జీవితానికి అన్వయించడం, ప్రతిస్పందించడం క్రమపద్ధతిలో వ్యక్తీకరించడం వంటివాటికి అవకాశం ఇవ్వడం.
- విమర్శనాత్మక దృక్పథాన్ని పెంచేవిగా ఉండడం.
- ఆనందంగా, అర్థవంతంగా నేర్చుకోవడానికి ఉద్దేశించినవిగా ఉండడం.
- బహుముఖ విశ్లేషణ, విమర్శన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉండడం.
- సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తి కలిగించడం.
- విద్యార్థుల స్వీయమూల్యాంకనానికి అవకాశం కల్పించడం.
- పాఠ్యాంశాలను ప్రతిబింబించే చిత్రాలతో ఆకర్షణీయంగా ఆసక్తి కలిగించేదిగా ఉండడం.
- సృజనాత్మకత, కల్పనాశక్తి పెంపొందించేదిగా ఉండడం.

**(ఆ) నూతన పాఠ్యపుస్తకాల భౌతిక లక్షణాలు:**

పాఠ్యపుస్తకం చూడగానే విద్యార్థులను ఆకర్షించేది దాని భౌతికలక్షణం. ఆ లక్షణాలను గురించి తెలుసుకొందాం.

**ముఖచిత్రం (కవర్‌పేజి) :**

పాఠ్యపుస్తక ముఖచిత్రాన్ని పుస్తకంలోని పాఠ్యాంశాలకు, సన్నివేశాలకు సంబంధించి ఉండేటట్లు ఆకర్షణీయంగా రూపొందించడం జరిగింది.

8వ తరగతి నవవసంతం–3 ముఖచిత్రం లోపలి పేజీల్లో తెలుగు గేయం, నాటినుండి నేటివరకు రాతసాధనాల చిత్రాలు ఉన్నాయి.

9వ తరగతి తెలుగు దివ్వెలు–1 వాచకం ముఖచిత్రం లోపలి పేజీల్లో తెలుగు వైభవాన్ని చాటిచెప్పే పద్యాలు, ప్రాఙ్నన్నయ యుగం నుండి ఆధునిక యుగం వరకు ఉన్న కవుల, రచయితల, ప్రక్రియ భేదాల వివరాలు పట్టిక రూపంలో ఉన్నాయి.

**పాఠ్యపుస్తక ముఖచిత్రాలు ఆధారంగా పిల్లలకు ఎలాంటి అభ్యాసం కల్పించవచ్చు? ఆలోచించండి.**

**చిత్రాలు :**

8వ తరగతిలో పిల్లలను ఆలోచింపజేసి పాఠంపై ఆసక్తికలిగించే ఉన్ముఖీకరణ చిత్రాలు ఉన్నాయి. 8, 9 తరగతుల వివిధ పాఠాలలోని సన్నివేశాలను ప్రతిబింబించేలా పాఠ్యాంశ చిత్రాలు ఉన్నాయి. సన్నివేశ చిత్రాలను చూసే పిల్లలు పాఠ్యాంశాన్ని కొంత ఊహించవచ్చు.

ప్రతి పాఠంలో పాఠ్యాంశ రచయిత / రచయిత్రి / కవులు / కవయిత్రుల చిత్రాలు, వారి గురించిన వివరాలు ఉన్నాయి.

**పాఠ్యపుస్తకాలలోని చిత్రాలతో పిల్లలకు కలిగే ప్రయోజనాలు ఏమిటి?**

**(ఇ) నూతన పాఠ్యపుస్తకాలలోని ప్రత్యేక అంశాలు:**

**1. పుస్తకాలకు పేరు పెట్టడం:**

6, 7 తరగతుల ననుసరించి 8వ తరగతి తెలుగు వాచకానికి నవవసంతం-3 అని పేరు, 9వ తరగతికి తెలుగుదనం ఉట్టిపడేలా తెలుగుదివ్వెలు-1 అని పేరు పెట్టారు.

**2. తెలుగుభాష విశిష్టతను తెలిపే అంశాలు:**

తెలుగుభాష గొప్పదనం తెలిపేవిధంగా కవర్‌పేజీ లోపలవైపు తెలుగుసీమ, తెలుగు గొప్పదనంపై గేయాలు, కవులు వారి కాలాలు వారి ప్రక్రియలతో కూడిన పట్టిక ఇచ్చారు. అవే కాకుండా కొన్ని పాఠ్యాంశాల చివర కూడా తెలుగు వెలుగును ప్రసరింపజేసేలా సమాచారం ఉంది.

**(ఈ) ముందుమాట:**

పాఠ్యపుస్తకాన్ని ఏ లక్ష్యంతో, ఏ ప్రయోజనంతో తయారుచేశారో, పాఠ్యపుస్తకం ద్వారా పిల్లలు ఏ ఏ సామర్థ్యాలను సాధించాలో ఉపాధ్యాయుల బాధ్యతలలేమిటో సంక్షిప్తంగా తెలియజేశారు. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాన్ని సమర్థంగా వినియోగించడానికి తరగతిగది వాతావరణం ఎలా ఉండాలో, ఉపాధ్యాయులు సమర్థబోధనకు అదనంగా ఏ వనరులను సమకూర్చుకోవాలో తెలియజేశారు.

**భాషాబోధన తరగతి గదుల్లోని వాతావరణం ఎలా ఉండాలి? పిల్లలను బహుకోణాల్లో ఆలోచింపజేసేలా పాఠ్యపుస్తకం ఉందనడానికి కొన్ని ఉదాహరణలు తెలపండి.**

**(ఉ) ఉపాధ్యాయులకు సూచనలు:**

ఉపాధ్యాయులకు సూచనలలో బోధనలోని వస్తువుతోబాటు ప్రక్రియావైవిధ్యాన్ని భిన్నశైలులను, రచనాసంవిధాన భేదాలను పిల్లలు అవగాహన చేసుకొనేలా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలని చెబుతూ పాఠ్యాంశ బోధన సోపానాల క్రమాన్ని తెలియజేశారు. అభ్యాసాల సాధనకు సామర్థ్యాలను మూడు భాగాలుగా విభజించి పిల్లలచేత ఎలాంటి కృత్యాలు చేయించాలో తెలియజేశారు. పిల్లల స్థాయిని అంచనా వేయడానికి ఏ ఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో కూడా వివరంగా ఇచ్చారు.

**ఉపాధ్యాయ సూచనలు బోధనకెలా తోడ్పడతాయి?**

**(ఊ) పాఠాల ఎంపిక - ఇతివృత్తాలు:**

నూతన పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాల ఇతివృత్తాలను పలు అంశాలను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేశారు. అందులో పర్యావరణం, మాతృభక్తి, సంస్కృతి, కుటుంబ విలువలు, నైతిక విలువలు, సామాజిక చైతన్యం, కళలు, వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, సాహిత్యాభిరుచి, వర్ణన, జాతీయ సమైక్యం, శాంతిస్థాపన, భాషాభిరుచి, స్త్రీచైతన్యం, కృతజ్ఞత, గ్రామీణ జీవనం, జీవకారుణ్యం మొదలైనవి అవగాహన చేసుకొనేలా వాటిపై అభిలాష పెంచుకొనేలా పాఠ్యాంశాలను ఎంపిక చేశారు.

**8, 9 తరగతి పాఠాలను పరిశీలించండి. వీటి ఇతివృత్తాలను తెలపండి.**

**(ఎ) పాఠాల అమరిక ప్రక్రియలు:**

పాఠాలను 4 యూనిట్లుగా విభజించారు. ప్రతి యూనిట్‌లో పద్య, గద్య పాఠాలు ఉంటాయి. సమయానుకూలంగా ఉపవాచకపాఠాలు చదువుకోవడంలో పిల్లలకు ఉపాధ్యాయుడు సహకారం అందిస్తూండాలి. ప్రతి పాఠంలో ముందుగా 'చదవండి - ఆలోచించి చెప్పండి' శీర్షికన పిల్లలను పాఠాలవైపు ఉన్ముఖీకరణ చేసే అంశం ఉంది. పాఠం నేపథ్యం, పిల్లల స్వయం అధ్యయనానికి సూచనలు ఉన్నాయి. పాఠాలు వివిధ ప్రక్రియల్లో ఉన్నాయి. పద్యం, గేయం, రుబాయి, లేఖ,

వచనకవిత, అధిక్షేపవ్యాసం, వ్యాసం, కథానిక, ఆత్మకథ, పుస్తక పరిచయం / సమీక్ష వంటి ప్రక్రియల్లో పాఠాలు ఉన్నాయి. కవిపరిచయాన్ని చిత్రంతో సహా వివరంగా పాఠం చివరన ఇవ్వడం జరిగింది. పద్యాల భావాలను ఇస్తూ సామర్థ్యాలు సాధించడానికి అభ్యాసాలను పొందుపరచడం జరిగింది.

**(ఏ) సామర్థ్యాధారిత అభ్యాసాలు:**

భాషాలక్ష్యాలను సాధించే క్రమంలో ప్రతి పాఠం చివర 7 సామర్థ్యాలను నిర్దేశించి అభ్యాసాలను రూపొందించారు.

అవి:

**8వ తరగతికి**

1. వినడం – మాట్లాడడం
2. ధారాళంగా చదవడం అవగాహన చేసుకోవడం, ప్రతిస్పందించడం
3. స్వీయరచన
4. పదజాలం
5. సృజనాత్మకత
6. ప్రశంస
7. భాషాంశాలు

**9వ తరగతికి 'ఇవి చేయండి' శీర్షికన**

1. అవగాహన – ప్రతిస్పందన (వినడం, మాట్లాడడం, పఠనావగాహన సామర్థ్యాలు)
2. వ్యక్తీకరణ – సృజనాత్మకత (స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస సామర్థ్యాలు)
3. భాషాంశాలు (పదజాలం, వ్యాకరణాంశాలు)

పైవాటితో పాటు ప్రతి పాఠంలో ప్రాజెక్టు పనులను చేర్చారు. ఇది భిన్న సామర్థ్యాల సమాహారం.

పాఠ్యపుస్తకాన్ని తరగతి గదిలో సమర్థంగా ఉపయోగించడానికి అవసరమైన అంశాలను స్పష్టంగా గుర్తించి, నిర్దిష్టమైన అభిప్రాయాలను ఏర్పరచుకున్నప్పుడే మనం బోధనలో విజయం సాధించగలం. పుస్తకంలోని అన్ని విభాగాలపట్ల అవగాహన కలిగించుకొని, పూర్తి ఆత్మవిశ్వాసంతో బోధన సాగించినప్పుడే విద్యార్థులనుండి సరియైన స్పందన లభిస్తుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో అర్థవంతమైన బోధనప్రక్రియ ఆశించిన లక్ష్యాలను సాధిస్తుంది. ఈ ప్రయత్నం విజయవంతం కావడంలో మనం విజయం సాధించడానికి ఈ పాఠ్యపుస్తకం తోడ్పడుతుంది.

*విద్యావ్యవస్థలో పిల్లలు, ఉపాధ్యాయులు కీలకమైనవారు. పిల్లలను జ్ఞాననిర్మాతలుగా భావించినప్పుడు ఉపాధ్యాయులలో, పాఠ్యపుస్తకాలలో, బోధనాభ్యసన ప్రక్రియలలో బృహత్తరమైన గట్టి మార్పులు చోటుచేసుకోవాలి. జ్ఞాననిర్మాణానికి దోహదపడేలా బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లలకు అనేక రకాలైన అనుభవాలను కలిగించాలి. దీంట్లో పిల్లల భాష కీలకమైంది. తరగతి గదిలో పిల్లల భాష, వారి జ్ఞాననిర్మాణానికి తోడ్పడాలి. భాషాతరగతి గదిలో కథలు చెప్పడం, గేయాలు, లయబద్ధమైన పాటల వంటి వ్యవహార రూపాల్లో భాషాసముపార్జన ఉండాలి. ఈ రూపాలు భాషను నేర్చుకునేలా చేస్తాయి.*

***– ఎ.పి.ఎస్.సి.ఎఫ్. 2011***

# 2 సామర్థ్యాలు - అభ్యాసాలు - అవగాహన

భాష మీద తన పట్టును పెంపొందించుకోవడానికి విద్యార్థికి పాఠశాల స్థాయిలో ఉపయోగపడే ప్రధానోపకరణం పాఠ్యపుస్తకం. పిల్లవాడు తన ఇంటిదగ్గరే నేర్చుకొని వచ్చిన మాతృభాషలో ఉన్న మెలకువలను, భాషాప్రయోగాలను, అంతర్భావాలను తదితర విషయాలను లేఖనసంప్రదాయంలో ఉన్నతంగా అందించే ప్రయత్నం చేస్తు,పాఠ్యపుస్తకం. నిత్యవ్యవహారానికి సంబంధించిన భాషనంతా ఇంటి వాతావరణమే అందిస్తుంది.

నూతన పాఠ్యపుస్తకాలు, భాషాపరంగా, సాహిత్యపరంగా విద్యార్థికుండే సామర్థ్యాలను వెలికితీసేరకంగా ఉన్నాయి. ఆయా తరగతుల్లో పాఠ్యపుస్తకాన్ని చదివాడంటే పిల్లవాడు ఏం నేర్చుకున్నట్లు, అనేది ప్రధాన ప్రశ్న. బట్టీ ద్వారా ప్రశ్నలకు జవాబులు రాసి ఉత్తీర్ణతాపత్రాన్ని పొందడం సరైనవిద్యా? దాని ద్వారా సామర్థ్యాలను సాధించడం జరుగుతున్నదా? అనేవి మనలను వేధించే ప్రశ్నలు.

అందుకే RTE 2009 ప్రతి విద్యార్థికీ సామర్థ్యాల సాధననే కొలబద్దగా నిర్ణయించింది. దాని ఆధారంగా APSCF-2011 విద్యాప్రమాణాలను నిర్దేశించింది. ఈ విద్యాప్రమాణాల కనుగుణంగా ఉన్న సామర్థ్యాలను పాఠ్యపుస్తకంలోని అభ్యాసాల ద్వారా కూర్చారు.

1. *ఎనిమిదో, తొమ్మిదో తరగతులకు నిర్దేశించుకున్న సామర్థ్యాలేవి?*
2. *వీటి సాధనకు పాఠ్యపుస్తకాలలో చేపట్టిన చర్యలు ఏవి?*
3. *అభ్యాసాల స్వభావాలు ఎలా ఉన్నాయి?*
4. *వీటిని ఎలా నిర్వహించాలి?*

ఒక్కో పాఠం పూర్తిగా బోధించడం అంటే ఆయా సామర్థ్యాల సాధన పూర్తవటం అని అర్థం. ప్రతి పాఠంలో ఉండే అభ్యాసాలను **"ఇవి చేయండి"** అనే శీర్షిక కింద ఇవ్వడం జరిగింది. ఈ అభ్యాసాలు వివిధ సామర్థ్యాల సాధనకు అనుకూలంగా ఉన్నాయి. పాఠ్యాంశ బోధనలో గరిష్ఠకాలం సామర్థ్యాల సాధనకే ఉపయోగించాల్సి ఉంటుంది. విద్యార్థి తన సామర్థ్యాలను సాధించడంలో ఉపాధ్యాయుడు మార్గదర్శి కావాలి.

**"ఇవి చేయండి"** అనే శీర్షికకింద ఇచ్చి సామర్థ్యాలకు సంబంధించిన అభ్యాసాల వివరణ, వాటికున్న ప్రాధాన్యం, వాటి ఆవశ్యకతలను ఉపాధ్యాయుడు తప్పక తెలుసుకోవాల్సిన అంశాలు. గుర్తించాల్సిన అంశాలు. అభ్యాసాల స్వభావాలను, వాటి

నిర్వహణను గురించి అవగాహన పొంది ఉండాలి. అప్పుడే విద్యార్థులచే అభ్యాసాలను సమర్థంగా చేయించగలడు. అందువల్ల వాటి గురించి చర్చించుకుందాం!

8, 9 వ తరగతుల పాఠ్యపుస్తకాలను కింది సామర్థ్యాల సాధనకు రూపొందించారు.

8వ తరగతి

I వినడం - మాట్లాడడం

II చదవడం - రాయడం

III స్వీయరచన

IV పదజాలం

V సృజనాత్మకత

VI ప్రశంస

VII భాషాంశాలు

9వ తరగతి

I అవగాహన - చింతన (Comprehension - Reflection)

(i) వినడం - ప్రతిస్పందించడం

(ii) చదవడం - అవగాహనచేసుకోవడం, ప్రతిస్పందన

II వ్యక్తీకరణ - సృజనాత్మకత (ExpressHûn - Creativity))

(i) స్వీయరచన

(ii) సృజనాత్మకత

(iii) ప్రశంస

III భాషాంశాలు (Language Items)

(i) పదజాలం

(ii) వ్యాకరణం

పైన తెలిపిన సామర్థ్యాలను సాధించటానికే పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలు ఉన్నాయి. ఆయా అభ్యాసాల స్వభావాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవలసిన అవసరం ఉంది. అందుకొరకు పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను పరిశీలించాలి.

**కింది ప్రశ్నలను పరిశీలించండి. వాటి స్వభావాలను తెలపండి.**

- దుందుభీనది ప్రవహించే తీరంలోని ప్రకృతి దృశ్యాలను గురించి సొంతమాటల్లో చెప్పండి. (దుందుభి)
- పాఠం ఆధారంగా పట్టికను పూరించండి. (మన సంస్కృతి)
- పద్యపాదాలకు సమానార్థకవాక్యాలు గుర్తించండి. (అమ్మకోసం)
- ప్రశ్నలకు పాఠం చదివి జవాబులు రాయండి. (ఇల్లు - ఆనందాల హరివిల్లు)
- 'సమర్థులకు క్షమ అవసరం' వివరించండి. (నీతిపరిమళాలు)
- పాఠంలోని మొదటి పేరా ఆధారంగా చిత్రాన్ని గీయండి. దాన్ని గురించి వర్ణించండి. (చూడడమనే కళ)
- పాఠంలోని ఏదైనా పేరాను వ్యవహార భాషలోకి మార్చి రాయండి. (సీతక్కపెండ్లి)
- కింది వాక్యాలను అవగాహన చేసుకొని గీతగీసిన పదాలకు నానార్థాలు రాయండి. (భూమి పుత్రుడు)
- పాఠంలోని పది సమాసపదాలు రాయండి. వాటికి విగ్రహవాక్యాలు రాయండి. ఏ సమాసమో తెలపండి. (ధర్మదీక్ష)
- పుట్టపర్తి నాయారాణాచార్యులుగారు అంత్యప్రాసలతో శివతాండవాన్ని, దాన్ని సౌందర్యాన్ని వర్ణిస్తూ రాసిన విధానాన్ని చూశారుకదా! దీనివల్ల మీరు పొందిన అనుభూతిని మీ 'డైరీ'లో రాయండి. ఉపాధ్యాయులకు చూపండి. (శివతాండవం)
- మేజర్ గిల్ వేటకు వెళ్ళి తొలిసారిగా అజంతా గుహలను దర్శించినట్లు చదివారుకదా! దీనివల్ల మన దేశానికి జరిగిన మేలు ఏమని భావిస్తున్నారో రాయండి. (అజంతా చిత్రాలు)
- హనుమంతుడు సముద్రలంఘనానికి ముందు కొన్ని చేష్టలు చేశాడు కదా! వాటి ఆంతర్యం ఏమైఉంటుంది? (సముద్ర లంఘనం)
- పరిశోధనలు ఎందుకు చేస్తారు? దీనివల్ల ఎవరికి మేలు జరగాలి? ఏ ఏ పరిశోధనలు సమాజానికి మేలు చేస్తాయి? (బతుకు పుస్తకం)
- శాస్త్రవేత్తల గురించి పత్రికల్లో వచ్చిన అంశాలను సేకరించండి. (ప్రేరణ)

పై ప్రశ్నలను పరిశీలిస్తే అభ్యాసాల స్వభావం ఏ రకంగా ఉంటుందనే విషయం లేదా తత్త్వం మనకు బోధపడుతుంది. ఆయా స్వభావాలు కింది విధంగా ఉంటాయి.

**అభ్యాసాల స్వభావం:**

- విద్యార్థుల ఆలోచనలకు, అభివ్యక్తీకరణకు ప్రాధాన్యం ఇస్తాయి.
- విద్యార్థులలో ఉండే సామర్థ్యాలను వెలికితీస్తాయి.
- ఎదురైన సవాళ్ళను ఆసక్తితో ఎదుర్కొనే తత్త్వాన్ని అలవరుస్తాయి.
- ఒక విషయానికి సంబంధించి బహుకోణాల్లో ఆలోచించి సమాధానాలు రాసేటట్లు వేసే ప్రక్రియ.
- ఒక ప్రశ్న నుండి విద్యార్థుల ద్వారా విభిన్న జవాబులను / పరిష్కారాలను, అంటే బహుళ సమాధానాలను రాబడతాయి.
- విశ్లేషణశక్తిని, విమర్శనశక్తిని పెంపొందిస్తాయి.
- ప్రశ్నించే తత్త్వాన్ని రేకెత్తిస్తాయి.
- పిల్లలందరూ పాల్గొనే అవకాశం కలిగిస్తాయి.
- సృజనాత్మకంగా ఆలోచించి రాయడం అలవడేలా రాస్తాయి.
- కల్పనాశక్తితో స్వీయరచన చేయడం నేర్పుతాయి.
- పాఠ్యపుస్తకాన్నేకాక అదనపు పఠనాన్ని ప్రోత్సహిస్తాయి.
- తరగతి గదిలో పిల్లలు విభిన్న మానసిక స్థాయిలో ఉంటారు. ఇలా ఉన్న బహుళస్థాయి పిల్లలందర్నీ భాగస్వాముల్ని చేస్తాయి.
- భాషను నేర్చుకోవడంతోపాటు భాషావినియోగాన్ని పెంచుకొనేందుకు, పదజాలాభివృద్ధికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తాయి.

ఇలా విభిన్న స్వభావాలుగల ప్రశ్నలు మనకు ఈ పాఠ్యపుస్తకాల్లో కన్పిస్తాయి. వీటిద్వారా పిల్లల భాషాస్థాయి, భావవ్యక్తీకరణస్థాయి, విషయనైపుణ్యస్థాయిలను పెంచడమే ఈ ప్రశ్నలన్నిటి లక్ష్యం.

**అభ్యాసాల స్వభావాల గురించి తెలుసుకున్నారు కదా! పైన చెప్పిన అంశాలకు ఒక్కోదానికి ఒక్కో ఉదాహరణను పాఠ్యపుస్తకంలో వెదకండి.**

ఇప్పుడు ఒక్కొక్క సామర్థ్యానికి చెందిన అభ్యాసాల గురించి దాని ప్రాధాన్యం, ఆవశ్యకత, వాటికున్న ప్రత్యేక స్వభావం వాటి నిర్వహణ గురించి చర్చిద్దాం!

## I. వినడం – మాట్లాడడం

**(అ) ఆవశ్యకత / ప్రాధాన్యత :**

విద్యార్థి తన ఇంటి వాతావరణం నుండే వినడం – మాట్లాడడం అలవాటు చేసుకొంటాడు. అయితే క్రమక్రమంగా ఈ వినడం – మాట్లాడడంలోని విభిన్న కోణాలను అర్థంచేసుకోవాల్సి ఉంటుంది. వీటిని వినియోగించుకొనే సామర్థ్యాన్ని పొందాలి. పాఠ్యపుస్తకాలు ఇందుకు తోడ్పడాలి. బడికి రాకముందే మాట్లాడే పిల్లవాడు బడిలో చేరిన తర్వాత స్వేచ్ఛగా మాట్లాడడం, ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, సూటిగా మాట్లాడడం, సందర్భోచితంగా మాట్లాడడం, సరైన పదజాలంలో అర్థవంతంగా వినసొంపుగా మాట్లాడడం గురించి అభ్యసిస్తాడు. అట్లాగే విన్నదాన్ని గురించి అర్థం చేసుకోవడంతోపాటు విశ్లేషించడం, అంతరార్థం గ్రహించడం, సందేశాన్ని పట్టుకోవడం వంటివి చేయగలగాలి.

ప్రాథమిక స్థాయిలో విద్యార్థి విని అర్థం చేసుకొని మాట్లాడే స్థాయికి చేరుకుంటే, మాధ్యమిక స్థాయిలో, విని అర్థం చేసుకొని ఆలోచించి మాట్లాడడం నేర్చుకుంటాడు. ఇక సెకండరీస్థాయి చేరుకొనేటప్పటికి వినడంలో మార్పు వస్తుంది. అర్థం చేసుకోవడం, ఆలోచించడం, విశ్లేషించుకోవడం, తన వాదనకు సరైన కారణాలను సమర్థంగా నిర్మించుకోవడం, బహుకోణాల్లో స్పర్శించడం తద్వారా మాట్లాడడం చేస్తాడు. అందుకే ప్రాథమిక స్థాయినుండి సెకండరీ స్థాయి వరకు గల పాఠ్యపుస్తకాల్లో 'వినడం - మాట్లాడడం' అనే సామర్థ్యాన్ని అభ్యాసాల్లో చేర్చడం జరిగింది. కింది ప్రశ్నల గురించి ఆలోచించండి.

**మరి, ఎనిమిది, తొమ్మిది తరగతుల పిల్లలు వినడం - మాట్లాడడం అనే సామర్థ్యం ద్వారా ఏం సాధించాలి? వీటికోసం పాఠ్యపుస్తకాలు ఎలాంటి అవకాశాలు కల్పించాయి? ఇందుకోసం ఉన్న అభ్యాసాలేవి? వీటి స్వభావం ఎలా ఉంది?**

**(అ) ఏం చేయగలగాలి?**

- విద్యార్థి తన ప్రతిస్పందనలను చెప్పగలగాలి.
- విమర్శనాత్మక ధోరణితో ప్రశ్నలకు జవాబులను చెప్పగలగాలి.
- అడిగిన ప్రశ్నలను విశ్లేషించి జవాబులు చెప్పాలి.
- వినడంద్వారా తన ఆలోచనలతో ఖచ్చితమైన సవ్యమైన అభిప్రాయాలను స్పష్టంగా వివరించగలగాలి.
- కుల, మత, లింగ, వర్ణ, వర్గవిచక్షణ లేకుండా ప్రతివారినీ అభినందించే తత్త్వంతో మాట్లాడగలగాలి.
- పాఠ్యాంశంలో ఉన్న విషయం ఆధారంగా, వర్ణన ఆధారంగా, విజ్ఞానం ఆధారంగా, అనుభూతి ఆధారంగా కవి హృదయాన్ని తన సొంతమాటల్లో ఆవిష్కరించగలగాలి.
- తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చేయగలగాలి.
- విషయాన్ని అన్వయించుకొని చెప్పగలగాలి.
- ఏదైనా విషయాన్ని విశ్లేషిస్తూ వ్యాఖ్యానించగలగాలి.
- ప్రతి అంశాన్నీ బహుకోణాల్లో ఆలోచించి వ్యక్తంచేయగలగాలి.
- చర్చల్లో పాల్గొనడం, ఉపన్యసించడం, వాదనలు వినిపించడం, ప్రశ్నించడం వంటివి చేయగలగాలి.

ఇలా వేరువేరు తీరులలో స్పష్టంగా మాట్లాడగలిగితే ఈ సామర్థ్యాన్ని సాధించినట్లుగా భావించాలి.

**(ఇ) స్వభావం :**

**8వ, 9వ తరగతుల్లోని "వినడం - మాట్లాడడం" శీర్షిక కింద ఇచ్చిన ఈ కింది ప్రశ్నలకు, ఏ స్వభావం ఉన్నదో ఆలోచించండి.**

- 'నదులు జీవనాధారాలు' - దీన్ని సమర్థిస్తూ మీ అభిప్రాయం చెప్పండి. **(దుందుభి)**
- నాటినుండి నేటివరకు ఇండ్ల నిర్మాణంలో వచ్చిన మార్పులు ఏమిటో చెప్పండి. **(మన సంస్కృతి)**
- కుటుంబంలో 'మన' అనే భావన లేకపోతే ఎలా ఉంటుంది? **(ఇల్లు - ఆనందాల హరివిల్లు)**
- స్వాతంత్ర్యం రావడానికి ముందు గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉండేదని మీ కనిపించింది? **(చిన్నప్పుడే)**
- వరకట్న నిర్మూలనకు రావలసిన మార్పులను "వరునివైపు - వధువువైపు" జట్లుగా విడిపోయి చర్చించండి. **(సంస్కరణ)**
- "స్వశక్తిచేత" ఏ పనులనైనా సాధించవచ్చు. నిజమా? కాదా? వివరించండి. **(ప్రబోధం)**
- కింది అంశం గురించి విభేదిస్తూ లేదా సమర్థిస్తూ మాట్లాడండి. 'మాతృభాషలో విద్య' **(స్వభాష)**
- "మనిషి నెప్పుడు నమ్మగూడదు" అనే పులి మాటలు నిజమా! కాదా! ఎందుకు? వ్యాఖ్యానించండి. **(స.సే.మి.రా.)**

పై ప్రశ్నలను లోతుగా చూసినప్పుడు వివిధ రీతుల్లో ఉంటాయి. వాటికి –

- స్వీయ ప్రతిస్పందన
- విమర్శనాత్మక ధోరణి
- విశ్లేషణ
- అభిప్రాయం తెలపడం
- అన్వయించుకోవడం
- కవిహృదయాన్ని ఆవిష్కరించడం
- వ్యాఖ్యానించడం
- అభినందించడం
- బహుకోణాల్లో ఆలోచించడం

మొదలయిన అంశాల్లో ఏదో ఒక స్వభావం ఉంటుంది. ఆయా స్వభావాలను ఉపాధ్యాయులు గుర్తించి సంబంధిత సామర్థ్యాలను సాధించాల్సి ఉంటుంది.

**(ఈ) నిర్వహణ :**

'వినడం – మాట్లాడడం' అనే ఈ సామర్థ్యాన్ని పూర్తి తరగతి కృత్యంగా అంటే ప్రతి ప్రశ్నను తరగతిలోని పిల్లలందరినీ అడగాలి. ఒక్కొక్కరిచేత మాట్లాడించాలి.

అవసరమైన చోట్ల అనుబంధ ప్రశ్నలను అడగాలి. **విద్యార్థులు చెప్పే సమాధానాలను ఖండించే ప్రయత్నం చేయగూడదు.** ఎందుకంటే విద్యార్థి తన వాతావరణంనుంచో, తన వ్యావహారికభాషాస్థితులనుంచో తన అనుభవాలనుంచో సమాధానాలు చెప్పే ప్రయత్నం చేస్తాడు. అందువల్ల వాటిని ఖండించగూడదు. అలా ఖండించడంవల్ల తాను మాట్లాడే స్థితిని కోల్పోయి భయంతో మౌనంగా ఉండే ప్రమాదం ఉంటుంది.

విద్యార్థులు చెప్పే సమాధానాలలో దొర్లే దోషాలను ఆప్యాయతతో సవరించాలి.

విద్యార్థుల సహజమైన మాటలను ప్రోత్సహించాలి. వాళ్ళను అభినందించాలి.

## II. చదవడం, అవగాహన చేసుకోవడం

ప్రాథమిక స్థాయిలో ధారాళంగా చదవడం చేయగలిగిన పిల్లలు ప్రాథమికోన్నత స్థాయిలో చదివిన అంశాన్ని అవగాహన చేసుకోవడం, దాన్ని వివరించగలగడం, ప్రతిస్పందించగలగడంలో శిక్షణ పొందుతారు. సెకండరీ స్థాయిలో పిల్లలు చదివిన అంశం గురించి విమర్శనాత్మక దృష్టితో ఆలోచించగలగాలి. రచయిత / కవి అంతరాత్మను, ఉద్దేశాన్ని పట్టుకోగలగాలి. 'చదవడం' అనే సామర్థ్యంద్వారా పిల్లల్లో పఠనాభిలాష పెరగడం, అర్థంచేసుకొని వ్యక్తీకరించగలగడం, తన జ్ఞానపరిధిని విస్తృతపరుచుకోవడం జరగాలి. ఇందుకోసం 8, 9 తరగతులలోని పాఠ్యపుస్తకాలలోని అభ్యాసాలను పరిశీలించండి.

- *చదవడం, అగాహన చేసుకోవడంకోసం ఎన్ని రకాల అభ్యాసాలు ఉన్నాయి?*
- *వీటిద్వారా పిల్లల్లో ఏ విధమైన పఠనసామర్థ్యం వృద్ధి చెందుతుంది? లేదా ఏం చేయగలుగుతారు?*
- *తరగతి గదిలో వీటిని ఎలా నిర్వహించాలి?*

**(అ) ఏం చేయగలగాలి?**

- ఇచ్చిన పరిచిత / అపరిచిత గద్య, పద్యాలను అవగాహనతో చదివి సంబంధిత జవాబులను రాయగలగాలి.
- ఇచ్చిన పద్య / గద్యాలను చదివి ప్రశ్నలను అనుసంధించగలగాలి.

- అంశాన్ని చదివి సమాచారం ఆధారంగా పట్టికలను తయారుచేయగలగాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా సత్యాసత్యాలను గుర్తించగలగాలి, జతపరచగలగాలి.
- అంశం చదివి సరైన అర్థం వచ్చేలా ఖాళీలను పూరించగలగాలి.
- ఇచ్చిన పేరా ఆధారంగా విభిన్నమైన వాక్యాలను గుర్తించగలగాలి.
- సందర్భాలను గుర్తించి రాయగలగాలి.
- ఇచ్చిన పేరా ఆధారంగా లక్ష్యాత్మక ప్రశ్నలకు సమాధానాలను గుర్తించగలగాలి.
- ఇచ్చిన పద్యాన్ని చదివి ప్రతిపదార్థాన్ని రాయగలగాలి.
- ఇచ్చిన విషయంలో తప్పొప్పులను గుర్తించగలగాలి.
- ఇచ్చిన అంశంలోని పాత్రలను విషయాలు, వస్తువులు మొదలయినవాటి పోలికలను అవగాహనతో గుర్తించి రాయగలగాలి.
- ఇచ్చిన పేరాను లేదా అంశాన్ని చదివి "శీర్షిక"ను నిర్ణయించగలగాలి.
- అర్థానికి అనుగుణంగా పద్యపాదాలను, పేరాలను, లేదా భావస్ఫోరక వాక్యాలను గుర్తించి రాయగలగాలి.
- క్రమపద్ధతిలో లేదా పాదపద్ధతిలో వాక్యాలను, పద్యాలను అమర్చగలగాలి.
- పాఠ్యాంశాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు సొంతంగా జవాబులు రాయగలగాలి.
- ఇచ్చిన పద్యాన్ని చదివి భావాన్ని రాయగలగాలి.

ఈ రకంగా చదవడం – రాయడం అనే ప్రక్రియలో ఇచ్చిన అంశాన్ని అవగాహనతో చదవడం దానికి సంబంధించిన విషయాన్ని గూర్చి రాయడం అనేదే ప్రధానమైంది. ఇలా చేయగల్గినప్పుడే విద్యార్థి ఈ సామర్థ్యాన్ని సాధించినట్లుగా భావించాలి.

**(ఆ) చదవడం, అవగాహనచేసుకోవడం అభ్యాసాల స్వభావం :**

ఎనిమిది, తొమ్మిది తరగతుల్లోని చదవడం అవగాహనచేసుకోవడానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలున్నాయి. వీటిని పరిశీలించండి.

- కింద ఇచ్చిన వాక్య భావాలకు సరిపోయే గేయ పాదాలను గుర్తించి రాయండి. **(దుందుభి)**

  అ) చెట్లను తాకి, జాజిపూల రంగులద్దుకొని ప్రవహిస్తావా?

  ఆ) పుట్ట రంధ్రాలను ముంచుతూ ప్రవహిస్తావా?

- కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారో, ఏ సందర్భంలో అన్నారో రాయండి **(అమ్మకోసం)**

  అ) మాయీ దాస్యము వాయు నుపాయము సేయుండు.

- కింది పదాలను పాఠంలో గుర్తించండి. ఆ వాక్యాలను చదవండి. వాటి గురించి రాయండి. **(ఇల్లు – ఆనందాల హరివిల్లు)**

  ఆశ్రమ ధర్మాలు, జీవితపథం, విశ్వసనీయత, సమష్టివ్యవస్థ.

- పాఠంలోని పద్యాల ఆధారంగా కింద తెలిపిన వాటిని వేటితో పోల్చారో రాయండి. **(నీతి పరిమళాలు)**

  అ) రసజ్ఞత ఆ) అవివేకం ఇ) వాక్కు

- పాఠం చదవండి. కింది పట్టికను పూరించండి. (ప్రతిజ్ఞ)

| **వృత్తులు** | **వాడే పనిముట్లు** |
|---|---|
| ఉదా॥ జాలరి | పగ్గం |
| 1 ______ | ______ |
| 2 ______ | ______ |

- కింది కవిత చదివి నాలుగు ప్రశ్నలు తయారుచేయండి. **(ప్రతిజ్ఞ)**
- పాఠం చదివి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి. **(శాంతికాంక్ష)**
  1. ధర్మరాజు రాజ్యసంపద దేనికోసం కోరాడు?
  2. శత్రుస్వభావాన్ని కవి దేనితో పోల్చాడు?
- 9వ, 10వ పద్యాలకు ప్రతి పదార్థం రాయండి **(పద్యరత్నాలు)**
- పాఠం ఆధారంగా కింద పేర్కొన్న వ్యక్తులను పరిచయం చేయండి. **(సీతక్కపెండ్లి)**

  1) రఘురాం 2) మాలక్ష్మి 3) సీతక్క 4) నాగయ్య 5) కోటయ్య
- కింది పేరాను చదవండి. కారణాలను రాయండి. **(భూమి పుత్రుడు)**

పై ప్రశ్నలను లోతుగా చూసినప్పుడు వాటి స్వభావాలు వివిధ రకాలుగా కనబడతాయి.

- భావాలకు తగిన పద్యపాదాలను గుర్తించడం.
- సందర్భాన్ని గుర్తించి ఎవరు ఎవరితో అన్నారో రాయడం.
- పాఠంలో ఉన్న విశేషపదాల అర్థాల వివరణ నివ్వడం.
- పాఠం ఆధారంగా పోలికలను గుర్తించి రాయడం.
- ఇచ్చిన అంశం ఆధారంగా పట్టికను తయారుచేయడం.
- పాఠాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయడం.
- ప్రశ్నలను తయారుచేయడం.
- పద్యాలకు ప్రతిపదార్థం రాయడం.
- పాఠం ఆధారంగా వ్యక్తులను పరిచయం చేయడం.
- పేరాను చదివి కారణాలను రాయడం.

మొదలయిన స్వభావాలు వాటికి ఉన్నాయి. ఈ ప్రశ్నల విధానాన్ని ప్రధానంగా మూడు రకాలుగా విభజించవచ్చు. అవి:

(i) పాఠ్యాంశాన్ని చదివి గుర్తించడం – రాయడం.

(ii) పరిచిత / అపరిచిత అంశాలను చదివి అవగాహన చేసుకొని గుర్తించి రాయడం.

(iii) పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నలకు జవాబులను రాయడం.

ఇలా ప్రశ్నల్లో ఉన్న వివిధ రకాల స్వభావాలను ఉపాధ్యాయులు గుర్తించాలి. విద్యార్థులు ఆయా సామర్థ్యాలను సాధించేటట్లు చూడాలి. అయితే ఇందుకు ఈ అభ్యాసాలను ఎలా నిర్వహించాలో తెలుసుకుందాం!

**(ఇ) నిర్వహణ :**

చదవడం, అవగాహనచేసుకోవడం సామర్థ్యానికి సంబంధించిన అభ్యాసాలను వ్యక్తిగత కృత్యంగానే నిర్వహించాలి. విద్యార్థులందరిచేత సాధన చేయించాలి. వారు చేసే దోషాలను వెనువెంటనే సవరించాలి. వారు చేసే ప్రయత్నాలను ప్రోత్సహించాలి. విద్యార్థి ఉచ్చారణకు అనుకూలమైన పదాలను రాయడం తప్పు గాదని గుర్తించాలి. ఉచ్చారణ సరిచేసి సరైన పదాలను రాసేలా ముందుకు నడిపించాలి. అభినందించాలి. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడాన్ని ఇంటిపనిగా ఇవ్వవచ్చు. మిగతావాటిని తరగతి గదిలోనే వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి. విద్యార్థుల సంఖ్యనుబట్టి సామర్థ్యసాధనకు అనుకూలమైన విధానాన్ని ఉపాధ్యాయులు ఎన్నుకోవాలి.

## III. స్వీయరచన

స్వీయరచన అంటే విద్యార్థి తన సొంత ఆలోచనలతో తనదైన విధానంలో ప్రశ్నలకు జవాబులు రాసే విధానం లేదా తెలిసిన అంశాల గురించి రాయడం. ప్రాథమిక, మాధ్యమిక స్థాయినుండి పిల్లలు సెకండరీ స్థాయికి చేరుకొనే క్రమంలో ఆలోచనాశక్తి కూడా పెరుగుతుంది. APSCF-2011 నిర్దేశించిన ప్రకారం అవగాహన చేసుకొని తన సొంతమాటల్లో రాయడం అనేది రావాలి. ఇప్పటి వరకు పాఠ్యపుస్తకంలోని పాఠాల్లో ఉన్న ప్రశ్నలను బట్టీ ద్వారా సమాధానాలు రాయడంవల్ల విద్యార్థుల సామర్థ్యాలు అంటే విశ్లేషణ, విమర్శనాత్మక, బహుకోణీయాలోచన, సమస్యా పరిష్కారసాధన మొదలగు అనేక విషయాల్లో తాను స్వయంగా రాయాల్సిఉంది. అభిప్రాయాలను లిఖిత రూపంలో వ్యక్తీకరించాల్సి ఉంటుంది. అభిప్రాయాలను లిఖిత రూపంలో చెప్పాల్సిఉంది. అందుకే సెకండరీ స్థాయిలో ఈ స్వీయరచనలో ఉన్న ప్రశ్నల స్థాయి పెరుగుతుంది. జవాబురాసే విధానంలో కూడా మార్పులుంటాయి. భాషా వినియోగంలో కూడా మార్పులుంటాయి.

**ఆలోచించండి.**

- *8, 9 తరగతుల పిల్లలు వేటిని ఎలా రాయగలగాలి?*
- *పాఠ్యపుస్తకాలలో ఇందుకోసం ఎలాంటి ప్రశ్నలు ఉన్నాయి?*
- *వీటిని తరగతి గదిలో ఎలా నిర్వహించాలి?*

**(అ) ఏం చేయగలగాలి?**

- విషయాన్ని విశ్లేషిస్తూ రాయగలగాలి.
- అంశాన్ని విమర్శిస్తూ రాయగలగాలి.
- మరో అంశంతో పోలుస్తూ రాయగలగాలి.
- సాధికారంగా అభిప్రాయాన్ని తెలపగలగాలి.
- బహుకోణాల్లో జవాబులు రాయగలగాలి.
- బహుళ సమాధానాలు చెప్పగలగాలి.
- విషయవివరణ ఇవ్వగలగాలి.
- సమర్థిస్తూ లేదా వ్యతిరేకిస్తూ అందుకు కారణాలను వివరించగలగాలి.
- పరిష్కార దృష్టితో వివరించగలగాలి.
- ఊహా ప్రతిస్పందనలను తెలియపరచగలగాలి.
- వివిధ సందర్భాలను అన్వయించుకొని వివరించగలగాలి.
- అంశంపై వ్యాఖ్యానించగలగాలి.
- వ్యాసం రాయగలగాలి.

**(ఆ) స్వభావం :**

స్వీయరచనలోని ప్రశ్నల స్వభావం క్షుణ్ణంగా అవగతమవాలంటే పాఠ్యపుస్తకంలోని కొన్ని ప్రశ్నలను పరిశీలించాల్సిందే.

మచ్చుకు కొన్ని ప్రశ్నలను కింద ఇస్తున్నాం. పరిశీలించండి.

- యోగ్యులైన పిల్లలవల్ల తల్లిదండ్రులకు కలిగే ప్రయోజనాలేమిటి? **(అమ్మకోసం)**
- మన సంస్కృతి గొప్పతనాన్ని చెప్పే అంశాల్ని విశ్లేషిస్తూ అభిప్రాయం రాయండి. **(మన సంస్కృతి)**

- కుటుంబ వ్యవస్థ బాగా కొనసాగాలంటే మనమేంచేయాలి? **(ఇల్లు – ఆనందాల హరివిల్లు)**
- ఈ కవిత మీకు ఎందుకు నచ్చిందో సొంత మాటల్లో రాయండి. **(ప్రతిజ్ఞ)**
- "మనుషులు పదుగురు కూడితే ఒక ఊరవుతుంది" అని సి.నా.రె. ఎందుకు అని ఉంటారు? **(జీవన భాష్యం)**
- "స్త్రీ శక్తిస్వరూపం" ఈ మాటలను సమర్థిస్తూ రాయండి. **(ప్రబోధం)**
- గౌతమబుద్ధుడు నందగోపాలుడిపై వాత్సల్యాన్ని ఎలా చూపించాడు? దానికి కారణాలు ఏమిటి? **(ధర్మదీక్ష)**
- 'సందర్భాన్ని బట్టి స్పందించాలి' దీన్ని ఉదాహరణలతో వివరించండి. **(రుబాయీలు)**
- కార్యసాధన అంటే అనుకొన్నది సాధించడం. ధర్మరాజు మాటలనుబట్టి ఈ కార్యసాధనను మనం ఎలా సాధించాలి? (శాంతికాంక్ష)

పై ప్రశ్నలను లోతుగా చూసినప్పుడు విభిన్న స్వభావాలున్న ప్రశ్నలుగా మనకు కనబడతాయి. ఎలా అంటే...

- విశ్లేషణాత్మకంగా
- వివరణాత్మకంగా
- సమస్యాపరిష్కారాత్మకంగా
- నచ్చిన అంశాన్ని కారణాలతో వివరించగలిగేవిగా
- ఇచ్చిన అంశాన్ని సమర్థిస్తూ రాసే విధంగా
- ఊహాత్మకంగా జవాబులు రాయడానికి వీలున్నవిగా
- సందర్భోచిత ప్రతిస్పందనలు తెలియజేసే విధంగా
- అన్వయపరంగా జవాబును రాయగలిగే విధంగా
- అభిప్రాయం సాధికారంగా చెప్పేరకంగా
- సమర్థిస్తూ జవాబురాసేరకంగా ఉన్నాయి.

**పాఠ్యపుస్తకంలో పై స్వభావాలున్న మరికొన్ని ప్రశ్నలను గుర్తించండి.**

**(ఇ) నిర్వహణ :**

ఈ "స్వీయరచన" అభ్యాసాన్ని వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి. అవసరమైన సందర్భంలో పూర్తి తరగతికృత్యంగా నిర్వహించాలి. ఆయా ప్రశ్నలను పిల్లలు పూర్తిగా అవగాహన చేసుకొనేలా ఉపాధ్యాయుడు చర్చ నిర్వహించాలి. కొన్ని సందర్భాలలో సూచనలు సలహాలు కూడా ఇవ్వాల్సివస్తే అందించాలి. వాళ్ళడిగే సందేహాలను నివృత్తి చేయాలి.

ఇందులోని కొన్ని ప్రశ్నలను ఇంటిపనిగా ఇచ్చే అవకాశం ఉన్నట్లైతే అది ఉపాధ్యాయుడు వినియోగించుకొనవచ్చు.

దోషసవరణ తరగతి గదిలో చేపట్టాలి. ఇది పూర్తి తరగతిలో చర్చ ద్వారా జరగాలి. విద్యార్థుల అభిప్రాయాలకు విలువనివ్వాలి. అభిప్రాయాల్లో ఉన్న తార్కికతను పిల్లలకు వివరించే ప్రయత్నం చేయాలి.

అభ్యాసాల్లోని ప్రశ్నలకు జవాబులు ప్రతి విద్యార్థినుండి భిన్నంగానే వస్తాయి. ఒకవేళ అలా కానట్లైతే సామర్థ్యసాధన జరగనట్లే భావించాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి స్వీయరచన చేసేట్లు ప్రోత్సహించాలి. సామర్థ్యాన్ని సాధించేట్లు చూడాలి.

## పిల్లలు రాసిన అంశాలను సవరించే విధానం

- పిల్లలు జట్లలో చర్చించి రాసిన / వ్యక్తిగతంగా రాసిన సమాధానాలను చార్టుపై రాయించాలి లేదా నల్లబల్లపై రాయించాలి.
- ఒక్కో జట్టువారిచే వ్యక్తిగతంగా ప్రదర్శింపజేయాలి.

✦ పిల్లలు రాసిన అంశాన్ని తరగతిలో చర్చిస్తూ కింది విధంగా సరిచేయాలి.

- *భావం సరిగా ఉందా? వరసక్రమంలో విషయాన్ని రాశారా?*
- *వాక్యనిర్మాణం సరిగా ఉందా?*
- *వాక్యాలు సంపూర్ణవాక్యాలుగా దోషరహితంగా ఉన్నాయా?*
- *వాక్యాలలో ఉపయోగించిన పదాలు సరిగా ఉన్నాయా? ఇంకే పదాలు ఉపయోగించవచ్చు?*
- *అక్షరదోషాలు ఏవైనా ఉన్నాయా?*

ఇలా ఒక్కో ప్రశ్న పిల్లలను అడుగుతూ పిల్లలు రాసిన దాన్ని పిల్లలతో చర్చిస్తూ సరిచేయించాలి. కొంత అభ్యాసం జరిగిన తర్వాత ఒక జట్టువారు రాసిన అంశాలను ఇంకొక జట్టువారికిచ్చి కూడా సరిచేయించవచ్చు.

- ఇలా సరిదిద్దిన తర్వాత పిల్లలను వ్యక్తిగతంగా రాయమనాలి.

## IV. పదజాలం

ఒకరి అభిప్రాయాలను ఒకరికి తెలుపుకోడానికి వాడే మాటల అర్థవంతమయిన కూర్పు ఉన్నది భాష. దీనిలో అత్యధిక భాగం పదజాలం. విద్యార్థులు పదజాలాన్ని ఎంత ఎక్కువగా సంపాదిస్తే భాషమీద అంత పట్టుపెరుగుతుంది. సందర్భాన్నిబట్టి, సమయోచితంగా మాట్లాడాలంటే, రాయాలంటే పదజాల వినియోగాన్ని గురించి సరయిన అవగాహన ఉండాలి.

ఉన్నత స్థాయిలోని విద్యార్థులు జాతీయాలు, సామెతలు, నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతివికృతులు లాంటివాటిని గురించి వివరంగా తెలుసుకొనే అవకాశం ఉంది. ప్రాచీన, ఆధునిక భాషా పాఠ్యాంశాల్లోని పద ప్రయోగాలను తెలుసుకోగలగాలి. ఆయా పదాల ప్రయోగాలను అవగాహన చేసుకొని తాను వినియోగించాలంటే "పదజాలం" సామర్థ్యాన్ని సాధించాలి.

**ఆలోచించండి.**

- ***8, 9 తరగతుల్లో ఏ పదజాలం గురించి అభ్యాసాలు ఉన్నాయి?***
- ***ఇందుకోసం ఏ ఏ రకాలైన అభ్యాసాలు ఉన్నాయి? ఇవి ఎలా ఉన్నాయి?***
- ***పిల్లలు ఏమేమి చేయగలగాలి?***
- ***వీటిని తరగతి గదుల్లో ఎలా నిర్వహించాలి?***

**(అ) ఏం చేయగలగాలి?**

ఈ సామర్థ్యానికి సంబంధించిన అభ్యాసాల ద్వారా

- జాతీయాల అర్థాలను గ్రహించగలగాలి.
- వివిధ పదాల నానార్థాలు, పర్యాయపదాలు సొంతవాక్యాలలో వినియోగించగలగాలి.
- ప్రకృతివికృతులను గుర్తించగలగాలి – ఉపయోగించగలగాలి.
- ప్రాచీన భాష, ఆధునిక భాషల్లో పదాల ప్రయోగాన్ని గుర్తించి ఆయా సందర్భాల్లో వాడగలగాలి.
- వ్యతిరేకార్థక పదాలను వాక్యాల్లో వినియోగించగలగాలి.
- సందర్భోచితంగా, సమయోచితంగా వాడే పదాలను గుర్తించి తాను ప్రయోగించగలగాలి.

**(ఆ) స్వభావం :**

ఈ ప్రశ్నల స్వభావం తెలియాలంటే పాఠ్యపుస్తకంలోని కొన్ని ప్రశ్నలను పరిశీలించండి.

- కింది వాక్యాలలో గీతగీసి పదాన్ని మరో సందర్భానికి అన్వయించి వాక్యాలు తిరిగిరాయండి.

  ఇ) <u>కాలగతి</u>లో కొన్ని చిత్రాలు నశించాయి. **(అజంతా గుహలు)**

- కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు అదే అర్థం వచ్చే మరి రెండు పదాలను ఎంపికచేసుకొని వాక్యాలు రాయండి. **(చిన్నప్పుడే)**

  (i) పెద్దవాళ్ళకు నమస్కారం చేయడం మన సంస్కృతి.

- కింది వాక్యాల్లో గీతగీసిన పదాల అర్థాలను పదవిజ్ఞానం ఆధారంగా రాయండి. **(ప్రాచీన సాహిత్యాధ్యయనం ఆవశ్యకత)**

  (ఆ) వైజయంతిక లీ మహాకావ్యాలు (                    )

- కింది పదాలకు వ్యుత్పత్తి అర్థాలు రాయండి. (పద్యరత్నాలు)

  1) దాశరథి    2) ధూర్జటి

పై ప్రశ్నలను పరిశీలిస్తే...

- సందర్భోచిత పద ప్రయోగం.
- పర్యాయపద ప్రయోగం.
- నిఘంటువు వినియోగం ద్వారా పదాల అర్థాలు తెలుసుకోవడం.
- పదాల వ్యుత్పత్తి తెలుసుకోవడం.

లాంటివి స్వభావాలు కనబడుతున్నాయి. అట్లాగే వివిధ పదజాల స్వభావాలను తెలిపే ప్రశ్నలున్నాయి. గళ్ళు ఆధారంగా కూడా సమాధానాలు రాయాల్సిన ప్రశ్నలు ఇవ్వడం జరిగింది.

**పదజాల స్వభావ ప్రశ్నలెన్ని రకాలుగా పాఠ్యపుస్తకంలో ఉన్నాయో చూసి ఒక్కో రకానికి ఒక్కో ప్రశ్నను వెదకండి.**

**నిర్వహణ :**

"పదజాలం" అభ్యాసాలను వ్యక్తిగత కృత్యంగాను, పూర్తితరగతి కృత్యంగాను నిర్వహించవచ్చు. ఏ సందర్భానికి ఏది అవసరమో అది నిర్వహించాలి. విద్యార్థులను సమూహాలుగా చేసి. జట్టు కృత్యంగానూ నిర్వహించవచ్చు. ఈ పదజాల వినియోగానికి నిఘంటువును ఉపయోగించేలా చూడాలి. పర్యాయపదాలు, నానార్థాలను వాక్యాల్లో ప్రయోగించి అర్థం తెలుసుకునేలా చేయాలి. ప్రకృతివికృతులు, వ్యతిరేకార్థకాలు, జాతీయాలు మొదలయినవన్నింటిని ప్రయోగపద్ధతిలో చూపించి విద్యార్థుల వినియోగంలోకి తేవాలి. విద్యార్థి కల్పతరువులాంటి పుస్తకాలను ఉపయోగించేలా నిర్వహించాలి.

దోషసవరణ వెంట వెంటనే చేయాలి. విద్యార్థుల భాషలోని యాసను ఖండించగూడదు. ప్రాంతీయ / మాండలిక పదాల ఉపయోగాన్ని తప్పు అని అనగూడదు. వారి భాషను గౌరవించాలి. వారిస్థాయికి తగిన భాషారూపమేదో చెప్పాలి.

## V. సృజనాత్మకత

పిల్లలు పాఠంలోని ప్రశ్నలకు జవాబులను బట్టీపట్టి రాయడంవల్ల భాషలోని ఏ ప్రక్రియను తాము స్వయంగా సృజించలేకపోతున్నాడు. ఈ లోటును పూడ్చాలని APSCF 2011 భావించింది. అందుకే విద్యార్థిలోని సృజనాత్మకతను వెలికితీయగలిగేలా అభ్యాసాల నిర్వహణ ఉండాలని నిర్దేశించింది.

దానికనుగుణంగానే నూతన పాఠ్యపుస్తకాల్లో ఈ సామర్థ్యం పొందుపరచడమైంది. సృజనాత్మకత అనేది ఊహ తెలిసిన పిల్లల దగ్గరినుండి మొదలుకొని పెద్దవారి వరకు ప్రతి వారిలో ఉంటుంది. దాన్ని వెలికితీసే ప్రయత్నం చేయకుంటే అది స్తబ్ద&ధమౌతుంది. అలా కాకూడదనే, వివిధ స్థాయిల్లో వివిధ ప్రశ్నలను ఇవ్వడం జరిగింది. సెకండరీ స్థాయిలోని పిల్లలు ఓ వ్యాఖ్యానం రాయగలగాలి. ఒక కవిత, వ్యాసం, పీఠిక మొదలయిన అంశాలను రాయగలిగితేనే ఈ సామర్థ్యసాధన జరిగినట్లు భావించాలి.

**ఆలోచించండి.**

- *8, 9 తరగతుల్లో సృజనాత్మకతకోసం ఏ ఏ అభ్యాసాలు ఉన్నాయి?*
- *వీటి ద్వారా పిల్లలు ఏమేమి చేయగలుగుతారు?*
- *వీటిని తరగతి గదిలో ఎలా నిర్వహించాలి?*

(అ) ఏం చేయగలగాలి?

- కవుల భావాలను నీతివాక్యాల రూపంలో రాయగలగాలి.
- ఓ పద్యాన్ని ఒక గేయంగానో, వచనకవితగానో మార్చగలగాలి.
- కరపత్రం తయారుచేయగలగాలి.
- మహోన్నత వ్యక్తుల పాత్రలను అభినయించాలి.
- ఒక గేయాన్ని ఓ కవితగానో, ఓ కథగానో మలచగలగాలి.
- లేఖలు రాయగలగాలి.
- వర్ణనాత్మకంగా రాయగలగాలి.
- నచ్చిన వస్తువును ఎన్నుకొని చిత్రం గీయగలగాలి. దాన్ని వివరించగల్గాలి.
- ఆత్మకథను రాయగలగాలి.
- సంభాషణారూపంలోకి మార్చగలగాలి.
- ఓ గేయకథను రాయగలగాలి.

**(ఆ) స్వభావం :**

సృజనాత్మకత కింద ఇచ్చిన ప్రశ్నలను పరికిస్తే వాటి స్వభావాలు తొందరగా అవగతమౌతాయి. మచ్చుకు కొన్ని ప్రశ్నలు–

- పాఠం ఆధారంగా గరుడునికీ, కద్రువ కుమారులకూ మధ్య జరిగిన పరస్పరచర్యను సంభాషణ రూపంలో రాయండి. **(అమ్మకోసం)**
- ఈ పాఠాన్ని ఆధారంగా చేసుకొని మీ అనుభవాలతో, ఒక చిన్న కథ రాయండి. **(చిన్నప్పుడే)**
- పాఠంలో మనదేశం గొప్పతనాన్ని తెలుసుకున్నారుకదా! మనదేశం గొప్పతనాన్ని వర్ణిస్తూ, భారతీయ విలువలు కాపాడటానికి అందరూ బాధ్యత తీసుకోవాలని ఒక "కరపత్రం" తయారుచేసి ప్రదర్శించండి. **(ప్రాచీన సాహిత్యాధ్యయన ఆవశ్యకత)**
- ప్రతీకారం మంచిది కాదనీ, శాంతియుతజీవనం గొప్పదనీ మీ మిత్రునికి లేఖ రాయండి. **(శాంతికాంక్ష)**
- పాఠ్యాంశం ఆధారంగా కొన్ని సూక్తులు తయారుచేయండి. **(రుబాయీలు)**
- కాళోజి తన కవిత ఎలా ఉండాలని అనుకున్నాడో తెలిసిందికదా! అదే విధంగా కథ ఎలా ఉండాలని మీరు అనుకుంటున్నారో కవితారూపంలో రాయండి. **(ఈప్స)**

పై ప్రశ్నలను పరిశీలిస్తే –

- సంభాషణరూపం
- కథానికారూపం
- కరపత్రం

- లేఖ
- సూక్తులు తయారుచేయడం
- కవితారూపానికి సంబంధించి

ప్రశ్నలు ఉన్నట్లు కనబడుతున్నాయి. ఇవేకాక ఇంకా వివిధ ప్రక్రియలకు అనుసృజనచేయగలప్రశ్నలున్నాయి.

**(ఇ) నిర్వహణ :**

ఈ సామర్థ్యాన్ని కూడా పూర్తి తరగతి కృత్యంగానే నిర్వహించాలి. ఉపాధ్యాయుడి ప్రోత్సాహం ఎక్కువగా ఉండాలి. ప్రశ్నల భావాలను విడబరచి చెప్పి సమాధానాన్ని అనుసృజింపచేయాలి. చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.

విద్యార్థి తన భావాలను ప్రదర్శించడానికి అనుమతించాలి, అభినందించాలి. తోటి విద్యార్థినీవిద్యార్థులచే అభినందింపజేయాలి.

"స్వీయరచన" నిర్వహణలాగానే సృజనాత్మక కృత్యాలను కూడా నిర్వహించాలి అంటే పూర్తి తరగతిలో సూచనలు ఇవ్వడం, జట్లలో లేదా వ్యక్తిగతంగా చేయించడం / రాయించడం, వాటిని ప్రదర్శింపజేయడం, ఆ తర్వాత సరిదిద్దడం జరగాలి. తర్వాత పిల్లలచేత వ్యక్తిగతంగా రాయించాలి.

## VI. ప్రశంస

ఒక్క ప్రశంస చాలు, కోటి ఏనుగుల బలం లభించినట్లు చేయడానికి. అయితే ఈ ప్రశంస అనేది కుల, మత, వర్గ, లింగ, భాషా భేదాల చుట్టూ తిరగడంవల్ల దేశంలో నైతిక విలువలు తగ్గిపోయి ఈర్ష్య, అసూయాద్వేషాలు పెచ్చుమీరుతున్నాయి. సంకుచిత ధోరణులు ప్రబలుతున్నాయి. మేధ అడుగంటి దుర్బుద్ధి రాజ్యం చేస్తున్నది.

ఈ ప్రమాదాలనుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే విద్యార్థి దశ నుండే సరైన మార్గదర్శనంచేయాల్సి ఉంటుంది. అందుకే దీన్నొక్క సామర్థ్యంగా విద్యాప్రమాణంగా APSCF 2011 నిర్దేశించింది. సరైన రీతిలో సరైన వ్యక్తులను ప్రశంసించడమనేది అత్యావశ్యకం. దీనివల్ల స్ఫూర్తి ఏర్పడుతుంది. ఈర్ష్య, అసూయాద్వేషాలు దరిచేరవు.

ప్రశంస అనేది ఒక వ్యక్తికి, ఒక వ్యవస్థకు, ఒక సంస్థకు, ఒక దేశానికి, ఒక గ్రామానికి, ఒక మేధకు లేదా మరోదానికి కావచ్చు. అది సార్వజనీనంగా, సార్వత్రికంగా ఉండాలి. పిల్లల్లో ఎదుటివారిలోని / వర్గంలోని గొప్పదనాన్ని గుర్తించి ప్రశంసించే వైఖరి పెంపొందాలి. ఇది ఉత్తమ వ్యక్తిత్వానికి ప్రతీక.

**(అ) ఏం చేయగలగాలి?**

ప్రశంస కింద ఇచ్చిన అభ్యాసాలేగాక, ఆటా సందర్భాన్ని బట్టి కూడా తగిన ప్రశ్నలను కూడా ఉపాధ్యాయుడు సంధించవచ్చు. వాటి ద్వారా విద్యార్థులు

- మతభేదం లేకుండా, కులభేదం లేకుండా మంచి పని చేసినవారిని ప్రశంసించగలగాలి.
- భాషాభేదంతో, లింగభేదంతో నిమిత్తం లేకుండా వ్యక్తులను ప్రశంసించగలగాలి.
- కవి / రచయిత భావాలను ప్రశంసించగలగాలి.
- తోటివారిలో ఉండే గొప్పతనాన్ని మెచ్చుకోగలగాలి.
- వికలాంగులను, అంటే ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని, వృద్ధులను వారిమంచి పనులను ప్రశంసించగలగాలి.
- వివిధ భాషానిర్మాణాలను, పదాలను పోల్చుకొని ప్రశంసించగలగాలి.
- చర్చలో తాను ఓడినా ఎదుటివారిని అభినందించగలగాలి.
- ప్రతి మంచినుండి స్ఫూర్తి పొంది, ఆ మంచిని కీర్తించగలగాలి.

**(ఆ) స్వభావం :**

పాఠ్యాంశాల్లోని ప్రశ్నలను గమనిస్తే ఈ ప్రశ్నల స్వభావాలు ఎలా ఉంటాయో తెలుస్తాయి. ఉదా:

- రుబాయీ ఛందస్సులో రాసిన కవితని, భావసౌందర్యాన్ని ప్రశంసిస్తూ ఆరు వాక్యాలను రాయండి. **(రుబాయీలు)**
- పాఠంలోని ఏదైనా పేరాను వ్యవహారభాషలోకి మార్చి రాయండి. **(సీతక్క పెండ్లి)**
- మీ తరగతిలో మీ మిత్రులు రాసిన పుస్తక పరిచయ నివేదికల్లో ఎవరి నివేదిక బాగుంది? అది ఎందుకు బాగుందో వివరిస్తూ వారిని ప్రశంసిస్తూ పది వాక్యాలు రాయండి. **(బతుకు పుస్తకం)**
- మీ పాఠంలో హనుమంతుని శక్తియుక్తులను వర్ణించిన కవిని ప్రశంసిస్తూ, అతని రచనలు చదవమని సలహా ఇస్తూ మిత్రునికి ఒక లేఖ రాయండి. **(సముద్ర లంఘనం)**
- శ్రీశ్రీ కవితాశైలి ఎలాంటిది? ఆయన చేసిన పదప్రయోగం గురించి ఒక వ్యాసం రాయండి. **(ప్రతిజ్ఞ)**
- దుందుభి గేయంలో కవి నదిని అద్భుతంగా వర్ణించాడు. ఇది ఆసక్తి కలిగించేలా ఉంది కదా! దీనివల్ల మీకు ఎలాంటి ఆసక్తి కలిగిందో వివరిస్తూ ఒక వ్యాసం రాసి గోడపత్రికలో ప్రదర్శించండి.

పై ప్రశ్నలను పరిశీలిస్తే –

- ఇతర భాషల్లోని భావసౌందర్యం.
- భాషలోని శైలీభేద ప్రశంస.
- తోటి మిత్రులను ప్రశంసించడం.
- లేఖద్వారా కవి వర్ణనాశక్తిని ప్రశంసించడం.
- కవుల కవిత్వ శైలిని వ్యాసం ద్వారా ప్రశంసించడం.
- గోడపత్రిక ద్వారా కవి చెప్పిన ఆసక్తికర, వర్ణనా వివరాలను ప్రశంసించడం లాంటి స్వభావాలు కనబడతాయి.

**ఒక్కోరకమైన ప్రశంసను గుర్తిస్తూ పాఠ్యాంశాల్లో ఇచ్చిన వివిధ రకాల ప్రశంసా సామర్థ్యాలను వెలికితెచ్చే ప్రశ్నల పట్టికను సిద్ధం చేయండి.**

**(ఇ) నిర్వహణ :**

విద్యార్థుల్లో ప్రశంసించే తత్వాన్ని పెంపొందించాలి. ప్రశంసించే విధానాన్ని తెలియజేయాలి. దీన్ని మొదట పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. సూచనలు ఇవ్వాలి. తరవాత వ్యక్తిగత కృత్యంగానే అభివ్యక్తీకరించేట్లు చేయించాలి. ప్రశంసల్లోని మాధుర్యానుభూతిని వర్ణించి చెప్పాలి.

కుల, మత, లింగ, భాషా వర్గ భేదాలు లేకుండా మంచిని ప్రశంసించేట్లు చూడాలి. సంకుచిత భావాలకు దూరంగా, ఈర్ష్యాసూయలకు దూరంగా ఉండేట్లు చూడాలి. ప్రశంస అనేది ఒక ప్రోత్సాహమనే విషయాన్ని తెలియజెప్పాలి.

ఇతరులు రాసిన విషయాన్ని పరిశీలించి అంగీకారయోగ్యంకాని భావనలున్నట్లైతే చర్చద్వారా సరిదిద్దాలి. స్వీయరచన, సృజనాత్మకత అభ్యాసాల లాగే సరిదిద్దడం చేపట్టవచ్చు.

## VII. భాషాంశాలు

పాఠ్యపుస్తకంలో వచ్చే వివిధ రకాల మార్పులను సౌందర్యాన్ని, నియమాలను తెలియజెప్పడానికి భాషాంశాలు అవసరం.

ఈ భాషాంశాల్లో సంధులు, సమాసాలు, వాక్యభేదాలు, అలంకారాలు, ఛందస్సు మొదలయిన అంశాలన్ని ఉంటాయి. ప్రాథమిక స్థాయిలో భాషాభాగాలతో మొదలైన భాషాంశాలు ఉన్నత స్థాయి వచ్చేసరికి వాక్యాలు నిర్మాణాల్లో ఉండే తేడాతోపాటు, భాషకు సంబంధించిన వివిధ నియమాలను విద్యార్థులు అవగతం చేసుకుంటారు.

**(అ) ఏం చేయగలగాలి?**

ఈ 'భాషాంశాలు' సామర్థ్యం ద్వారా విద్యార్థులు

- ♦ వాక్యనిర్మాణాల్లోని తేడాలను గమనించి వివిధ రకాల వాక్యాలు నిర్మించగలగాలి.
- ♦ తెలుగు, సంస్కృత సంధుల నియమాలను గుర్తించగలగాలి. ప్రయోగాల ద్వారా సూత్రం నిర్మించగలగాలి.
- ♦ సమాసాలను గుర్తించి, ఆయా సమాసాలకు సరైన ఉదాహరణలు ఇవ్వగలగాలి.
- ♦ పద్య / గద్యాల్లో ఉండే అలంకారాలను గుర్తించగలగాలి. అలంకారానికి సంబంధించిన లక్షణాలను చెప్పగలగాలి.
- ♦ ఛందోరీతులను తెల్సుకోవాలి. జాతి, ఉపజాతి, వృత్త పద్యాలకు సంబంధించిన లక్ష్యలక్షణ సమన్వయం చేయగలగాలి.

**(ఆ) స్వభావం :**

స్థూలంగా ఈ సామర్థ్యసాధన ప్రశ్నలు భాషాప్రయోగాన్ని అనుసరించి సూత్రీకరణ దిశగా ఉంటాయి.

అయితే నూతన పాఠ్యపుస్తకాల్లో ఇవి ప్రాయోగికంగా ఇవ్వడం జరిగింది. ఉదా:

- ♦ కింది పేరానుండి సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించి రాయండి. **(ప్రతిజ్ఞ)**
- ♦ కింది విగ్రహవాక్యాలను సమాసపదంగా మార్చండి. **(చిన్నప్పుడే)**
- ♦ కింద ఇచ్చిన పదాలకు వ్యుత్పత్త్యర్థాలను జతచేయండి. **(సముద్రలంఘనం)**
- ♦ కింది పాదాలు ఏ వృత్తాలకు సంబంధించినవో గుర్తించండి. **(సందేశం)**
- ♦ పాఠం చదవండి. కింద తెలిపిన సంధులకు సంబంధించిన ఉదాహరణలను వెతికి రాయండి. సూత్రాలు కూడా రాయండి. **(శాంతికాంక్ష)**
- ♦ పాఠంలోని సమాస పదాలు ఆధారంగా కింది పట్టికలోని ఖాళీగళ్ళను పూరించండి. **(ససేమిరా)**
- ♦ 7వ పద్యంలోని అలంకారాన్ని కనుక్కొని, పేరురాసి, లక్షణాలతో సరిపోల్చండి. **(ససేమిరా)**

ఈ ప్రశ్నల స్వభావాలు మామూలు రీతికి భిన్నంగా కనబడతాయి.

- ♦ పేరా నుండి విభిన్న వాక్యాలను ఏరి తీయడం.
- ♦ సమాస పదాలను కూర్చడం.
- ♦ ఛందోలక్షణాలను గుర్తించడం.
- ♦ సంధుల పేర్ల ద్వారా సంధిపదాలను గుర్తించడం.
- ♦ పాఠంలోని సమాస పదాలు ఆధారంగా అడిగిన ఖాళీని పూరించడం.
- ♦ పద్యంలోని అలంకారాన్ని లక్షణంతో సరిపోల్చడం మొదలయిన స్వభావాలు కనబడతాయి.

**భాషాంశ సంబంధ ప్రశ్నల్లోఉన్న కొత్త పోకడలున్న ప్రశ్నలను వెదకండి.**

**(ఈ) నిర్వహణ :**

ఈ సామర్థ్యాన్ని తరగతి కృత్యంగాను, వ్యక్తిగత కృత్యంగాను నిర్వహించాలి. ప్రతి విద్యార్థి సూత్ర నిర్మాణాన్ని సాధించగలగాలి. అందుకు ఉపాధ్యాయుడు విభిన్న ఉదాహరణలను ఉపయోగించుకోవచ్చు. నిత్యవ్యవహారంలోని వాక్యాలను, పదాలను కూడా వాడి విద్యార్థులచేత సామర్థ్య సాధన చేయవచ్చు. దీనికి కేటాయించిన పీరియడ్లలోనే ఈ అభ్యాసం జరగాలి. దీనిలో సులువు నుండి కఠినతవైపు వెళ్ళాలి.

విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలి. విద్యార్థి స్వయంగా సాధించగలగాలి.

## ప్రాజెక్ట్ పని

ఇది అనేక సామర్థ్యాలు సమ్మిళితమైన పని. ప్రతి పాఠంలో ఇచ్చిన ప్రాజెక్టుపనిని వ్యక్తిగత కృత్యంగానే నిర్వహించాలి. అవసరమైన చోట్ల మాత్రమే సమూహకృత్యంగా నిర్వహించేట్లు చూడాలి. ఐతే ఎలా చేయాలో, సూచనలు ఇవ్వాలి. ఏమేం చేయాలో స్పష్టంగా తెలపాలి.

ఇచ్చిన ప్రతి ప్రాజెక్ట్ పనిని తరగతి గదిలో ప్రదర్శించేట్లు చూడాలి. ఉత్తమ ప్రాజెక్టుపనులను ప్రశంసించాలి. పాఠ్య విషయబోధన పూర్తికాగానే అభ్యాసాలను ప్రారంభించకముందే ప్రాజెక్టుపనిని ఇంటిపనిగా ఇవ్వాలి. దీన్ని బట్టి సమయాన్ని దృష్టిలో పెట్టుకొని పదజాల కృత్యాలు నిర్వహించే రోజు లేదా స్వీయమూల్యాంకన కృత్యాలు నిర్వహించేటప్పుడు ప్రదర్శింపజేయాలి. చర్చ నిర్వహించాలి. పిల్లలు ఏమి నేర్చుకొన్నారో వ్యక్తిగతంగా నివేదిక రాయమనాలి.

## ముగింపు

పాఠ్యపుస్తకంలో అభ్యాసాలు చాలా కీలకమైనవి. వీటి సాధన అత్యవసరమనే విషయాన్ని గుర్తించాలి. వీటిద్వారానే సామర్థ్యాల సాధన జరుగుతుంది. ఏ పాఠం బోధించినా ఆ పాఠానికి కేటాయించిన పీరియడ్లలో ఎక్కువభాగం సుమారు 70% సమయాన్ని అభ్యాసాలకు కేటాయించాలి. విషయబోధన / వినడం / అవగాహనకు 30% సమయాన్ని కేటాయించుకోవాలి. అప్పుడే భాషాబోధన లక్ష్యాలు నెరవేరుతాయి.

*పాఠశాల సామాజిక కేంద్రం. దీంట్లో సమానత్వపు విలువలు, సామాజిక న్యాయం, వైవిధ్యాల పట్ల గౌరవం, పిల్లల హక్కులు, పిల్లలకిచ్చే గౌరవం వంటివి ఇందులో ప్రతిబింబించాలి. ఈ విలువలను పాఠశాల దృక్కోణంలో ఉద్దేశపూర్వకంగా భాగం చేసి వాటి అమలుకు పునాదులు వేయాలి. పిల్లలు భద్రతాభావంతో, నిర్భయం ఉంటూ సమానత్వం, న్యాయమైన పరిపాలనతో, స్వేచ్ఛాపూరిత వాతావరణంలో భావవ్యక్తీకరణ చేయగలగడం, ప్రశ్నించడం వంటివి చేయడానికి ఉన్న వాతావరణాన్ని అనుకూల వాతావరణం అంటారు. దీనికై ఉపాధ్యాయులు ప్రత్యేక కృషిచేయాల్సిన అవసరం లేదు. పిల్లల పట్ల వివక్షత, అసమానత్వపు దృష్టి లేకుండా ఉంటే చాలు. బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొనేటప్పుడు పిల్లలు స్వేచ్ఛగా ప్రశ్నించేటట్లు, తోటిపిల్లలతో, ఉపాధ్యాయులతో సంభాషించేటట్లు తరగతి గదిని ఉపాధ్యాయుడు నిర్మించాలి. తరగతి గది భౌతిక స్వరూపం కూడా మారాలి. పిల్లలు చిన్నగ్రూపులుగా, పెద్దగ్రూపులుగా కూర్చొని వివిధ కృత్యాలు లేదా కథలు చెప్పుకోడానికి, చర్చించుకోడానికి, వ్యక్తిగతంగా చదవడం, రాయడం చేయడానికి, అందరూ సమావేశమై T.V., రేడియో కార్యక్రమాలు వీక్షించడానికి అనుకూలంగా తరగతి గదులు మార్పుచెందాలి.*

***– ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం 2011***

# 3 బోధనప్రణాళిక వ్యూహాలు – సోపానాలు

గతంలో విద్యాబోధన ఉపాధ్యాయకేంద్రితమయి ఉండేది. ప్రస్తుత బోధన అంతా విద్యార్థి కేంద్రితంగా మారింది. దీనివల్ల విద్యార్థుల భాగస్వామ్యం, స్వయం అధ్యయనానికి అవకాశం కలిగించింది. దీనికనుగుణంగా బోధన వ్యూహాలున్నప్పుడే అది సఫలమౌతుంది. ఈ బోధన వ్యూహాలు పాఠ్యపుస్తక లక్ష్యాల్ని సాధించడంలో ఉపయోగపడతాయని భావిస్తున్నాం.

వ్యూహంలో కీలక భూమిక పోషించేది 'సమయం'.

మొదట దీన్ని గురించి చర్చిద్దాం.

**పాఠశాల పనిదినాలు :**

| | | |
|---|---|---|
| విద్యా సంవత్సరంలో ఉండే మొత్తం పనిదినాలు | – | 220 |
| భాషోపాధ్యాయునికి అవసరమైన పీరియడ్లు | – | 176 |

8వ తరగతి పాఠ్యపుస్తకంలో 14 పాఠాలు, 6 ఉపవాచకపాఠాలతో కలిపి మొత్తం 20 పాఠాలు ఉన్నాయి. 9వ తరగతిలో 14 పాఠాలు, 6 ఉపవాచకపాఠాలతో కలిపి 21 పాఠాలున్నాయి. ఆయా తరగతుల పాఠ్యాంశాలకు పీరియడ్ల విభజన పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు. అవసరమైనచోట్ల ఉపాధ్యాయుడు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు.

ఆయా తరగతులవారీగా సాధించాల్సిన సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని, పాఠ్యాంశాలను పీరియడ్లుగా విభజించుకొని ఆశించిన ఫలితాల సాధనకోసం శ్రమించాలి. పాఠ్యపుస్తకాలలోని విషయసూచికలో, ఉపాధ్యాయులకు సూచనల్లో వివరాలు ఉన్నాయి. ఒక పాఠాన్ని బోధించడానికి సగటున ఎన్ని పీరియడ్లు అవసరమైతాయో విషయ సూచికలో పొందుపరిచారు. భాషోపాధ్యాయులుగా బోధన ప్రణాళికకోసం మొత్తం పీరియడ్లలో పాఠ్యబోధనకు ఎన్ని పీరియడ్లు, అభ్యాసాల నిర్వహణకు ఎన్ని పీరియడ్లు అవసరమవుతాయో ముందే నిర్ధారించుకోవాలి. వీటికోసం కేటాయించిన పీరియడ్లలో ఆయా కృత్యాలు నిర్వహించాలి. ఇందుకోసం పక్క పేజీల్లో భాషోపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉండడానికి బోధన పీరియడ్ల ప్రణాళిక వివరాలు ఉన్నాయి. పరిశీలించండి.

## 8వ తరగతి – పీరియడ్‌వారీగా ప్రణాళిక

| క్ర. సంఖ్య | పాఠం పేరు | కేటాయించిన పీరియడ్లు | 1వ పీరియడ్ | 2వ పీరియడ్ | 3వ పీరియడ్ | 4వ పీరియడ్ | 5వ పీరియడ్ | 6వ పీరియడ్ | 7వ పీరియడ్ | 8వ పీరియడ్ | 9వ పీరియడ్ | 10వ పీరియడ్ | 11వ పీరియడ్ | 12వ పీరియడ్ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | దుందుభి (ప) | 10 | (ఉన్ముఖీకరణ, ఉద్దేశం, పాఠం చదవడం) పూర్తి తరగతి కృత్యం | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వినడం-మాట్లాడడం | చదవడం, అవగాహన | స్వీయరచన | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | | |
| 2 | మన సంస్కృతి (గ) | 12 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | భాషాంశాలు | నేనివి చేయగలనా? |
| 3 | అమ్మకోసం (ప) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | |
| 4 | హద్దులు హద్దులు (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 5 | ఇల్లు ఆనందాల హరివిల్లు (గ) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | | |
| 6 | నీతిపరిమళాలు (ప) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | |
| 7 | సాంస్కృతిక వైవిధ్యం (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 8 | ప్రతిజ్ఞ (ప) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | | |
| 9 | హైద్రాబాద్ సంస్థాన విమోచనోద్యమం (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 10 | అజంతా చిత్రాలు (గ) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | |
| 11 | మధుపర్కాలు (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 12 | హరిశ్చంద్రుడు (ప) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | | |
| 13 | చిన్నప్పుడే (గ) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | | |
| 14 | జీవన భాష్యం (ప) | 09 | | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | | | |
| 15 | ప్రాచీన సాహిత్యాధ్యయనం(గ) | 12 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | భాషాంశాలు | నేనివి చేయగలనా? |
| 16 | సముద్ర లంఘనం (ప) | 12 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | భాషాంశాలు | నేనివి చేయగలనా? |
| 17 | www.కారడవి.com (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 18 | సంస్కరణ (గ) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | భాషాంశాలు | నేనివి చేయగలనా? | |
| 19 | సందేశం (ప) | 12 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | వి-మా॥ | చదవడం, అవగాహన | స్వీ.ర-పదజాలం | సృజనాత్మక | ప్రశంస, ప్రాజెక్టు | భాషాంశాలు | భాషాంశాలు | నేనివి చేయగలనా? |
| 20 | వేసవి సెలవుల్లో (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| | | 176 | | | | | | | | | | | | |

## 9వ తరగతి - పీరియడ్‌వారీగా ప్రణాళిక

| క్ర. సంఖ్య | పాఠం పేరు | కేటాయించిన పీరియడ్లు | 1వ పీరియడ్ | 2వ పీరియడ్ | 3వ పీరియడ్ | 4వ పీరియడ్ | 5వ పీరియడ్ | 6వ పీరియడ్ | 7వ పీరియడ్ | 8వ పీరియడ్ | 9వ పీరియడ్ | 10వ పీరియడ్ | 11వ పీరియడ్ | 12వ పీరియడ్ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | శాంతి కాంక్ష (ప) | 11 | (ఉన్ముఖీకరణ, ఉద్దేశం, పాఠం చదవడం) పూర్తి తరగతి కృత్యం | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. ప్రశ్నలు | అ.ప్ర. చదవడం | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | వ్యాకరణం | వ్యాకరణం | |
| 2 | స్వభాష (గ) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | | |
| 3 | శివతాండవం (ప) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. ప్రశ్నలు | అ.ప్ర. కత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | | |
| 4 | స్వామి వివేకానంద (ఉ) (*) | 06 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 5 | ప్రేరణ (గ) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. చర్చ | అ.ప్ర. కత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | |
| 6 | పద్యరత్నాలు (ప) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. చర్చ | అ.ప్ర. కత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | వ్యాకరణం |
| 7 | ప్రబోధం (గ) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | వ్యాకరణం | | |
| 8 | సావిత్రీబాయి పులే (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 9 | ససేమిరా (ప) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. | స్వీయరచన | సృజనాత్మకత | పదజాలం | వ్యాకరణం | వ్యాకరణం | | |
| 10 | సీతక్కపెండ్లి (గ) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. చర్చ | అ.ప్ర. కత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | |
| 11 | రుబాయీలు (ప) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. చర్చ | అ.ప్ర. కృత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | | |
| 12 | గిడుగు రామమూర్తి (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 13 | చూడడమనే కళ (గ) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. చర్చ | అ.ప్ర. కత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | |
| 14 | ఈప్స (ప) | 10 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | చర్చ | చదవడం, రాయడం | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | | |
| 15 | భద్రిరాజు కృష్ణమూర్తి (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 16 | బతుకు పుస్తకం (గ) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. ప్రశ్నలు | అ.ప్ర. కత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | |
| 17 | బళ్ళారి రాఘవ (*) | 04 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | చర్చ | చదవడం, రాయడం | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | | |
| 18 | భూమిపుత్రుడు (ప) | 10 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| 19 | ధర్మదీక్ష (గ) | 11 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | అ.ప్ర. ప్రశ్నలు | అ.ప్ర. కత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | | |
| 20 | కాపు రాజయ్య (ఉ) (*) | 04 | | పాఠ్యబోధన | పాఠ్యబోధన | పాఠ్యబోధన | చర్చ | అ.ప్ర. కత్యాలు | స్వీయరచన | సృజనాత్మకత | ప్రశంస, ప్రాజెక్టు | పదజాలం | వ్యాకరణం | |
| 21 | మిద్దె రాములు (ఉ) (*) | 04 | | చదివించడం చర్చ | చదివించడం చర్చ | అభ్యాసాలు | అభ్యాసాలు | | | | | | | |
| | | 176 | | | | | | | | | | | | |

గమనిక :- వి॥ మా॥ - వినడం - మాట్లాడడం, అ.ప్ర. - అవగాహన - ప్రతిస్పందన, అ.ప్ర.ప్రశ్నలు - వినడం ఆలోచించి మాట్లాడడానికి ఉద్దేశించినవి, అ.ప్ర.కృత్యాలు - చదవడం అర్థంచేసుకోడానికి ఉద్దేశించినవి.

**బోధన :**

గతంలో అనుసరించిన బోధన పద్ధతులన్నమాట స్థానంలో ప్రస్తుతం బోధనవ్యూహాలు అని వాడుతున్నాం. అవసరాన్ని బట్టి బోధన విధానం మార్చుకునే వీలు ఈ వ్యూహం కల్పిస్తుంది. ఎందుకంటే వ్యూహం గతిశీలమైంది కదా! పిల్లలంతా భాషాసామర్థ్యాల్లో పట్టు సాధించడమే భాషా బోధనకు తగిన లక్ష్యం. ఆ లక్ష్యసాధనకు, విద్యార్థుల్లో ఆశించిన సామర్థ్యాలకోసం ఉపాధ్యాయుడు అభ్యాసాల నిర్వహణపైనే దృష్టి సారించాల్సి ఉంది.

ఆర్టీఈ 2009 లో బోధనాభ్యసన ప్రక్రియల గురించి కింది విధంగా పేర్కొన్నది.

- ***స్నేహపూరిత వాతావరణంలో శిశుకేంద్రంగా; పరిశోధన, అన్వేషణ, కృత్యాల సాయంతో అభ్యసనం జరగాలి.***
- ***భయం, ఒత్తిడి ఉద్విగ్నతలేని వాతావరణంలో పిల్లలు స్వేచ్ఛగా భావవ్యక్తీకరణ చేసే అవకాశం ఉండాలి.***
- ***పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని ఏ మేరకు వినియోగించగలరో అంచనా వేయడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం జరగాలి.***

వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని బోధనవ్యూహాలను తయారుచేసుకున్నాం. ఈ సోపానాలు బోధనాభ్యసన క్రమాన్ని ఫలవంతంచేస్తుంది.

పాఠ్యప్రణాళికను రాసే సందర్భంలో పాఠాన్ని పూర్తిగా తీసుకుని ఉన్ముఖీకరణ మొదలు పాఠం పూర్తయ్యేవరకు, అభ్యాసాలతో మొదలుకొని స్వీయమూల్యాంకనం చేసుకునే వరకు సోపానాలు నిర్ధరించుకొని వాటిని అమలుచేసేలా బోధనవ్యూహాలు ఉంటాయి. వాటిని ఒకసారి పరిశీలిద్దాం!

## పాఠంలోని విషయాల అమరిక క్రమం - ఉద్దేశం

**I) మొదటిపేజీ** – అ) ప్రతి పాఠం ప్రారంభానికీ ముందు పేజీలో "ఆలోచించండి–చెప్పండి" అనే శీర్షికతో చిత్రం / గేయం / పద్యం / సన్నివేశం ..... మొదలయినవి ఉన్నాయి. ఇవి ఉన్ముఖీకరణకు సంబంధించినవి. వీటి ఆధారంగా పిల్లలను ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. వీటిద్వారా పిల్లల్ని పాఠం వైపు సంసిద్ధులను చేయాల్సి ఉంటుంది.

ఆ) నేపథ్యం / ఉద్దేశం : ప్రతి పాఠం ఉద్దేశాన్నీ లేదా నేపథ్యాన్నీ వివరించారు.

ఇ) పాఠం ఎంపిక : పాఠం ఏ గ్రంథంలో, దీన్ని ఎవరు రాశారు? వంటి వివరాలను ఉద్దేశం / నేపథ్యం కింద పరిచయం చేశారు.

ఈ) విద్యార్థులకు సూచనలు : మొదటి పేజీలో చివర విద్యార్థులకు సూచనలు ఉన్నాయి. వీటిలో మూడు సూచనలు ఉంటాయి. పాఠం చదవడం, పదపట్టికల ద్వారా అర్థాలు తెలుసుకోవడం, పాఠం చిత్రం ఆధారంగా విషయాన్ని ఊహించడానికి సంబంధించిన సూచనలు ఉన్నాయి.

**II) పాఠ్యాంశవిషయం** – తరవాతి పేజీ నుండి రెండు నుండి ఆరుపేజీలవరకు, పాఠం ఉంటుంది. ఇవి వివిధ ప్రక్రియల్లో ఉంటాయి. వీటిని ఉపాధ్యాయులు చదవడం, చదివించడం, విషయాన్ని అర్థం చేయించడం, అంతరార్థాన్ని కనుగొనేలా చేయడం, కవి ఆంతర్యాన్ని గ్రహించడం, సమకాలిన అంశాలకు అన్వయించి ప్రతిస్పందించేలా చేయడం, భాషాభిరుచి, పఠనాభిలాషను పెంపొందించడం, విలువలు, వ్యక్తిత్వం వెలిగేలా పాఠంలోని కీలక పదాలు, కీలక వాక్యాలు, సన్నివేశాలు, సంఘటనలను విడబరిచి చెప్పడం లేదా చర్చ ద్వారా అవగాహన కలిగించడం చేయాల్సి ఉంటుంది.

**III) అభ్యాసాలు** - **"ఇవిచేయండి'** శీర్షికతో అభ్యాసాలు ఉన్నాయి. ఇవి భాషాసామర్థ్యాల సాధనకు ఉద్దేశించినవి. వీటిమీద పిల్లలకు అవగాహన కల్పించడం, అభ్యాసం చేయించడం జరగాలి.

**IV) నేనివి చేయగలనా?** - ఇది స్వీయమూల్యాంకనానికి ఉద్దేశించినది. పాఠం పూర్తయిన తరవాత పిల్లలు తాము వేటిని సాధించారో, వేటిని సాధించలేకపోయారో పిల్లలే తమకు తాము అంచనావేసుకోడానికి **"నేనివిచేయగలనా?"** అభ్యాసం ఉంది. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని బోధనవ్యూహాలు, ప్రణాళికలు పాఠంలోని మొదటిపేజీలోని **"ఆలోచించండి-చెప్పండి"** నుండి **"నేనివిచేయగలనా?"** వరకు అన్ని అంశాల గురించి పాఠ్యబోధన ప్రణాళికలో చోటుచేసుకోవాలి. ఇందుకనుగుణంగానే పాఠానికి అవసరమైన మొత్తం పీరియడ్ల సంఖ్యను నిర్ధరించాలి. ఏ పీరియడ్‌లో దేనిపై దృష్టి పెట్టాలో నిర్ణయించుకోవాలి. ఇందుకోసం ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉండడానికి పాఠాల వారీగా పీరియడ్ల విభజన ప్రణాళికను ముందు పేజీల్లో ఇచ్చారు.

## పాఠ్యబోధన - వివిధ ప్రక్రియలు

పాఠ్యబోధనలో ప్రక్రియను దృష్టిలో ఉంచుకోవాలి. 8, 9 తరగతుల్లో పద్యం, గేయం, వ్యాసం, కథ, ప్రబంధం, రుబాయి, వచన కవిత, అనువాద కవిత, యాత్రాచరిత్ర, గజల్, వార్తావ్యాఖ్య తదితర ప్రక్రియలున్నాయి.

పద్యం - పద్యాల్ని భావస్ఫోరకంగా, రసానుభూతి కలిగించేలాగా చదవాలి.
- స్పష్టమైన ఉచ్చారణతో చదవాలి.

గేయం - లయాత్మకంగా ఆలపించాలి.
- భావానుగుణంగా లయ / తాళం గుర్తిస్తూ ఆలపించాలి.

పాట - శ్రుతి, రాగ, తాళ జ్ఞానంతో పాడాలి.

వచనకవిత - భావానుగుణంగా, ప్రాసల్ని గుర్తిస్తూ... చదవాలి. పునరుక్తుల్ని గమనిస్తూ చదవాలి.

రుబాయీ / గజల్ - గానప్రధానమైనవి.
- అంత్యప్రాసలు, ఊనిక, తూగు పాటిస్తూ ఆలపించాలి.
- రసానుభూతి కలిగేలా ఆలపించాలి.

పై ప్రక్రియలన్నీ రసానుభూతి ప్రధానమైనవి. విషయజ్ఞానంతోపాటు రసానుభూతికి అధిక ప్రాధాన్యం ఉండేలా బోధించాలి.

కథ - కథను ఉపాధ్యాయుడు ముందు సొంతంగా చెప్పాలి.
- ఇలా చెప్పేటప్పుడు కొన్ని ప్రశ్నల ద్వారా ఆలోచనల్ని రేకెత్తించాలి.
- ఉత్కంఠ కలిగించే సన్నివేశం దగ్గర కథను ఆపి విద్యార్థి ఊహించడానికి, ఆలోచించడానికి ప్రాధాన్యమివ్వాలి.
- కొత్త ముగింపు చెప్పమని కాల్పనిక శక్తిని వెలికితీయాలి.
- తాను విన్న / చదివిన కథతో సమన్వయించమనాలి.

వ్యాసం – ఎత్తుగడ, నడక, ముగింపు అనేవి వ్యాసంలో ప్రధానాంశాలు. ఎలా మొదలు పెట్టారు? ఎలా నిర్వహించారు? ఎలా విశ్లేషించారు? ఉపశీర్షికలు ఎలా ఉంచారు? ఎలా ముగించారు? మొదలైన విషయాలు గమనించమనాలి.

– ఒక్కో పేరాలోని కీలక పదాల్ని గుర్తించమనాలి. ఆ పదం ఆధారంగా తిరిగి పేరా చెప్పించాలి. సొంతమాటల్లో రాయగలిగేలా చేయాలి.

– సొంతంగా కొత్త విషయాలపై వ్యాసాలు రాయమనాలి.

ఆత్మకథ – ప్రసిద్ధులైనవారి ఆత్మకథలు, కీలక ఘట్టాలు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందిస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి.

– ఆత్మకథలు ఉత్తమ పురుష కథనంలో ఉంటాయి.

## "ఇవిచేయండి" అభ్యాసాల సాధన

**వినడం, మాట్లాడడం**
– వినడం మాట్లాడడం – చర్చ – చదవడం – అవగాహన (అవగాహన–ప్రతిస్పందన).
– విద్యార్థులకు వ్యక్తిగత / పూర్తితరగతివారీగా ప్రశ్నలు వేయడం.
– విన్నదాన్ని ఏమేరకు అవగాహన చేసుకుని ప్రతిస్పందిస్తున్నారో గమనించడం.
– విషయవిశ్లేషణ తీరును గుర్తించడం.

**స్వీయరచన**
– స్వీయరచనలో 1, 2 ప్రశ్నలు తరగతిలో సాధన చేయించి మిగతావి ఇంటిపనిగా ఇచ్చి మరుసటి రోజు సరిచూడాలి.
– స్వీయరచనలో ప్రశ్నల గురించి అవగాహన కల్పించడానికి తరగతిలో చర్చ నిర్వహించాలి.
– జట్లుగా చేసి రాయిస్తూ పర్యవేక్షించాలి.

**సృజనాత్మకత**
– సృజనాత్మకత, ప్రశంస అభ్యాసాలు తరగతిలో చేయించాలి. అవసరమైన చోట ఉపాధ్యాయుడు సహకరిస్తూ ప్రోత్సహించాలి.

**పదజాలం – భాషాంశాలు**

– పదజాలంలోని ఆయా అభ్యాసాల్ని పరిశీలించమనాలి.
– ఉదాహరణల్లోని పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి–వికృతులు, తదితర అంశాలను చదివి అర్థం చేసుకోమని వాళ్ళను ప్రోత్సహించాలి.
– వ్యాకరణాంశాల్లో పదాలు విడదీయడం – కలపడం – జరిగిన మార్పును గమనించడం – సూత్రీకరణం చేయమనాలి.
– కొన్ని కృత్యాలను తరగతి గదిలో చేయించాలి. మరిన్ని కృత్యాల్ని ఇంటిపనిగా ఇవ్వవచ్చు.

**ప్రాజెక్టుపని**
– పాఠం మొదలుపెట్టినప్పటినుండి పూర్తిచేసేలోపున విద్యార్థికి ఆయా విషయాల్లో ప్రాజెక్టుపనిని ఉపాధ్యాయుడు ఇవ్వవచ్చు.
– ప్రాజెక్టుపనిని ప్రదర్శన చేయించాలి.
– ప్రాజెక్టుపనిని మూల్యాంకనంలో అంతర్భాగంగా గుర్తించాలి.
– ప్రదర్శన విద్యార్థిలో ప్రశంసాగుణాన్ని ప్రోత్సహిస్తుంది.

**నేనివిచేయగలనా? స్వీయమూల్యాంకనం కృత్యాలు**

- 8వ తరగతి వాచకంలో ప్రతి పాఠం ముగిసిన వెంటనే విద్యార్థి తానేం నేర్చుకున్నాడో పరిశీలించుకునే అవకాశం "నేనివి చేయగలనా?" అనే శీర్షిక కల్పిస్తుంది.
- పిల్లలు ఏ అంశంలో వెనకబడ్డారో గమనించి, పునరభ్యసనం చేయించడానికి ఇది తోడ్పడుతుంది.

**సూచనలు:**

- బోధన ప్రణాళికలో పాఠానికి అవసరమైన పీరియడ్ల సంఖ్యను నిర్ధరించుకోవడం ప్రధానమైనది.
- పాఠ్యపుస్తకంలోని పాఠం ముందున్న ఉన్ముఖీకరణ చిత్రం / సన్నివేశం / సంఘటన మొదలైనవాటిని పాఠంవైపు పిల్లలను ఆకర్షితులను చేయడానికి, ఆలోచన రేకెత్తించడానికి వినియోగించుకోవాలి.
- పాఠ్యాంశ చిత్రం గురించి పిల్లలచేత మాట్లాడించాలి.
- పాఠ్యాంశబోధనలో విషయాన్ని వివరించడానికి / అవగాహన కల్పించడానికి ముందు తప్పనిసరిగా పిల్లలతో చర్చ నిర్వహించాలి. ఎవరెవరు బాగా చదవగలరో, చదివలేరో గుర్తించాలి.
- పిల్లల బాహ్యపఠనం తర్వాత ఉపాధ్యాయుడు ఆదర్శపఠనం చేయాలి.
- ఆ తరవాత అర్థగ్రహణ కోసం వ్యక్తిగత పఠనం (మౌనంగా), పదాలను గుర్తించడం, నిఘంటువులో వెతకడం వంటివి నిర్వహించాలి.
- పాఠ్యాంశ వివరణ రోజుల్లో తప్పనిసరిగా పిల్లలకు చదవడం, అవగాహన చేసుకోవడం, పదజాలం, స్వీయరచన చిన్నప్రశ్నల వంటివి ఇంటిపనిగా ఇవ్వవచ్చు.
- పాఠ్యాంశ వివరణ పూర్తయిననాడే ప్రాజెక్టుపనిని ఇంటిపనిగా ఇవ్వాలి. అట్లాగే ఆ మరునాటి ప్రశంస ప్రశ్నలను కూడా ఇంటిపనిగా ఇవ్వాలి.
- పాఠ్యాంశ విషయానికి చెందిన పీరియడ్లు పూర్తికాగానే మరుసటిరోజు అవగాహన ప్రతిస్పందనలోని ప్రశ్నలమీద తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత 'ప్రశంస'కు సంబంధించిన ప్రశ్నలపై పిల్లలకు అవగాహన కల్పించాలి. ఇదేరోజు 'ప్రశంస' ప్రశ్నలను ఇంటి పనిగా ఇవ్వాలి.
- ప్రశంస, ప్రాజెక్టుపనులను పిల్లలచేత తరగతిలో ప్రదర్శింపజేయడానికి రెండిటికి కలిపి ఒక పీరియడ్‌ను కేటాయించుకోవాలి.

***తరగతి పరిసరాలలో ఉపాధ్యాయులు, పిల్లలు పరస్పర భావప్రసార చర్యలలో పాల్గొనాలి. చర్చ, స్వేచ్ఛా వ్యక్తీకరణలకు పిల్లలకు అవకాశం లేకపోతే అది పిల్లల్లో అవిధేయత, కోపం, అసహనం, బానిసత్వపు వైఖరి, విముఖత మొదలగు సమస్యలకు దారితీస్తుంది. పిల్లలను పరాధీనులుగ మార్చివేస్తుంది. ఇలాంటి తరగతి వాతావరణం పిల్లల్లో అశాంతిని కలిగిస్తుంది. పరీక్ష అభ్యాసకులుగా, ఇతరులపై ఆధారపడే వారిగా, క్రియాశీలతలేని పౌరులుగా మార్చివేస్తుంది. కాబట్టి బోధనాభ్యసన ప్రక్రియలు పిల్లల జ్ఞాన నిర్మాణానికి అనుకూలంగా ఉండాలి. ఆ జ్ఞానాన్ని పిల్లలు నిజజీవితంలో ఉపయోగిచుకొనులా ఉండాలి.***

***- ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం-2011***

# 4 పాఠ్యపథకం - మాదిరి పాఠ్యపథకాలు

మారుతున్న నూతన విద్యావిధానాలను అనుసరించి బోధనలో, పాఠ్యపుస్తకాల్లో, చాలా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీనికనుగుణంగానే నూతన పాఠ్యపథక రూపకల్పన అనివార్యమైంది.

పాఠంలో కొంత భాగాన్ని ఎంపిక చేసుకొని అందులోని విశేషాంశాలు, వ్యాకరణాంశాలు, ప్రశ్నలకు సమాధానాలు మొదలైనవి. ఒకే పీరియడ్‌లో ముగించేలా వ్యూహం ఏర్పాటుచేసుకోవడం ఒకప్పటి పద్ధతి. మొత్తం పాఠంమీద విద్యార్థికి అవగాహన కలిగించడంకోసం కొన్ని పీరియడ్‌లు, అభ్యాసాలలోని వివిధ విషయాలకు ప్రత్యేకంగా కొన్ని పీరియడ్‌లు కేటాయించడం ఇప్పటి పద్ధతి. పిల్లలు స్వేచ్ఛగా అవగాహన చేసుకునేందుకు కావలసిన అవకాశాల్ని ఈ పాఠ్యపథకం కల్పిస్తుంది. సోపానాల్ని పాటిస్తూ అనుకున్న రీతిలో పూర్తిచేయడమే ముఖ్యం కనుక కాలాంశ నిర్దిష్టతలో కొద్దిపాటి మార్పులు చోటుచేసుకోవచ్చు. ఈ స్వేచ్ఛ భాషోపాధ్యాయుడికి ఉంది.

ప్రతి సోపానం స్వరూప స్వభావాలనూ, వాటిని పూర్తిచేసే విధానాన్నీ ఇంతకుముందే తెలుసుకున్నాం. పాఠ్యపథకాన్ని పరిశీలించి, కొత్తదనాన్ని గమనించి అవగాహన చేసుకుందాం.

## పాఠ్యబోధన - సోపానాలు

**I. ఉపోద్ఘాతం**

అ) పరిచయం / సంబోధన
ఆ) ఉన్ముఖీకరణ
ఇ) శీర్షికా ప్రకటన
ఈ) నేపథ్యం, కవిపరిచయం
ఉ) లక్ష్యాలు

(పై అంశాలన్నింటికీ:) లేదా పునశ్చరణ

**II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన**

అ) పాఠ్యాంశ చిత్రం గురించి మాట్లాడించడం (పదాలు / వాక్యాలు / సంభాషణ / కథ)

ఆ) గేయం / పద్యం / పాట ..... ఉపాధ్యాయుడు పాడడం

ఇ) పిల్లలచేత పాడించడం

ఈ) పిల్లలచేత బాహ్యపఠనం

ఉ) ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం

ఊ) పిల్లల మౌనపఠనం

ఎ) పిల్లలు తెలియని పదాల కింద గీతగీయడం, అర్థాలు తెలుసుకోవడం

ఏ) పాఠ్యాంశంపై చర్చ అవగాహన (కీలక పదాలు / వాక్యాలు / సంఘటనపై చర్చ)

(లేదా)

**సామర్థ్యాల సాధనమీద అభ్యాసం (స్వీయరచన / సృజనాత్మకత / భాషాంశాలు మొదలయినవి)**

అ) పూర్తి తరగతిలో చర్చ

ఆ) మేధోమథనం

ఇ) జట్టుపని

ఈ) జట్టుపని ప్రదర్శన

ఉ) సరిద్దిదడం (భావం / వాక్యం / పదాలు / అక్షరదోషాలు)

ఊ) వ్యక్తిగతంగా రాయించడం

## III. పిల్లల అవగాహన పరిశీలన

ఆరోజు బోధించిన అవగాహన అంశం ఆధారంగా పిల్లల అవగాహన పరిశీలన.

## IV. ఇంటిపని

(గ్రంథాలయ పుస్తక పఠనం / ప్రశంస / ప్రాజెక్టుపని / వినడం మాట్లాడడం పద్యాలు పాటలు కంఠస్థం చేయడం మొదలయినవి)

గమనిక : 1) పదజాలం అభ్యాసాలు, చదవడం అవగాహన చేసుకోవడం అభ్యాసాలు, స్వీయరచనలోని లఘు సమాధాన ప్రశ్నలకు పాఠ్యాంశ బోధన జరిగే రోజుల్లో ఇంటిదగ్గర రాసుకొని రమ్మని చెప్పాలి.

2) ప్రాజెక్టుపని, ప్రశంస ప్రశ్నలను ఇంటిపనిగా ముందే ఇవ్వాలి. పాఠం పూర్తయ్యే రోజు ప్రాజెక్టు పనిని ఇంటిపనిగా ఇస్తే చివరి పీరియడ్‌లో ప్రదర్శింపచేయవచ్చు. అట్లాగే ప్రశంస ప్రశ్నలను కూడా ఇవ్వాలి.

*బోధనకు పథక రచన చేయడం ఒక నైపుణ్యం. అది తన వృత్తి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. బోధనాభ్యసన ప్రక్రియల్లో వచ్చిన ఆధునిక ధోరణిలకనుగుణంగా పథక రచనలో కావల్సిన మార్పులు చేసుకోవడం ఉపాధ్యాయులకు తప్పనిసరి. ఉపాధ్యాయులను ఇందుకు సంసిద్ధులు కావడం ఒక బృహత్కార్యం.*

*– ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం–2011*

## మాదిరి పాఠ్యపథకం - ఉపవాచకం

నవవసంతం-3 (8వ తరగతి) | పాఠం: హద్దులు హద్దులు | 1వ పీరియడ్

### I. ఉపోద్ఘాతం :

- పిల్లలూ! ఈ రోజు మీకు ఒక కథ చెబుతాను వింటారా?
- అయితే వినండి.

### II. ఉన్ముఖీకరణ :

ఒక గ్రామంలో రాము అనే పేరుగల ఒక అమాయికుడు ఉండేవాడు. అతనికి ఇంగ్లీషు మాట్లాడితే గౌరవం పెరుగుతుందని నమ్మకం. ఇందుకోసం ఇంగ్లీషు తెలిసిన వ్యక్తి వెంటపడ్డాడు. రాము బాధపడలేక అతడు, మూడు ఇంగ్లీషు ముక్కలు నేర్పించి, పంపాడు. Yes, No, All Right అనే మూడు పదాలు నేర్చుకొని ఇంటికి తిరిగివచ్చి, తన ఊరి రచ్చబండమీద కూర్చున్నాడు. ఆ ఊరిలో జరిగిన దొంగతనాన్ని విచారించడానికి వచ్చిన పోలీసువారు. రామును పిలిచి "నీవు ఈ దొంగతనం చేశావా?" అని ప్రశ్నించారు. ఇంగ్లీషులో మాట్లాడితే బాగుంటుందని 'Yes' అన్నాడు. తర్వాత పోలీసువారు. "నీకు ఎవరైన సహకరించారా?" అని ప్రశ్నించారు. రాము వెంటనే 'No' అన్నాడు. పోలీసువారు కదా! పోలీసు స్టేషనుకు పద! అన్నారు. రాము All Right అంటూ వారి వెంట వెళ్ళాడు.

- ఈ కథ విన్నారు కదా!
  - రాము అమాయకుడని ఎలా చెప్పగలవు?
  - ఈ కథలో మీకు నవ్వు తెప్పించిన సంఘటన ఏది?

  *(పై ప్రశ్నలను ప్రతి విద్యార్థిని అడగాలి.)*

  - ఈ రోజు మనం ఇలాంటి హాస్యం కలిగించే ఒక నాటికను తెలుసుకుందాం!

### III. శీర్షికాప్రకటన

- నల్లబల్లపై "హద్దులు - హద్దులు" అని రాయాలి.

### IV. చదవడం - చర్చ - అవగాహనచేసుకోవడం

- పిల్లలూ! మీరు "హద్దులు - హద్దులు" నాటికను చదవండి.
- ఈ పాఠంలో నచ్చిన సంఘటన చెప్పండి. (అందరిని అడగండి. చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.)

2వ పీరియడ్

### I. ఉపోద్ఘాతం :

పిల్లలూ! నిన్న పాఠం చదివారు కదా! ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- పాఠం ఆధారంగా అల్లుడి పాత్ర స్వభావం ఏమిటి?
- పాఠంలో ఏ ఏ సందర్భాలల్లో నవ్వు వస్తుంది? చెప్పండి.

**II. చదవడం - అవగాహన - నాటకీకరణ :**

- పిల్లలూ! మీరు జట్లుగా కూర్చోండి. నాటికలోని ఒక్కొక్క పాత్రను ఎంపిక చేసుకోండి.

  *(విద్యార్థులను ఐదుమందిని ఒక గ్రూప్‌గా విభజించి వాళ్ళకు పాఠంలోని పాత్రలు మరిది, అత్త, మామ, అల్లుడు, డాక్టర్ పాత్రలను కేటాయించండి.)*

- మీరు ఎంపికచేసుకొన్న పాత్రలను చదవండి. దాని ప్రకారం అభినయం చేయండి.

  *(వారి పాత్రలను ఎవరెవరు ఎలా మాట్లాడాలో, ఎలాంటి అభినయం చేయాలో ఉపాధ్యాయుడు ఒక్కొక్కరికి వివరించి చెప్పండి.)*

- ప్రదర్శన - ఏదైనా ఒక జట్టువాళ్ళువచ్చి ప్రదర్శన చేయండి.

**III. ఇంటిపని :**

- పిల్లలూ! మీరందరూ మీ పాత్రలను చక్కగా ప్రదర్శించడానికి ఇంటిదగ్గర సాధన చేయండి. రేపు ఒక్కొక్క గ్రూప్ వచ్చి ప్రదర్శించండి.

<u>**3వ పీరియడ్**</u>

**I. ఉపోద్ఘాతం :**

- పిల్లలూ! నాటకాన్ని ప్రదర్శించడానికి మీరందరూ సంసిద్ధులై వచ్చారా?
- మీ పాత్రలు అభినయంలో సాధన చేస్తుంటే ఏమనిపించింది? చెప్పండి.

**II. ప్రదర్శన - చర్చ :**

- పిల్లలూ! ఒక్కొక్క జట్టువారు వచ్చి ప్రదర్శించండి.

  *(ఒక గ్రూప్ ప్రదర్శిస్తున్నప్పుడు మిగిలిన గ్రూప్‌లను గమనించమని చెప్పాలి.)*

- పిల్లలూ! ఏ జట్టువాళ్ళు బాగా ప్రదర్శించారు? ఇంకా బాగా ప్రదర్శించడానికి ఏం చేయాలి?

**III. ఇంటిపని :**

- నాటక ప్రదర్శనను మీరు గమనించారుకదా! నాటకప్రదర్శనమీద మీ అభిప్రాయాలు రాసుకొని రండి.

<u>**4వ పీరియడ్**</u>

**I. ఉపోద్ఘాతం :**

- పిల్లలూ నిన్న మీరు చూసిన నాటక ప్రదర్శనమీద అభిప్రాయాలు రాసుకొనివచ్చారా?

  *(కొంతమందిని వాళ్ళ అభిప్రాయాలు చదవమనండి.)*

**II. ప్రశ్నలు - చర్చ - పాఠంపై అవగాహన :**

- నాటకం ద్వారా మీరు గ్రహించిన సారాంశాన్ని మీ సొంతమాటల్లో చెప్పండి.
- మీకు నచ్చిన హాస్య సన్నివేశాన్ని వర్ణించండి.
- ఈ నాటకానికి హద్దులు - హద్దులు అనే పేరు సరిపోయిందా? ఎందుకు?
- ఈ నాటకానికి మీరు ఏమేమి పేర్లు పెడతారు?

- ఈ పాఠం ద్వారా రచయిత ఇచ్చిన సందేశం ఏమిటి?

*(పై ప్రశ్నలు విద్యార్థులందరిని అడగండి.)*

**III. ఇంటిపని :**

- పై ప్రశ్నలకు జవాబులు మీ సొంతమాటల్లో రాసుకురండి.

## మాదిరి పాఠ్యపథకం - ఉపవాచకం

**తెలుగుదివ్వెలు-1 (9వ తరగతి)** **పాఠం: నేనూ... సావిత్రీబాయిని** **1వ పీరియడ్**

**I. ఉపోద్ఘాతం :**

- పిల్లలూ! మీ అందరినీ కొన్ని ప్రశ్నలు అడుగుతాను. వాటికి మీకు తెలిసిన జవాబులు చెప్పండి.
  - మీకు తెలిసిన, గొప్పవారైన స్త్రీలను గురించి చెప్పండి.
  - వీళ్ళందరూ గొప్పవారిగా ఎదగడానికి ఏం చేశారు?
  - స్త్రీలు చదువుకుంటే ఎలాంటి ప్రయోజనాలున్నాయి?
  - చదువుకున్న స్త్రీలున్న, చదువురాని స్త్రీలున్న కుటుంబాలలో ఉన్న తేడాలు ఏమిటి?
- పై ప్రశ్నలను తరగతిలోని విద్యార్థులందరినీ అడగండి.
  - గొప్పవారైన కొందరి స్త్రీలను గురించి తెలుసుకున్నాం కదా! భర్త ప్రోత్సాహంతో చదువుకొని, భర్త చేస్తున్న సమాజ సేవకు తన వంతు కృషి చేసిన స్త్రీ రత్నం సావిత్రీబాయి గురించి తెలుసుకుందామా!

**II. శీర్షికా ప్రకటన :**

- నల్లబల్లమీద "నేనూ... సావిత్రీబాయిని" అని రాయాలి.

**III. చదవడం - చర్చ - అవగాహన :**

నమస్కారం!

ఇవాళ మీ అందరితో మాట్లాడడానికి వచ్చాను..........................................................................
.......................................................................................................................................
.................................................... మళ్ళీ పరుగుతీసేదాన్ని.

*(140 పేజీ నుంచి 141వ పేజి 3వ పేరా వరకు)*

- పై పేరాలు విద్యార్థులందరినీ చదవమని చెప్పండి. (వ్యక్తిగత పఠనం)
- పిల్లలూ! నేను అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పండి.
  - మీరు చదివిన పాఠం ఎవరు చెబుతున్నారు?
  - 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అనే సామెత వాడడానికి కారణాలు వివరించండి.
  - సావిత్రీబాయి పుట్టిన గ్రామాన్ని కుగ్రామం అని ఎందుకు అన్నారు?
  - కొమ్మకు వేలాడుతున్న సావిత్రీబాయిని ఆమె తండ్రి చూసి నవ్వటానికి కారణాలు ఏమై ఉంటాయి?
  - సావిత్రీబాయి చేసిన చిలిపి పనులను వివరించండి.

**III. ఇంటిపని :**

- నాన్న కూడా పెళ్ళిప్రయత్నాలు మొదలుపెట్టాడు.................................................................. .................................. బడిలో పాఠాలు చెప్పడానికి ఒప్పుకోక తప్పలేదు.

***(141వ పేజీలో 4వ పేరా నుండి 143వ పేజి వరకు చదవండి.)***

<u>**2వ పీరియడ్**</u>

**I. ఉపోద్ఘాతం :**

- పిల్లలూ! నిన్న మీకిచ్చిన పేరాలు చదువుకొనివచ్చారా?
- ఎవరెవరు చదివారు? చెప్పండి.

**II. చదవడం – చర్చ – అవగాహన :**

పిల్లలూ! పాఠం చదవండి. చర్చించుదాం.

- ఆరోజుల్లో స్త్రీ పరిస్థితి ఎలా ఉండేది?
- సావిత్రీబాయికి, ఆమె భర్తకు జరిగిన సంభాషణలో ముఖ్యవిషయాలు ఏమిటి?
- సేఠ్‌జీ చదివిన పుస్తకాలను బట్టి, సేఠ్‌జీ వ్యక్తిత్వం ఎలాంటిది?
- సేఠ్‌జీ తన భార్య సావిత్రీబాయికి చదువు నేర్పించాలనే తపన ఎలా వచ్చింది?
- సేఠ్‌జీ తండ్రి ఆడపిల్లల చదువు అవసరం లేదంటే సేఠ్‌జీ చెప్పిన సమాధానాన్ని సొంతమాటల్లో చెప్పండి.
- సావిత్రీబాయి బడిలో టీచర్‌గా ఎందుకు చేయవలసి వచ్చింది?

***(విద్యార్థులందరినీ వ్యక్తిగతంగా ప్రశ్నలు అడగండి.)***

**III. ఇంటిపని :**

- 144 పేజి నుండి 146 పేజి వరకు చదువుకొనిరండి.

<u>**3వ పీరియడ్**</u>

**I. ఉపోద్ఘాతం :**

- పిల్లలూ! నిన్న చెప్పిన పేరాలు చదువుకొని వచ్చారా?
- చదవడంలో ఏమైన ఇబ్బందులు కలిగాయా? అయితే ఏమిటి?

**II. చదవడం – చర్చ – అవగాహన :**

పిల్లలూ! పాఠం చదవండి. దానిమీద చర్చిద్దాం.

- సావిత్రీబాయి బడికి వెళ్ళి చదువు చెబుతుంటే జనం ఎందుకు శాపనార్థాలు పెట్టేవారు. ఇలా జరగడానికి కారణాలు ఏమై ఉంటాయి?
- సేఠ్‌జీని చంపటానికి వచ్చిన వ్యక్తులు, తాము చేస్తున్నది తప్పని ఎలా గ్రహించారు?
- ఈ లోకంలోకి వచ్చిన ప్రాణికి కులంముద్ర వేయడం అంటే మీకు ఏం అర్థమైంది?
- సేఠ్‌జీ ఎవరెవరికి ఏ ఏ పాఠశాలలు స్థాపించారు?

- ప్లేగువ్యాధి ప్రబలిన సందర్భంలో సావిత్రీబాయి చూపిన సాహసాన్ని బట్టి, ఆమెను ఎలా అర్థం చేసుకోవాలి?

*(పై ప్రశ్నలను విద్యార్థులందరిని అడగండి.)*

**III. ఇంటిపని :**

- పిల్లలూ! మొత్తం పాఠం చదవుకొని రండి.

<u>**4వ పీరియడ్**</u>

**I. ఉపోద్ఘాతం :**

- పిల్లలూ, పాఠం మొత్తం చదువుకొనివచ్చారు కదా!
    - సావిత్రీబాయి భర్త పేరు ఈ పాఠంలో సేఠ్‌జీ అని ఉంది కదా! అసలు పేరు ఏమిటి? ఆయనను గురించి మీరేం తెలుసుకొన్నారు?

**II. ప్రశ్నలు – చర్చ – అవగాహన :**

- పిల్లలూ! ఈ పాఠంలో ఇచ్చిన ప్రశ్నలమీద చర్చిద్దామా!
    - సావిత్రీబాయి కాలంలో స్త్రీల పరిస్థితులు ఎలా ఉండేవి? ఎందుకు?
    - పాఠం ఆధారంగా సేఠ్‌జీ వ్యక్తిత్వాన్ని వివరించండి.
    - జ్యోతిరావు పూలేను చంపడానికి వచ్చినవాళ్ళు పరివర్తన చెందిన విధానాన్ని తెలపండి.
    - సావిత్రీబాయి పూలే పాత్రను ఏక పాత్రాభినయం చేయండి.

*(పై ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.)*

**జట్టుపని :**

పిల్లలూ! మీరు జట్లుగా కూర్చోండి. పైన తెల్పిన ప్రశ్నల గురించి చర్చించండి. తప్పనిసరిగా మీ జట్టులో ఎవరైనా సావిత్రిబాయిపూలే లాగ ఏకపాత్రాభినయం చేయాలి.

**జట్టుపని ప్రదర్శన :**

మీ జట్టునుండి ఏకపాత్రాభినయం చేసి చూపండి.

*(ఇలా ఒక్కొక్క జట్టునుండి ఒక ప్రశ్నకు ప్రదర్శన చేయించాలి.)*

**III. ఇంటిపని :**

- ఏకపాత్రాభినయానికి అవసరమైన సామగ్రిని సేకరించండి. అభ్యాసం చేసుకొని రండి.

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 1వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం!

**2. ఉన్ముఖీకరణ :**

పిల్లలూ! వాచకంలోని ఒకటవ పేజిలోని "చదవండి - ఆలోచించండి - చెప్పండి" పరిశీలించండి. అడిగిన ప్రశ్నలకు జవాబుల నివ్వండి.

- చదివిన అంశమును బట్టి మీకేమర్థమైంది?
- మానవ కళ్యాణానికి ఉపయోగపడాల్సిన సైన్సు దేనికి దారితీసింది?
- ఈనాటి ఆధునిక కాలంలో యుద్ధాల వల్ల ఎలాంటి నష్టాలు సంభవిస్తాయి?
- యుద్ధాలను నివారించడానికి శాంతిని నెలకొల్పడానికి ఏం చేయాలి?

*(ఉపాధ్యాయుడు అనుబంధ ప్రశ్నలను కూడా అడగాలి.)*

**3. శీర్షికా ప్రకటన :**

పిల్లలూ! ఈ రోజు మనం అల్లకల్లోల పరిస్థితుల్లో ఉన్న వాతావరణం నుంచి శాంతిని కోరుకుంటున్న తరుణంలో "శాంతి కాంక్ష" అనే పాఠం గురించి తెల్సుకుందాం.

*(ఉపాధ్యాయుడు పాఠం పేరును నల్లబల్లపై రాయాలి.))*

**4. లక్ష్యాలు :**

- పాఠంలోని పద్యాలను రాగంతో, భావంతో చదవగలుగుతారు.
- పద్యభావాలను సొంతమాటల్లో చెప్పగలుగుతారు. రాయగలుగుతారు.
- పద్యాలకు ప్రతిపదార్థాన్ని రాయగలుగుతారు.
- పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాస్తారు.
- లేఖారచన అవగాహన చేసుకుంటారు.
- 'శాంతి' ఆవశ్యకత తెలియజేసేలా ఒక కరపత్రాన్ని తయారుచేయడం నేర్చుకుంటారు.
- సువర్ణ, సరళాదేశ, ఇత్త్వ, యడాగమ సంధుల నియమాలను గ్రహిస్తారు ఉదాహరణలు చెబుతారు.
- కర్మధారయ సమాసమును గూర్చి తెలుసుకుంటారు.

**5. నేపథ్యం / ఉద్దేశ్యం :**

పిల్లలూ! ఒకటవ పేజీలోని నేపథ్యాన్ని చదవండి. నేను అడిగిన ప్రశ్నలకు జవాబులను తెల్పండి.

***(ఉపాధ్యాయుడు అందరూ నేపథ్యాన్ని చదివేటట్లు సూచనలు ఇవ్వాలి).***

- కౌరవ పాండవులు ఎవరు?
- మాయాజూదంలో ఎవరు ఓడినారు?
- పందెం ప్రకారం పాండవులు ఏమి పూర్తి చేశారు?
- రాయబారిగా ఎవరు వెళ్ళారు.?
- రాయబారిగా వెళ్ళుటకు లక్ష్యం ఏమిటి?

**6. కవి పరిచయం / ప్రక్రియా పరిచయం :**

పిల్లలూ! నాల్గవ పేజీలోని కవి పరిచయమును, ప్రక్రియలను చదవండి. ఒక్కొక్కరుగా అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- మహాభారతాన్ని రచించిన వారెవరు?
- కవిత్రయంలో తిక్కన ఎన్నవ వాడు?
- తిక్కన రచించిన గ్రంథాలు ఏవి?
- 'ఇతిహాసం' అనే పదానికి అర్థం ఏమిటి?
- మన ఇతిహాసాలు ఏవి?

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

**1. పాఠ్యాంశ చిత్రంపై చర్చ :**

పిల్లలూ! పాఠంలోని చిత్రాన్ని చూడండి. పరిశీలించండి.

అ. చిత్రంలో ఏమేమి కనిపిస్తున్నాయి?

***(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాసి నామవాచక పదాలను గుర్తింపచేయాలి.)***

ఉదా: కృష్ణుడు, పాండవులు మొ॥నవి

ఆ. చిత్రంలో కనిపించిన వారు ఏమి చేస్తున్నారు?

***(పిల్లలు చెప్పిన వానిలో క్రియా పదాలను, వాక్యాలను నల్లబల్లపై రాయాలి మరియు క్రియాపదాలను గుర్తింపచేయాలి.)***

ఉదా: ధర్మరాజు, కృష్ణునితో మాట్లాడుట.

క్రియాపదం - మాట్లాడుట.

ఇ. చిత్రంలో చూసిన దాన్ని బట్టి వారిద్దరు ఏమి మాట్లాడుతుండొచ్చు?

ఉదా: ధర్మరాజు :

కృష్ణుడు :

ధర్మరాజు :

కృష్ణుడు :

*(పైన చూపిన రీతిలో కొందరి పాత్రలను నల్లబల్లపై రాసి, వారు ఏమి మాట్లాడినారో పిల్లల ద్వారా చెప్పించి సంభాషణను రాయాలి.)*

**2. ఉపాధ్యాయుడు చదవడం :**

పిల్లలూ! "ఆపదఁగడవం బెట్టగ ..... మహాత్మా" అను పద్యమును హావ, భావ, రాగ యుక్తంగా పాడతాను. జాగ్రత్తగా వినండి.

**3. పిల్లలచే చదివించడం :**

పిల్లలూ! "ఆపద" పద్యాన్ని పాడతాను అనుసరించి పాడండి.

*(పద్యాన్ని పిల్లలచే పాడిస్తూ దోషాలు రాకుండా స్పష్టమైన ఉచ్చారణతో పాడించాలి.)*

**4. పిల్లలచే బాహ్యపఠనం :**

పిల్లలూ! ఇప్పుడు మీరు ఒక్కొక్కరు ఈ పద్యాన్ని ధారాళంగా చదవండి.

*(ఉపాధ్యాయుడు ప్రతిసారి ఒకే విద్యార్థి కాకుండా అందరూ చదివే రీతిలో బాహ్యపఠనం చేయించాలి.)*

**5. ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**

పిల్లలూ! బాగా చదివారు. మరొకసారి నేను పద్యాన్ని చదువుతాను. గమనించండి.

*(ఉపాధ్యాయుడు ఉచ్చారణ దోషరహితముగా భావయుక్తంగా పాడి వినిపించాలి.)*

**6. విద్యార్థులచే మౌన పఠనం :**

పిల్లలూ! మీరంతా ఈ పద్యాన్ని మౌనముగా చదవండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.

**7. అర్థ సంగ్రహణ :**

పిల్లలూ! అర్థం కాని పదాలను గమనించండి. పాఠం చివర గల పట్టికలో గాని, నిఘంటువులో గాని చూచి తెలుసుకోండి. మీరు తెలుసుకున్న పదాలు వాటి అర్థాలు చెప్పండి.

*(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి. తెలియని పదాలకు సొంతవాక్యాల ద్వారా తెలియజేయాలి. నోట్సులలో రాసుకునేలా చేయాలి.)*

ఉదా: కృష్ణుడు రాయబారానికి చనియెను.

(చనుట = వెళ్ళుట అని అర్థము)

చనుట అంటే అర్థమేమి?

*(అవసరమైన ఇంకొన్ని సందర్భోచిత వాక్యాలను చెప్పి అర్థాన్ని రాబట్టాలి.)*

**8. పాఠ్యాంశ వివరణ - చర్చ :**

పిల్లలూ! తెలియని పదాలకు అర్థాలు తెలుసుకున్నారు కదా! వాచకములోని "ఆపద గడవం ... మహాత్మా" అను పద్యమును చూడండి.

*(పాఠానికి సంబంధించిన భావాన్ని పదాలు, వాక్యాలు, పాదాలను చెప్పిస్తూ, చదివిస్తూ, చర్చిస్తూ, వివరిస్తూ తెలియజేయాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- "ఆపదఁ గడవం బెట్టగ ....."

  పద్యాన్ని రాగంతో చదవండి.

- 'చనియె' వానికి అర్థం ఏమిటి? దీనితో ఒక వాక్యం చెప్పండి.

## IV. ఇంటిపని

**1. అవగాహన – ప్రతిస్పందన :**

అ) కవి పరిచయం చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

- మహాభారతాన్ని తెలుగులో ఎవరు రచించారు?
- తిక్కన వేటిని రచించాడు?
- తిక్కన రచనాశైలి ఎలా ఉంటుంది?

**2. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

అ) సృజనాత్మకత :

పాఠంలోని '2'వ పేజీలోని చిత్రం చూడండి. శ్రీకృష్ణుడు, ధర్మరాజు ఏం మాట్లాడి ఉంటారు? దీని ఆధారంగా సంభాషణలు రాయండి.

ధర్మరాజు : ______________________

శ్రీకృష్ణుడు : ______________________

ధర్మరాజు : ______________________

శ్రీకృష్ణుడు : ______________________

ధర్మరాజు : ______________________

శ్రీకృష్ణుడు : ______________________

ధర్మరాజు : ______________________

శ్రీకృష్ణుడు : ______________________

ఆ) స్వీయరచన : పద్యం భావాన్ని సొంతమాటల్లో రాయండి.

ఇ) పదజాలం : కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

పాండవులు, కౌరవులు : ______________________

పాండవులు, శాంతి : ______________________

ఆపద, కౌరవులు : ______________________

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 2వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

శుభోదయం పిల్లలూ! మీరందరూ బాగున్నారా!

**2. పునశ్చరణ :**

- పిల్లలూ! నిన్న చెప్పుకున్న "ఆపద ... మహాత్మా" అను పద్యమును ధారాళంగా పాడండి.
- నిన్న మీరు రాసిన సంభాషణలను చదివి వినిపించాలి.

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

**1. ఉపాధ్యాయుడు పాడడం :**

*(ఉపాధ్యాయుడు ముందుగా పాఠ్యాంశములోని తదుపరి "సమయమిది, ఇచ్చటి బంధులు, ఆదుర్యోధనుడంత", అక్కట, -------- కాననవశ్యములను 2, 3, 4, 5, 6 పద్యాలు హావ, భావ, రాగ యుక్తంగా పాడాలి.)*

**2. పిల్లలచే పాడించడం :**

పిల్లలూ! "సమయమిది, ఇచ్చటి బంధులు, ఆదుర్యోధనుడంత" అక్కట! --------- కాననవశ్యము అను పద్యాలను పాడుతాను. మీరు నన్ను అనుసరించి పాడండి.

*(పద్యంలోని పాదాలను పాడుతూ పిల్లలచే పాడిస్తూ పద్యాల పఠన దోషాలను సవరించాలి.)*

**3. పిల్లలచే బాహ్య పఠనం :**

పిల్లలూ! మీరు ఒక్కొక్కరు ఈ పద్యాలను ధారాళంగా చదవండి.

*(పిల్లలు చదువుతున్నప్పుడు ఉచ్ఛారణ దోషాలు సవరించాలి.)*

**4. ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**

పిల్లలూ! బాగా చదివారు. ఇప్పుడు నేను కూడా చదువుతాను. నేను చదువుతున్నప్పుడు చదివే విధానాన్ని గమనించండి.

*(స్పష్టమైన ఉచ్ఛారణతో దోషరహితంగా భావయుక్తంగా ఉపాధ్యాయుడు చదవాలి.)*

**5. పిల్లలచే మౌనపఠనం :**

పిల్లలూ! మీరంతా ఈ పద్యాలను మౌనంగా చదవండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి. అర్థం కాని పదాలను గమనించండి. మీరంతా జట్లుగా ఏర్పడి ఏ జట్టుకు ఆ జట్టుగా చర్చించండి. పాఠం వెనకాల ఉన్న అర్థాలు చూసి తెలుసుకోండి. ఇంకా తెలియని పదాలు ఉంటే చెప్పండి.

*(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన అర్థం తెలియని పదాలను నల్లబల్లపై రాయాలి. సొంత వాక్య ప్రయోగాల ద్వారా అర్థాన్ని గ్రహించేలా చేయాలి. నోట్సులలో రాసుకునేలా చేయాలి.)*

ఉదా: క్ష్మా = భూమి

క్ష్మా పాలుడు ధర్మబద్ధుడై ఉండాలి.

**6. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

పిల్లలూ! తెలియని పదాలకు అర్థాలు తెలుసుకున్నారు కదా!

*(పాఠానికి సంబంధించిన భావాన్ని పదాలు, వాక్యాలు, పాదాలను చెప్పిస్తూ, చదివిస్తూ, చర్చిస్తూ, వివరిస్తూ తెలియజేయాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- ధర్మరాజు అడిగిన ఐదు ఊళ్ళపేర్లను తెల్పుము?
- ఎవరెవరు కలసి ఉండాలని ధర్మరాజు కోరుకున్నాడు?

## IV. ఇంటిపని

**1. అవగాహన – ప్రతిస్పందన :**

అ) పాఠంలోని 4, 5 పద్యాలు కంఠస్థం చేయండి. వాటి భావాలను సొంతమాటల్లో చెప్పండి.

ఆ) ఆ దుర్యోధనుడంత ............ పద్యాన్ని రాయండి. దీనికి ప్రతిపదార్థం రాయండి.

**2. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

- ధర్మరాజు రాజ్య సంపదను దేనికోసం కోరాడు?
- ధర్మరాజు ఐదు ఊళ్ళిచ్చినా చాలని ఎందుకనుకొన్నాడు?

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 3వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

శుభోదయం పిల్లలూ! మీరందరూ బాగున్నారా!

**2. పునశ్చరణ :**

"ఆదుర్యోధను" అను పద్యమును పాడి వినిపించండి.

*(కనీసము ఐదు, ఆరుగురి చేత పద్యాన్ని చెప్పించాలి.)*

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. ఉపాధ్యాయుడు పాడడం :**

*(ఉపాధ్యాయుడు ముందుగా పాఠ్యాంశములోని తరువాత పద్యాలు 7, 8, 9, 10 పద్యాలు హావ, భావ, రాగ యుక్తంగా పాడాలి.)*

**2. పిల్లలచే పాడించడం :**

పిల్లలూ! పద్యాన్ని పాడుతాను. మీరు నన్ను అనుసరించి పాడండి.

*(పద్యంలోని పాదాలను పాడుతూ పిల్లలచే పాడిస్తూ దోష సవరణ చేయాలి.)*

**3. పిల్లలచే బాహ్య పఠనం :**

పిల్లలూ! మీరు ఒక్కొక్కరు ఈ పద్యాలను ధారాళంగా చదవండి.

*(పిల్లలు చదువుతున్నప్పుడు ఉచ్చారణ దోషాలు సవరించాలి.)*

**4. ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**

పిల్లలూ! బాగా చదివారు. ఇప్పుడు నేను కూడా చదువుతాను. నేను చదువుతున్నవిధమును గమనించండి.

*(స్పష్టమైన ఉచ్చారణతో దోషరహితంగా ఉపాధ్యాయుడు చదవాలి.)*

**5. పిల్లలచే మౌనపఠనం :**

పిల్లలూ! మీరంతా పద్యాలను చదవండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి. అర్థం కాని పదాలను గమనించండి. మీరంతా జట్లుగా ఏర్పడి ఏ జట్టుకు ఆ జట్టుగా చర్చించండి. పాఠం వెనకాల గాని, నిఘంటువునందుగాని చూసి తెలుసుకోండి. ఇంకా తెలియని పదాలు ఉంటే చెప్పండి.

*(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన అర్థం తెలియని పదాలను నల్లబల్లపై రాయాలి. సొంత వాక్య ప్రయోగాల ద్వారా అర్థాన్ని గ్రహించేలా చేయాలి. నోట్సులలో రాసుకునేలా చేయాలి.)*

ఉదా: పగ వలన నెయ్యము కయ్యమగును.

పగ అనగా అర్థమేమి?

**6. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

*(పద్యాలను భావయుక్తంగా చదువుతూ చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- మనశ్శాంతిని ఎప్పుడు కోల్పోతాం?
- దేనివల్ల ప్రయోజనం శూన్యమగును?
- ఈ రోజు నేర్చుకొన్న పదాలను చదవండి. భావం చెప్పండి.

## IV. ఇంటిపని

**1. అవగాహన – ప్రతిస్పందన :**

అ) "కావున శాంతి ..... జనార్ధనా" అను రెండు పద్యములను కంఠస్థము చేయండి. వాటి భావాలను సొంతమాటల్లో చెప్పండి.

ఆ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

- శత్రుత్వ భావనను కవి దేనితో పోల్చాడు?
- ధర్మరాజు శ్రీకృష్ణుడితో ఎలా మాట్లాడమని చెప్పాడు?

ఇ) "పగయడగించు ........ కేశవా?" పద్యాన్ని రాయండి. దానికి ప్రతిపదార్థం రాయండి.

**2. పదజాలం :**

కింది వాక్యాలు చదవండి. గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.

అతిథులను గౌరవించాలి.

అవశ్యముగా స్పందించాలి.

అవినీతులను దూరంగా ఉంచాలి.

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 4వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! మీరు చక్కగా నేర్చుకుంటున్నందుకు అభినందనలు.

**2. పునశ్చరణ :**

"అక్కట ..... కోర్వవచ్చునే" కావున శాంతి ...... జనార్ధనా పద్యాలను పాడి వినిపించండి.

***(ఒక్కొక్కరిని అడగాలి.)***

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

పిల్లలూ! ఈ రోజు శాంతి కాంక్షలోని చివరివి అయిన "మనమున ..... నాడుమీ" పద్యము నుంచి "మమ్మెఱుగు ..... సెప్పన్" పద్యము వరకు పద్యాలు నేర్చుకుందాం.

**1. ఉపాధ్యాయుడు పాడడం :**

***(ఉపాధ్యాయుడు పద్యాన్ని రాగ యుక్తంగా గానం చేయాలి.)***

**2. పిల్లలచే పాడించడం :**

పిల్లలూ! ఈ పద్యం పాడుతుంటాను. మీరు నన్ను అనుసరించి పాడాలి.

***(పద్యంలోని ఒక్కొక్క పాదం పాడుతూ పిల్లలచే పాడించాలి. అలా పద్యాన్ని పాడించి దోష సవరణ చేయాలి.)***

**3. పిల్లలచే బాహ్య పఠనం :**

పిల్లలూ! మీరు ఒక్కొక్కరు ఈ పద్యాన్ని ధారాళంగా చదవండి.

***(పిల్లలు చదువుతున్నప్పుడు ఉచ్చారణ దోషాలు సవరించాలి.)***

**4. ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**

పిల్లలూ! ఇప్పుడు నేను పద్యాఇన్న చదువుతాను. పద్యాన్ని ఎలా చదువుకోవాలో ఉచ్చారణ, పదచ్ఛేదన మొదలగు వాటిని ఎలా చేయాలో గమనించండి.

***(స్పష్టమైన ఉచ్చారణతో దోషరహితంగా భావయుక్తంగా ఉపాధ్యాయుడు చదవాలి.)***

**5. పిల్లలచే మౌనపఠనం :**

పిల్లలూ! మీరంతా ఈ పద్యాలను మౌనంగా చదవండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి. అర్థం కాని పదాలను గమనించండి. మీరంతా జట్లుగా ఏర్పడి ఏ జట్టుకు ఆ జట్టుగా చర్చించండి. పాఠం వెనకాల ఉన్న అర్థాలు

చూసి తెలుసుకోండి. ఇంకా తెలియని పదాలు ఉంటే చెప్పండి.

*(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి. సొంత వాక్య ప్రయోగముతో పిల్లలు ఆ పదానికి అర్థం గ్రహించేలా చేయాలి. నోటు పుస్తకంలో రాసుకోవాలి.)*

ఉదా: బెడిదపు పలుకులు పలుకరాదు.

బెడిదములు అంటే?

**6. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

పద్యాలను భావయుక్తంగా చదువుతూ, చర్చ ద్వారా అవగాహనకల్పించాలి.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- ఈ రోజు నేర్చుకొన్న పద్యాలు చదవండి.
- వాటి భావాలను సొంతమాటల్లో చెప్పండి.

## IV. ఇంటిపని

**1. ప్రాజెక్టు పని :**

- ప్రపంచ శాంతి కోసం కృషిచేసిన వారి వివరాలు సేకరించండి.

  వారి గురించి ఒక నివేదిక తయారుచేసి ప్రదర్శించండి.

**2. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) 'పామున్న ఇంటిలో కాపురమున్నట్లే' అంటే ఏమిటి? ధర్మరాజు ఈ వాక్యాన్ని ఎందుకు చెప్పాడు?

ఆ) 'ఎవరితోనూ దీర్ఘకాలం విరోధం మంచిందికాదు' దీని మీద మీ అభిప్రాయం ఏమిటి?

ఇ) 'కార్య సాధన' అంటే ఏమిటి? దీనికోసం మీరేంచేస్తారు?

ఈ) మాట్లాడే విధానం అంటే ఏమిటి? కార్యసాధకుడు ఎలా మాట్లాడాలి?

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 5వ పీరియడ్ |
| --- | --- |
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం! పాఠంలోని పద్యాలు ఎలా ఉన్నాయి? ఏ ఏ పద్యాలు మీకు నచ్చాయి? ఎందుకు?

**2. పునశ్చరణ :**

- పిల్లలూ! నిన్న మీరు రాసిన ప్రశ్నలకు జవాబులు చదవండి.

  ***(4, 5 గురు పిల్లలతో చదివించాలి. దోషాలు సవరించాలి.)***

- ఈ పాఠంలో చుక్క ఉన్న పద్యాలు కంఠస్థం చేశారా! ఒకసారి చదవండి.

  ***(4, 5 గురు పిల్లలతో చదివించాలి. మిగతా వారిని కూడా కంఠస్థం చేయమని చెప్పాలి.)***

## II. సామర్థ్యాలపై సాధన - అభ్యాసం

పిల్లలూ! నిన్నటి రోజు పాఠం పూర్తయింది కదా! ఈరోజు మనం అవగాహన - ప్రతిస్పందనలోని 'అ' లోని రెండు ప్రశ్నల గురించి చర్చిద్దాం! ఆ ప్రశ్నలు చదవండి.

***(1, 2 ప్రశ్నలు పేజీ సంఖ్య '6' లోనివి నల్లబల్లపై రాయాలి.)***

**మేధోమథనం :**

పిల్లలూ! శ్రీకృష్ణుడిని ధర్మరాజు కష్టాలను తొలగించే వ్యక్తి అని కీర్తించాడు కదా! ఇలా ఎందుకన్నాడో ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం చెప్పండి. ఇది సరైందేనా? చర్చించండి.

***(ఇలా అందరు పిల్లలతో మాట్లాడించాలి. తర్వాత రెండవ ప్రశ్న గురించి కూడా మాట్లాడించాలి.)***

**క్రోడీకరణ :**

పిల్లలందరు చెప్పిన సమాధానాలు విన్నారు కదా! మీలో ఎవరైనా ఒక్కరు ఒక్కొక్క ప్రశ్న గురించి మొత్తం జవాబు చెప్పండి.

**ప్రశంస :**

- పిల్లలూ! శాంతికాంక్ష పాఠంద్వారా శాంతి గురించి ధర్మరాజు కోరిక గురించి విన్నారు కదా! పేజీ నెంబరు '8'లోని డబ్బాలోని ప్రశంసకు సంబంధించిన ప్రశ్నలు చదవండి.
- పిల్లలూ! ప్రపంచ శాంతి కోసం ఎవరెవరు పాటుపడ్డారో తెలుసా?

  ***(పిల్లలకు నెల్సన్‌మండేలా, గాంధీ, యాసరు అరాఫత్‌లగురించి తెలపాలి. తెల్సుకోమని చెప్పాలి.)***

- శాంతి కోసం పాటుపడేవాళ్ళు మీ గ్రామాల్లో / ఊరిలో కూడా ఉన్నారా! మరివాళ్ళను మనం ఎలా అభినందించాలో చెప్పండి.

*(అభినందించే విధానం గురించి తెలియజేయాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ రోజు మనం ఏ ఏ అంశాల గురించి చర్చించుకొన్నాం?
- శాంతి ఆవశ్యకత ఏమిటి? మనం శాంతి గురించి ఎందుకు కృషిచేయాలి?

## IV. ఇంటిపని

పిల్లలూ! ఈ రోజు మనం 'శాంతి' గురించి, శాంతికోసం పాటుపడేవారి గురించి తెల్సుకొన్నాం కదా! మీరు కింది ప్రశ్నలకు జవాబులు రాసుకొని రండి.

1. ప్రపంచశాంతికోసం పాటుపడిన నెల్సన్‌మండేలా, గాంధీ, యాసర్ అరాఫత్ వంటి వివరాలు సేకరించండి. వారిని అభినందిస్తూ ఒక వ్యాసం రాయండి.
2. మీ ప్రాంతంలో శాంతికోసం పాటుపడేవారి గురించి అభినందిస్తూ కొన్ని వాక్యాలు రాయండి.

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 6వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

- పిల్లలూ! బాగున్నారా? నిన్న మీరేం చేసారు?
- శాంతి కోసం కృషిచేసిన వారి వివరాలు తెలుసుకొన్నారా?

**2. పునశ్చరణ :**

శాంతికోసం కృషిచేసినవారు ఎవరెవరు? వారి గురించి మీరేం తెల్సుకొన్నారో చెప్పండి.

*(పిల్లలతో మాట్లాడించాలి.)*

## II. సామర్థ్యాలపై సాధన - అభ్యాసం

పిల్లలూ! నిన్న అవగాహన - ప్రతిస్పందనలో ప్రశ్నల గురించి చర్చించుకున్నాం కదా! ఈ రోజు 'ఆ' లోని అభ్యాసాలు అంటే పద్యాలకు ప్రతిపదార్థం గురించి, పేరా చదివి ప్రశ్నలు తయారుచేయడం, పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం గురించి తెల్సుకొందాం!

**పద్యం చదవడం :**

- పాఠంలో గుర్తున్న పద్యాల్లో ఏయే వాక్యాలున్నాయి? వాటిని చదవండి.
- వీటిలో "ఆ దుర్యోధనుడు ..... పద్యం చదవండి.
  - ఈ పద్యంలలోని పదాలు చెప్పండి.
  - 7వ పేజీలోని ప్రతిపదార్థం చదవండి.

**జట్టుపని :**

పిల్లలూ! మీరు ముగ్గురు, నల్గురు ఒక జట్టుగా కూర్చోవాలి. పాఠంలోని చుక్క ఉన్న పద్యాలలో ఒక పద్యంలోని ప్రతి పదానికి అర్థాన్ని మీ జట్టులో చర్చించి రాయండి.

*(ఒక్కొక్క జట్టుకు ఒక చుక్క ఉన్న పద్యాన్ని కేటాయించాలి.)*

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! మీరు రాసిన పద్యం చదవండి. దాని ప్రతిపదార్థం చదివి వివరించండి.

*(అన్ని టల్లలో పిల్లలు రాసిన ప్రతిపదార్థాన్ని చదివి వినిపింపజేయాలి.)*

**సరిదిద్దడం :**

పిల్లలూ! మీరు జట్లలో రాసిన పద్యాల ప్రతిపదర్థాలని నల్లబల్లపై రాయండి. వెరీగుడ్! బాగారాసారు. మిగతా జట్లలోని వారు నల్లబల్లపై రాసిన ప్రతి పదార్థాన్ని చదవండి.

పదాలకు అర్థాలు సరిగా రాసారా?

అక్షర దోషాలు ఉన్నాయా?

అట్లే మిగతా జట్లలోని వాళ్ళు కూడా ప్రదర్శించండి.

*(చర్చ ద్వారా దోషాలను సవరించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ రోజు మనం ఏ ఏ పద్యాలకు ప్రతిపదార్థం రాయడం తెల్సుకొన్నాం?
- ఒక వాక్యం చదవండి. దాని ప్రతిపదార్థాం చెప్పండి.

## IV. ఇంటిపని

**1. అవగాహన – ప్రతిస్పందన**

అ) పాఠంలోని చుక్క గుర్తు ఉన్న పద్యాలు రాయండి. వాటికి ప్రతిపదార్థాలు రాయండి.

ఆ) పుస్తకంలోని పేజీ నెంబర్ '7' లోని 'ఇ' అభ్యాసానికి చెందిన పేరా చదవండి. దాని ఆధారంగా ఎలా ఎందుకు? అనే పదాలు ఉపయోగించి ప్రశ్నలు రాయండి.

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 7వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీరు నేర్చుకొన్న చుక్క పద్యాలు చదవండి. వాటి ప్రతిపదార్థాలు చెప్పండి.

## II. సామర్థ్యాలపై సాధన - అభ్యాసం

పిల్లలూ! పేజీ నెంబర్ '8' లోని 'ఆ' అభ్యాసంలోని ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలో తెలుసుకుందాం మరియు వాటి గురించి చర్చిద్దాం.

**ప్రశ్నలు :**

1. ధర్మరాజు శాంతి వచనాలను సొంతమాటల్లో రాయండి.
2. ధర్మరాజు యుద్ధంవల్ల కలిగే నష్టాలు చెప్పాడు గదా! ఈ రోజుల్లో కూడా యుద్ధాలు జరుగుతున్నాయి. యుద్ధాలు రాకుండా ఉండడానికి చేపట్టాల్సిన చర్యలేమిటి?

***(స్వీయరచనకు చెందిన వ్యాసరూప ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.)***

**మేధోమధనం :**

పిల్లలూ! నల్లబల్లపై రాసిన ప్రశ్నలు చదవండి. ఒక ప్రశ్నకు ఎలా రాయాలో చూద్దాం. ముందుగా నేనడిగి ప్రశ్నలకు ఒక్కొక్కరు, ఒక్కొక్క వాక్యం చొప్పున సొంత మాటల్లో చెప్పండి.

***(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన వాటిని వివరిస్తూ, అవసరమైన మరిన్ని ప్రశ్నలతో అనుకున్న జవాబును వారిచే చెప్పిస్తూ నల్లబల్లపై రాయాలి. మేధోమధనం ద్వారా అర్థం తెలియజేయాలి)***

**జట్టుపని :**

పిల్లలూ! నలుగురు చొప్పున జట్లుగా కూర్చోండి. నల్లబల్లపై రాసిన ప్రశ్నలకు జట్లలో చర్చించుకొని జవాబులు రాయండి.

***(నల్లబల్లపై రాసిన ప్రశ్నలను వారిల వారు చర్చించుకొనేలా సూచనలు ఇవ్వాలి. వారిలో వారు చర్చించుకుంటూ జవాబులు రాసేలా చూడాలి.)***

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! మీరు జట్లలో రాసిన జవాబులు చదవండి.

***(అన్ని టట్లలో పిల్లలు రాసిన జవాబులను చదివించాలి.)***

**సరిదిద్దడం :**

పిల్లలూ! మీరు రాసిన జవాబును నల్లబల్లపై రాయండి.

***(ఏదైనా ఒక జట్టువారు రాసిన జవాబును నల్లబల్లపై రాయాలి.)***

పిల్లలూ! జవాబులోని అంశం (విషయం) సరిగా ఉందా?

వాక్యాలు సరిగా రాసారా?

సరైన పదాలు వినియోగించారా?

అక్షరదోషాలు ఏమైనా ఉన్నాయా?

***(ఇలా అడుగుతూ చర్చద్వారా దోషాలను సవరించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! ఈరోజు స్వీయరచనకు సంబంధించిన వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు ఎలా రాశారో తెల్సుకొన్నారు కదా!

- మీరు ఎక్కడెక్కడ ఇబ్బంది ఎదుర్కొన్నారు?
- 15 పంక్తులలో జవాబులు రాసేటప్పుడు ఏ ఏ దోషాలు చేశారు?
- మీరు రాసిన సమాధానాలను సొంతమాటల్లో చెప్పండి.

## IV. ఇంటిపని

పిల్లలూ! కింది ప్రశ్నలకు 15 పంక్తుల్లో జవాబులు రాసుకొనిరండి.

1. ధర్మరాజు శాంతి వచనాలను సొంతమాటల్లో రాయండి.
2. యుద్ధాలు జరగకుండా ఉండడానికి చేపట్టాల్సిన చర్యలు ఏమిటి?

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 8వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా! శుభోదయం!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీరు ప్రశ్నలకు జవాబులు రాసారు కదా! ఏం చేశారో చెప్పండి. లేదా చదవండి.

*(ముగ్గురు, నల్గురు పిల్లలు రాసిన వానిని పిల్లలతో చదివించండి.)*

## II. సామర్థ్యాలపై సాధన - అభ్యాసం

పిల్లలూ! ఎనిమిదవ పేజీలోని సృజనాత్మకత అంశమును పరిశీలించండి. నేను అడిగిన ప్రశ్నలకు జవాబులనివ్వండి.

*(ఆ ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.)*

**మేధోమధనం :**

పగ, ప్రతీకారం ఎందుకు మంచివి కావు? ఒక్కొక్కరు మాట్లాడండి.

*(అందరు పిల్లలతో మాట్లాడించాలి.)*

పిల్లలూ! అట్లే శాంతి ఎందుకవసరమో మాట్లాడండి.

*(అందరితో మాట్లాడించాలి.)*

**లేఖ కరపత్రం పరిచయం :**

పిల్లలూ! మీరు ఎప్పుడైనా కరపత్రాలు చూసారా! దేని గురించి ఉంటాయి?

*(అందరితో మాట్లాడించాలి.)*

పిల్లలూ! ఈ కరపత్రాన్ని చూడండి.

*(తరగతిలో చదివి వినిపించాలి. చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.)*

**జట్టుపని :**

పిల్లలూ! మీరు ముగ్గురు లేక నలుగురు జట్టుగా కూర్చోండి.

*(పిల్లలను జట్టుగా కూర్చో పెట్టాలి.)*

పగ, ప్రతీకారం మంచిది కాదని మిత్రునికి లేఖరాయడం ద్వారా లేదా శాంతి ఆవశ్యకతలను తెలిపేలా కరపత్రం రాయాలి. ఏదైనా ఒకదాన్ని గురించి జట్టులో చర్చించి రాయండి.

**జట్టుపని ప్రదర్శన :**

ఒక జట్టు తరువాత మరొక జట్టుచెప్పున అన్ని జట్లవారిచే చెప్పించాలి. ప్రదర్శింప చేయాలి.

**నల్లబల్లపై రాయడం దాన్ని సరిదిద్దడం :**

'పగ – ప్రతీకారం' మంచిది కాదనీ శాంతియుత జీవినం గొప్పదని మిత్రునికి రాసిన లేఖను నల్లబల్లపై రాయాలి.

**సరిదిద్దడం :**

- ♦ రాసిన విషయములో లోపాలు లేకుండా భావం సరిగా ఉందా!
- ♦ వాక్య నిర్మాణం బాగుందా?
- ♦ ఇంకా మంచి పదాలు ఉపయోగించవచ్చా?
- ♦ అక్షర దోషాలు ఏమైనా ఉంటే సవరణ తెల్పండి. ఏమేమి ఉన్నాయి?

***(ఉపాధ్యాయుడు విద్యార్థులను ప్రశ్నిస్తూ దోషాలు సవరించాలి. పై విధంగానే కరపత్రం గురించి కూడా చర్చద్వారా సవరించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- ♦ "పగ – ప్రతీకారం" దీనివలన ఎలాంటి నష్టాలు కల్గవచ్చు.
- ♦ కరపత్రము వలన లాభం ఏమిటి?

## IV. ఇంటిపని

**సృజనాత్మకత :**

1. 'శాంతి ఆవశ్యకత' గూర్చి కరపత్రం తయారుచేయండి.
2. పగ, ప్రతీకారం మంచివికావని మిత్రునికి లేఖ రాయండి.

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 9వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా! శుభోదయం!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీరు ప్రశ్నలకు జవాబులు రాసారు కదా! ఏం చేశారో చెప్పండి. లేదా చదవండి.

*(ముగ్గురు, నల్గురు పిల్లలు రాసిన వానిని పిల్లలతో చదివిచండి.)*

## II. ప్రాజెక్టుపని, ప్రశంస - ప్రదర్శన

పిల్లలూ! మీకు ఇచ్చిన ప్రాజెక్టు పనిని ఎంత వరకు పూర్తిచేశారు? అందరూ చూపించండి.

*(ఉపాధ్యాయుడు ప్రాజెక్టు పనులను ప్రదర్శింపచేయుటకు సహకరించవలెను. నలుగురు, ఐదుగురు విద్యార్థులచే ప్రదర్శింపచేయాలి.)*

**సరిదిద్దడం :**

పిల్లలూ! మీలో ఎవరైనా ఒకరు మీరు రాసిన ప్రాజెక్టుపని వివరాలు నల్లబల్లపై రాయండి.

వెరీగుడ్! దీంట్లో వివరాలు సరిగా రాసారా?

వాక్యాలు సరిగా రాసారా?

పదాలు సరిగా వాడారా?

అక్షర దోషాలు ఏమున్నాయి?

*(ఇలా చర్చద్వారా ప్రాజెక్టుపని ప్రశ్నలను సరిదిద్దాలి.)*

**ప్రశంస :**

పిల్లలూ! మీరు ప్రశంసకు సంబంధించిన ప్రశ్నలకు జవాబులు రాసారు కదా!

**ప్రదర్శన :**

వాటిని చదివి విన్పించండి.

**సరిదిద్దడం :**

ప్రాజెక్టుపని వలెనే వీటని కూడా చర్చద్వారా సరిదిద్దాలి.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ప్రాజెక్టు పనివల్ల మీరు ఏయే కొత్త విషయాలు తెల్సుకొన్నారు?

## IV. ఇంటిపని

పిల్లలూ! పేజీనెంబర్ 8, 9లలో పదజాలం అభ్యాసాలను రాసుకొనిరండి.

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 10వ పీరియడ్ |
| --- | --- |
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! కులాసాగా ఉన్నారా! నిన్న మీరు ఏమేంచేసారో చెప్పండి.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీరు రాసిన 'పదజాలం' అభ్యాసాలు చదవండి.

*(పిల్లలతో చదివించాలి. తప్పులు సవరించాలి.)*

## II. సామార్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! మీరు 8వ తరగతిలో ఏఏ సంధుల గురించి నేర్చుకొన్నారు?
- సవర్ణదీర్ఘ సంధి, సరళాదేశ సంధి సూత్రాలు తెల్పండి.

*(ఇలా ఇత్వసంధి, యడాగమ సంధి సూత్రాలు కూడా పిల్లలతో చెప్పించాలి. ఉదాహరణలతో వివరించాలి.)*

**జట్టుపని :**

పిల్లలూ! మీరు ముగ్గురు, నల్గురు జట్లుగా కూర్చోండి. పాఠం చదవండి. పాఠంలో పైన తెల్పిన సంధులకు సంబంధించిన పదాలు ఏమున్నాయో వెతకండి.

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! రాసిన పదాలు చెప్పండి. అవి ఏ సంధికి సంబంధించినవో వివరించండి.

*(పిల్లలు జట్లలో రాసినవి ప్రదర్శించేటప్పుడు తప్పులు వివరించాలి. ఉదాహరణల ద్వారా అవగాహన కల్పించాలి.)*

- పిల్లలూ! వెరీగుడ్! బాగా చెప్పారు. మరి మీరు 8వ తరగతిలో ఏ ఏ సమాసాల గురించి తెల్సుకొన్నారు?
- పిల్లలూ! ఈ పదాలు చదవండి.

  నల్లకలువ

  మామిడి గున్న

  *(పై పదాలు నల్లబల్లపై రాయాలి.)*

- పై పదాలలో మొదటి పదం ఏది? రెండవ పదం ఏది?
- మొదటి పదాన్ని పూర్వపదం, రెండవ పదాన్ని ఉత్తరపదం అంటారు కదా? మరి పై వాటిలో విశేషణ పదాలు ఏవి? నామవాచక పదాలు ఏవి?

- 'నల్ల, గున్న' అనే పదాలు విశేషణ పదాలు కదా! అట్లే కలువ, మామిడి అనేవి నామవాచక పదాలు కదా! అట్లే కలువ, మామిడి అనేవి నామవాచక పదాలు కదా! వీటిలో విశేషణం మొదటి పదంగా (పూర్వపదం) అంటే విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం అంటారు.
- పిల్లలూ! 'ఏనుగుగున్న' లో విశేషణ పదం ఎక్కడ ఉంది? ఇది ఉత్తర పదంగా ఉంది కదా! కాబట్టి దీన్ని ఏ సమాసం అంటారు?
- విశేషణం రెండవ పదంగా ఉంటే విశేషణ ఉత్తర పద కర్మధారయ సమాసం అంటారు.

***(ఇలా నల్లబల్లపై పదాలురాసి చర్చద్వారా అవగాహన కల్పించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! 'తెలుపు గుర్రం' ఏ సమాసం అవుతుంది? ఎందుకు?
- ఎర్ర గులాబి ఏ సమాసం అవుతుంది ఎందుకు?

## IV. ఇంటిపని

కింది పదాలకు విగ్రహవాక్యాలు రాయండి. సమాసం పేరు రాయండి.

1. పుణ్యభూమి
2. మంచిరాజు
3. కొత్త పుస్తకం
4. కార్మికవృద్ధుడు
5. పురుషోత్తముడు

# 1. శాంతి కాంక్ష

| 9వ తరగతి | 11వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! కులాసాగా ఉన్నారా! నిన్న మీరు ఏమేం చేసారో చెప్పండి.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీరు రాసిన 'సమాసాలు' అభ్యాసాలు చదవండి.

*(పిల్లలతో చదివించాలి. తప్పులు సవరించాలి.)*

## II. సామర్థ్యాలపై సాధన - అభ్యాసం

- పిల్లలూ! మీరు 8వ తరగతిలో ఛందస్సు గురించి తెలుసుకున్నారు కదా!
- గణవిభజన, గురువు, లఘువులు గుర్తించడం మొదలైనవి తెలుసుకున్నారు కదా! ఇప్పుడు ఈ కింది పద్యపాదానికి గణవిభజన చేసి, అవి ఏ పద్యపాదాలో తెల్పి, లక్షణాలను తెల్పండి.

1. కావున శాంతి బొందుటయ కర్జము దానది యట్టులుండెశ్రీ.

*(పిల్లలచే గణ విభజన చేయించాలి.)*

**జట్టుపని :**

ఈ కింది పద్యపాదం ఇది ఏ జాతికి చెందిందో గణవిభజన చేసి గుర్తించండి.

U U U I I U I U I   I I U U U I U UI U
ఆ దుర్యోధనుడం తమాత్ర మునుజేయంజాల డోగానిపెం

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! రాసిన గణవిభజన చదవండి. అది ఏ జాతికి చెందిందో చెప్పండి.

*(పిల్లలు గణవిభజన చదివి పద్యపాదం ఏ జాతికి చెందిందో చెపుతారు. వారు చదువుతున్నప్పుడు తప్పులు సవరించాలి.)*

- పిల్లలూ! వెరీగుడ్! బాగా చెప్పారు. మరి మీరు 8వ తరగతిలో ఏ ఏ అలంకారాల గురించి తెల్సుకున్నారు?
- <u>లక్ష</u> <u>భక్ష్యాలు</u> తినేవాడికి ఒక <u>భక్ష్యం</u> <u>లక్ష్యమా</u>.

  *(ఈ వాక్యాన్ని నల్లబల్లపై రాయాలి.)*
- పై వాక్యం ఏ అలంకారానికి చెందుతుంది.
- పై వాక్యంలో ఒకే హల్లు మళ్ళీ మళ్ళీ ఉపయోగించడం జరిగింది కదా!
- శబ్దంలో చమత్కారం ఇక్కడ ప్రధానంగా కనబడుతుంది.

- ఈ విధంగా శబ్దానికి ప్రాముఖ్యం ఇచ్చే అలంకారాలలో 'వృత్యానుప్రాస' అలంకారం ఒకటి.
- కాబట్టి 'వృత్యానుప్రాస' అలంకారం.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! గట్టు మీది చెట్టుకింద కిట్టు రొట్టెను లొట్టలేస్తూ తింటున్నాడు. ఇది ఏ అలంకారం అవుతుంది. ఎందుకు?

## IV. ఇంటిపని

ఈ పాఠంలోని ఉపమా అలంకారానికి సంబంధించిన ఉదాహరణను రాయండి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 1వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

### 1. పలకరింపు :

పిల్లలూ! శుభోదయం! అందరూ బాగున్నారా? మనం మొదటి పాఠంలో గేయం నేర్చుకున్నాం కదా! గేయం మీకు నచ్చిందా? ఇప్పుడు 2వ పాఠంలో కథ గురించి తెలుసుకుందాం.

### 2. ఉన్ముఖీకరణ :

పిల్లలూ! 9వ పేజీ చూడండి. ఆ పేజీలో ఒక చిన్నకథ ఉంది. ఆ కథ అందరూ చదవండి.

కథ గురించి మాట్లాడించడం.

- పిల్లలూ! అందరూ కథ చదివారు కదా!
- కథలో ఏ ఏ పాత్రలున్నాయి?
- కథలో ఎవరు మంచి స్నేహితులుగా జీవిస్తారు?
- చీమ పావురానికి ఎందుకు కృతజ్ఞత చెప్పాలనుకుంది?
- వేటగాడి బాణం ఎందుకు గురి తప్పింది?

*(ఇలా పిల్లలను ప్రశ్నలు వేస్తూ కథ గురించి మాట్లాడించాలి.)*

### 3. శీర్షికా ప్రకటన :

- పిల్లలూ! కథలో చీమ పావురం మంచి స్నేహితులుగా జీవిస్తాయి. అని చెప్పారు కదా! ఎందుకు?
- చీమ తనను రక్షించినందుకు పావురానికి కృతజ్ఞత చెప్పింది కదా!
- చీమ పావురం కష్టసుఖాలలో ఒకదానికొకటి సహాయం చేసుకున్నాయి కదా!
- మనం ఈరోజు ఇలాటిదే మరొక కథ గురించి తెల్సుకుందాం. ఆ కథ పేరు 'లకుముకిపిట్ట'.

*(పాఠం పేరు నల్లబల్లపై రాయాలి.)*

### 4. ఉద్దేశం :

తన చుట్టూ ఉండే వారితో స్నేహంగా కలిసిమెలసి ఉండాలి. వారికి కష్టసుఖాలలో సహకరించటంవల్ల తృప్తి, సంఘజీవనంలో సార్థకత కలుగుతాయి. ఈ విషయాలను తెలపటమే ఈ పాఠం ఉద్దేశం.

### 5. నేపథ్యం / ఉద్దేశ్యం :

పిల్లలూ! మీరు ఈ పాఠం పూర్తయేసరికి...

- కథను సొంతమాటల్లో చెప్పగలుగుతారు.
- పాఠాన్ని ధారాళంగా చదువగలుగుతారు. ఇతర భాషా పదాలను గుర్తించగలుగుతారు.
- పాఠంలోని మాండలిక పదాలను, ఇతర పదాలను సొంతమాటల్లో ఉపయోగించగలరు.
- పాఠం ఆధారంగా సంభాషణ రాయగలరు.

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

### ✦ 'లకుముకి పిట్ట' కథను చెప్పడం

పిల్లలూ! కష్టసుఖాలలో ఒకరికొకరు సహాయం చేసుకొని స్నేహితులుగా కలిసి జీవించాలని చెప్పాను కదా! ఇప్పుడు ఆ కథ చెపుతాను జాగ్రత్తగా వినండి.

***(పాఠంలోని సారాంశాన్ని కథ రూపంలో పిల్లలకు చెప్పాలి.)***

### ✦ పిల్లలతో కథను చెప్పించడం

- పిల్లలూ! 'లకుముకి పిట్ట' గురించి కథ విన్నారు కదా? ఈ కథను మీలో ఎవరు చెపుతారు?
- ఒక్కొక్కరు ఒక వాక్యం చెప్పటం ద్వారా కథను చెప్పుకుందాం!
- 'బు... ర్... ర్... ర్..." ఒక్కసారిగా శబ్దం చేస్తూ పక్కకు వచ్చి వాలింది లకుముకి పిట్ట.
- పిల్లలూ! ఇప్పుడు ఎవరు ముందుగా చెపుతారో చెప్పండి.

***(ఇలా ఒక్కొక్కరితో ఒక్కొక్క వాక్యం చెప్పిస్తూ కథను చెప్పించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! లకుముకి పిట్ట మర్రికొమ్మ మీంచి ఎందుకు కింద పడిపోయింది.
- నువ్వసలు పక్షివేనా అని అన్నది ఎవరు?
- పాలపిట్ట, లకుముకి పిట్ట ఎక్కడికి వెళ్ళాయి?

## IV. ఇంటిపని

- పుస్తకంలోని '9'వ పేజీలో ఉన్న కథను చదవండి. కథలో ఏయే పాత్రలున్నాయి? ఆ పాత్రల సహజ స్వభావం ఏమిటో రాయండి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 2వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! మీరంతా బాగున్నారా! నిన్న 'లకుముకి పిట్ట' కథ గురించి తెలుసుకున్నారు కదా! కథ మీకు నచ్చిందా!

**2. పునశ్చరణ :**

- పిల్లలూ! నిన్న 9వ పేజీలో కథలోని పాత్రలు వాటి స్వభావాలు గురించి రాసుకుని రమ్మన్నాను కదా! రాసారా! ఏదీ చెప్పండి.

*(4, 5 గురు పిల్లలతో చెప్పించాలి.)*

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

పిల్లలూ! నిన్న 'లకుముకి పిట్ట' కథ విన్నారు కదా! ఇప్పుడు మీరు పాఠం చదువుతారా!

**1. పిల్లల బాహ్య పఠనం :**

నలుగురైదుగురు పిల్లలతో పాఠాన్ని చదివించాలి.

*(పిల్లలు పాఠం చదువుతున్నప్పుడు ఉచ్చారణ దోషాలు సవరించాలి.))*

**2. ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం :**

పిల్లలూ! ఇంతసేపు మీరు చదివారు కదా! పాఠాన్ని ఇప్పుడు నేను చదువుతాను జాగ్రత్తగా పుస్తకంలో చూడండి.

**3. పిల్లల మౌన పఠనం :**

పిల్లలూ! పాఠం చదివారు కదా! పాఠంలో మీకు తెలువని పదాలు ఏమేమి ఉన్నాయి? వాటి కింద గీతగీయండి.

- గీత గీసిన పదాలు పుస్తకం చివర ఉన్న 115, 116, 117, 118 పేజీల్లోని పదాలు – అర్థాలు పట్టికలో ఉన్నాయి వెతకండి.
- అన్ని పదాలకు అర్థాలు తెలుసుకున్నారా! ఇంకా తెలువని పదాలు ఏమున్నాయి?
- తెలువని పదాలు ఏమిత్రులతో చర్చించండి.
- పిల్లలూ! ఇప్పుడు కూడా మీకు తెలువని పదాలను చెప్పండి.

*(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)*

ఉదా:– నిర్వేదం, మాను, నొచ్చుకుంది.

- పిల్లలూ! ఈ పదాలకు అర్థాలు తెల్సుకుందామా.

  నేను వాక్యం చెపుతాను వినండి.

మొక్కై వంగనిది మ్రానై వంగదు.

- ఈ వాక్యంలో మాను అంటే ఏమిటర్థం.

మాను = చెట్టు, వృక్షం.

*(ఇలా పదాలను వాక్య ప్రయోగం ద్వారా పిల్లలు అర్థాన్ని గ్రహించేలా చేయాలి. ఆ అర్థాన్ని నల్లబల్లపై రాయాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! మీరు ఈ రోజు పాఠంలో ఏ ఏ కొత్త పదాలు గురించి తెల్సుకున్నారు?
- ఆ పదాలకు అర్థాలు ఏమిటి?
- ఆ పదాలతో వాక్యాలు చెప్పండి.

ఉదా:– నిర్వేదం, మాను, నొచ్చుకుంది.

*(పిల్లలతో వాక్యాలు చెప్పించాలి.)*

## IV. ఇంటిపని

- పిల్లలూ! ఈ కింది పదాలతో వాక్యాలు రాసుకుని రండి.

నిరంతరం, వగరుస్తూ, ఉక్కిరిబిక్కిరి, మురుసుకుంటు.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 3వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! కులాసానా! ఈ రోజు అందరూ సంతోషంగా ఉన్నారే.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నేను నిన్న ఇంటిపనిగా కొన్ని పదాలు ఇచ్చి వాక్యాలు రాయమన్నారు కదా అందరు రాసారా? ఏది చదవండి.

***(4, 5 గురు పిల్లలతో వాళ్ళు రాసిన వాక్యాలు చదివించాలి. నల్లబల్లపై ఆ వాక్యాలు రాయాలి.)***

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. పాఠ్యాంశ చిత్రం గురించి మాట్లాడించడం :**

- పిల్లలూ! 10, 11వ పేజీలు చూడండి. ఆపేజీల్లోని పాఠం బొమ్మలు చూడండి.
- చిత్రంలో ఏమేమి కనిపిస్తున్నాయి?
- చిత్రంలో ఉన్నది ఏ డ్యాము?
- పాలపిట్ట లకుముకి పిట్ట ఏం మాట్లాడుతుండవచ్చు?
- పిల్లలూ! ఇప్పుడు మీలో ఒకరు పాలపిట్టలాగా మరొకరు లకుముకి పిట్టలాగా అభినయించాలి.

**సంభాషణలు చెప్పించడం :**

- పిల్లలూ! ఇప్పుడు మీలో ఎవరు ముందుగా పాలపిట్టలాగా లకుముకి పిట్ట లాగా అభినయిస్తారో రండి.

***(ఇలా పిల్లలతో సంభాషణలు చెప్పించాలి.)***

**2. పిల్లల బాహ్య పఠనం :**

పిల్లలూ! ఈ రోజు పాఠంలోని మొదటి నాలుగు పేరాలను తప్పులు లేకుండా చదవండి.

***(ఇద్దరు, ముగ్గురు పిల్లలతో చదివించాలి.)***

**3. ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం :**

పిల్లలూ! ఇప్పుడు నేను చదువుతాను జాగ్రత్తగా పుస్తకంలో చూడండి.

**4. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

పిల్లలూ! ఒక్కసారిగా శబ్దం చేస్తూ పక్కన వచ్చి వాలింది ఎవరు? ఎందుకు?

- 'నిరాహారం' అంటే ఏమిటి?

- 'అనునయించడం' అంటే ఏమిటి? మిమ్మల్నెవరైనా, ఎప్పుడైనా అనునయించారా!

***(ఇలా పేరాలోని కీలక పదాలు, వాక్యాలు, అడుగుతూ, వారితో జవాబులు చెప్పించాలి. అవసరమైతే ఉపాధ్యాయుడు సలహాలు, సూచనలు ఇయ్యాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! పాఠంలో పాలపిట్ట పరధ్యానంగా ఎందుకున్నది?
- లకుముకి పిట్టపై పాలపిట్ట ఎందుకు కోపం చేసింది?
- పాలపిట్ట ఎందుకు నిర్వేదంగా మాట్లాడింది?

## IV. ఇంటిపని

- పిల్లలూ! మీ పాఠ్యాంశ చిత్రంలో డ్యాము ఉన్నది కదా! దాని యొక్క వివరాలు తెలుసుకొనిరండి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 4వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం! నిన్న పాఠం విన్నారు కదా! మీకు ఎలా అన్పించింది. నచ్చిందా? కథ బాగుందా! పాఠంలో మీకు ఏ ఏ పదాలు ఎక్కువగా నచ్చాయో చెప్పండి.

వెరీగుడ్. బాగా చెప్పారు.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీకు మీ పాఠ్యాంశ చిత్రంలోని డ్యాము యొక్క వివరాలు తెల్సుకుని రమ్మన్నారు కదా! వచ్చారా! ఏదీ చెప్పండి.

*(4, 5 గురు పిల్లలతో చెప్పించాలి. నల్లబల్లపై రాయాలి.)*

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. పిల్లల బాహ్య పఠనం :**

పిల్లలూ! నిన్న మనం పాఠంలోని మొదటి నాలుగు పేరాల గురించి చెప్పుకున్నాం కదా! ఈ రోజు మనం మరికొంత పాఠాన్ని గురించి తెల్సుకుందాం.

♦ మీలో ఎవరు ముందుగా తప్పులు లేకుండా చదువుతారో రండి!

*(ఇలా నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి.)*

**2. ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం :**

పిల్లలూ! మీరు చదివారు కదా! ఇప్పుడు నేను చదువుతాను జాగ్రత్తగా పుస్తకంలో చూడండి.

**3. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

♦ పిల్లలూ! కష్టకాలంలో నన్ను మతికి జేసుకోవద్దా? అని ఎవరన్నారు? ఎవరితో అన్నారు?

♦ 'కష్టాలు మనకు గాక మానులకొస్తాయా?' అని లకుముకి పిట్ట పాలపిట్టతో ఎందుకన్నది?

♦ పాముని తుడకలు – తుడకలు జేసింది ఎవరు?

♦ పాలపిట్ట ఎవరిని మనసులో స్మరించుకొని ఆకాశానికెగిరింది?

*(ఇలా పిల్లలతో మాట్లాడిస్తూ చర్చ ద్వారా పాఠంపై అవగాహన కల్పించాలి.)*

### III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! పాఠం విన్నారు. పాలపిట్ట ఆయాసంతో రొప్పుతూ ఎక్కడ వాలిపోయింది.
- పాఠంలో ఎవరు ఎవరిని ప్రేరేపించారు? ఎందుకు?
- పాలపిట్ట, లకుముకి పిట్టతో ఎందుకు రాలేనని చెప్పింది?

### IV. ఇంటిపని

- పిల్లలూ! పాఠాన్ని ఇంటి వద్ద చదువుకుని రండి, దోషరహితంగా, ధారాళంగా చదవడానికి ప్రయత్నించండి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 5వ పీరియడ్ |
| --- | --- |
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా! ఏం చేస్తున్నారు? మనం చెప్పుకుంటున్న పాఠం అందరికీ నచ్చినట్టుందే? పుస్తకాలు తీసి అందరూ రెడీగా ఉన్నారు.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న నేను అందరికీ ఇంటి వద్ద పాఠం చక్కగా చదువుకుని రమ్మన్నాను కదా! వచ్చారా! ఏదీ ఎవరు ముందు తప్పులు లేకుండా ధారాళంగా చదువుతారో రండి.

***(నలుగురైదుగురు పిల్లలతో పాఠం చదివించాలి.)***

- అందరూ బాగా చదివారే! వెరీగుడ్.

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. పిల్లల బాహ్య పఠనం :**

పిల్లలూ! నిన్న మనం కొంత పాఠం చెప్పుకున్నాం కదా! ఈ రోజు మిగిలిన పాఠం గురించి తెల్సుకుందాం. మీలో నేను ఎవరిని అడిగితే వాళ్ళు వరసగా పాఠం చదవాలి.

***(4, 5 గురు పిల్లలతో పాఠం చదివించాలి. ఉచ్ఛారణ దోషాలను గమనించి సవరించాలి.)***

**2. ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం :**

పిల్లలూ! ఇప్పుడు పాఠాన్ని నేను చదువుతాను. మీరంతా జాగ్రత్తగా మీ పుస్తకాల్లో చూడండి.

**3. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

పిల్లలూ! మనం ఇప్పుడు పాఠం గురించి చర్చించుకుందామా!

- పాలపిట్ట ఎందుకు ఉక్కిరిబిక్కిరైంది?
- జూరాల ప్రాజెక్టు ఏనదిపై కట్టబడింది?
- లకుముకిపిట్ట, పాలపిట్టకు చేపల్ని పట్టుకోవటంలో ఎలాంటి శిక్షణనిచ్చింది?
- లకుముకిపిట్ట ఆనందంతో ఎందుకు మురిసిపోయింది?

***(ఇలా చర్చద్వారా పాఠాన్ని అవగాహన పర్చాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! పాఠం విన్నారు కదా! లకుముకిపిట్ట చేసిన పని కరెక్టేనా? ఎందుకో చెప్పండి.

## IV. ఇంటిపని

- స్నేహాన్ని తెలిపే కథలను, చిత్రాలను సేకరించి, ఒక ఆల్బమ్ తయారుచేయండి.
- స్నేహాన్ని తెలిపే నినాదాలు, సూక్తులు, గొప్పవారు చెప్పిన నిర్వచనాలు సేకరించండి. వాటిపై మీ మిత్రులతో చర్చించండి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 6వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం. 'లకుముకిపిట్ట' పాఠం పూర్తయింది కదా! కథ ద్వారా మీరేం తెల్సుకున్నారు? కథ బాగుందా! ఇలాంటి కథలు ఇంకా తెల్సుకోవాలని ఉందా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! మీరెప్పుడైనా ఎవరికైనా నా సహాయం చేసారా! ఎటువంటి సహాయం చేసారో చెప్పండి.

***(4, 5 గురు పిల్లలతో చెప్పించాలి.)***

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

పిల్లలూ! పాఠం పూర్తయింది కదా! పేజి నెం.13 చూడండి. "ఇవి చేయండి" లోని అభ్యాసాలు నేర్చుకుందామా? మొదటి అభ్యాసం ఏముంది?

**1. వినడం - మాట్లాడడం - ఆలోచించి చెప్పడం :**

పిల్లలూ! వినండి - ఆలోచించి చెప్పండిలో ఉన్న ప్రశ్నలు చదవండి.

**మేధోమధనం :**

- పిల్లలూ! ఇప్పుడు మనం మొదటి ప్రశ్న గురించి మాట్లాడుకుందాం.
- కథలో పక్షుల సంభాషణ ద్వారా తిండిగింజలు దొరకకపోవడానికి కారణం ఏమని భావిస్తున్నారు? ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం చెప్పండి.

***(ఇలా ఒక్కొక్క ప్రశ్న గురించి పిల్లలందరితో మాట్లాడిస్తూ పూర్తి తరగతిలో 'వినడం - మాట్లాడడం' అభ్యాసంలోని ప్రశ్నలపై అవగాహన కల్పించాలి.)***

**2. ధారాళంగా చదవడం - అర్థం చేసుకొని చెప్పడం :**

పిల్లలూ! 14వ పేజీలోని 1వ అభ్యాసం చూడండి.

.1 పాఠంలో కొన్ని ఇతర భాషాపదాలున్నాయి. వాటిని వెతికి ఒక చోట రాయండి.

- పిల్లలూ! 14వ పేజీలోని 2వ అభ్యాసంలో కొన్ని పదాలున్నాయి చూడండి. పాఠం చదివి ఈ పదాలున్న వాక్యాలెక్కడున్నాయో గుర్తించి రాయండి.

- పిల్లలూ! పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

  1. నిరాశ, నిర్వేదం పాలపిట్ట మాటలో ఎందుకు ప్రతిధ్వనించాయి?
  2. ఆరితేరిన సైనికునిగా మారడానికి పాలపిట్టకు అందివచ్చిన అంశాలేవో చెప్పండి.

*(ఇలా అన్ని ప్రశ్నలను అడగాలి. పిల్లలతో పూర్తి తరగతిలో చెప్పించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! "నువ్వు దేవుడివిరా" అని ఎవరు ఎవరితో అన్నారు? ఎందుకు? ఆ పదం పాఠంలో ఎన్నిసార్లు వచ్చింది?
- పాలపిట్ట ఎందుకు పడిపోయింది?

## IV. ఇంటిపని

- పిల్లలూ! పాఠం చక్కగా చదువుకొని రండి.
- స్నేహం విలువ తెలుపుతూ మీ మిత్రునికి ఒక లేఖ రాయండి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 7వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా! నిన్న మీరు చేసిన 'ఇవి చేయండి' అభ్యాసాలు బాగా అర్థమైనాయా?

**2. పునశ్చరణ :**

మీ మిత్రునికి స్నేహం గురించి లేఖరాయమన్నాను కదా! రాసారా! ఈ రోజు మనం మిగిలిన అభ్యాసాలు చేద్దాం.

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

పిల్లలూ! ఈ రోజు మనం పాఠంలో "ఆలోచించి రాయండి" లోని ప్రశ్నల గురించి మాట్లాడుకుందాం.

- పిల్లలూ! ప్రశ్నలు చదవండి.

*(పిల్లలు చదివిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.)*

**మేధోమధనం :**

- స్నేహితుల వల్ల జరిగే మేలు గురించి చెప్పండి.
- మంచి స్నేహితులు ఎలా ఉంటారో చెప్పండి.
- ఒక పని చేయాలంటే ఎలా శ్రమించాలో ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం చెప్పండి.
- జూరాల ప్రాజెక్టు గురించి చెప్పండి.

**వ్యాసరూప ప్రశ్నలు :**

- ఈ పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో చెప్పండి.
- ఈ పాఠం ద్వారా స్నేహంపై మీ అభిప్రాయం చెప్పండి.

*(ఇలా పై ప్రశ్నలన్నిటికీ ఒక్కొక్కరితో ఒక్కొక్క వాక్యం చెప్పించాలి.)*

**జట్టుపని :**

పిల్లలూ! ప్రశ్నలకు జవాబులు చక్కగా చెప్పారు. వెరీగుడ్. మీరు ఇప్పుడు జట్లలో కూర్చొని ఒక్కొక్క ప్రశ్నకు జవాబు రాయాలి.

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! మీరు జట్లలో రాసిన జవాబులు చదివి విన్పించండి.

*(అన్ని జట్లలో రాసిన జవాబులు చదివి విన్పించాలి.)*

**సరిదిద్దడం :**

పిల్లలూ! మీరు రాసిన సమాధానాలను నల్లబల్లపై రాయండి. ఇప్పుడు వీటి గురించి మాట్లాడుకుందాం.

- ప్రశ్నలకు జవాబులు సరిగా రాసారా?
- వాక్యనిర్మాణం సరిగా ఉందా?
- పదాలు సరిగా ఉన్నాయా? ఇంకేమైనా పదాలు రాసుంటే బాగుండేదా!
- అక్షర దోషాలు ఏమున్నాయి? గమనించి చెప్పండి.

*(పై విధంగా ఒక్కొక్క ప్రశ్న గురించి ప్రశ్నిస్తూ చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.)*

- పిల్లలూ! ఇప్పుడు ఈ జవాబులను మీ నోటుబుక్కుల్లో రాయండి.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! అన్ని ప్రశ్నలకూ మీరు సొంతంగా జవాబులు రాయగలరు కదా!
- ఈ పాఠంలో జూరాల అందాలను గురించి చదివారు కదా! మీరు చూసిన ఏదైనా జలాశయం లేదా నదీ ప్రాంతాన్ని వర్ణించి చెప్పండి.

## IV. ఇంటిపని

- పిల్లలూ! 'ఆశావాదం – నిరాశావాదం' వీటిని ఉదహరిస్తూ మీ సొంతమాటల్లో రాసుకుని రండి.
- పిల్లలూ! మీకు ఇచ్చిన ప్రాజెక్టుపనిని రేపు ప్రదర్శించవలసి ఉంటుంది. అందరూ రెడీచేసుకొని రండి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 8వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం. అందరూ బాగున్నారా! ఇవాళ అందరూ వచ్చారా! మీరంతా పాఠాలను చక్కగా నేర్చుకుంటున్నారు. వెరీగుడ్.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! మీరు ప్రాజెక్టు పని పూర్తి చేసారా?

- స్నేహాన్ని తెలిపే కథలను, చిత్రాలను సేకరించారా?
- స్నేహాన్ని తెలిపే నినాదాలు, సూక్తులు, నిర్వచనాలు సేకరించారా?
- మీరేం రాసారో చదవండి.

*(నలుగురైదుగురు పిల్లలు రాసినవాటిని చదివించాలి.)*

- పిల్లలూ! మీలో ఎవరు ప్రాజెక్టు పనిని బాగా చేసారు? అది ఎందుకు బాగా అన్పించింది.

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! ఈ రోజూ పదజాలం అభ్యాసాల గురించి చర్చిద్దాం!
- పేజినెం.15 చూడండి. పదజాలంలోని 1వ అభ్యాసం చూడండి.
- వాక్యాల్లో గీతగీసిన పదానికి అర్థం రాసి మరో వాక్యం రాయండి.
- వెరీగుడ్ బాగారాసారు.
- ఇప్పుడు 2వ అభ్యాసంలోని వాక్యాలు చదవండి.
- సమాన అర్థమున్న పదాలను గీతగీసి గుర్తించండి.
- 3వ అభ్యాసంలోని ప్రకృతి, వికృతి పదాలను జతపరచండి.
- 4వ అభ్యాసంలోని ఖాళీలను సరైన పదాలనుపయోగించి పూరించండి.
- 5వ అభ్యాసంలోని పదాలలో భిన్నమైన పదాన్ని గీత గీసి గుర్తించండి.
- వెరీగుడ్! అన్ని అభ్యాసాలు చాలా బాగాచేసారు.
- ఇప్పుడు మీరు జవాబులను ఎవరైనా నిలబడి తప్పులు లేకుండా చెప్పండి.

*(పిల్లలు చెప్పిన పై అభ్యాసాల జవాబులను నల్లబల్లపై రాయాలి. ఒక్కో బిట్ ఒక్కొక్కరితో చెప్పించాలి. తరగతిలోని పిల్లలందరూ పాల్గొనేలా చూడాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! గుణాలు, నిరంతరం, చప్పుడు, అధికం ఈ పదాలకు అర్థాలు చెప్పండి.
- ఆశ్చర్యం, నిమిషం, హృదయం, ఆకాశం ఈ పదాలకు వికృతి పదాలు చెప్పండి.

## IV. ఇంటిపని

- పిల్లలూ! మన ఇరుగు పొరుగు వారితో కలిసి మెలసి జీవించడంవల్ల కలిగే తృప్తి ఆనందాన్ని ఒక చార్టుపై రాసి తరగతి గదిలో గోడకు తగిలించండి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 9వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! నమస్తే! బాగున్నారా! ఏం చేస్తున్నారు. అందరూ సంతోషంగా ఉన్నట్టున్నారే! రాణి ఈ రోజు నీ పుట్టిన రోజున్నట్టుందే!

- పిల్లలూ! మీరంతా రాణికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న నేను మీ ఇరుగు పొరుగు వారితో కలసి ఉండడంవల్ల కలిగే ఆనందాన్ని చార్టుపై రాసుకుని రమ్మన్నాను కదా! రాసుకుని వచ్చారా! ఎవరు బాగా రాసారో చదవండి.

- వెరీగుడ్. బాగా రాసారు.

***(పిల్లలు తెచ్చినచార్టులను గోడకు అతికించాలి.)***

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! ఈ రోజు మనం ఏ ఏ అభ్యాసాల గురించి చెప్పుకుందాం! సృజనాత్మకత, ప్రశంసల గురించి మాట్లాడుకుందామా!
- పిల్లలూ! పాఠంలో ఏ ఏ పాత్రలున్నాయి?
- వెరీగుడ్! లకుముకి పిట్ట, పాలపిట్ట రెండు పాత్రలున్నాయి కదా!
- ఇప్పుడు పాఠంలోని పాత్రలతో సంభాషణను రాయండి. ఏ జట్టువాళ్ళు బాగా రాస్తారో చూద్దాం!

**జట్టుపని :**

మీరు నాలుగు జట్లుగా విడిపోయి కూర్చోండి. పాఠంలోని పాత్రల ఆధారంగా సంభాషణను రాయండి.

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! అన్ని జట్లవాళ్ళు రాసారు కదా! ఏ జట్టువాళ్ళు ముందుగా చదువుతారు. రండి చదవండి.

***(ఇలా అన్ని జట్లతో చదివించాలి.)***

**సరిదిద్దడం :**

పిల్లలూ! ఇప్పుడు ఏ జట్టు వారైనా వచ్చి మీరు రాసినదాన్ని నల్లబల్లపై రాయండి.

- పాలపిట్ట, లకుముకిపిట్ట సంభాషణలు సరిగా ఉన్నాయా?
- వాక్య నిర్మాణం సరిగా ఉందా?

- పదాలు సరిగా ఉన్నాయా? ఇంకేమైనా మంచి పదాలు వాడవచ్చా?
- అక్షర దోషాలు ఏమైనా ఉన్నాయా? చూడండి. ఏమైనా ఉంటే చెప్పండి.
- పిల్లలూ! ఇదే విధంగా పాఠంలోని లకుముకిపిట్ట, పాలపిట్ట స్థానాలలో అడవిలోని జంతువులను పెట్టి ఒక కథను ఊహించిరాయండి.
- పిల్లలూ! ఇప్పుడు ప్రశంస అభ్యాసాన్ని చేద్దాం.

**జట్టుపని :**

పిల్లలూ! మీరు మీ జట్లలో పాఠంలోని పక్షుల స్నేహాన్ని గురించి చర్చించండి. స్నేహంలో గొప్పతనాన్ని మీ మిత్రులకు చెప్పండి.

- పిల్లలూ! అందరూ చర్చించారా! వెరీగుడ్.
- ఇప్పుడు మీరు చర్చించిన దాన్ని ఏ జట్టువారు ముందుగా చెప్తారు. రండి చెప్పండి.

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలు వారి జట్లలో చర్చించిన అంశాలను ఒక్కొక్క జట్టుతో చెప్పించాలి.

***(ఇలా అన్ని జట్లతో చెప్పించాలి. ఏవైనా దోషాలుంటే సరిచేయాలి.)***

- పిల్లలూ! ఇలాగే మీకున్న మంచి స్నేహితుల గురించి చర్చించి, వాళ్ళ మంచి గుణాలను ప్రశంసిస్తూ చెప్పండి.

***(పిల్లలందరితో చెప్పించాలి. దోషాలుంటే సరిచేయాలి.)***

**పుస్తక సంకలనం :**

పిల్లలూ! మీరు మీ జట్లలో చర్చించి రాసిన సంభాషణలను అన్నిటినీ కలిపి పుస్తకంలాగా పిన్‌చేసి చూపించండి.

***(అన్ని జట్లలో రాసిన సంభాషణలు సంకలనం చేసి పుస్తక రూపంలో తయారుచేయాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! సంభాషణలు ఎలా రాయాలో తెల్సుకున్నారు కదా!
- ఇలాగే కథలోని పాత్రల ద్వారా మరియు చిత్రాలు చూసి సంభాషణలు రాయగలరా?
- వెరీగుడ్.

## IV. ఇంటిపని

మీరు రాసిన సంభాషణలు ఇంటి దగ్గర చదువుకొనిరండి. రేపుక్లాసులో అభినయించాలి.

# 2. లకుముకిపిట్ట

| 9వ తరగతి | 10వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం. అందరూ వచ్చారా?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీరు రాసిన సంభాషణలు చదువుకొని రమ్మన్నాను కదా! చదువుకొని వచ్చారా? ఎవరు ముందుగా అభినయిస్తారు.

*(నలుగురు, ఐదుగురితో అభినయం చేయించాలి.)*

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

**భాషాంశాలు :**

- పిల్లలూ! మీరు 1వ పాఠంలో వాక్యాల గురించి తెల్సుకున్నారు కదా! ఈ రోజు మనం మరికొన్ని వాక్యాల గురించి తెల్సుకుందాం!
- పిల్లలూ! 17వ పేజీలోని వాక్యాలను గమనించండి.

అ) i) విశాల్ పుస్తకాన్ని చదివాడు.

ii) స్వప్న మ్యూజియాన్ని చూసింది.

ఆ) i) పుస్తకం విశాల్‌చే చదువబడెను.

ii) మ్యూజియం స్వప్నచే చూడబడెను.

- చూడండి పిల్లలూ! 'అ' లో ఉన్న వాక్యాలు "కర్త"ను ఆధారం చేసుకొని ఉన్నాయి. ఇలా కర్తను ఆధారం చేసికొని ఉన్న వాక్యాలను "కర్తరి వాక్యాలు" అంటారు.
- 'ఆ'లోని వాక్యాలు "కర్మ"ను ఆధారం చేసుకొని ఉన్నాయి. ఇలా కర్మను ఆధారం చేసుకొని ఉన్న వాక్యాలను "కర్మణి వాక్యాలు" అంటారు.

**జట్టుపని :**

పిల్లలూ! మీరు ఇప్పుడు జట్లుగా కూర్చోండి. 17వ పేజీలో ఉన్న కర్తరి, కర్మణి వాక్యాలను గుర్తించి రాయండి.

**జట్టుప్రదర్శన :**

పిల్లలూ! మీరు రాసిన వాక్యాలను చదవండి. వెరీగుడ్. బాగా రాసారు.

- పిల్లలూ! ఇప్పుడు అవే 17వ పేజీలోని కింది అభ్యాసంలోని వాక్యాల్లో "పురుష" లను గుర్తించి రాయండి.

*(పిల్లలు రాసిన వాటిని చూసి ఏవైనా దోషాలుంటే సరిచేయాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఏదైనా ఒక 'కర్తరి వాక్యం' చెప్పండి.
- వెరీగుడ్. ఇప్పుడు ఏదైనా ఒక 'కర్మణి వాక్యం' చెప్పండి.

✦ **"నేనివి చేయగలనా?" :**

- పిల్లలూ! "నేనివి చేయగలనా?" లోని వాక్యాలు చదవండి. చేయగల్గితే ఔను లేకుంటే కాదు వద్ద '✓' పెట్టండి.

***(అందరు పిల్లలు పుస్తకంలో ఔను, కాదు వద్ద '✓' పెట్టేలా చూడాలి.)***

- పిల్లలూ! పాఠ్యాంశ కథను ఎంత మంది సొంతమాటల్లో చెప్పగలరు చేతులెత్తండి.

***(ఇలా "నేనివి చేయగలనా?" లోని ఒక్కొక్క వాక్యం చదువుతూ 'ఔను' అని గుర్తించిన వారిని చేతులెత్తమనాలి. 80% మంది పిల్లలు చేయలేని అంశాలను గుర్తించి మళ్ళీ అభ్యాసం కల్పించాలి.)***

## IV. ఇంటిపని

- పిల్లలూ! 'నేనివి చేయగలనా?' లో మీరు ఏవేవి చేయలేకపోయారో వాటిని ఇంటి వద్ద అభ్యాసం చేయండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 1వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం!

మొదటి పాఠం 'దుందుభి' నది గురించి గేయం ద్వారా నేర్చుకొన్నారు కదా! గేయం ఎలా ఉంది?

**2. ఉన్ముఖీకరణ :**

పిల్లలూ! వాచకంలోని పేజీ నెంబరు '11'లోని చిత్రం చూడండి. అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- మొదటి చిత్రానికి, రెండవ చిత్రానికి మధ్యగల తేడాలు ఏమిటి?
- మొదటి చిత్రంలోని మనుషుల వేషధారణ, రెండవ చిత్రంలోని మనుషుల వేషధారణ ఒకేలా ఉందా? తేడాలు ఉన్నాయా?
- రెండు చిత్రాలలోని ఇండ్లు, పరిసరాలు చూసారు కదా! వీటి మధ్య తేడాలు ఏమిటి?
- వీటితో పోలిస్తే, మన వేషధారణ, మన ఇల్లు, పరిసరాలు ఎలా ఉన్నాయి? ఏమేం తేడాలు ఉన్నాయి?
- మొదటి చిత్రంలోని వారి జీవన విధానం ఎలా ఉండేవని మీరనుకుంటున్నారు?

పిల్లలూ! చాలా బాగా చెపుతున్నారు. మీకు అభినందనలు. మారుతున్న కాలాన్నిబట్టి మన వేషధారణలో, మన జీవన విధానంలో కూడా మార్పులు వస్తుంటాయికదా! గతంతో పోలిస్తే నేడు ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయికదా!

**సంభాషణలు చెప్పించడం :**

గతం కాలం గురించి, అప్పటి జీవన విధానం గురించి ఆచారవ్యవహారాల గురించి మీరు తెల్సుకోవాలనకుంటే ఎవరి దగ్గరికి వెళతారు? వారినేమేం ప్రశ్నలు అడుగుతారు? చెప్పండి. (అందరితో మాట్లాడించాలి.)

- పిల్లలూ! మీలో ఎవరైనా ఇద్దరు రండి. ఒకరు ప్రశ్నలు అడగాలి. ఇంకొకరు జవాబులు చెప్పాలి.

***(జీవన విధానం గురించి మాట్లాడించిన అంశాల ఆధారంగా సంభాషణలను అభినయంపజేయాలి.)***

**3. శీర్షికా ప్రకటన :**

పిల్లలూ! మన జీవన విధానం, మన ఆచారవ్యవహారాలు వీటిని మన సంస్కృతి అని అంటారు. మనం రెండవ పాఠం 'మన సంస్కృతి' గురించి తెల్సుకొందాం.

***(పాఠం పేరు నల్లబల్లపై రాయాలి.)***

**4. ఉద్దేశం :**

పిల్లలూ! 'మన సంస్కృతి' అనే పాఠం బిరుదు రామరాజు రాసిన "రామరాజీయం" అనే వ్యాససంకలనంలోనిది. 18, 19 శతాబ్దాల మధ్యకాలంలో హైదరాబాదు సంస్థానంలో విలసిల్లిన సంస్కృతిని తెలుసుకోవడమే ఈ పాఠం ఉద్దేశం.

**5. లక్ష్యాలు :**

పిల్లలూ! మీరు ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు

- మన సంస్కృతి గురించి, ఆచారవ్యవహారాలు గురించి సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలుగుతారు.
- పాఠాన్ని ధారాళంగా చదివి అర్థం చేసుకొంటారు. పాఠం ఆధారంగా సమాచారపట్టికలు రూపొందిస్తారు.
- మన సంస్కృతిలోని గొప్పతనాన్ని తెలుపే విషయాలను, ఈ పాఠంపై మీ అభిప్రాయాలను సొంతమాటల్లో రాయగల్గుతారు.
- పాఠంలోని పదాలకు పర్యాయపదాలు, ప్రకృతి – వికృతి పదాలపై పట్టు సాధిస్తారు. వీటిని సందర్భోచితంగా ఉపయోగించగల్గుతారు.
- పిండివంటల ఆధారంగా గేయకవితను లేదా మిత్రుడికి లేఖను లేదా వ్యాసాన్ని రాయగల్గుతారు.
- సామాన్య, సంక్లిష్ట వాక్యాల గురించి తెల్సుకుంటారు.

## II. పాఠ్యాంశం బోధన – చర్చ – అవగాహన

- పిల్లలూ! ఈ పాఠం మన సంస్కృతికి సంబంధించినదని తెల్సుకొన్నారు కదా? ఐతే ఇప్పుడు మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. మరి 18, 19 శతాబ్దాలు అంటే సుమారు 200 సంవత్సరాల క్రితం మన రాష్ట్రం ఎలా ఉండేదో? అప్పటి హైదరాబాదు సంస్థానంలో ప్రజలు ఎలా ఉండేవారు? వారి జీవన విధానం ఎలా ఉండేదో తెల్సుకోవడానికి ఈ పాఠాన్ని మనం చదవాలి.
- **కవిపరిచయం :** పిల్లలూ! పాఠాన్ని రాసింది బిరుదు రామరాజు కదా! ఆయన వివరాలు 15వ పేజీలో ఉన్నాయి. చదవండి. చెప్పండి.
- **(మైండ్ మ్యాపింగ్) మేథోమధనం :** సంస్కృతికి సంబంధించిన పదాలను చెప్పండి.

  ***(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)***
- వీటి ఆధారంగా పాఠంలోని విషయాన్ని సంక్షిప్తంగా పిల్లలకు తెలపాలి.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- సంస్కృతి అంటే ఏమిటి?
- సంస్కృతిలో మార్పులు ఎందుకు చోటుచేసుకొంటాయి?
- ఈ పాఠాన్ని రాసిన రచయిత ఎవరు?

## IV. ఇంటిపని

- పేజి నంబర్ '11' లోని చిత్రం ఆధారంగా ఏమేం గమనించారో పదాలు రాయండి. (పదజాలం)
- ఈ చిత్రాల ఆధారంగా ఒక పేరా రాయండి. (స్వీయరచన)

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 2వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా? ఈ రోజు మీరు ఏమేం నేర్చుకోవాలనుకొంటున్నారు?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! బిరుదు రామరాజు గారి గురించి తెలుసుకొన్నారు కదా!

- ఈయన జన్మస్థలం ఏది?
- వీరు ఏ ఏ రచనలు చేసారు?
- వీరు తెలుగుభాషకు చేసిన కృషి ఏమిటి?

## II. పాఠ్యాంశం బోధన - చర్చ - అవగాహన

**1. పిల్లల బాహ్య పఠనం :**

పిల్లలూ! మీరు వ్యక్తిగతంగా పాఠం చదవాలి. పుట 12లోని మొదటి పేరాను చదవండి. మీలో ఎవరు చదువుతారు?

***(పిల్లలు చదివేటప్పుడు దోషాలను సవరించాలి.)***

**2. ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం :**

పిల్లలూ! ఇప్పుడు నేను చదువుతాను. జాగ్రత్తగా గమనించండి.

***(భావస్ఫోరకంగా, స్పష్టోచ్ఛారణతో చదవాలి.)***

**3. పిల్లల మౌన పఠనం :**

పిల్లలూ! నేను ఎలా చదివానో చూసారు కదా! అప్పుడు మీరు పాఠాన్ని మౌనంగా చదవండి.

**4. అర్థసంగ్రహణం :**

పిల్లలూ! పాఠంలో మీకు తెలియని పదాలు ఏమి ఉన్నాయి? వాటి కింద గీతలు గీయండి.

- వెరీగుడ్. మీకు తెలియని పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న 171, 172, 173, 174 పేజీల్లో వెతకండి. అర్థాలు తెలుసుకోండి.
- పిల్లలూ! మీకు ఇంకా తెలియని పదాలు ఏమున్నాయి?

***(పిల్లలు చెప్పే పదాలను నల్లబల్లపై రాయాలి.)***

ఉదా : సంస్కృతి, నాగరికత, ప్రగతి, ఆర్థికస్తోమత మొదలగునవి.

- పిల్లలూ! నేను ఇప్పుడు పై పదాలతో వాక్యాలు చెపుతాను. మీరు పదాలకు అర్థాలు ఏమిటో చెప్పాలి.

*(నల్లబల్లపై రాసిన పదాలతో వాక్యాలు చెప్పాలి. పిల్లలే పదాలకు అర్థాలు గ్రహించేలా చూడాలి. ఆ పదాలు, అర్థాలను నల్లబల్లపై రాయాలి. పిల్లలను నోటుబుక్కులో రాసుకోవాలి.)*

ఉదా : ప్రగతి : ఏ గ్రామమైనా చదువుకున్న వారితోనే ప్రగతిని సాధిస్తుంది.

ప్రగతి = అభివృద్ధి

**పాఠ్యాంశ వివరణ – చర్చ :**

- పాఠం చిత్రం చూడండి. మాట్లాడండి. ఏమేమి ఉన్నాయి? వారేంచేస్తున్నారు?
- సంస్కృతి అంటే ఏమిటి?
- భౌతిక మానసిక అభివృద్ధి అంటేఏమిటి?
- ఆధ్యాత్మిక అభివృద్ధి అంటే ఏమిటి?

*(మొదటి పేరాను చర్చద్వారా అవగాహన పరచాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! ఈరోజు పాఠంలోని తెలియని పదాలకు అర్థాలు తెలుసుకొన్నారుకదా! నేనడిగే పదాలకు అర్థాలు చెప్పి వాటితో సొంతవాక్యాలు చెప్పండి.

ప్రగతి, ఆర్థికస్తోమత, అక్షరాస్యులు, విదేశీయులు

## IV. ఇంటిపని

### 1. పదజాలం :

కింది పదాలకు అర్థాలు రాసి, సొంతవాక్యాలు రాయండి.

అ) ప్రగతి :

ఆ) ఆర్థికస్తోమత :

ఇ) నిరక్షరాస్యులు :

ఈ) నిర్భరము :

### 2. ధారాళంగా చదవడం, అవగాహన చేసుకోవడం :

పేజీ నెంబరు '15' లోని కవి పరిచయం చదవండి. దీని ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) బిరుదు రామరాజునగానే ఏమి గుర్తుకువస్తుంది?

ఆ) వీరు ఎప్పుడు, ఎక్కడ జన్మించారు?

ఇ) వీరి రచనలు ఏవి?

ఈ) వీరి గొప్పదనం ఏమిటి?

### 3. స్వీయరచన :

అ) ఆధ్యాత్మిక ప్రగతి అంటే మీరేమి తెల్సుకొన్నారు?

ఆ) మనం భౌతిక ప్రగతి సాధించిన వారమని ఎలా చెప్పగలరు?

ఇ) పాఠం చిత్రం ఆధారంగా ఒక పేరా రాయండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 3వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! కులాసాగా ఉన్నారా?

**2. పునశ్చరణ :**

- నిన్న మనం పాఠం ప్రారంభించుకొన్నాం కదా! మొదటిపేరాను చదవండి. దాంట్లోని ముఖ్యమైన పదాలు ఏవో చెప్పండి.

  *(పిల్లలు చెప్పే పదాలను నల్లబల్లపై రాయాలి.)*

- పిల్లలూ! ఈ పదాల గురించి మీరేం తెల్సుకొన్నారు?

  ఉదా: భౌతిక అభివృద్ధి, ఆధ్యాత్మిక అభివృద్ధి, లలితకళలు.

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

**1. పిల్లలతో బాహ్య పఠనం :**

పిల్లలూ! పేజీ నెం.12లో రెండవ పేరా నుండి పేజీ నెంబర్ 13లో 3వ పేరా వరకు చదవండి.

*(నలుగురు లేక ఐదుగురు విద్యార్థులతో చదివించాలి. చదివేటప్పుడు దోషాలు సవరించాలి.)*

**2. ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం :**

పిల్లలూ! నేను పాఠం చదువుతాను. జాగ్రత్తగా చూడండి.

*(భావం అర్థమయ్యేలా సరైన కంఠధ్వని, ఉచ్ఛారణతో చదవాలి.)*

**3. పాఠ్యాంశ వివరణ - చర్చ :**

- సమాజం సంకోచం చెందడం, వ్యాకోచం చెందడం అంటే ఏమిటి?
- ఆర్థికస్తోమత, చైతన్యంతో సమాజ అభివృద్ధికి గల సంబంధం ఏమిటి?
- అప్పటి వస్త్రధారణ గురించి పాఠంలో ఏముంది?
- అప్పటి వస్త్రధారణకు, ప్రస్తుతవస్త్రధారణకు తేడాలు ఏమిటి?
- 'స్వయంసమృద్ధి' అంటే ఏమిటి? గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉండడం అంటే ఏమిటి?

*(ఇలా కీలక పదాలు / వాక్యాలపై చర్చ ద్వారా విషయాన్ని పిల్లలకు అవగాహన కల్పించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ రోజు పాఠం ద్వారా మీరేమేమి తెల్సుకున్నారు?
- 'కులోచితం' అంటే ఏమిటి?
- స్త్రీల వేషధారణ గురించి పాఠంలో ఎక్కడ ఉంది? ఆ వాక్యాలు చదవండి.

## IV. ఇంటిపని

**1. పదజాలం :**

కింది పదాలకు అర్థాలు రాసి, సొంతవాక్యాలు రాయండి.

అ) కేశాలంకరణం :

ఆ) పల్లెసీమ :

ఇ) స్వయంసమృద్ధం :

ఈ) వినిమయం :

**2. ధారాళంగా చదవడం, అవగాహన చేసుకోవడం :**

అ) కింది పేరాలోని పదాలు తారుమారైనవి. పాఠం ఆధారంగా పేరాను సరిగా రాయండి.

స్త్రీలు, పురుషులు వివాహిత స్త్రీలందరికీ బట్ట, వెండి, బంగారు నగలు ధరించేవారు. తెలంగాణాంధ్రుల గంటె పుస్తెలు, మట్టెలు తప్పనిసరి. ఆర్థికస్తోమతకు మాంగల్యాలు మహారాష్ట్రుల మాంగల్యాలవలె చిన్నవి. మట్టెలు వెండివైనా, కంచువైనా కావచ్చు. తీగచుట్టాలని, బోలుమట్టెలని, గట్టి మట్టెలని వీనిలో భేదాలు.

ఆ) పాఠంలోని 13వ పేజీలోని 3వ పేరా చదవండి. వీలైనన్ని ప్రశ్నలు రాయండి.

**3. స్వీయరచన :**

కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) "పాలితులు, పాలకులను అనుకరించడం సహజం" దీనిపై మీ అభిప్రాయం రాయండి.

ఆ) స్త్రీ, పురుషులు ఆర్థిక స్తోమతను బట్టి నగలు ధరిస్తారు. దీనిపై మీ అభిప్రాయం తెల్పండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 4వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

### 1. పలకరింపు :

పిల్లలూ! ఎలా ఉన్నారు? మీకీరోజు ఎలా అన్పిస్తుంది? ఏమేం చేయాలనుకుంటున్నారు?

### 2. పునశ్చరణ :

పిల్లలూ! నిన్న ఇచ్చిన ఇంటిపని చేసుకొని వచ్చారా? చదవండి.

*(నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి. అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి.)*

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

### 1. పిల్లలతో బాహ్య పఠనం :

పిల్లలూ! మీలో ఎవరు బాగా చదువుతారు? ఆగకుండా, గొణగకుండా గబగబా చదవాలి.

*(పోటీలాగా చదివించాలి. లిప్తకాలం పాటు ఆగకుండా చదవాలి. ఇలా నలుగురు ఐదుగురు పిల్లలతో చదివించాలి. 13వ పేజీ 4వపేరా నుండి చివరివరకు.)*

### 2. ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం :

పిల్లలూ! నేను పాఠం చదువుతాను. జాగ్రత్తగా చూడండి.

*(స్పష్టోచ్చారణ, సరైన హెచ్చు తగ్గులతోకూడిన కంఠధ్వనితో పాఠాన్ని చదవాలి.)*

### 3. పాఠ్యాంశ వివరణ - చర్చ :

- పిల్లలూ! పాఠాన్ని మౌనంగా చదవండి. నాడు ఏ ఏ పంటలు పండేవి? ఏ ఏ పిండి వంటలు వండుకొనేవారు?
- ఇంట్లో ఏ ఏ సామాగ్రి ఉండేది? వాటితో పోలిస్తే నేడు ఎలాంటి గృహోపకరణాలు వచ్చాయి?
- ఏ ఏ పండుగలు జరుపుకొనేవారు?
- ఏ ఏ కళలు వ్యాప్తిచెందినవి?

*(ఇలా చర్చద్వారా పిల్లలకు పాఠ్యాంశ విషయం పట్ల అవగాహన కల్పించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! నాటి పెండ్లిళ్ళు ఎలా జరిగేవి? ఈ విషయం పాఠంలో ఎక్కడ ఉంది?
- చివరి పేరా చదవండి. దాంట్లోని విషయాన్ని సొంతమాటల్లో చెప్పండి.

## IV. ఇంటిపని

### 1. పదజాలం :

అ) కింది వాక్యాలు చదివి సమాన అర్థం వచ్చే పదాల కింద గీత గీయండి.

- చంద్రుడు చల్లదనాన్ని ఇస్తాడు. సోముడు కలువలు వికసింపజేస్తాడు. ఇంద్రుడు పౌర్ణమినాడు నిండుగా ఉంటాడు. శశిని అందరూ మామ అని పిలుస్తారు.
- పూర్వం పెండ్లి ఐదు రోజులు జరిగేది. కాని ఇప్పుడు వివాహం ఒక్కరోజులో చేస్తున్నారు. కాలక్రమంలో కళ్యాణం చేసే విధానం మారింది.
- గుడిలో పూజలు నిత్యం జరుగుతాయి. రోజూ కోవెలకు వెళ్ళటం నాకు ఇష్టం. దేవాలయంలో ప్రశాంతంగా ఉంటుంది. పూర్వం దైవ మందిరాలు విద్యాలయాలుగా వెలుగొందాయి.

ఆ) కింది పదాల్లో భిన్నంగా ఉన్న పదాన్ని గీతగీసి చదవండి.

- కట్టు, బొట్టు, గిట్టు, జుట్టు.
- అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, విద్వాంసులు, జ్ఞానులు.
- నులకమంచం, తాటిచాప, మడతమంచం, పట్టిమంచం.
- పాలు, పెరుగు, వెన్న, నీరు.

ఇ) కింది వాక్యాలలో ప్రకృతి, వికృతి పదాలు ఉన్నాయి. వాటిని గుర్తించండి.

- మాతృభాషపై పట్టున్నవారు ఏ భాసనైనా సులభంగా నేర్చుకోగలరు.
- అందం, ఆరోగ్యం కోసం గతంలో స్త్రీలు మొఖాలకు పసుపు రాసుకొంటే, నేడు ముఖాలకు స్నోలు, పౌడర్లు రాసుకొంటున్నారు.
- ఒకప్పుడు కులాన్నిబట్టి వృత్తులుండేవి. నేడు ఏ కొలమైనాసరే ఏ వృత్తినైనా స్వీకరిస్తున్నారు.
- కొందరు నాటకాలలో వేషాలువేసి పొట్టపోసుకొనేవారు. వారి వేసధారణ పాత్రను బట్టి ఉంటుంది.

### 2. ప్రాజెక్టుపని :

గతంలో పెండ్లిళ్ళు ఎలా జరిగేవో పాఠం ద్వారా తెల్సుకొన్నారు కదా! ప్రస్తుతం పెండ్లిళ్ళు ఎలా జరుగుతున్నాయో తెలుసుకొని రాయండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 5వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం! ఏం చేస్తున్నారు?

**2. పునశ్చరణ :**

- పిల్లలూ! నిన్న మీరు పదాజాలానికి సంబంధించిన అభ్యాసాలు రాసుకొని వచ్చారా!
- ప్రాజెక్టుపని గురించి తెల్సిందా? తెల్సుకొని రాయగలరా?

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! నిన్నటి వరకు పాఠంలోని విషయం గురించి తెల్సుకొన్నాం కదా! ఈ రోజు 'ఇవిచేయండి' లోని అభ్యాసాల గురించి చర్చిద్దాం!
- పిల్లలూ! 15వ పేజీలోని వినడం, మాట్లాడడంలోని ప్రశ్నలు చదవండి.

*(ఈ ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.)*

- **మేధోమథనం :** సమృద్ధి అంటే ఏమిటి? గ్రామసమృద్ధి గురించి మీకేంతెలుసు?

*(పిల్లలందరితో మాట్లాడించాలి. ఒక్కొక్కరు కనీసం ఒక అంశం చెప్పేలా ప్రోత్సహించాలి. వాటిని నల్లబల్లపై రాయాలి.)*

- **జట్టు సంవాదం :** పిల్లలూ! తరగతిలోని మీరందరూ రెండు గ్రూపులుగా ఉంటారు. ఎడమవైపు కూర్చున్నవారందరూ ఒక గ్రూపు, కుడివైపు వరసల్లోని వారందరూ రెండవ గ్రూపుగా ఉండాలి.
- 'మన సంస్కృతి గొప్పగా ఉండేది' అనే అంశం గురించి ఎడమవైపు గ్రూపువారు సమర్థిస్తూ, కుడివైపు గ్రూపువారు విభేదిస్తూ మాట్లాడాలి.

*(ఇలా మిగతా ప్రశ్నల గురించి కూడా పూర్తి తరగతిలో చర్చ జరిగేలా చూడాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! ఈరోజు జరిగిన చర్చలో మీరు ఏమేం తెల్సుకొన్నారో చెప్పండి.

## IV. ఇంటిపని

పిల్లలూ! మన సంస్కృతిలో ప్రశంసించదగిన విషయాలు ఏవి? వీటిని మిత్రులతో చర్చించి ఎందుకు ప్రశంసించదగినవో వ్యాసం రాసుకొని రండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 6వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా?

**2. పునశ్చరణ :**

నిన్న మీరు రాసిన పదజాలం అభ్యాసాలను చదివి వినిపించండి.

***(నలుగురైదుగురు పిల్లలతో చదివి వినిపించాలి. దోషాలు సవరించాలి.)***

- పిల్లలూ! మన సంస్కృతిలోని గొప్ప విషయాలేవి. ఇవి ఎందుకు గొప్పవో చెప్పండి.

  ***(ఒక్కొక్కరితో చెప్పించాలి.)***

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

- పిల్లలూ! 15వ పేజీలోని చదవడం – అవగాహన చేసుకోవడంలోని పేరాను చదవండి. దానికింద ఉన్న ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

  ***(ఒక్కొక్క ప్రశ్నను అడుగుతూ చెప్పించాలి.)***

- **జట్టుపని :** పిల్లలూ! ముగ్గురు, నలుగురు జట్లుగా కూర్చోవాలి. 16వ పేజీలోని '2'వ అభ్యాసాన్ని చదవండి. పాఠం ఆధారంగా పట్టికను పూరించండి.
- **జట్టుపని ప్రదర్శన :** పిల్లలూ! మీరు రాసిన పట్టికను చదవండి.

  ***(అన్ని జట్లతో ప్రదర్శింపచేయాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! పట్టిక రాసేటప్పుడు మీరు ఎదుర్కొన్న ఇబ్బందులు ఏవి?
- పాఠంలోని చివరి నుండి రెండవ పేరా చదవండి. దానికి ఏ పేరు పెడితే బాగుంటుందో చెప్పండి.

## IV. ఇంటిపని

**1. పిల్లలూ! పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

- సంస్కృతి అంటే ఏమిటి?
- గ్రామాల్లో వ్యాపార, వాణిజ్యాలు ఏ రూపంలో జరిగేవి ఎందుకు?
- నాటికాలంలో వివాహాలు ఎలా జరిగేవి?
- దేవాలయాలు వేటికి నిలయాలుగా విలసిల్లేవి?

**2. స్వీయరచన :**

కింది ప్రశ్నలకు సొంతమాటల్లో 5 వాక్యాలలో జవాబులు రాయండి.

- గతంలో పెండ్లిళ్ళు 5 రోజులు చేసేవారు కదా? మరి ఇప్పుడు ఒకరోజే ఎందుకు చేస్తున్నారు?
- ప్రస్తుతం ప్రజలు గ్రామాల నుండి పట్టణాలవైపు వలసలు పోతున్నారు. కారణాలు ఏమై ఉంటాయి?
- దేవాలయాలు ధార్మికనిష్ఠకే గాక లలిత కళావికాసానికి తోడ్పడ్డాయని పాఠంలో చదివారు కదా! దీన్ని మీరెలా సమర్థిస్తారు?
- మన సంస్కృతిని కాపాడడానికి మీరేం చేస్తారు?

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 7వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! మీరంతా సంతోషంగా ఉన్నారా? సంతోషంగా మీరు ఉండడానికి కారణాలు ఏమిటి? మీకు బాగా ఆనందంగా ఎప్పుడు అన్పిస్తుంది?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న రాసిన ప్రశ్నలకు జవాబులు చదివి విన్పించండి.

*(నలుగురు, ఐదుగురు పిల్లలతో చదివించాలి. దోషాలు సవరించాలి.)*

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

- పిల్లలూ! ఈ రోజు మనం వ్యాసరూప సమాధానాలు రాసే ప్రశ్నల గురించి చర్చిద్దాం!
- పేజీ నెంబర్ 16లో పది వాక్యాల్లో జవాబు రాసే ప్రశ్నలు ఉన్నాయి. వాటిని చదవండి.

  *(ఈ ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.)*

**మేధోమథనం :**

- పిల్లలూ! పాఠం సారాంశాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం చెప్పండి.

  *(సారాంశాన్ని పిల్లల నుండి రాబట్టాలి.)*

  *(ఇంకా మిగతా ప్రశ్నలు కూడా అడగాలి.)*

**జట్టుపని :**

- పిల్లలూ! మీరు ఇప్పుడు మనం చర్చించిన ప్రశ్నలకు “జవాబులు” రాయండి.

**జట్టుపని ప్రదర్శన :**

- పిల్లలూ! మీరు జట్లలో రాసిన సమాధానాలు చదివి విన్పించండి.

**సరిదిద్దడం :**

ఏదైనా ఒక జట్టువారు రాసిన సమాధానాన్ని నల్లబల్లపై రాయండి.

పిల్లలూ! విషయం సరిగా రాసారా?

వాక్యాలు సరిగా ఉన్నాయా?

ఇంకా ఏ పదాలు వాటితే బాగుంటుంది?

అక్షర దోషాలున్నాయా?

*(ఇలా అన్ని ప్రశ్నల గురించి చర్చ ద్వారా అవగాహన కల్పిస్తూ సరిదిద్దాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! వ్యాసరూప సమాధానాలు రాసేటప్పుడు ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?
- మీరు రాసిన ప్రశ్నల్లో ఏది కఠినమనిపించింది? ఎందుకు?

## IV. ఇంటిపని

పిల్లలూ! కింది ప్రశ్నలకు మీరు సొంతమాటల్లో జవాబులు రాయండి.

- పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.
- మన సంస్కృతి గొప్పదనాన్ని తెలిపే అంశాల్ని విశ్లేషిస్తూ మీ అభిప్రాయాల్ని రాయండి.
- ఈ పాఠంపై మీ అభిప్రాయాల్ని సొంతమాటల్లో రాయండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 8వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

### 1. పలకరింపు :

పిల్లలూ! చాలా బాగా ఉన్నారు మీరు. చక్కగా చదువుకొంటున్నారుకూడా! మీరు చేసిన ఏదైనా ఒక మంచి పనిని గూర్చి మాట్లాడండి.

### 2. పునశ్చరణ :

పిల్లలూ! నిన్న మీరు రాసిన సమాధానాలను చదివి విన్పించండి.

*(నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి. దోషాలుంటే సూచనలు ఇవ్వాలి.)*

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

- పిల్లలూ! ఇప్పటి వరకు మీరు 'ఇవిచేయండి'లో ఏ ఏ అభ్యాసాల గురించి తెల్సుకొన్నారు?
- మరి ఈ రోజు దేని గురించి తెల్సుకొందాం?
- 17వ పేజీలోని సృజనాత్మకతలోని ప్రశ్నలు చదవండి.

  *(వాటిని నల్లబల్లపై రాయాలి.)*
- పిల్లలూ! మీకు తెల్సిన ఏదైనా ఒక కవితను చదవండి.

  *(పిల్లలతో చెప్పించాలి. చెప్పేలా ప్రోత్సహించాలి.)*
- మీకు తెల్సిన పిండివంటల గురించి చెప్పండి. మరి ఈ పిండి వంటలలో గేయాన్ని లేదా కవితను చెప్పగలరా? ప్రయత్నించండి.

**జట్టుపని :**

సరే! పిల్లలూ! ఇప్పుడు మీరు జట్లలో కూర్చోండి. సృజనాత్మకతలోని రెండు ప్రశ్నలు ఉన్నాయికదా? వీటిలో ఏదైనా ఒకటి అంటే పిండి వంటలలో కవితను లేదా సంస్కృతి గొప్పదనాన్ని తెలిపేలా మిత్రునికి లేఖను రాయండి.

*(పిల్లల జట్లలో రాసేటప్పుడు దగ్గరికి వెళ్ళి పరిశీలించాలి.)*

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! మీరు రాసిన కవిత లేదా లేఖను చదివి విన్పించండి.

*(అన్ని జట్ల వారిచే ప్రదర్శింపజేయాలి.)*

వెరీగుడ్! పిల్లలూ! మీరు బాగా ప్రయత్నించారు! మీకు అభినందనలు. వీటిని ఇంకా బాగా రాద్దామా?

**సరిదిద్దడం :**

సరే! ఇప్పుడు కవిత గురించి చర్చిద్దాం.

ఏ జట్టువారు రాసిన కవిత బాగుంది? ఎందుకు?

దీంట్లో ఇంకా మంచి పంక్తులు ఏమి జోడించవచ్చు?

ఇంకా మంచి పదాలు వేటిని చేర్చవచ్చు?

***(ఇలా చర్చద్వారా కవితను సరిదిద్దాలి.)***

- పిల్లలూ! ఇప్పుడు మీరు రాసిన లేఖలను చదవండి.

***(పై విధంగానే లేఖలను కూడా సరిదిద్దాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! కవితలు రాయడం చేయగలరా?
- లేఖలు రాసేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏవి?

## IV. ఇంటిపని

**1. సృజనాత్మకత :**

పిల్లలూ! ఈ రోజు చర్చించిన అంశాల ఆధారంగా మీరు పిండి వంటలతో కవితనుగానీ లేదా మనం సంస్కృతి గొప్పదనాన్ని తెలుపుతూ మిత్రునికి లేఖను రాయండి.

**2. ప్రశంస, ప్రాజెక్టుపనులు :**

పిల్లలూ! మీకు ఇంతకు ముందే ప్రాజెక్టుపని, ప్రశంస ప్రశ్నలు ఇంటి పనిగా ఇచ్చాను కదా! వాటిని పూర్తిచేయండి. రేపు వాటిని మీరు ప్రదర్శించండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 9వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! మీకు పాటలంటే ఇష్టమేనా? ఏదైనా ఒక మంచి పాటను పాడండి.

వెరీగుడ్! చాలా బాగా పాడుతున్నారు.

**2. పునశ్చరణ :**

నిన్న మనం కవితలు రాయడం, లేఖ రాయడం గురించి చర్చించుకున్నాం కదా? మీరు ఎవరెవరు ఏమేం రాసారో చదవండి.

***(ఐదుగురు లేదా ఆరుగురు విద్యార్థులచే చదివించాలి.)***

**పుస్తక సంకలనం :**

- పిల్లలూ! మీరు రాసిన కవితలను ఎవరైనా ఒకరు సేకరించండి. అట్లే లేఖలను ఇంకొకరు సేకరించండి.

  ***(అందరు పిల్లలు రాసిన సృజనాత్మకతకు చెందిన అంశాలను సేకరించాలి.)***

- మీరు రాసిన కవితలకు ఏం పేరు పెడదాం? అట్లే లేఖలకు ఏం పేరు పెడదాం?

  ***(పిల్లలతోనే చర్చించి కవితలకు, లేఖలకు శీర్షికను నిర్ణయించాలి.)***

- వీటిని పుస్తకంలాగా తయారుచేద్దామా! కవితల కాగితాలకు, లేఖల కాగితాలకు వీర్వేరుగా పిన్ చేయండి. వాటిపై మీ పేర్లు రాయండి. ముందు పేజీపై ఎవరైనా చక్కని చిత్రం గీయండి.

  ***(స్టాప్లర్‌తో పిన్‌చేయాలి. బొమ్మలుగీయగలిగే వారితో ముఖచిత్రం లాగా రెండిటిపైనా బొమ్మలు గీయించి రంగులు వేయించాలి.)***

వెరీగుడ్! చాలా బాగా చేసారు. వీటిని తరగతిలో ప్రదర్శించాలి. ఇలా ప్రతీ పాఠానికి తయారుచేయాలి.

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

- పిల్లలూ! మీరు ప్రాజెక్టుపని పూర్తిచేసారా! అట్లే ప్రశంసకు సంబంధించిన వ్యాసం రాసుకొని వచ్చారా?
- మొదట ప్రాజెక్టుపనికి సంబంధించిన వివరాలు ఏమేం రాసారో చర్చిద్దాం! పెండ్లిళ్ళు ఎలా జరుగుతున్నాయో వివరాలు సేకరించారుకదా? చదవండి.

  ***(నలుగురైదుగురు విద్యార్థులతో చదివించాలి.)***

**ప్రాజెక్టు పనిని సరిదిద్దడం :**

ఎవరైనా ఒకరు దాన్ని చర్చిద్దాం!

దీంట్లో ఏయే అంశాలు బాగున్నాయి?

ఇంకా ఏయే విషయాలు చర్చిస్తే బాగుంటుంది?

వాక్యాలు సరిగా రాసారా?

ఇంకా ఏయే మంచి పదాలు వాడవచ్చు?

అక్షర దోషాలు ఏమైనా ఉన్నాయా?

***(ఇలా చర్చద్వారా ఒక ప్రాజెక్టుపనిని సరిదిద్దాలి.)***

- పిల్లలూ! ఇప్పుడు వ్యాసం గురించి చర్చిద్దాం! చదివి వినిపించండి.

  ***(నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి.)***

**ప్రశంసను సరిదిద్దడం :**

- పిల్లలూ! మన సంస్కృతిలో ఇంకా ఏయే గొప్ప విషయాలు ఉన్నాయి?

  ***(పిల్లలు చెప్పే వాటిని నల్లబల్లపై రాయాలి.)***

- వీటిని చేర్చి మళ్ళీ వ్యాసం రాయగలరా!

**జట్టుపని :**

- పిల్లలూ! ఇప్పుడు మీరందరు జట్లలో కూర్చోండి. మీ జట్టులోని వారు రాసిన ప్రాజెక్టుపనిని, ప్రశంస వ్యాసాన్ని అందరూ కల్సి చదవండి. చర్చించండి.
- ఇంతకు ముందు చర్చించిన విషయాలను చేర్చి అందరూ కల్సి వివాహాల గురించి, సంస్కృతిలోని గొప్ప విషయాల గురించి రాయండి.

**జట్టుపని ప్రదర్శన :**

మీరు రాసిన వాటిని ప్రదర్శించండి.

పిల్లలూ! వెరీగుడ్ చాలా బాగా రాసారు.

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! వివాహం గురించి ఎవరెవరి నుండి విషయాలు సేకరించారు? రాసేటప్పుడు ఏమేం ఇబ్బందులు ఎదురైనాయి?

వ్యాసం ఎలా రాయాలో తెల్సిందా? ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి?

## IV. ఇంటిపని

**వ్యాకరణాంశాలు :**

- పాఠం చదవండి. పాఠంలోని క్రియా పదాలు రాయండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 10వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! పెళ్ళి సమయంలో మీరేం చేస్తారు? మీకు ఏ ఏ ఆటలంటే ఇష్టం? ఇంకా ఏమేం చేయడమంటే ఇష్టం?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మిమ్మల్ని పాఠంలోని క్రియాపదాలు రాయమని చెప్పాను కదా! వాటిని చదవండి.

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

♦ పిల్లలూ! మీరు రాసిన క్రియా పదాలను నల్లబల్లపై రాయండి. (పిల్లలతోనే నల్లబల్లపై రాయించాలి.)

♦ పై పదాలలో తిని, వెళ్ళి ..... వంటి పదాలున్నాయి? ఏమేమి ఉన్నాయో చూపండి.

*(వాటికి నల్లబల్లపై సున్నా చుట్టాలి.)*

♦ మిగతా క్రియా పదాలకు, ఈ క్రియా పదాలకు తేడా ఏమిటి?

♦ పూర్తయిన పనిని తెలిపే క్రియాపదాలను సమాపక క్రియలు అంటారు. పని అసంపూర్ణంగా ఉండడం లేదా పూర్తికాకుంటే అలాంటి క్రియాపదాలను అసమాపక క్రియలు అంటారు.

♦ పిల్లలూ! నేను చెప్పే క్రియా పదాలతో వాక్యాలు చెప్పండి.

తిన్నాడు, రాసాడు, వెళ్లాడు

*(పిల్లలు చెప్పిన వాక్యాలను నల్లబల్లపై రాయాలి.)*

ఉదా : రాజు అన్నం తిన్నాడు.    రమ ఉత్తరం రాసింది.

♦ ఈ వాక్యాలలో ఎన్ని క్రియా పదాలు ఉన్నాయి? ఇవి ఏరకమైన క్రియాపదాలు?

♦ వెరీగుడ్ వాక్యంలో ఒకే సమాపక క్రియ ఉంటే అలాంటి వాక్యాలను సామాన్య వాక్యాలు అంటారు.

♦ మీరు మరికొన్ని సామాన్య వాక్యాలను చెప్పండి.

*(నలుగురైదుగురు పిల్లలతో చెప్పించాలి.)*

♦ "హైదరాబాదు మన రాష్ట్ర రాజధాని". ఈ వాక్యంలో క్రియాపదం ఉందా?

ఇలా క్రియా పదం లేని వాక్యాలు కూడా సామాన్య వాక్యాలే. ఇలాంటివి మరికొన్ని వాక్యాలు చెప్పండి.

♦ ఇప్పుడు నేను రాసే వాక్యాలు గమనించండి.

రాజు అన్నం తిని,

సీను మార్కెటుకు వెళ్లి,

ఈ వాక్యాలను బట్టి మీకేం తెలుస్తుంది? ఇవి సంపూర్ణ వాక్యాలా? ఎందుకు సంపూర్ణ వాక్యాలు కావు?

- మళ్ళీ చూడండి.
- 'రాజు అన్నం తిని, బడికి వెళ్ళాడు'

  *(నల్లబల్లపై రాయాలి.)*
- ఇంతకు ముందు వాక్యానికి, ఈ వాక్యానికి తేడా ఏమిటి?
- గీత బజారుకు వెళ్ళింది. గీత కూరగాయలు కొన్నది.

  గీత బజారుకు వెళ్ళి, కూరగాయలు కొన్నది.

  పిల్లలూ! ఈ మొదటి రెండు వాక్యాలకు, కింది వాక్యానికి తేడా ఏమిటి?
- మొదటి వాక్యంలోని క్రియ 'వెళ్ళింది' అనేది 'వెళ్ళి' అని అసమాపక క్రియగా మారింది కదా! అట్లే నామవాచకం ఒకేసారి వచ్చింది. ఇలా రెండు సామాన్య వాక్యాలను అసమాపక క్రియ ఉపయోగించి మార్చి రాస్తే సంశ్లిష్ట వాక్యం ఏర్పడుతుంది.
- మీరు కొన్ని సంశ్లిష్ట వాక్యాలు చెప్పండి.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- అసమాపక క్రియలకు ఉదాహరణలు చెప్పండి.
- సామాన్య వాక్యాలకు, సంశ్లిష్ట వాక్యాలకు తేడా ఏమిటి?

## IV. ఇంటిపని

**వ్యాకరణాంశాలు :**

అ) కింది సామాన్య వాక్యాల్ని సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.

- విమల వంట చేస్తుంది. విమల పాటలు వింటున్నది.
- అమ్మ నిద్ర లేచింది. అమ్మ ముఖం కడుక్కొంది.
- రవి ఊరికి వెళ్ళాడు. రవి మామిడి పండ్లు తెచ్చాడు.

ఆ) కింది సంశ్లిష్ట వాక్యాల్ని సామాన్య వాక్యాలుగా మార్చి రాయండి.

- తాత భారతం చదివి, నిద్ర పోయాడు.
- చెట్లు పూత పూస్తే, కాయలు కాస్తాయి.
- రాము నడుచుకుంటూ వెళ్ళి, తన ఊరు చేరాడు.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 11వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

### 1. పలకరింపు :

పిల్లలూ! శుభోదయం!

శుభోదయానికి బదులు ఇంకా ఏ విధంగా పలకరిస్తామో చెప్పండి.

### 2. పునశ్చరణ :

- నిన్న మీకిచ్చిన ఇంటి పనిని పూర్తిచేసారా? చదవండి.

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

- పిల్లలూ! పాఠం చదవండి. పాఠంలో సంధి పదాలు ఏమేం ఉన్నాయో వెతకండి. అంటే రెండు పదాలు కల్సి ఒకే పదంగా ఉన్నవి.

  ***(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)***

- అట్లే పదాలు కూడా చదవండి.

  ఎనిమిది మూరలు, దశదిశలు, పంచకావ్యాలు, చతుర్వేదాలు, కూరగాయలు, అక్కాచెల్లెళ్లు.

- ఈ పదాలను విడదీయండి.

  దైవారాధన, పరమాత్మ, కనబడకుండా, కేశాలంకరణ, బ్రాహ్మణేతరులు, గృహోపకరణ, నాలుగైదు.

- వెరీగుడ్! ఇవి ఏ సంధులో చెప్పండి.

  ***(సూత్రాలను చర్చద్వారా అవగాహన కల్పించాలి.)***

- ఎనిమిది మూరలు ..... ఈ పదాలకు విగ్రహవాక్యాలు చెప్పండి. అవి ఏ సమాసాలో చెప్పండి.

  ద్విగు, ద్వంద్వ సమాసం గురించి పునశ్చరణచేయాలి.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ రోజు మనం ఏ ఏ సంధుల గురించి తెల్సుకొన్నాం?
- ఏయే సమాసాల గురించి తెల్సుకొన్నాం?

## IV. ఇంటిపని

**వ్యాకరణాంశాలు :**

పిల్లలూ! మీరు పాఠ్యపుస్తకంలోని 19, 20 పేజీల్లోని సంధులు, సమాసాలకు చెందిన అభ్యాసాలను రాసుకొనిరండి.

# 2. మన సంస్కృతి

| 8వ తరగతి | 12వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం!

మీరంతా చాలా ఉత్సాహంగా ఉన్నారే!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీరు రాసిన సంధులు, సమాసాలకు సంబంధించిన ఇంటి పనిని చదివి విన్పించండి.

***(తప్పులుంటే సవరించాలి.)***

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! ఈ పాఠంలో అన్ని అభ్యాసాల గురించి సాధన చేసాం కదా! ఇంకా ఏ అభ్యాసం మిగిలింది?
- పాఠంలో చివరిది "నేనివి చేయగలనా?" అనేది ఉంది కదా! దాంట్లో ఏమేమి రాసి ఉన్నాయో చదవండి.
- ఇవి ఎవరికి సంబంధించినవి! దీన్ని బట్టి మీకేమి తెల్సింది?
- నేనివి చేయగలనా? లోనివి మీరు చేయగలరా? లేదా? అని మీకు మీరే తెల్సుకోవాల్సినవి. అంటే ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఇవి చేయగలరా? లేదా? చెప్పండి.

**పరిశీలన :**

మొదటి వాక్యం చదవండి. "ఈ పాఠ్యాంశాన్ని సమర్థిస్తూ మాట్లాడగలను" మీరు ఎవరెవరు మాట్లాడగలరో చేతులెత్తండి. చేతులెత్తిన వారు 'ఔను' వద్ద '✓' పెట్టండి.

***(చేతులెత్తిన వారిని లెక్కించాలి.)***

- అట్లే రెండవ వాక్యం చదవండి. మీరు చేయగల్గితే అంటే పాఠం చదివి సమాచారాన్ని పట్టికలో రాయగల్గితే ఔను వద్ద లేకుంటే కాదు వద్ద '✓' ఉంచండి. ఇప్పుడు చేయగలిగిన వారు చేతులెత్తండి.

***(ఎంత మంది చేతులెత్తారో లెక్కించండి.)***

***(ఇలా నేనివి చేయగలనా? లోని అన్ని వాక్యాలు చదువుతూ, చేతులెత్తించాలి. లెక్కించాలి. పై అంశాన్ని 80% మంది చేయగలరో లేదో గుర్తించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! మీలో ఏ అంశాన్ని ఎక్కువ మంది చేయలేకపోయారు?

***(ఇలా అడిగి 80% కంటే తక్కువ మంది చేయలేనిదానిపై పునరవగాహన కల్పించాలి.)***

## IV. ఇంటిపని

పిల్లలూ! మీరు చేయలేని అంశంపై అవగాహనకలిగిందాన్ని మీరు ఇంటి వద్ద అభ్యాసం చేసి రాసుకొనిరండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 1వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

### 1. పలకరింపు :

పిల్లలూ! శుభోదయం. ఎలా ఉన్నారు? బాగున్నారా? అందరూ బడికి వచ్చారా? ఈరోజు రాజు ఎందుకు బడికి రాలేదు. మీరు ఇంటికి వెళ్ళేటప్పుడు కనుక్కుని వెళ్ళండి. సరే పిల్లలూ.....

- ఇప్పుడు మీకు తెలిసిన ఏవైనా దేశభక్తి గేయాలు చెప్పండి.

  రహీమ్ : సారే జహాఁసే అచ్ఛా ..................

  రాజా : శ్రీలుపొంగిన జీవగడ్డయి ..................

- చాలా బాగా పాడారు పిల్లలూ! అయితే రహీమ్ పాడిన గేయమైనా, రాజా పాడిన గేయమైనా రెండూ దేశభక్తిని చాటి చెప్పేవే.
- అలాగే మనం ఇప్పుడు దేశభక్తితోపాటు దేశంలో ఉన్న అన్ని మతాలు, అందరు దేవుళ్ళూ సమానమనే భావం కల్గిన గేయం గురించి తెల్సుకుందాం.

### 2. ఉన్ముఖీకరణ :

పిల్లలూ! చిత్రం గురించి మాట్లాడించడం. మీ పాఠ్యపుస్తకంలోని 1వ పేజీలో ఉన్న చిత్రాన్ని చూడండి. తరువాత నేనడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి.

- చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
- మన జాతీయ జెండా ద్వారా ఏం గ్రహించాలనుకుంటున్నారు?
- పిల్లలు ఒకరి భుజంపై మరొకరు చేతులు వేసుకున్నారు కదా! వారు ఏమనుకుంటున్నారో ఊహించండి.
- చిత్రంలో ఉన్నవారు ఏం మాట్లాడుకుంటున్నారో ఊహించి చెప్పండి.
- బాగా చెప్పారు పిల్లలూ!

**సంభాషణలు చెప్పించడం :**

- పిల్లలూ! చిత్రంలో హిందూ, ముస్లింలు, జెండా పాతుతూ ఉన్నారు కదా! వారు ఏం మాట్లాడుతున్నారో ఊహిస్తూ మీలో ఒకరు హిందువుగానూ, ఒకరు ముస్లింగానూ అభినయించండి.

  ***(ఇద్దరు పిల్లలతో సంభాషణ చెప్పించాలి.)***

### 3. శీర్షికా ప్రకటన :

- పిల్లలూ! చిత్రంలోని వారు ఒకరి భుజంపై మరొకరు చేయివేసుకొని ఉన్నారు కదా! ఎందుకు?
- అన్ని మతాలవారు కలిసి ఒకే పని చేస్తున్నారు కదా! వారు ఏపని చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు?

- ఇలా అందరూ కలసి మెలసి ఉండడాన్ని "సమైక్యత" అంటారు. మనం ఈరోజు "సమైక్యభారతి" పాఠం గురించి చెప్పుకుందాం.

*(పాఠం పేరు నల్లబల్లపై రాయాలి)*

**4. ఉద్దేశం :**

కుల మత భేదాలు వద్దని మానవులంతా సమానమని, సోదరభావంతో మెలగాలని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం. ఈ పాఠం దేవుల పల్లి కృష్ణశాస్త్రిగారు రాసారు. కృష్ణశాస్త్రిగారి గేయ సంపుటిలోనిదీ పాఠ్యభాగం.

**5. లక్ష్యాలు :**

- పిల్లలూ! మీరు ఈ పాఠం పూర్తయ్యేసరికి గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగలరు.
- గేయం సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలరు.
- గేయంలోని ప్రాసపదాలను గుర్తించగలరు. మీ ఊరిని పొగడుతూ గేయం రాయగలరు.
- దేశభక్తిని పెంపొందించుకో గల్గుతారు.

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

పిల్లలూ! మానవులంతా ఒకటేనని ఈ గేయం తెలియజేస్తుందని చెప్పుకున్నాం కదా! మరి ఈ గేయాన్ని పాడుకుందామా!

**1. ఉపాధ్యాయుడు గేయాన్ని పాడి వినిపించడం :**

ఉపాధ్యాయుడు గేయాన్ని రాగయుక్తంగా పాడాలి. పిల్లలు వింటారు.

**2. పిల్లలతో పాడించడం :**

రెండోసారి ఉపాధ్యాయుడు పాడుతూ పిల్లలతో అనిపిస్తాడు.

**3. పిల్లలు, ఉపాధ్యాయుడు కల్సి పాడడం :**

పిల్లలూ! ఇప్పుడు గేయాన్ని అందరం కల్సిపాడుదామా!

పిల్లలూ! చాలా బాగా పాడారు.

**(మైండ్ మ్యాపింగ్) మేధోమధనం :**

దేశభక్తికి సంబంధించిన పదాలను పిల్లలచే చెప్పించాలి.

*(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ గేయాన్ని ఎవరు రాసారు?
- ఈ గేయంలో దేని గురించి ఉంది?
- ఈ గేయాన్ని రాగంతో పాడండి.

## IV. ఇంటిపని

- 1వ పేజీలోని చిత్రం చూసి చిత్రంలో ఏమేం కన్పిస్తున్నాయో వాటి పేర్లు రాయండి.
- పిల్లలూ! కవి పరిచయం చదవండి. కవి గురించి ఉన్న వివరాలను తెలుసుకొని రండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 2వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా? నిన్న మనం 1వ, 2వ పేజీలలోని చిత్రాల గురించి మాట్లాడుకున్నాం కదా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మిమ్మల్ని చిత్రాలు చూసి వాటిలో ఏమేమున్నాయో పేర్లు రాసుకుని రమ్మన్నాను కదా!

- ఎవరెవరు రాసుకుని వచ్చారు?
- 1వ పేజీలో ఉన్న చిత్రంలోని పేర్లను ఎంత మంది రాసుకువచ్చారు?

***(ఇద్దరు, ముగ్గురు పిల్లలతో వాళ్ళు రాసుకుని వచ్చిన పేర్లను చదివించాలి.)***

- పిల్లలూ! నిన్న కవి గురించి వివరాలు తెలుసుకొని రమ్మన్నాను కదా! వచ్చారా?
- వెరీగుడ్! ఎవరెవరు కవిపరిచయం చదివారు చేతులెత్తండి.

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. ఉపాధ్యాయుడు గేయాన్ని పాడడం :**

పిల్లలూ! "సమైక్యభారతి" గేయం అని తెల్సుకదా! ఇప్పుడు ఆ గేయాన్ని నేను పాడతాను. వినండి. నేను పాడిన తర్వాత నాతోపాటు కల్సి మీరుకూడా పాడాలి.

***(ఉపాధ్యాయుడు గేయాన్ని రాగంతో పాడుతూ పిల్లలతో అనిపించాలి.)***

**2. పిల్లలతో పాడించడం :**

పిల్లలూ! ఈ గేయాన్ని ఇప్పుడు మీరే అందరు కల్సిపాడాలి. (పిల్లలతో పాడించాలి)

**3. పిల్లలతో బాహ్య పఠనం :**

పిల్లలూ! గేయం పాడుకున్నాం కదా! ఇప్పుడు మీరు పేజి నెం. 2 చూడండి.

- ఈ పేజీలో ఏముంది?
- మీలో ఎవరు నారాయణ నారాయణ అల్లా ........ పిల్లలమేమెల్లా గేయం చూసి చదువుతారు. చదవండి.

***(నలుగురు లేదా ఐదుగురు పిల్లలతో బాహ్యపఠనం చేయించాలి. పిల్లలు చదివేటప్పుడు స్పష్టోచ్చారణతో చదువుతున్నారా గమనించండి.)***

**4. ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం :**

పిల్లలూ! ఇప్పుడు నేను చదువుతాను. జాగ్రత్తగా వింటూ పుస్తకంలో చూడండి.

*(ఉపాధ్యాయుడు పుస్తకంలో చూసి రాగ, హావ, భావాలతో చదవాలి.)*

**5. పిల్లల మౌన పఠనం :**

పిల్లలూ! నేను చదివాను కదా! ఇప్పుడు మీరు మౌనంగా గేయాన్ని చదవండి.

**6. అర్థసంగ్రహణం :**

పిల్లలూ! గేయాన్ని చదివారు కదా! ఈ గేయంలో మీకు తెలియని పదాలు ఏమేమి ఉన్నాయి?

*(నలుగురైదుగురు పిల్లల్ని అడగాలి. వారు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)*

- ఈ పదాలకు అర్థాలు తెల్సుకోవడానికి పుస్తకంలో చివరన ఉన్న అర్థాల పట్టికను చూసి, వెతకండి.
- పిల్లలూ! ఏయే పదాలకు అర్థాలు తెల్సుకున్నారు? ఇంకా తెలువని పదాలు ఏమేమి న్నాయి? మీ మిత్రులను అడగండి.

*(పదాలను వాక్యప్రయోగం ద్వారా వివరించాలి. పిల్లలు తెల్సుకునేలా చూడాలి. ఆ పదాలు - అర్థాలు నల్లబల్లపై రాయాలి.*

ఉదా: మర్మం

వేదాలలోని మర్మాన్ని తెలుసుకోవడం అందరికీ సాధ్యపడదు.

మర్మం = రహస్యం.

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! ఇప్పటివరకు పాఠంలో తెలువని పదాలకు అర్థాలు తెలుసుకున్నారు కదా! కింది పదాలకు అర్థాలు చెప్పండి.

మసక, గితం, మాయా.

## IV. ఇంటిపని

పిల్లలూ! ఈ రోజు మనం పాడుకున్న 2, 3 పేజీలలోని గేయాన్ని కంఠస్థం చేసుకుని, తప్పులు లేకుండా రాసుకుని రండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 3వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా? నిన్నటి గేయం బాగుందా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మనం పాడుకున్న గేయాన్ని కంఠస్థం చేసుకుని రమ్మన్నాను కదా! వచ్చారా!

***(ఇద్దరు, ముగ్గురు పిల్లలతో పాడించాలి.)***

- ఈ రోజు ఈ పాటకు అభినయం నేర్చుకుందాం. ఎవరు చేస్తారు? అభినయం చేసి చూపండి.

***(పిల్లలతో నారాయణ నారాయణ అల్లా ..... గేయానికి అభినయం చేస్తూ పాడించాలి.)***

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. పాఠ్యాంశ చిత్రం గురించి మాట్లాడించడం :**

- పిల్లలూ! పుస్తకంలో 2వ పేజీలో ఉన్నటువంటి బొమ్మలు చూడండి.
- వీటిలో ఏమేం కన్పిస్తున్నాయి? ఒక్కొక్కరు ఒక్కొక్కటి చెప్పాలి.

***(పిల్లలు చెప్పే పదాలను నల్లబల్లపై రాయాలి.)***

- 2వ పేజీలోని చిత్రాలలో ఎవరెవరు ఏమేం చేస్తున్నారో ఒక్కొక్కరు ఒక వాక్యం చెప్పాలి.

**సంభాషణలు :**

పిల్లలూ! చిత్రంలో ఎవరు మాట్లాడుతున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఏం మాట్లాడుతుండవచ్చు?

- చిత్రంలోని వారు జెండాలు పైకెత్తి ఎలుగెత్తి చెపుతున్నారు కదా! వారు ఏం చెపుతుండవచ్చు?
- కింది చిత్రంలో పక్షి ఏ పువ్వు తీసుకువస్తున్నది.
- అది ఏ పక్షి అయి ఉండవచ్చు?
- చిత్రంలో ఇద్దరిద్దరు నిలబడి ఉన్నారు కదా! మీరు కూడా అలాగే జట్లుగా నిలబడి వారు ఏం మాట్లాడుతున్నారో ఊహించి మాట్లాడాలి. ఎవరు మాట్లాడుతారు.

***(పిల్లలతో సంభాషణ చేయించాలి.)***

**2. పిల్లలతో బాహ్య పఠనం :**

పిల్లలూ! గేయాన్ని పుస్తకంలో చూసి తప్పులేకుండా చక్కగా చదవాలి. ఎవరు చదువుతారు.

***(నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి. ఉచ్చారణ దోషాలు సవరించాలి.)***

**3. ఉపాధ్యాయుని ఆదర్శ పఠనం :**

పిల్లలూ! ఇప్పుడు నేను చదువుతాను. జాగ్రత్తగా వింటూ పుస్తకంలో చూడండి.

**4. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

"నారాయణ ...... నుండి మాయా మర్మం వద్దు" వరకు చదివించాలి ***(దీంట్లోని కీలక పదాలు వాక్యాలు, విడమర్చి వివరించాలి.)***

- మతం, గితం ఇవి రెండూ ఎటువంటి పదాలు.
- కవి నారాయణ నారాయణ అల్లా అల్లా అని ఎందుకన్నాడు.
- మనమందరం ఎవరి పిల్లలమని చెప్పాడు?

## III. పిల్లల అవగాహన పరిశీలన

- మతం గురించి కవి ఏమని చెప్పాడు?
- కవి దేవుళ్ళందరూ ఒకటే అని చెప్పాడు? ఎందుకు?

## IV. ఇంటిపని

పాఠం చిత్రం చూసారు కదా! అందులో ఏ ఏ మతాలకు సంబంధించిన వాళ్ళున్నారు? వాళ్ళంతా ఏం చేస్తున్నారు? రాసుకుని రండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 4వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! అంతా కులాసాగా ఉన్నారా!

**2. పునశ్చరణ :**

నారాయణ ..... మేమెల్లా అందరం అభినయం చేస్తూ పాడుదామా!

*(ఉపాధ్యాయుడు, పిల్లలు అభినయం చేస్తూపాడాలి.)*

- పిల్లలూ! నిన్న చిత్రం గురించి రాసుకుని రమ్మన్నాను కదా! రాసుకుని వచ్చారా! చెప్పండి.

  *(నలుగురైదుగురు పిల్లలతో చెప్పించాలి.)*

- మీరు రాసుకుని వచ్చిన దానిని అభినయిస్తూ నాటకీకరణ చేసి చూపండి.

  *(పిల్లలచే వారు రాసిన దానిని అభినయింపజేయాలి.)*

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. ఉపాధ్యాయుడు గేయాన్ని పాడడం :**

- పిల్లలూ! నిన్న మనం "నారాయణ ..... మేమెల్లా ... మాయామర్మంవద్దు" వరకు చెప్పుకున్నాం కదా! ఇప్పుడు మిగతా పాటను నేర్చుకుందాం.

**2. పిల్లలతో బాహ్య పఠనం :**

పిల్లలతో "ద్వేషాలు రోషాలు ..... నుండి అందరం సోదరులం" వరకు తప్పులు లేకుండా చదవాలి. ఎవరు చదువుతారు?

*(నలుగురైదుగురు పిల్లలతో బాహ్యపఠనం చేయించాలి. ఉచ్చారణదోషాలను గమనించి సరిచేయాలి.)*

**3. ఉపాధ్యాయుని ఆదర్శ పఠనం :**

పిల్లలూ! నేను ఈ గేయం పాడతాను. జాగ్రత్తగా వింటూ పుస్తకంలో చూడండి.

*(ఉపాధ్యాయుడు రాగ, హావ, భావ యుక్తంగా పాడాలి.)*

**4. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

- పిల్లలూ! మారణహోమం అంటే ఏమిటి?
- మనమందరం ఎవరం?

- హితమంటే ఏమిటి?

*(ఇలా గేయంలోని కీలక పదాలను అడిగి వాటిని వివరిస్తూ చర్చ ద్వారా భావాన్ని పిల్లలకు గ్రహింపజేయాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! గాంధీజీ ఏ మార్గాన్ని అనుసరించారు?
- మనందరం ఎటువంటి భావనతో నడుచుకోవాలి.
- కవి గతం ఎలా ఉండకూడదన్నాడు?

## IV. ఇంటిపని

ప్రాజెక్టుపని :

- భరతమాతను స్తుతించే గేయాలను సేకరించండి.
- వార్తాపత్రికలు, పాఠశాల గ్రంథాలయంలో లభ్యమయ్యే దేశభక్తి గేయాలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి మీ పాఠశాల గోడపత్రికలో ప్రదర్శించండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి |
|---|
| ద్వితీయభాష |

| 5వ పీరియడ్ |
|---|
| 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం!

**2. పునశ్చరణ :**

- పిల్లలూ! గేయాన్ని అభినయంతో పాడండి.
- గేయాన్ని రాగ, హావ, భావ యుక్తంగా ఎవరు పాడుతారు? పాడండి.

*(నలుగురైదుగురు పిల్లలతో గేయాన్ని చదివించాలి. దోషాలను సరిచేయాలి.)*

- వెరీగుడ్ చాలా బాగా పాడారు.

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

- పిల్లలూ! పాఠంలో పేజీ నెం.4 చూడండి. ఏముంది? "ఇవి చేయండి" అని అభ్యాసాలు ఉన్నాయి కదా! మొదటి అభ్యాసం ఏమున్నది?

**1. వినడం – మాట్లాడడం – ఆలోచించి చెప్పడం :**

- పిల్లలూ! మొదటి అభ్యాసం వినడం – మాట్లాడడం – ఆలోచించి చెప్పడానికి సంబంధించినది దీంట్లో ఎన్ని ప్రశ్నలు ఉన్నాయి? వాటిని చదవండి.

*(పిల్లలు చదివిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.)*

- పిల్లలూ! దీంట్లో మొదటి ప్రశ్న ఏది? గేయం దేని గురించి చెపుతుంది. అని ఉంది కదా! ఒక్కొక్కరు ఒక్కో వాక్యం చెప్పండి.

*(అందరు పిల్లలతో మాట్లాడించాలి.)*

- వెరీగుడ్ చాలా బాగా చెప్పారు! గేయం మత సామరస్యం గురించి చెపుతుంది. మానవులంతా సమానులే. అందరూ ఆ భగవంతుని బిడ్డలే. కాబట్టి ద్వేషాలు, రోషాలు, పగలు, ప్రతీకారాలు వదలిపెట్టి అందరూ అన్నదమ్ముల్లా కలిసి, మెలిసి ఉండాలి కదా!

*(ఇలా అన్ని ప్రశ్నలను అడగాలి. పూర్తి తరగతి కృత్యంగా ఒక్కొక్కరితో ఒక్కొక్క వాక్యం చెప్పించాలి. చివరకు ఉపాధ్యాయుడు అందరి వాక్యాలు క్రోడీకరించి సారాంశం చెప్పాలి.)*

**2. ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – అభ్యాసాలు :**

పిల్లలూ! వినడం, మాట్లాడడంలోని ప్రశ్నల గురించి చర్చించుకున్నాం కదా! ఇప్పుడు రెండవ అభ్యాసం ధారాళంగా చదవడంలోని అభ్యాసాలు చేద్దాం.

- పిల్లలూ! గేయం చదవండి. గేయంలో అల్లా, మెమేల్లా ప్రాస పదాలను గుర్తించి, వాటిని రాయండి.
- వెరీగుడ్, ఏమేమి పదాలున్నాయో చెప్పండి.

  మసకైతే, మబ్బైతే, మతమైతే, గతమైతే .........

**3.** పిల్లలూ! నేను వాక్యాలు రాస్తాను వాటికి సంబంధించిన పంక్తులు గేయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించి గీత గీయండి.

అ) గతం మనలో కలహాలను కక్షలను కలిగిస్తుంది.

ఆ) హిందూ ముస్లింలు అందరూ అన్నదమ్ములే.

ఇ) మతం అనేది నా మనసుకు మబ్బులాంటిది.

- వెరీగుడ్. చాలా బాగ చేసారు.

  ***(ఇలా మిగిలిన వాటిని కూడా ఇచ్చి చేయించాలి.)***

- **మేధోమథనం :** పిల్లలూ! గతం అంటే ఏమిటి?

  ***(పిల్లలందరితో చెప్పించాలి. వారు చెప్పినవి నల్లబల్లపై రాయాలి.)***

**4.** పిల్లలూ! ఇప్పుడు నేను ప్రశ్నలడుదుతాను. పాఠం ఆధారంగా జవాబులు చెప్పండి.

- మతానికి అతీతంగా ఉంటానని కవి పాఠం ద్వారా తెలిపాడు కదా! పాఠంలోని ఆ వాక్యాన్ని రాయండి.
- పాఠానికి సరిపోయే శర్షికలను సూచించండి.

***(పిల్లలతో సమాధానాలు చెప్పించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ రోజు మనం వినడం – మాట్లాడడం, చదవడం – అర్థం చేసుకోవడం అభ్యాసాల గురించి తెలుసుకున్నాం కదా! మరి ఇప్పుడు గేయ సారాంశాన్ని మీ సొంత మాటల్లో చెప్పండి.

## IV. ఇంటిపని

- హిందూ, ముస్లింలు ఎలా మెలగాలో 5, 6 వాక్యాల్లో మీ సొంతమాటల్లో రాసుకుని రండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 6వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా! మీరు పాఠాన్ని చాలా బాగా నేర్చుకుంటున్నారు. మీకు అభినందనలు.

**2. పునశ్చరణ :**

- ఈ గేయం ద్వారా మీరు ఏం తెల్సుకున్నారు?
- ఏమేమి కొత్త పదాలు మీకు తెల్సినవి?
- "దేశభక్తి" గురించి ఇంకా మీకు ఏఏ పాటలు వచ్చో పాడండి.

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

పిల్లలూ! పాఠ్యపుస్తకంలోని వినడం – మాట్లాడడం, చదవడం అభ్యాసాల గురించి తెల్సుకున్నారు కదా! ఈ రోజు స్వీయరచన అభ్యాసంలోని ప్రశ్నల గురించి తెల్సుకొందామా!

**1. స్వీయరచన :**

పిల్లలూ! "స్వీయరచన"లో ఏయే ప్రశ్నలు ఉన్నాయో చదవండి.

***(పిల్లలు చదివిన ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి.)***

- వీటిలో ఒక్కొక్క ప్రశ్న గురించి జవాబులు చెప్పాలి. ఎవరిని అడిగితే వాళ్లే చెప్పాలి.
- పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.

***(ఒక్కొక్కరిచే ఒక్కొక్క వాక్యం చెప్పించాలి.)***

- మనది భిన్నత్వంలో ఏకత్వం సాధించిన దేశం కదా! మరి సమైక్యత అవసరమేమిటి?

***(ఇలా ప్రతి ప్రశ్న గురించి అడుగుతూ పూర్తి తరగతి కృత్యంగా పిల్లలందరితో మాట్లాడించాలి. ఒక్కొక్క వాక్యం చెప్పించాలి.)***

- **మేధోమథనం :** పిల్లలూ! పాఠం సారాంశాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం సొంతమాటల్లో చెప్పండి.

***(పిల్లలు చెప్పిన వాక్యాలు నల్లబల్లపై రాయాలి.)***

**2. జట్టుపని :**

పిల్లలూ! మీరంతా జట్లుగా విడిపోయి కూర్చోండి. ఇప్పటి వరకు మనం మాట్లాడిన ప్రశ్నలకు జవాబులు మీరంతా చర్చించుకొని మీ నోటు బుక్కులో రాయండి.

***(జట్టుపనిలో పిల్లలంతా పాల్గొంటూ చర్చలో పాల్గొంటున్నారా లేదా గమనించాలి. వీలైతే సలహాలు, సూచనలు ఇవ్వాలి.)***

**3. జట్టు ప్రదర్శన :**

పిల్లలు జట్లలో రాసిన సమాధానాలను తరగతి గదిలో ప్రదర్శింపజేయాలి.

**4. సరిదిద్దడం :**

*(పిల్లలు జట్లలో రాసిన సమాధానాలను తరగతిలో చర్చద్వారా సరిదిద్దాలి. ఇందుకోసం ఏదైనా ఒక జట్టు వారు రాసిన జవాబులను నల్లబల్లపై రాయాలి.)*

పిల్లలూ! మీలో ఎవరైనా మీ జట్టు రాసిన జవాబులు నల్లబల్లపై రాయండి.

- పిల్లలూ! మీరు రాసిన జవాబులను నల్లబల్లపై రాశారు కదా!
- మరి రాసిన భావం సరిగా ఉందా?
- వాక్య నిర్మాణం సరిగా ఉందా?
- పదనిర్మాణం సరిగా ఉందా? ఇంకా ఏమైనా మంచి పదాలు ఉపయోగించవచ్చా!
- అక్షర దోషాలేమైనా ఉన్నాయా?

*(పైన తెల్పిన ప్రశ్నలు అడుగుతూ చర్చద్వారా నల్లబల్లపై రాసిన సమాధానాలను సరిద్దిదాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ప్రశ్నలకు జవాబులు రాయడం గురించి చర్చించుకొన్నాం కదా! దేశభక్తి గురించి కవి ఏమని చెప్పాడు. సొంతమాటల్లో చెప్పండి.

## IV. ఇంటిపని

- పిల్లలూ! మనం టి.వి., రేడియోలలో వింటూ ఉంటాం, చూస్తూ ఉంటాం. భారతీయ సంస్కృతి సంప్రదాయాలంటే అన్ని దేశాలవారు ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు కదా! అలా మనదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచదేశాలు ఎందుకు ప్రశంసిస్తాయి?
- "అందరం మానవులం, అందరం సోదరులం" దీన్ని సమర్థిస్తూ రాయండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 7వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా! ఇవాళ అందరూ సంతోషంగా ఉన్నారు. ఎవరిదో పుట్టినరోజులా ఉంది.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! మీకు ప్రాజెక్టుపని ఇచ్చాను కదా! భారతమాతను స్తుతించే గేయాలను సేకరించుకొని వచ్చారా! ఎవరెవరు ఏం గేయం తీసుకొచ్చారు?

- ప్రాజెక్టుపని ప్రదర్శన! పిల్లలూ! మీరు రాసి తెచ్చిన గేయాలను ప్రదర్శించండి.
- ఎన్ని గేయాలు రాసుకొని వచ్చారు.
- నిన్న ఇంటిపనిగా ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాసారా? చదివి వినిపించండి.

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

పిల్లలూ!

1. ప్రాజెక్టుపనిలో ఎవరెవరు బాగా రాశారు?
2. వీటిలో ఏమైనా అక్షర దోషాలున్నాయా?

***(ప్రాజెక్టు పనిలోని దోషాలను చర్చద్వారా సవరించాలి.)***

**1. పదజాలం - అభ్యాసాలు :**

- పిల్లలూ! పేజి నెం. 5 లోని పదజాలం అభ్యాసం 1వ బిట్‌లో ఉన్న పదాలు చూడండి. రెండు, రెండు పదాలు కలిసి ఉన్నాయి కదా! వాటిని ఒకే వాక్యంలో వచ్చేటట్లు రాయండి.

  ఉదా : కులం - మతం

- కులం, మతం మనుషుల్ని దూరం చేస్తాయి.

  ***(మిగిలిన పదాలు కూడా ఇదే విధంగా రాసేట్లు చూడాలి.)***

- పిల్లలూ! ఇప్పుడు రెండవబిట్‌లో ఉన్న వాక్యాలను వ్యతిరేకార్థం ఇచ్చే వాక్యాలుగా మార్చి రాయండి.
- పిల్లలూ! ఇప్పుడు మీరంతా జట్లలాగా ఏర్పడండి.
- **మేధోమథనం :** పిల్లలూ! హితం అంటే ఏమిటి?

  ***(పిల్లలచే చెప్పించాలి. ఒక్కొక్కరు చెప్పిన అర్థాన్ని నల్లబల్లపై రాయాలి.)***

**2. జట్టుపని :**

పిల్లలూ! మీరంతా జట్లలాగా ఏర్పడ్డారు కదా! మనం పైన చెప్పుకున్న 1, 2 బిట్లలోని అభ్యాసాలను మీరంతా చర్చిస్తూ మీ నోట్సులో రాయండి.

**3. జట్టు ప్రదర్శన :**

పిల్లలూ! మీరు జట్లలో చర్చిస్తూ రాసినవాక్యాలను చదవండి.

***(ఇలా అన్ని జట్ల పిల్లలతో చెప్పించాలి. ఇలానే 3, 4 అభ్యాసాలలోని కృత్యాలను కూడా పిల్లలతో చేయించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ధరిత్రీ గోళం అంటే ఏమిటో చెప్పండి.
- సమభావన అంటే అర్థం ఏమిటి?

## IV. ఇంటిపని

**ప్రశంస :**

- గేయంలో మీకు నచ్చిన పదాలను, పాదాలను గురించి రాయండి. అవి మీకు ఎందుకు నచ్చాయో తెలుపండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 8వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం! అందరూ వచ్చారా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! మీకు ప్రాజెక్టుపనిగా ఇచ్చిన రెండవ అంశం గుర్తుందా! దేశభక్తి గేయాలను సేకరించి వాటిని చార్టుమీద రాసుకుని రమ్మన్నాను కదా! రాసుకుని వచ్చారా. ఎవరెవరు ఏయే గేయాలు తీసుకునివచ్చారు?.

**ప్రాజెక్టుపని ప్రదర్శన :** పిల్లలూ! మీరు రాసి తెచ్చిన చార్టును ప్రదర్శించండి.

- ఎన్ని దేశభక్తి గేయాలు రాసుకొని వచ్చారు.

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

1. ప్రాజెక్టుపనిలో ఎవరెవరు ఏయే కవులగేయాలు సేకరించిరాసారు.
2. రాసిన వీటిలో ఏమైనా అక్షర దోషాలున్నాయా?

*(ప్రాజెక్టు పనిలోని అక్షర దోషాలను చర్చద్వారా సవరించాలి.)*

**1. సృజనాత్మకత – అభ్యాసం :**

- పిల్లలూ! మీరంతా పాఠం చక్కగా విన్నారు కదా! మరి ఇప్పుడు మీరందరూ కలిసి 'సమైక్యభారతి' గేయాన్ని చక్కగా అభినయిస్తూ పాడండి.

  *(పిల్లలందరూ పాడేలా చూడాలి.)*

- మనదేశంలాగే పుట్టిన ఊరు కూడా కన్నతల్లి వంటిదికదా! మీ ఊరిని పొగుడుతూ ఒక గేయం రాయండి.
- పిల్లలూ! ఇప్పుడు మీరంతా జట్లుగా ఏర్పడండి.

**2. జట్టుపని :**

పిల్లలూ! మీరు రాసిన గేయాలలో పదజాలం, వాక్యనిర్మాణాం సరిగా ఉందా? వాటిలో ఏది బాగా ఉందో చర్చించండి.

**3. జట్టు ప్రదర్శన :**

పిల్లలూ! మీరు చర్చించి రాసిన గేయాలు చదవండి.

*(అన్ని జట్లతో చదివించాలి. దోషాలు సరిచేయాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ రోజు మీరు సృజానాత్మకత అభ్యాసం ద్వారా ఏమేమి తెలుసుకున్నారో చెప్పండి.

## IV. ఇంటిపని

- మీకు నచ్చిన ఒక దేశభక్తి గేయం రాసుకుని రండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 9వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం. మనం ఎన్నో దేశభక్తి గేయాల గురించి తెల్సుకున్నాం కదా! ఈ రోజు మనం భాషాంశాల గురించి నేర్చుకుందామా.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! మీకు ప్రాజెక్టుపనిలో భారతమాతను స్తుతించేగేయాలు, దేశభక్తి గేయాలు రాసుకొని వచ్చారు కదా! అవన్నీ కలిపి మనం ఒక ఫైల్‌లాగా తయారుచేద్దామా!

***(పిల్లలు రాసుకొని వచ్చిన చార్టులన్నీ సంకలనం చేసి ఒక ఫైల్‌లాగా తయారుచేయాలి.)***

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

- పిల్లలూ! మనం ఇప్పటి వరకు ఏ ఏ అభ్యాసాల గురించి తెల్సుకున్నాం? సరే ఈ రోజు భాషాంశాల గురించి తెల్సుకుందామా!
- పిల్లలూ! పేజి నెం.6 లోని భాషాంశాలు అనే అభ్యాసంలో 1వ బిట్ చూడండి. వాక్యాలలోని కొన్ని పదాలు గీతగీసి ఉన్నాయి. ఆ పదాలు ఏ భాషాభాగాలో చెప్పండి.
- పిల్లలూ! ఇప్పుడు మీరంతా జట్లుగా ఏర్పడండి. జట్లలో చర్చించి ఆ పదాలు ఏ భాషాభాగాలో చెప్పండి.

  ఉదా : <u>హిమాలయాలు</u> భారతదేశపు ఉత్తర సరిహద్దు.
- పిల్లలూ! హిమాలయాలు ఏ భాషాభాగం. నామవాచకం కదా! ఇలా పేరును సూచించే వాటిని నామవాచకం అంటారు.

**జట్టుపని :**

పిల్లలందరూ జట్లుగా ఏర్పడి మిగిలిన గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలో చర్చిస్తారు. రాస్తారు.

**జట్టు ప్రదర్శన :**

పిల్లలూ! మీరు రాసినవి ఎవరైనా ఒక జట్టువారు చదివి వినిపించండి.

***(ఇలా అన్ని జట్ల పిల్లలతో చెప్పించాలి. ఇలానే 3, 4 అభ్యాసాలలోని కృత్యాలను కూడా పిల్లలతో చేయించాలి.)***

**సరిదిద్దడం :**

పిల్లలూ! మీరు రాసిన వాటిలో ఏదైనా ఒక జట్టువారు రాసింది నల్లబల్లపై రాయండి.

***(ఒక జట్టువారు రాసింది నల్లబల్లపై రాయాలి. దోషాలు సరిదిద్దాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! కింది వాక్యాలు చదవండి. గీతగీసినవి ఏ భాషాభాగాలో గుర్తించండి.

1. రాకేశ్ శర్మ అంతరిక్ష యాత్ర చేసాడు.
2. పాలు తెల్లగా ఉన్నాయి.

## IV. ఇంటిపని

- పిల్లలూ! ఏవైనా కొన్ని నామవాచక పదాలు, విశేషణ పదాలు రాసుకొని రండి.

# 1. సమైక్యభారతి

| 8వ తరగతి | 10వ పీరియడ్ |
|---|---|
| ద్వితీయభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా! శుభదినం.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! మొన్న ప్రశంస అనే అభ్యాసంలోని కృత్యం ఇచ్చాను. మరి గేయంలో మీకు నచ్చిన పదాలు, పాదాలు గురించి రాయమన్నాను కదా! రాసారా? అవి మీకు ఎందుకు నచ్చాయో చెప్పండి.

- వెరీగుడ్. బగా చెప్పారు పిల్లలు.

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! నిన్న మనం 'భాషాంశాలు' అభ్యాసంలో 1వ బిట్‌లోని భాషా భాగాల గురించి తెలుసుకున్నాం కదా!
- ఈ రోజు మిగిలినవాటి గురించి తెలుసుకుందాం.
- పిల్లలు కింది వాక్యాలు చదవండి. వీటిలో ఎవరు? అనే ప్రశ్నకు సమాధానం వచ్చే పదం ఏది? దేనిని, ఎవరిని అనే ప్రశ్నకు సమాధానం వచ్చే పదం ఏది? పినిన తెలిపే పదం ఏది?

**1. రాణి సౌందర్యను కలుసుకున్నది.**

- ఈ వాక్యంలో 1వ పదం 'రాణి' ఎవరు అనే ప్రశ్నకు సమాధానంగా వస్తుంది. దీన్నే 'కర్త' అంటారు.
- 2వ పదం 'సౌందర్యను' దేన్ని, ఎవరిని అనే ప్రశ్నకు సమాధానంగా వస్తుంది. దీన్నే 'కర్మ' అంటారు.
- 3వ పదం 'కలుసుకున్నది' పనిని సూచిస్తుంది. దీన్నే 'క్రియ' అంటారు.

ఇలా కర్త, కర్మ, క్రియ అనే క్రమంలో వాక్యాలు ఉంటాయి.

- పిల్లలూ! మీరు ఇప్పుడు జట్లుగా కూర్చోండి.

**2. జట్టుపని :**

పిల్లలూ! కింది వాక్యాల్లో కర్త, కర్మ, క్రియల్లో వేటికి చెందుతాయో జట్లలో చర్చించి రాయండి.

**3. జట్టు ప్రదర్శన :**

పిల్లలూ! మీరు జట్లలో ఏమేం రాశారో చదవండి.

***(అన్ని జట్ల పిల్లలతో చదివించాలి. దోషాలు సరిచేయాలి.)***

- పిల్లలూ! పేజి నెం.7. 4వ బిట్‌లోని గీతగీసిన పదాలను గమనించండి.

1. <u>అక్కడ</u> బంతాట ఆడుతున్నారు.
2. <u>అయ్యో!</u> బంతి పోయిందా!

- పిల్లలూ! ఇటువంటి పదాలను అవ్యయాలు అంటారు.
- ఇవి ఏ లింగ, వచన, విభక్తికి చెందినవి కావు కదా!
- మీరు ఇప్పుడు జట్లలో చర్చించి మరికొన్ని అవ్యయపదాలను రాయండి.

*(పిల్లలందరు చర్చలో పాల్గొనేలా చూడాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ కింద గీతగీసిన పదాలు కర్త, కర్మ, క్రియల్లో వేటికి చెందుతాయో రాయండి.

1. <u>సోము</u> పరీక్ష <u>రాశాడు</u>. __________ __________
2. <u>మీరంతా</u> ఇళ్ళకు <u>వెళ్ళండి</u>. __________ __________
3. విమల <u>అన్నం</u> <u>తిన్నది</u>. __________ __________

- నేనివి చేయగలనా?
  - పిల్లలూ! నేనివి చేయగలనా? లోని వాక్యాలు చదవండి. చేయగల్గితే ఔను లేకుంటే కాదు వద్ద ✓ పెట్టండి.

    *(అందరు పిల్లలు పుస్తకంలో ఔను / కాదు వద్ద ✓ పెట్టేలా చూడాలి.)*
  - పిల్లలూ! గేయ సారాంశాన్ని ఎంత మంది సొంతమాటల్లో చెప్పగలరు. చేతులెత్తండి.

    *(ఇలా నేనివి చేయగలనా? లోని ఒక్కొక్క వాక్యం చదువుతూ 'ఔను' అని గుర్తించినవారిని చేతులెత్తమనాలి. 80% మంది పిల్లలు చేయలేని అంశాలను గుర్తించి మళ్ళీ అభ్యాసం పునరవగాహన కల్పించాలి.)*

## IV. ఇంటిపని

- పిల్లలూ! మీరు చేయలేని అంశంపై అవగాహన కల్గిందా దాన్ని మీరు ఇంటి వద్ద అభ్యాసం చేసిరాసుకుని రండి.

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 1వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం! మొదటి పాఠం "శ్రీలుపొంగిన జీవగడ్డ" గురించి గేయం ద్వారా నేర్చుకున్నారు కదా! గేయం ఎలా ఉంది? బాగుందా? మీకు నచ్చిందా?

- వెరీగుడ్ పిల్లలూ! ఈరోజు మనం 2వపాఠం మొదలుపెట్టుకుందామా!

**2. ఉన్ముఖీకరణ :**

పిల్లలూ! పుస్తకంలో పేజి నెం.9లోని చిత్రం చూడండి. నేనడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- చిత్రంలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారు?
- చిత్రంలో ఆసనంపైన కూర్చున్న వ్యక్తికి ఎందుకలా చేస్తున్నారు?
- చిత్రంలోని సందర్భం ఏమై ఉంటుంది?
- ఇలాంటి సన్నివేశాన్ని మీరెక్కడైనా చూసారా?

పిల్లలూ! చాలా బాగా చెప్పారు. మీకు అభినందనలు.

మనదేశ సంస్కృతిలో ఇంటికి వచ్చిన వారికి మర్యాదలు చేయడం ఆనవాయితీ కదా!

**సంభాషణలు :-**

పిల్లలూ! మీలో ఎవరైనా ఇద్దరు వచ్చి ఒకరేమో అతిథులకు ఎలా మర్యాదలు చేసే వ్యక్తిగా, మరొకరు అతిథిగా సంభాషించండి.

***(పిల్లలతో ఒకరు అతిథిగా, మరొకరు మర్యాద చేసేవాడిగా ఉండి సంభాషిస్తూ అభినయింపచేయాలి.)***

**3. శీర్షికా ప్రకటన :**

మన ఇంటికి వచ్చిన వారిని ఆదరించడం మన సాంప్రదాయం. ఇట్లా ఆదరించి మర్యాదచేయడాన్ని 'అతిథి మర్యాద' అంటారు.

***("అతిథి మర్యాద" నల్లబల్లపై పాఠం పేరు రాయాలి.)***

**4. నేపథ్యం :**

అతిథులను ఎలా ఆదరించాలి? మన స్వార్థం వదిలిపెట్టి వారిని ఎలా గౌరవించాలి అనేది ఈ పాఠం తెలియజేస్తుంది.

**5. లక్ష్యాలు :**

పిల్లలూ! ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు

- అతిథి మర్యాద కథను సొంతమాటల్లో చెప్పగలరు.
- పాఠ్యాంశాన్ని ధారాళంగా చదువగలరు. అర్థం చేసుకొని సొంతమాటల్లో చెప్పగలరు.
- పాఠ్యాంశ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలరు.
- పాఠంలోని పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించగలరు.
- అతిథి మర్యాద పాఠానికి సంభాషణలు రాసి నాటకీకరణ చేయగలరు.

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

- పిల్లలూ! ఈ పాఠం మన స్వార్థం వదలి మన ఇంటికి వచ్చిన వ్యక్తులను (అతిథులను) ఎలా ఆదరించి మర్యాద చేయాలి అనే విషయాన్ని తెల్సుకోవడానికి మనం ఈ పాఠం చదవాలి.

  ***(పిల్లలకు సంక్షిప్తంగా కథను చెప్పాలి.)***

- **కవిపరిచయం :** పిల్లలూ! ఈ పాఠ్యాంశ రచయిత ఉషశ్రీ కదా! ఆయన గురించి వివరాలు ఈ పుస్తకంలోని 12వ పేజీలో ఉన్నాయి. చదవండి, చెప్పండి.
- **(మైండ్ మ్యాపింగ్) మేధోమథనం :** మన ఇంటికి వచ్చిన వ్యక్తులను వారి మనసుకు ఆనందంకలిగే విధంగా ఎలా గౌరవించాలో చెప్పండి. ఏయే విధాలుగా మర్యాదలు చేయవచ్చో చెప్పండి.

  ***(పిల్లలచే చెప్పించాలి. వారు చెప్పిన వాక్యాలను నల్లబల్లపై రాయాలి.)***

- వీటి ఆధారంగా పాఠంలోని విషయాన్ని పిల్లలకు తెలుపాలి.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- అతిథులు అంటే ఎవరు?
- ఇంటికి వచ్చిన వారికి ఎలాంటి మర్యాదలు చేయాలి?
- ఈ పాఠాన్ని రాసిన రచయిత ఎవరు?

## IV. ఇంటిపని

- పిల్లలూ! 9వ పేజీలోని చిత్రం ఆధారంగా మీరేం గమనించారో పదాలు రాయండి.
- ఈ చిత్రం ఆధారంగా ఒక పేరా రాయండి. (స్వీయరచన)
- 'కవి పరిచయం' లోని వివరాలు చదుకునిరండి.

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 2వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం! బాగున్నారా!

**2. పునశ్చరణ :**

నిన్న మనం 2వ పాఠం 'అతిథి మర్యాద' పాఠం మొదలు పెట్టుకున్నాం కదా! మీకు నేను ఇంటిపనిగా ఇచ్చిన అంశాలు రాసుకొని వచ్చారా!

- కవి యొక్క వివరాలు చదువుకుని వచ్చారా!

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. పిల్లల బాహ్య పఠనం :–**

పిల్లలూ! మీరు వ్యక్తిగతంగా పాఠం చదవండి. తప్పులు లేకుండా మీలో ఎవరు చదువుతారో రండి.

***(పిల్లలు చదివేటప్పుడు దోషాలను సవరించాలి.)***

**2. ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం :–**

పిల్లలూ! ఇప్పుడు నేను పాఠం చదువుతాను. జాగ్రత్తగా గమనించండి.

***(పుస్తకంలోని 10వ పేజిని స్పష్టోచ్చారణతో, భావస్ఫోరకంగా చదవాలి.)***

**3. పిల్లల మౌనపఠనం :–**

పిల్లలూ! నేను పాఠం ఎలా చదివానో విన్నారు కదా! ఇప్పుడు మీరు పాఠాన్ని మౌనంగా చదవండి.

**4. అర్థసంగ్రహణం :–**

పిల్లలూ! పాఠంలో మీకు తెలువని పదాలు ఏమి ఉన్నాయి? వాటి కింద గీత గీయండి.

- వెరీగుడ్. మీకు తెలువని పదాలను పుస్తకం చివరన ఉన్న 158 నుండి 164 వరకు ఉన్న పేజీల్లో వెతకండి. అర్థాలు తెలుసుకోండి.
- పిల్లలూ! మీకు ఇంకా తెలువని పదాలు ఏమున్నాయి?

***(పిల్లలు చెప్పే పదాలను నల్లబల్లపై రాయాలి.)***

ఉదా: పుణ్యకాలం, మనసువికలం, ప్రాయశ్చిత్తం మొ॥నవి.

- పిల్లలూ! నేను ఇప్పుడు పై పదాలకు వాక్యాలు చెపుతాను. మీరు పదాలకు అర్థాలు ఏమిటో చెప్పాలి.

***(నల్లబల్లపై రాసిన పదాలతో వాక్యాలు చెప్పాలి. పిల్లలు వాక్యాల ద్వారా అర్థం గ్రహించేలా చూడాలి. ఆ పదాల అర్థాలను నల్లబల్లపై రాయాలి. పిల్లలను నోటుబుక్కులో రాయమనాలి.)***

ఉదా: పరీక్షలో ఆలోచిస్తూ కూర్చునేసరికి 'పుణ్యకాలం' కాస్త అయిపోయింది.

పుణ్యకాలం = మంచి సమయము (ఇచ్చిన సమయము)

- **పాఠ్యాంశ వివరణ – చర్చ** : పాఠం చిత్రం చూడండి. మాట్లాడండి చిత్రంలో ఏమేమి ఉన్నాయి? వారేం చేస్తున్నారు?
    - అతిథి మర్యాద అంటే ఏమిటి?
    - అతిథులు అని ఎవరిని అంటారు?
    - మొదటి చిత్రంలో ధర్మరాజు ఏం చేస్తున్నాడు?
    - ధర్మరాజు ఎవరితో మాట్లాడుతున్నాడు?

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! ఈ రోజు పాఠంలోని తెలువని పదాలకు అర్థాలు తెలుసుకున్నారు కదా! నేనడిగే పదాలకు అర్థాలు చెప్పి వాటితో సొంత వాక్యాలు చెప్పండి.

ఆత్మీయులు, నిర్విరామం, సంతృప్తి, ఆశ్చర్యం

## IV. ఇంటిపని

1. **పదజాలం :–** కింది పదాలకు అర్థాలు రాసి, సొంతవాక్యాలు కూడా రాయండి.

అ) యోగ్యులు

ఆ) సంగ్రామం

ఇ) అభినందించు

ఈ) తెల్లబోవడం

2. **ధారాళంగా చదవడం – అర్థం చేసుకోవడం :–** పేజి నెం. 12లోని కవిపరిచయం చదవండి. దాని ఆధారంగా ఈ కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) ఉషశ్రీ పూర్తి పేరేమిటి?

ఆ) ఉషశ్రీ ఎప్పుడు, ఎక్కడ జన్మించారు?

ఇ) వీరి రచనలు ఏవి?

3. **స్వీయరచన :–**

అ) పాఠ్యాంశ చిత్రం ఆధారంగా ఒక పేరా రాయండి.

ఆ) అశ్వమేధ యాగం అంటే ఏమిటి? ఇప్పటి సమాజంలో ఇటువంటి యాగాలు చేస్తున్నారా?

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 3వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం! అందరూ వచ్చారా!

**2. పునశ్చరణ :**

నిన్న మనం పాఠంలోని కొంత భాగాన్ని చెప్పుకున్నాం కదా! దాంట్లోని ముఖ్యమైన పదాలేవో చెప్పండి.

***(పిల్లలు చెప్పే పదాలను నల్లబల్లపై రాయాలి.)***

- పిల్లలూ! ఈ పదాల గురించి మీరేం తెల్సుకున్నారు?

  ఉదా: ప్రాయశ్చిత్తం, యోగ్యులు, పుణ్యకాలం

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

**1. పిల్లల బాహ్య పఠనం :-**

పిల్లలూ! పేజినెం. 11 చదవండి.

***(నలుగురైదుగురు విద్యార్థులతో చదివించాలి. చదివేటప్పుడు దోషాలు సవరించాలి.)***

**2. ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం :-**

పిల్లలూ! నేను పాఠం చదువుతాను. జాగ్రత్తగా గమనించండి.

***(భావస్ఫోరకంగా, స్పష్టోచ్ఛారణతో చదవాలి.)***

**3. పాఠ్యాంశ వివరణ - చర్చ :-**

- ధర్మబుద్ధి అంటే ఏమిటి?
- సర్వభూతకోటిని దయతో చూడటం అంటే ఏమిటి?
- ఎముకలు బయట పడుతున్నాయి. డొక్కలు మాడి ఉన్నాయి. అంటే ఏవిధంగా ఉండడమో చెప్పండి.
- ఒడి గట్టడం అంటే అర్థం ఏమిటి?

***(ఇలా కీలక పదాలు / వాక్యాలపై చర్చ ద్వారా విషయాన్ని పిల్లలకు అవగాహన కల్పించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈరోజు పాఠం ద్వారా మీరేమి తెల్సుకున్నారు?
- మహనీయుడు అని ఎవరిని అంటారు?
- గృహ యజమాని తన భాగాన్ని అతిథికి ఏమని చెప్తూ వడ్డించాడు?

## IV. ఇంటిపని

**1. పదజాలం :-**

కింది పదాలకు అర్థాలు రాసి, వాటితో సొంతవాక్యాలు కూడా రాయండి.

అ) ఆతురత

ఆ) ధర్మబుద్ధి

ఇ) స్వీకరించడం

**2. ధారాళంగా చదవడం – అవగాహనచేసుకోవడం :-**

పాఠం చదవండి ఈ కింది వాక్యాలు పాఠంలో ఇక్కడ ఉన్నాయో గుర్తించి గీతగీయండి.

అ) "ఎవరా మహనీయుడు! ఏమిటాయన కథ?"

ఆ) "సావధానంగా వినండి".

ఇ) దొరికినదాన్ని తిని తృప్తిగా గడుపుతున్నారు.

ఈ) "ఆకలి, ఆకలి" అని నీరసంగా అడిగాడు.

**3. స్వీయరచన :-**

కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) అతిథులు అంటే ఎవరు? అతిథి మర్యాద అంటే ఏమిటి?

ఆ) జీవితం పరమేశ్వరధ్యానానికే అర్పించడం అంటే ఏమిటి?

ఇ) సక్తుప్రస్థుడు అతిథికి చేసిన మర్యాద సరైనదేనా? ఎందుకు?

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 4వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! కులాసాగా ఉన్నారా? పాఠం కొంత విన్నారు కదా! ఎలా ఉంది? బాగుందా?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న ఇచ్చిన ఇంటి పనిని పూర్తి చేసారా? చదవండి.

*(నలుగురైదుగురు పిల్లలతో వారు రాసుకుని వచ్చినవి చదివించాలి. అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి.)*

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

**1. పిల్లల బాహ్య పఠనం :-**

పిల్లలూ! మీలో తప్పులేకుండా, గొణగకుండా చదివేవారు వచ్చి పాఠం చదవండి.

*(నలుగురైదుగురు పిల్లలతో పోటీలాగా మిగిలిన మొత్తం పాఠం చదివించాలి. బాగా చదివిన వారిని ప్రశంసించాలి.)*

**2. ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం :-**

పిల్లలూ! ఇప్పుడు నేను పాఠం చదువుతాను. జాగ్రత్తగా చూడండి.

*(స్పష్టోచ్చారణతో అవసరమైన హెచ్చుతగ్గులతో కూడిన కంఠస్వరంతో పాఠాన్ని చదవాలి.)*

**3. పిల్లల మౌన పఠనం :-**

పిల్లలూ! ఇప్పుడు పాఠాన్ని మీరు మౌనంగా చదవండి.

**4. పాఠ్యాంశ వివరణ - చర్చ :-**

- పిల్లలూ! పాఠాన్ని చదివారు కదా! వచ్చిన అతిథికి ఎవరెవరు తమ వంతు భాగాన్ని ఇచ్చారు?
- అన్ని దానాలలోకి ఏ దానము గొప్పది?
- యజమాని భార్యాపిల్లలు ఏది ఎక్కివెళ్ళారు?
- ముంగిస సగభాగం శరీరం ఎందుకు బంగారుమయమైంది?

*(ఇలా చర్చ ద్వారా పిల్లకు పాఠ్యాంశ విషయం పట్ల అవగాహన కల్పించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- మీకు దివ్యలోకాలు లభిస్తాయి. అని ఎవరు ఎవరితో అన్నారు.
- దయగల గుండెగలవారు దేనికి దూరమవుతారు?
- ముంగిస దేహంలోని రెండవ భాగం ఎందుకు బంగారుమయం కాలేదు.

## IV. ఇంటిపని

పిల్లలూ! 16వ పేజీలో బాక్సులో ఉన్నటువంటివి మీకు తెలుసా!! లో అక్షౌహిణి అంటే, అశ్వమేథయాగం అంటే? అని ఉందికదా అవి చదువుకుని రండి.

**ప్రశంస – ప్రాజెక్టు పనులు :-**

అ) 'అతిథిమర్యాద' లకు సంబంధించిన కథలు ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషల్లో కూడా ఉంటాయి. వాటిని గురించి తెల్సుకొని చెప్పండి.

ఆ) మర్యాద చేయడం / ఆతిథ్యం ఇవ్వడం ఒక్కో ప్రాంతంలో, ఒక్కో కుటుంబంలో, ఒక్కో రకంగా ఉంటుంది. వీటిని గురించి మీ మిత్రులతో మాట్లాడండి. వివరాలు సేకరించండి. ప్రదర్శించండి.

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 5వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం! బాగున్నారా! పాఠం మొత్తం విన్నారు కదా! ఎలా ఉంది? అందరికీ నచ్చిందా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న ఇచ్చిన ఇంటిపనిని పూర్తి చేసుకుని వచ్చారా. అక్షౌహిణి అంటే ఎంతో అశ్వమేథ యాగం అంటే ఏమిటో తెలుసుకుని వచ్చారా. చెప్పండి.

*(నలుగురైదుగురు పిల్లలతో చెప్పించాలి. ప్రాజెక్టుపని గురించి తెలుసుకున్నారా?)*

## II. సామర్థ్యాల సాధన – అవగాహన

- పిల్లలూ! నిన్నటి వరకు పాఠంలోని విషయం గురించి తెల్సుకున్నారు కదా! ఈరోజు 'ఇవి చేయండి' లోని అభ్యాసాల గురించి చర్చిద్దాం.
- పిల్లలూ! 13వ పేజీలోని వినడం, మాట్లాడడంలోని ప్రశ్నలు చదవండి.

*(పిల్లలు చదివిన ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి.)*

✦ **మేధోమథనం :**

'అతిథి మర్యాద' అంటే ఏమిటి? అతిథిమర్యాద గురించి మీకేమి తెలుసో చెప్పండి.

*(పిల్లలందరితో మాట్లాడించాలి. ఒక్కొక్కరు ఒక్కో వాక్యం ఒక అంశం చెప్పేలా ప్రోత్సహించాలి. వాటిని నల్లబల్లపై రాయాలి.)*

✦ **జట్టు చర్చ :**

ఆకలితో అలమటించే ప్రాణికి ఇంత అన్నం పెట్టడంకంటే ఏదానమూ గొప్పది కాదు. దీనిపై చర్చించండి.

*(పిల్లలందరూ చర్చలో పాల్గొనేలా చూడాలి.*

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! ఈరోజు జరిగిన చర్చలో మీరేం తెల్సుకున్నారో చెప్పండి.

## IV. ఇంటిపని

ఇంటికి వచ్చిన వారికి మర్యాద చేయడమనేది మన సంప్రదాయం కదా! ఇంటికివచ్చిన అతిథికి ఇంకా ఏయే విధాలుగా మర్యాదలు చేయవచ్చో రాయండి.

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 6వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న ఇంటిపనిగా ఇంటికి వచ్చిన అతిథికి ఏయే విధాలుగా మర్యాదలు చేయవచ్చో రాయమన్నాను కదా! రాసారా చదివి వినిపించండి.

***(నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి. దోషాలు సవరించాలి.)***

## I. సామర్థ్యాల సాధన – అవగాహన

పిల్లలూ! చదవడం అభ్యాసంలో ఉన్న వాక్యాలను పాఠంలో ఎక్కడ ఉన్నాయో వెతికి వాటి కింద గీతగీయండి.

- పిల్లలూ! 13వ పేజీలోని చదవడం – అవగాహన చేసుకోవడంలోని పేరాను చదవండి. దాని కింద ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

  ***(ఒక్కొక్క ప్రశ్నను పిల్లలను అడుగుతూ జవాబులు చెప్పించాలి.)***

- ఇలాగే పిల్లలూ! పాఠం ఆధారంగా ఉన్న ప్రశ్నలకు కూడా జవాబులు చెప్పండి.

  ***(పిల్లలచే పాఠం చదివించి, ఒక్కొక్క ప్రశ్నకు జవాబు చెప్పించాలి.)***

✦ **జట్టుపని :**

పిల్లలూ! ఇప్పుడు మీరంతా జట్లుగా కూర్చోండి. పాఠం చదవండి. మీ జట్లలో చర్చించి పాఠం ఆధారంగా ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

✦ **జట్టు ప్రదర్శన :**

పిల్లలూ! ఇప్పుడు మొదటి ప్రశ్నకు ఏ జట్టు సమాధానం చెప్తారో చెప్పండి.

***(ఇలా అన్ని జట్లతో ఒక్కో ప్రశ్నకు ఒక్కో జట్టుతో సమాధానం చెప్పించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! పాఠం వల్ల మీరు ఏం గ్రహించగలిగారు.

- ధర్మరాజు మనసు ఎందుకు వికలమైంది?
- ముంగిస దేహం పూర్తిగా బంగారుమయం అయిందా? కాలేదా?

## IV. ఇంటిపని

- సక్తుప్రస్థుడు ఏ విధంగా జీవితం గడిపేవాడు.
- ధర్మరాజును ఎవరు అభినందించారు? ఎందుకు?
- ధర్మరాజు ఎలాంటి దానధర్మాలు చేసాడు?

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 7వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభదినం. ఎలా ఉన్నారు - అందరూ చాలా సంతోషంగా ఉన్నారే!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! మన సామర్థ్యాల సాధన అభ్యాసాలు చేస్తున్నాం కదా! మరి నిన్న నేను ఇంటి పనిగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాసారా? చదవండి.

***(నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి.)***

- ప్రాజెక్టు పని చేస్తున్నారా!

## II. సామర్థ్యాల సాధన - అవగాహన

- పిల్లలూ! ఈ రోజు మనం వ్యాసరూప సమాధాన ప్రశ్నల గురించి చర్చిద్దాం.
- పేజీ నెం. 14లో పదివాక్యాల్లో సమాధానాలు రాసే ప్రశ్నలు ఉన్నాయి. వాటిని చదవండి.

***(పిల్లలు చదివిన ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి.)***

**మేధోమథనం :**

- పిల్లలూ! ఈ పాఠం సారాంశాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం చెప్పండి.

***(పిల్లలతో ఒక్కొక్కరితో ఒక్కొక్క వాక్యం చెప్పిస్తూ సారాంశాన్ని రాబట్టాలి.)***

***(ఇలా మిగతా ప్రశ్నలు కూడా అడగాలి.)***

**జట్టుపని :**

పిల్లలూ! జట్లుగా కూర్చోండి. ఇప్పుడు మీరు మనం చర్చించిన ప్రశ్నలకు మీ నోటు బుక్కుల్లో జవాబులు రాయండి.

**సరిదిద్దడం :**

- పిల్లలూ! విషయం సరిగా ఉందా?
- వాక్యాలు సరిగా ఉన్నాయా?
- మంచి పదాలు వాడారా. ఇంకే పదాలు వాడితే బాగుండేది.
- అక్షర దోషాలేమైనా ఉన్నాయా?

***(ఇలా అన్ని ప్రశ్నల గురించి చర్చ ద్వారా అవగాహన కల్పిస్తూ సరిదిద్దాలి.)***

### III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! వ్యాసరూప సమాధాన ప్రశ్నలు రాసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.
- మీరు రాసిన ప్రశ్నల్లో ఏది కఠినమన్పించింది?

### IV. ఇంటిపని

**స్వీయరచన :-**

పిల్లలూ! కింది ప్రశ్నలకు మీరు సొంతమాటల్లో జవాబులు రాయండి.

1. పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.
2. ఈ పాఠంపై మీ అభిప్రాయాల్ని సొంతమాటల్లో రాయండి.

- పిల్లలూ! మీకు ఇంతకు ముందే ప్రశంస ప్రాజెక్టు పనులను ఇచ్చాను కదా! అవి పూర్తి చేయండి. రేపు క్లాసులో ప్రదర్శించవలసి ఉంటుంది.

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 8వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! మీరంతా చాలా చక్కగా చదువుకుంటున్నారు. అభ్యాసాలు కూడా చాలా బాగా చేస్తున్నారు.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న ఇంటి పనిగా ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాసారా? చదివి విన్పించండి.

*(ఇద్దరు ముగ్గురు పిల్లలతో చదివించాలి. దోషాలుంటే సూచనలు ఇవ్వాలి.)*

## II. సామర్థ్యాల సాధన – అవగాహన

- పిల్లలూ! ఇప్పటి వరకు మీరు 'ఇవి చేయండి' లో ఏయే అభ్యాసాల గురించి తెల్సుకున్నారు?
- మరి ఈరోజు 'పదజాలం' అనే అభ్యాసం గురించి తెల్సుకుందామా?
- పిల్లలూ! పేజి నెం. 14లో 'పదజాలం' అభ్యాసం 1వ బిట్ చదవండి. వాక్యాలకు తగిన పదాలు రాయండి.

  ఉదా: ఇతరులకు ఉచితంగా అన్నం పెడితే అది <u>అన్నదానం</u>.
- ఇలానే మిగిలిన వాక్యాలకు కూడా రాయండి.

*(పిల్లలందరు మిగిలినవి కూడా ఇదే విధంగా రానేటట్లు చూడాలి.)*

- పిల్లలూ! ఇప్పుడు 2వ బిట్ చూడండి. అక్కడున్న పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.
- అట్లే తరువాతి బిట్‌లోని పదాలకు వ్యతిరేక పదాలు పాఠంలో గుర్తించండి. ఆ పదాలతో వాక్యాలు రాయండి.

*(పిల్లలందరూ రాసేలా చూడాలి.)*

- పిల్లలూ! మీరు ప్రాజెక్టు పని పూర్తి చేసారా అట్లే ప్రశంసకు సంబంధించిన అతిథి మర్యాదకు సంబంధించిన కథలు – ఇతర భాషల్లోనివి తెలుసుకుని రాసారా.
- మొదట ప్రాజెక్టుపనికి సంబంధించిన వివరాలు ఏమేం రాసారో చర్చిద్దాం. మర్యాద చేయడం ఒక్కో ప్రాంతంలో ఒక్కో కుటుంబంలో ఒక్కో రకంగా ఉంటుంది కదా! ఏం రాసారో చెప్పండి.

*(నలుగురైదుగురు విద్యార్థులతో చదివించాలి.)*

**ప్రాజెక్టుపనిని సరిదిద్దడం :**

ఎవరైనా ఒకరు రాసిన దానిని చర్చిద్దాం!

- దీంట్లో ఏయే అంశాలున్నాయి?
- ఇంకా ఏయే విషయాలు చేరిస్తే బాగుంటుంది.

- వాక్య నిర్మాణం సరిగా ఉందా?
- పదాలు సరిగా ఉన్నాయా? ఇంకా ఏవైనా మంచి పదాలు వాడవచ్చా?
- అక్షర దోషాలేమైనా ఉన్నాయా?

*(ఇలా చర్చ ద్వారా ప్రాజెక్టుపనిని సరిదిద్దాలి.)*

**ప్రశంస :**

పిల్లలూ! ప్రశంసలోని అతిథి మర్యాదకు సంబంధించి ఇతర భాసలలోని కథలు, సంభాషణలు తెలుసుకుని వచ్చారా చదవండి.

*(ఇద్దరు ముగ్గురు పిల్లలతో చదివించాలి. దోషాలు సరిదిద్దాలి.)*

**జట్టుపని :**

పిల్లలూ! ఇప్పుడు మీరందరూ జట్లలో కూర్చొని, మీ జట్టులోనివారు రాసిన ప్రాజెక్టుపనిని, ప్రశంసా పనిని అందరూ కల్సి చర్చించండి.

**జట్టుపని ప్రదర్శన :**

మీరు రాసిన వాటిని ప్రదర్శించండి.

వెరీగుడ్! పిల్లలూ! బాగారాసారు.

**మేథోమథనం :**

పిల్లలూ! 'నిర్విరామం' అంటే ఏమిటి? అట్లే ధర్మబుద్ధి అంటే ఏమిటి?

*(ఇలా పిల్లలచే చెప్పించాలి. పిల్లలు చెప్పిన అర్థాలను నల్లబల్లపై రాయాలి.)*

**జట్టుపని :**

పిల్లలూ! మీరంతా జట్టలాగా ఏర్పడ్డారు కదా! మనం పైన చెప్పుకున్న పదజాలంలోని అభ్యాసాలను మీరంతా చర్చిస్తూ మీ నోట్సులో రాయండి.

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! మీరు జట్లలో చర్చిస్తూ రాసిన వాటిని చదవండి.

*(ఇలా అన్ని జట్ల పిల్లలతో చెప్పించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! పుణ్యకాలం అంటే ఏమిటి?
- మనసు వికలం కావడమంటే ఏమిటో చెప్పండి.

## IV. ఇంటిపని

పిల్లలూ! పాఠం చదువుకుని రండి. కథను సొంతమాటలలో రాసుకుని రండి.

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 9వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం! బాగున్నారా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న పాఠం చదువుకుని రమ్మన్నాను కదా! చదువుకుని వచ్చారా! కథను సొంతమాటల్లో రాసుకుని వచ్చారా? చదవండి.

*(నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి. దోషాలు సరిచేయాలి.)*

## II. సామర్థ్యాల సాధన – అవగాహన

♦ పిల్లలూ! ఈ రోజు మనం 'సృజనాత్మకత అనే అభ్యాసం గురించి చర్చించుకుందామా.

**సృజనాత్మకత – అభ్యాసం :**

♦ పిల్లలూ! మీరంతా పాఠం చక్కగా విన్నారు కదా! మరి ఇప్పుడు 'అతిథి దేవోభవ' అనే శీర్షికతో చిన్న కథ రాయండి.

♦ పిల్లలూ! ఇప్పుడు మీరంతా జట్లుగా ఏర్పడండి.

**జట్టుపని :**

పిల్లలూ! అన్ని జట్లవారు కథను రాసారా. వాక్య నిర్మాణం సరిగా ఉందా. సరైన పదాలు వాడారా. వాక్య నిర్మాణం సరిగా ఉందా. సరైన పదాలు వాడారా. ఇందులో జట్టువారు బాగా రాసారు. వచ్చి చదవండి.

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! మీరు రాసిన కథను బాగా రాసిన జట్టువారు వచ్చి చదవండి.

*(అన్ని జట్లతో చదివించాలి. దోషాలు సరిచేయాలి.)*

♦ పిల్లలూ! అట్లాగే 'అతిథి మర్యాద' కథను సంభాషణ రూపంలో రాయండి.

*(అన్ని జట్ల పిల్లలు రాసేటట్లు చూడాలి. ఇదే విధంగా పిల్లలతో పాఠాన్ని నాటకీకరణ చేయించాలి.)*

♦ పిల్లలూ! ఈ పాఠాన్ని ఎవరు బాగా నాటకీకరణ చేస్తారో రండి.

*(పాఠంలోని వారి లాగా సంభాషిస్తూ పిల్లలు నాటకీకరణ చేసేలా చూడాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! మీరు ఈ సృజనాత్మకథ అభ్యాసం ద్వారా ఏం తెలుసుకున్నారో చెప్పండి.
- కథను రాసేటప్పుడు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా?
- నాటకీకరణ చేస్తున్నప్పుడు మీకు ఎట్లా అనిపించింది?

## IV. ఇంటిపని

- పిల్లలూ! ఈ రోజు మీరు చర్చించిన కథను రాసుకొని రండి.
- 'సంభాషణలు' వ్యక్తిగతంగా రాసుకొని రండి.

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 10వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! తీరిక సమయాల్లో మీరేం చేస్తారు. కథలు చదవడమంటే మీకిష్టమేనా?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న ఇంటిపనిగా ఇచ్చిన కథను అందరూ రాసుకొని వచ్చారా? వచ్చి చదవండి.

*(ఇద్దరు ముగ్గురు పిల్లలతో చదివించాలి. దోషాలు సరిచేయాలి.)*

## II. సామర్థ్యాల సాధన - అవగాహన

- పిల్లలూ! నిన్నటి వరకు చేసిన అభ్యాసాలు చాలా బాగా చేసారు.
- వెరీగుడ్. ఇదే విధంగా మిగిలినవి కూడా చేయాలి.
- ఈ రోజు మనం భాషను గురించి తెలుసుకుందాం. అభ్యాసం చేద్దాం.

**భాషను గురించి తెల్సుకుందాం :**

- పిల్లలూ! పాఠం చదవండి. పాఠంలో సంధిపదాలు ఏమేమి ఉన్నాయో వెతకండి. అంటే రెండు పదాలు కల్సి ఒకే పదంగా ఉన్న వాటిని చూడండి.

*(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)*

సెలవిచ్చి, రానిదని, జీవగడ్డయి

- ఈ పదాలను విడదీయండి.

కవితలల్లిన, భాగ్యసీమయి

ఉదా: ఇచ్చితిరిప్పుడు - వచ్చితిరి + ఇప్పుడు - ఇత్వసంధి

- పిల్లలూ! పై పదాలను విడదీసి చెప్పండి.
- వెరీగుడ్! ఇవి ఏ సంధులో చెప్పండి.

*(సూత్రాలను చర్చద్వారా అవగాహన కల్పించాలి.)*

- పిల్లలూ! ఇప్పుడు ఈ కింది పదాలను కలిపి అవి ఏ సంధులో చెప్పండి.
- వెరీగుడ్, బాగా చెప్పారు.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ రోజు మనం ఏయే సంధుల గురించి తెల్సుకున్నాం?
- పదాలు విడదీయడం, కలపడం, ఎలాగో తెల్సిందా?

## IV. ఇంటిపని

- పిల్లలూ! మీ పాఠ్యపుస్తకంలలోని 15, 16 పేజీలలో ఉన్న సంధి పదాలు కలపడం, విడదీయడం, సంధి పేర్లు రాయడం. అభ్యాసాలను రాసుకుని రండి.

# 2. అతిథి మర్యాద

| 7వ తరగతి | 11వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! ఎలా ఉన్నారు? బాగున్నారా! ఏం చేస్తున్నారు?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీకు భాష గురించి తెలుసుకుందాం అభ్యాసంలోని సంధి పదాలు కలుపుట, విడదీయుట రాసుకురమ్మని ఇంటిపనిగా ఇచ్చానుకదా! రాసుకుని వచ్చారా? చదివి విన్పించండి.

***(పిల్లలు రాసినవి చదివించాలి.)***

## II. సామర్థ్యాల సాధన – అవగాహన

- పిల్లలూ! ఈ పాఠంలోని అన్ని అభ్యాసాల గురించి సాధన చేసాం కదా! ఇప్పుడు చివరిది 'నేనివి చేయగలనా?' అభ్యాసం మిగిలింది. అది కూడా చేద్దామా!
- 16వ పేజీలో కింది బాక్సులో నేనివి చేయగలనా? ప్రశ్నలున్నాయి కదా! అవి చదవండి.
- ఇవి ఎవరికి సంబంధించినవి? దీన్ని బట్టి మేకేం తెలిసింది.
- 'నేనివి చేయగలనా?' లోనివి మీరు చేయగలరా? లేదా? అవి మీకు మీరే తెల్సుకోవాల్సినవి. అంటే ఈ పాఠ్యపుస్తకం పూర్తయ్యేసరికి మీరు ఇవి చేయగలరా? లేదా? చెప్పండి.

**పరిశీలన :** మొదటి వాక్యం చదవండి. "అతిథి మర్యాద కథను సొంతమాటల్లో చెప్పగలను". దీని గురించి మీలో ఎవరెవరు మాట్లాడగలరో చేతులెత్తండి. చేతులెత్తిన వారు 'ఔను' వద్ద '✓' పెట్టండి.

***(చేతులెత్తిన వారిని లెక్కించాలి)***

- అట్లాగే రెండవ వాక్యం చదవండి. మీరు చేయగల్గితే ఔను వద్ద లేకుండే కాదు వద్ద '✓' పెట్టండి. ఇప్పుడు చేయగల్గినవారు చేతులెత్తండి.

***(ఎంతమంది చేతులెత్తారో లెక్కించండి.)***

ఇలా నేనివి చేయగలనా? లోని అన్ని వాక్యాలు చదువుతూ, చేతులెతినవారిని. లెక్కించాలి.

***(ఇలా అన్నింటిని అడిగి 80% మంది చేయగలరో లేదో గుర్తించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! మీలో ఏ అంశాన్ని ఎక్కువమంది చేయలేకపోయారు?

***(ఇలా అడిగి 80% కంటె తక్కువ మంది చేయలేని దానిపై పునరావగాహన కల్పించాలి.)***

## IV. ఇంటిపని

పిల్లలూ! మీరు చేయలేని అంశంపై దాన్ని మీరు ఇంటివద్ద అభ్యాసం చేసి రాసుకుని రండి.

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 1వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం! ఎలా ఉన్నారు? అందరూ బాగున్నారా! వేసవి సెలవుల్ని బాగా గడిపారా!

**2. ఉన్ముఖీకరణ :**

**చిత్రం గురించి మాట్లాడించడం:-**

పిల్లలూ! మీ పాఠ్య పుస్తకంలో 1వ పేజీలో ఉన్న చిత్రం చూడండి. నేనడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

- పై చిత్రంలో ఎవరెవరున్నారు? వాళ్ళందరూ ఏం చేస్తున్నారు?
- జెండాకు వందనం ఎప్పుడెప్పుడుచేస్తారు? ఎందుకు చేస్తారు?
- మన జెండాలో ఎన్ని రంగులున్నాయి? అవి ఏవి?

పిల్లలూ! చాలా బాగా చెప్పారు. మీకు అభినందనలు.

**సంభాషణలు చెప్పించడం:-**

పిల్లలూ! ఈ జెండా పండుగ గురించి మరికొన్ని విషయాలు ఒకరు ప్రశ్నలడగడం, మరొకరు సమాధానాలు చెప్పడం ద్వారా అభినయించి చెప్పండి.

***(పిల్లలందరితో మాట్లాడించాలి.)***

**3. శీర్షికా ప్రకటన :**

- పిల్లలూ! జెండా ఎక్కడ ఎగురుతూంది?
- పిల్లలందరూ అక్కడ నిలబడి ఏం చేస్తున్నారు?
- ఆరోజు యొక్క ప్రత్యేకత ఏమిటి?

పిల్లలూ! దేశప్రజలందరూ కలసి జరుపుకే పండుగలను జాతీయ పండుగలు అంటారు. ఆరోజు ప్రతి చోటా జాతీయ జెండాను ఎగురవేసి ప్రజలంతా వారి దేశభక్తిని చాటుకుంటారు. మనం ఈ రోజు చెప్పుకోబోయే పాఠం పేరు **“ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా!”**

*(పాఠం పేరు నల్లబల్లపై రాయాలి.)*

**4. నేపథ్యం :**

కొన్ని వందలయేండ్లు విదేశీయుల పాలనలోపడిన భారతదేశానికి 1947 సంవత్సరంలో స్వాతంత్ర్యం లభించింది. దేశంలో అందరూ స్వేచ్ఛా వాయువులను పీల్చుకొన్నారు. ఆ ఆనంద క్షణాలలో కవులు, రచయితలు పుంఖాను పుంఖాలుగా గేయాలు, కథలు, కావ్యాలు రచించారు.

దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిగారు ఆ సందర్భంలో ఈ గేయం రచించారు. మన జెండా ఎందరో వీరులు తమ నెత్తురు ధారపోసి సంపాదించిన స్వాతంత్ర్యానికి గుర్తు అనీ అంతటా పేదరికం తొలగిపోవాలనీ మొట్టి పట్టుతో దౌర్జన్యం చేసి మాట నెగ్గించుకొనేవాళ్ళకు అధికారం రాగూడదనీ అందరికీ సమానావకాశాలుండే విధంగా కొత్తపాలన జరగాలనీ కవి ఆశించాడు.

ప్రస్తుత పాఠ్యాభాగం "కృష్ణశాస్త్రి గేయసంపుటి" లోనిది.

**5. లక్ష్యాలు :**

పిల్లలూ! ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు

- గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగల్గుతారు.
- పాఠాన్ని సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగల్గుతారు.
- గేయం సారాంశాన్ని సొంతమాటల్లో రాయగల్గుతారు.
- ఇందులోని పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించగల్గుతారు.
- పాఠంలోని పదాలతో కొత్త గేయాన్ని రాయగల్గుతారు.
- దేశభక్తిని పెంపొందించుకోగల్గుతారు.

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

పిల్లలూ! సర్వసమానత్వం ఏర్పడి శాంతిని, నవీనకాంతిని భారతదేశం నిండా ప్రసరింపజేసేవిధంగా జెండాను ఎగురవెయ్యాలి. ఆకాశం నిండా వ్యాపింపజేయాలి. అని కవి చెప్పాడు కదా! మరి ఇప్పుడు ఈ గేయాన్ని పాడుకుందామా!

**1. ఉపాధ్యాయుడు గేయాన్ని పాడి వినిపించడం :**

ఉపాధ్యాయుడు గేయాన్ని రాగ, భావయుక్తంగా పాడాలి. పిల్లలు వింటారు.

**2. పిల్లలతో పాడించడం :**

రెండోసారి ఉపాధ్యాయుడు పాడుతూ పిల్లలతో పాడించడం.

**3. పిల్లలు, ఉపాధ్యాయుడు కల్సి పాడడం :**

పిల్లలూ! ఇప్పుడు ఈ గేయాన్ని అందరం కల్సి పాడుదామా?

***(ఇప్పుడు ఉపాధ్యాయుడు, పిల్లలు ఒకేసారి కల్సి పాడాలి.)***

- **కవిపరిచయం :** పిల్లలూ! ఈ పాఠాన్ని రాసింది దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి కదా! ఆయన వివరాలు, 3వ పేజీలో ఉన్నాయి చదవండి, చెప్పండి.
- **(మైండ్ మ్యాపింగ్) మేథోమథనం :** జెండా వందనానికి సంబంధించిన పదాలను పిల్లలచే చెప్పించాలి.

  ***(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)***
- ఈ పదాల ఆధారంగా పాఠంలోని విషయాన్ని సంక్షిప్తంగా పిల్లలకు తెలపాలి.

## III. పిల్లల అవగాహన పరిశీలన

- జెండాను ఎప్పుడెప్పుడు ఎగురవేస్తారు?
- జెండా గొప్పతనం ఏమిటి?
- 'జెండావందనం' ఎందుకు జరుపుకుంటాం?
- ఈ పాఠాన్ని రాసిన రచయిత ఎవరు?

## IV. ఇంటిపని

- పిల్లలూ! పేజి నెం.1 లోని చిత్రం ఆధారంగా ఏమేం గమనించారో పదాలు రాయండి. (పదజాలం)
- ఈ చిత్రాల ఆధారంగా ఒక పేరా రాయండి. (స్వీయరచన)
- ఈ పాఠం రచించిన కవి యొక్క వివరాలు చదువుకునిరండి.

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 2వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా? ఈ రోజు ఏమేం నేర్చుకోవాలనుకొంటున్నారు?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! దేవులపల్లి కృష్ణశాస్త్రి గురించి చదువుకుని రమ్మన్నాను కదా! అందరూ చదువుకుని వచ్చారా!

- కృష్ణశాస్త్రి జన్మ స్థలం ఏది?
- ఈయన ఏయే రచనలు చేసాడు?
- ఈయన పొందిన బిరుదులేమిటి?

## II. పాఠ్యాంశ బోధన - చర్చ - అవగాహన

**1. పిల్లలచే గేయాన్ని పాడించడం :**

పిల్లలూ! నిన్న మనం గేయం పాడుకున్నాం కదా! ఇప్పుడు మీరు ఒకసారి గేయాన్ని చదవండి.

***(పిల్లలు పాడేటప్పుడు దోషాలు సవరించాలి.)***

**2. ఉపాధ్యాయుడు పాడడం :**

పిల్లలూ! ఇప్పుడు గేయాన్ని నేను పాడుతాను. పుస్తకంలో చూస్తూ జాగ్రత్తగా వినండి.

***(ఉపాధ్యాయుడు రాగ, హావ, భావాలతో గేయాన్ని చదవాలి.)***

**3. పిల్లలచే బాహ్య పఠనం :**

పిల్లలూ! గేయాన్ని నేను చదివానుకదా! ఇప్పుడు మీలో ఎత్తండీ! ఎత్తరేం! నుండి స్వాతంత్ర్యపు జెండా వరకు ఎవరు పాడుతారో రండి! పాడండి.

***(నలుగురైదుగురు పిల్లలతో బాహ్య పఠనం చేయించాలి. వారు చదువుతున్నప్పుడు స్పష్టోచ్చారణతో చదువుతున్నారా? లేదా చూడాలి. దోషాలుంటే సవరించాలి.)***

**4. పిల్లల మౌన పఠనం :**

పిల్లలూ! ఇప్పుడు గేయాన్ని మీరు మౌనంగా చదవండి.

**5. అర్థసంగ్రహణం :**

పిల్లలూ! గేయాన్ని చదివారు కదా! ఈ గేయంలో మీకు తెలువని పదాలు ఏమేమున్నాయి? వాటి కింద గీతలు గీయండి.

- వెరీగుడ్! మీకు తెలియని పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న 138, 139, 140, 141, 142 పేజీల్లో ఉన్న పదాలు–అర్థాలు పట్టికలో వెతకండి. అర్థాలు తెలుసుకోండి.
- పిల్లలూ! మీకు ఇంకా తెలియని పదాలు ఏమున్నాయి?

***(పిల్లలు చెప్పే పదాలను నల్లబల్లపై రాయాలి.)***

ఉదా : అహంకృతులు, అంధమతులు మొదలగునవి.

- పిల్లలూ! నేను ఇప్పుడు పై పదాలతో వాక్యాలు చెపుతాను. మీరు పదాలకు అర్థాలు ఏమిటో చెప్పాలి.

***(నల్లబల్లపై రాసిన పదాలతో వాక్యాలు చెప్పాలి. పిల్లలు పదాలకు అర్థాలు గ్రహించేలా చూడాలి. ఆ పదాలు, అర్థాలను నల్లబల్లపై రాయాలి. పిల్లలను నోటుబుక్కులో రాసుకోమనాలి.)***

ఉదా : రాము అధికారంతో అహంకృతుడైనాడు.

అహంకృతులు = పొగరెక్కినవాళ్ళు

**పాఠ్యాంశ వివరణ – చర్చ :**

- పిల్లలూ! పాఠ్యాంశ చిత్రం చూడండి. చిత్రంలో ఎవరెవరున్నారు? వారేంచేస్తున్నారు?
- స్వాతంత్ర్యం అంటే ఏమిటి?
- అంధమతులు అంటే ఎవరు?
- నిరంకుశులు అంటే అర్థం ఏమిటి?

***(మొదటి, రెండు గేయ పంక్తులను చర్చద్వారా అవగాహన పరచాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! ఈరోజు పాఠంలోని తెలియని పదాలకు అర్థాలు తెలుసుకొన్నారుకదా! నేనడిగే పదాలకు అర్థాలు చెప్పి వాటితో సొంతవాక్యాలు చెప్పండి.

నిరుపేదలు, నిరంకుశులు, అంధమతులు

## IV. ఇంటిపని

**1. పదజాలం :**

కింది పదాలకు అర్థాలు రాసి, సొంతవాక్యాలు రాయండి.

అ) వీరులు :

ఆ) అహంకృతులు :

ఇ) నిర్భాగ్యులు :

**2. పాఠం చిత్రం ఆధారంగా ఒక పేరా రాయండి.**

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 3వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా? గేయం బాగుందా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మనం గేయపాఠం ప్రారంభించుకున్నాం కదా! నిన్న చెప్పుకున్న గేయంలోని ముఖ్యమైన పదాలు ఏవో చెప్పండి.

***(పిల్లలు చెప్పిన పదాలు నల్లబల్లపై రాయాలి.)***

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. పిల్లల బాహ్య పఠనం :**

పిల్లలూ! పేజీనెం.2లోని గేయపంక్తులున్న 3వ పేరాను చదవండి.

***(నలుగురు లేక ఐదుగురు పిల్లలతో చదివించాలి. చదివేటప్పుడు దోషాలు సవరించాలి.)***

**2. ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం :**

పిల్లలూ! ఇప్పుడు నేను గేయం చదువుతాను. జాగ్రత్తగా వింటూ పుస్తకం చూడండి.

***(రాగ, హావ, భావాలతో ఉపాధ్యాయుడు గేయం చదవాలి.)***

**3. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

- కులందాటి, మతందాటి అంటే ఏమిటి?
- సమభోగం, సమభాగ్యం ఈ రెండు పదాలకు అర్థమేమిటి?
- దేన్ని ప్రసరింపజేయాలి.
- సమసంస్కృతి అంటే ఏమిటి? భారతదేశంలో ఎలాంటి సంస్కృతి ఉంది.

***(ఇలా కీలక పదాలు, వాక్యాలపై చర్చద్వారా విషయాన్ని పిల్లలకు అవగాహన కల్పించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! గేయం ద్వారా మీరేమి తెల్సుకున్నారు?
- 'సమభాగ్యం' అంటే ఏమిటి?
- నవీనకాంతి ప్రసరించేవిధంగా అనే భావం వచ్చే పంక్తులు గేయంలో ఎక్కడ ఉన్నాయి?

## IV. ఇంటిపని

**1. పదజాలం :**

కింది పదాలకు అర్థాలు రాసి, సొంతవాక్యాలు రాయండి.

అ) కొత్తవేడి :

ఆ) భరతావని :

ఇ) వీరులు :

**2. ధారాళంగా చదవడం, అవగాహన చేసుకోవడం :**

నిర్భాగ్యులు, నిరంకులు, నిరుపేదలు లేని అంధమతులు, లహంకృతులు, అర్థమత్తురాని పంక్తులలోని పదాలు తారుమారైనాయి. వాటిని పాఠం ఆధారంగా సరిచేసి రాయండి.

**3. స్వీయరచన :**

అ) కవి స్వాతంత్ర్యపు జెండాను ఏ విధంగా వ్యాపింపజేయాలనుకున్నాడు.

ఆ) కవి ఎలాంటి కొత్త ప్రపంచాన్ని చూడాలనుకున్నాడు?

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 4వ పీరియడ్ |
| --- | --- |
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! కులాసాగా ఉన్నారా? పాఠం విన్నారు కదా! ఎలా ఉంది? మీకేమనిపించింది.

**2. పునశ్చరణ :**

నిన్న మీకు ఇచ్చిన ఇంటిపని చేసుకుని వచ్చారా! చదవండి.

*(నలుగురు లేదా ఐదుగురు పిల్లలతో చదివించాలి. అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి.)*

## II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన

**1. పిల్లల బాహ్య పఠనం :**

పిల్లలూ! మీలో ఎవరు బాగా చదువుతారు? ఆగకుండా, రాగయుక్తంగా చదవాలి.

*(పోటీలాగా చదివించాలి. రాగయుక్తంగా చదివేలా చూడాలి. ఇలా పిల్లలందరితో గేయం మొత్తం చక్కగా చదివించాలి.)*

**2. ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం :**

పిల్లలూ! ఇప్పుడు నేను గేయాన్ని చదువుతాను. జాగ్రత్తగా వింటూ పుస్తకంలో చూడండి.

*(ఉపాధ్యాయుడు గేయాన్ని రాగ, హావ, భావాలతో స్పష్టోచ్చారణతో చదవాలి.)*

**3. పిల్లల మౌన పఠనం :**

- పిల్లలూ! ఇప్పుడు గేయాన్ని మౌనంగా చదవండి.
- రాగయుక్తంగా చదవడం అలవాటు చేసుకోండి.

**4. పాఠ్యాంశ వివరణ – చర్చ :**

- ఎత్తండోయ్! ఎత్తు ఎత్తు ఆకాశం నిండా అని అనడంలో కవి ఉద్దేశమేమిటి?
- కవి గేయంలో చెప్పిన దేశ పరిస్థితులను ఇప్పటి దేశ పరిస్థితులను పోల్చి చెప్పండి.

*(ఇలా చర్చద్వారా పిల్లలకు పాఠ్యాంశ విషయంపట్ల పూర్తి అవగాహన కల్పించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- గేయంలో చివరి 5 వరుసలు చదవండి. దాంట్లోని విషయాన్ని సొంతమాటల్లో చెప్పండి.
- కొత్తజగం, కొత్తయుగం తీసుకరావాలని కవి అన్న మాటలు గేయంలోని ఏపేరాలో ఉన్నాయి.

## IV. ఇంటిపని

**ప్రాజెక్టుపని :**

వార్తాపత్రికలు చూడండి. వాటిలో వచ్చే దేశనాయకుల చిత్రాలను, దేశభక్తి గేయాలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.

**ప్రశంస :**

గేయంలో మీకు నచ్చిన పదాలను, పంక్తులను గురించి రాయండి. అవి మీకు ఎందుకు నచ్చాయో తెలుపండి.

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 5వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం! బాగున్నారా!

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్నటి వరకు మనం గేయపాఠం గురించి తెల్సుకున్నాం కదా! గేయం అందరికీ వచ్చిందా! అందరూ చక్కగా పాడగల్గుతారా!

వెరీగుడ్! మరి ఇప్పుడు సామర్థ్యాల సాధన చేద్దామా!

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! ఈ రోజు మనం 'ఇవి చేయండి' లోని అభ్యాసాల గురించి చర్చిద్దాం.
- పిల్లలూ! 3వ పేజీలో వినడం - మాట్లాడడంలోని ప్రశ్నలు చదవండి.

*(పిల్లలు చదివిన ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి.)*

**మేధోమథనం :**

- ఈ గేయం దేన్ని గురించి చెబుతున్నది?
- ఆకాశం నిండా, స్వాతంత్ర్యపుజెండా! అనే శీర్షికను బట్టి నీవేమని భావిస్తున్నావు?

*(ఇలా అన్ని ప్రశ్నలను పిల్లలచే చదివించాలి. చదివిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.)*

- పిల్లలూ! దీంట్లో మొదటి ప్రశ్న ఏది?
- గేయం దేని గురించి చెబుతుంది అని ఉన్నది కదా! ఒక్కొక్కరు ఒక్కో వాక్యం చెప్పండి.

*(అందరు పిల్లలతో చెప్పించాలి.)*

- వెరీగుడ్! చాలా బాగా చెప్పారు. గేయం మన స్వాతంత్ర్యానికి గుర్తు అయిన జెండాను ఎగురవేయండి. సమాజంలో డబ్బుతో కళ్ళు మూసుకుపోయినవాళ్ళు, పొగరెక్కినవాళ్ళు, తెలివిలేనివాళ్ళు అధికారంపొందగూడదు. బీదవాళ్ళు, దురదృష్టవంతులు, నియంతలులేని కొత్త ప్రపంచం రావాలి. కుల, మతాలులేని ధనిక, పేద తేడాలేని అందరూ సర్వసమానులేనని సమాన సంస్కృతి శోభిల్లే నవీ కాంతితో నిండిన భారతదేశంలో మన స్వాతంత్ర్యపు జెండాను ఎగురవెయ్యాలి. ఆకాశమంతా వ్యాపించేలా ఎగురవేయాలి కదా!

*(ఇలా అన్ని ప్రశ్నలను అడగాలి. పూర్తి తరగతి కృత్యంగా ఒక్కొక్క వాక్యం చెప్పించాలి.*

**2. ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – అభ్యాసం :**

అ) ♦ పిల్లలూ! వినడం, మాట్లాడడంలోని ప్రశ్నల గురించి చర్చించుకున్నాం కదా! ఇప్పుడు రెండవ అభ్యాసం ధారాళంగా చదవడంలోని అభ్యాసాలు చేద్దాం.

♦ పిల్లలూ! గేయం చదవండి. గేయంలో ఎన్ని పంక్తులున్నాయి. ప్రతి పంక్తిలో ఉన్న చివరి పదం ఏదో రాయండి.

♦ వెరీగుడ్! ఏ పదమున్నదో చెప్పండి.

స్వాతంత్ర్యపు జెండా.

ఆ) పిల్లలూ! కింది వాక్యాలు గేయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటి కింద గీత గీయండి.

♦ స్వాతంత్ర్యపు జెండా ఎత్తండి.

♦ ఆకాశమంతా వ్యాపించేలాగ మనజెండా ఎత్తండి. చాలా బాగా చేసారు.

ఇ) గేయంలో ద్విత్వాక్షరపదలు, సంయుక్తాక్షరపదాలు ఏమున్నాయో రాయండి.

*(పిల్లలందరూ రాసేలా చూడాలి. పిల్లలు రాసిన వాటిని నల్లబల్లపై రాయాలి.)*

ఈ) పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

♦ కవి చెప్పిన కొత్త ప్రపంచం ఎలాంటిది?

♦ కులం దాటి, కొత్త భరతావని నిండా అనే వాక్యాలకు భావం ఏమిటి?

♦ కవి జెండా ఎలా ఎగరవేయమని కోరాడు?

*(పిల్లలందరితో సమాధానాలు చెప్పించాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! ఈరోజు మనం చేసిన అభ్యాసాల ద్వారా మీరేం తెలుసుకున్నారో చెప్పండి.

## IV. ఇంటిపని

పిల్లలూ! మన దేశం యొక్క గొప్పతనం ఏమిటో మీ మిత్రులతో చర్చించి రాసుకుని రండి.

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 6వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! శుభోదయం. ఏంచేస్తున్నారు?

**2. పునశ్చరణ :**

- పిల్లలూ! నిన్న ఇంటిపనిగా మనదేశ గొప్పతనం గురించి మీ మిత్రులతో చర్చించి రాసుకొని రమ్మన్నాను కదా! రాసుకొని వచ్చారా.
- వెరీగుడ్. ప్రాజెక్టుపనిని చేస్తున్నారా?

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! నిన్న వినడం - మాట్లాడడం, చదవడం అభ్యాసాల గురించి తెల్సుకున్నారు కదా! ఈ రోజు 'ఆలోచించి రాయడం'లోని ప్రశ్నల గురించె తెల్సుకుందామా.

**1. స్వీయరచన :**

పిల్లలూ! స్వీయరచనలో ఏయే ప్రశ్నలున్నాయో చదవండి.

***(పిల్లలు చదివిన ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి.)***

**మేధోమథనం :**

పిల్లలూ! పాఠం సారాంశాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం చెప్పండి.

***(సారాంశాన్ని పిల్లల నుండి రాబట్టాలి. ఇలా మిగతా ప్రశ్నలు కూడా అడగాలి.)***

**జట్టుపని :**

పిల్లలూ! మీరు ఇప్పుడు మనం చర్చించిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! మీరు జట్లలో రాసిన సమాధానాలు చదివి విన్పించండి.

**సరిదిద్దడం :**

ఏదైనా ఒక జట్టువారు రాసిన సమాధానాన్ని నల్లబల్లపై రాయాలి.

- పిల్లలూ! విషయం సరిగా రాసారా?
- వాక్యాలు సరిగా ఉన్నాయా?

- ఇంకా ఏయే పదాలు ఉంటే బాగుండేది.
- అక్షర దోషాలు ఏమైనా ఉన్నాయా?

*(ఇలా అన్ని ప్రశ్నల గురించి చర్చద్వారా అవగాహన కల్పిస్తూ సరిదిద్దాలి.)*

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! వ్యాసరూప సమాధానాలు రాసేటప్పుడు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి.
- మీరు రాసిన ప్రశ్నల్లో ఏది కఠినమనిపించింది? ఎందుకు?

## IV. ఇంటిపని

**స్వీయరచన :**

- పిల్లలూ! కింది ప్రశ్నలకు మీరు సొంతమాటల్లో జవాబులు రాయండి.

1. మన జెండా వీరుల నెత్తురుపంట అనడంలో కవి ఉద్దేశమేమిటి?
2. పాఠం సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
3. మీరు పాల్గొన్న పతాకావిష్కరణ కార్యక్రమాన్ని గురించి రెండు పేరాలు రాయండి.
4. ఈ పాఠంపై మీ అభిప్రాయాన్ని సొంతమాటల్లో రాయండి.

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 7వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బావున్నారా? మీరు అభ్యాసాలు చాలా చక్కగా చేస్తున్నారు. ఇలాగే మిగిలినవి కూడా చేయండి.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న మీరు ఇంటిపనిగా రాసిన సమాధానాలను చదివి విన్పించండి.

*(నలుగురు లేదా ఐదుగురు పిల్లలతో చదివించాలి. దోషాలుంటే సరిదిద్ది, తగిన సూచనలు ఇవ్వాలి.)*

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! ఇప్పటి వరకు మీరు 'ఇవి చేయండి'లో ఏయే అభ్యాసాల గురించి తెల్సుకున్నారు?
- మరి ఈ రోజు దేని గురించి తెల్సుకుందాం?
- ఈ రోజు 5వ పేజీలోని 'సృజనాత్మకత' అభ్యాసం గురించి తెల్సుకుందామా.
- పిల్లలూ! 'సృజనాత్మకత'లోని ప్రశ్నలు చదవండి.

  *(పిల్లలు చదివిన వాటిని నల్లబల్లపై రాయాలి.)*
- పిల్లలూ! జెండా చిత్రాన్ని గీసి, రంగులు వేయండి. జెండాలోని ఒక్కొక్క రంగు ప్రత్యేకతను వర్ణించండి.

  *(పిల్లలందరితో చిత్రాన్ని గీయించి, రంగులు వేయించాలి. ఒక్కొక్క రంగు ప్రత్యేకత గురించి వారితో చెప్పించాలి.)*
- పిల్లలూ! 'ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా' గేయాన్ని అందరూ కలిసి అభినయించండి.

  *(పిల్లలందరితో పాడించాలి.)*
- గేయంలో కొత్తవేడి, కొత్తవాడి, కొత్తజగం, కొత్తయుగం మొదలైన పదాలున్నాయి కదా! అలాగే మరికొన్ని పదాలు రాయండి. వాటితో గేయం రాయగలరా! ప్రయత్నించండి.

**జట్టుపని :**

సరే! పిల్లలూ! ఇప్పుడు మీరు జట్లుగా కూర్చోండి. సృజనాత్మకతలోని 3వ ప్రశ్నకు జవాబుగా ఒక కొత్త గేయాన్ని రాయండి.

*(పిల్లలు జట్లలో రాసేటప్పుడు వారిని గమనించాలి.)*

**జట్టుపని ప్రదర్శన :**

పిల్లలూ! మీరు రాసిన గేయాన్ని చదివి వినిపించండి.

*(అన్ని జట్లు రాసిన గేయాలను ప్రదర్శింపజేయాలి.)*

వెరీగుడ్ పిల్లలూ! మీరు చాలా బాగా ప్రయత్నంచేసారు. మీకు అభినందనలు. గేయాన్ని ఇంకా బాగా రాద్దామా?

**సరిదిద్దడం :**

సరే! ఇప్పుడు గేయం గురించి చర్చిద్దాం. ఏ జట్టువారు రాసిన గేయం బాగుంది? ఎందుకు?

- దేంట్లో భావం సరిగా ఉందా?
- ఇంకా మంచి పంక్తులు ఏవి జోడించవచ్చు?
- ఇంకా ఎటువంటి మంచి పదాలు జోడించవచ్చు?
- అక్షర దోషాలు ఏవైనా ఉన్నాయా?

***(ఇలా చర్చ ద్వారా గేయాన్ని సరిదిద్దాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! ఈ విధంగా గేయాలు రాయగలరా?
- గేయం రాసేటప్పుడు తీఉకోవాల్సిన జాగ్రత్తలు ఏవి?

## IV. ఇంటిపని

**సృజనాత్మకత :**

1. పిల్లలూ! ఈ రోజు చర్చించిన అంశాల ఆధారంగా ఏదైనా ఒక గేయం రాయండి.
2. ప్రశంస, ప్రాజెక్టుపనులు : పిల్లలూ! మీకు ఇంతకు ముందే ప్రశంస, ప్రాసక్టుపనులు ఇంటిపనిగా ఇచ్చాను కదా! వాటిని పూర్తిచేయండి. రేపు వాటిని మీరు ప్రదర్శించండి.

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 8వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! బాగున్నారా? మీ అందరికీ పాటలంటే ఇష్టమేనా?

**2. పునశ్చరణ :**

పిల్లలూ! నిన్న గేయం రాయడం గురించి చర్చించుకున్నాంకదా! ఇంటిపనిగా ఇచ్చాను కదా! ఎవరెవరు ఏ గేయం రాసారో చదవండి.

*(నలుగురైదుగురు విద్యార్థులచే చదివించాలి.)*

## II. సామర్థ్యాల సాధన – అభ్యాసం

పిల్లలూ! ప్రాజెక్టు పనిని పూర్తి చేసారా? అల్లే ప్రశంసకు సంబంధించిన గేయ పంక్తులలోని పదాలు, పంక్తులను గురించి రాసారా?

- మొదట ప్రాజెక్టు పనికి సంబంధించిన వాటి గురించి చర్చిద్దాం. ఎవరెవరు ఏమేం గేయాలు రాసారో, ఎవరెవరి చిత్రాలు సేకరించారో చూపండి.

*(నలుగురైదుగురు పిల్లలతో వారు రాసిన గేయాలను చదివించాలి.)*

**ప్రాజెక్టుపని సరిదిద్దడం :**

పిల్లలూ! ఇప్పుడు ఎవరైనా ఒకరు రాసిన దాన్ని చర్చిద్దాం!

- ఈ గేయం దేశభక్తిని తెలియజేస్తుందా?
- ఇంకా ఏయే విషయాలు చేరిస్తే బాగుంటుంది?
- వాక్యాలు, గేయపంక్తులు సరిగా ఉన్నాయా?
- ఇంకా ఏయే పదాలు వాడితే బాగుండేది?
- అక్షర దోషాలేమైనా ఉన్నాయా?

*(ఇలా చర్చద్వారా ఒక ప్రాజెక్టుపనిని సరిదిద్దాలి. దీని ఆధారంగా మిగిలిన వారిని దిద్దుకోమనాలి.)*

- పిల్లలూ! ఇప్పుడు ప్రశంసలోని గేయంలోని పదాలు, వాక్యాలు గురించి చర్చిద్దాం. మీరు రాసినవి చదివి వినిపించండి.

*(నలుగురైదుగురు పిల్లలతో చదివించాలి.)*

**ప్రసంశ సరిదిద్దడం :**

1. పిల్లలూ! గేయంలో ఇంకా ఏయే పదాలున్నాయి? ఏయే పంక్తులున్నాయి?

   ***(పిల్లలు చెప్పే వాటిని నల్లబల్లపై రాయాలి.)***

- ఇవి మీకు ఎందుకు నచ్చాయో చెప్పండి.

2. పిల్లలూ! గేయాన్ని ఎవరు అభినయంతో బాగా పాడతారో పాడండి.

   ***(ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలతో పాడించాలి.)***

   గేయాన్ని మీ తరగతిలో ఎవరు బాగా పాడారు? ఎవరు బాగా అభినయం చేసారు? బాగా ఉందని మీరు ఎందుకనుకుంటున్నారో చెప్పండి.

**జట్టుపని :**

- పిల్లలూ! ఇప్పుడు మీరందరూ జట్లలో కూర్చోండి. మీ జట్టులోని వారు రాసిన ప్రాజెక్టు పనిని, ప్రశంసను అందరూ కల్సి చదవండి, చర్చించండి.
- ఇంతవరకు చర్చించిన విషయాలను చేర్చి అందరూ కల్సి గేయాన్ని రాయండి.
- పిల్లలూ! నేను ఇప్పుడు పై పదాలతో వాక్యాలు చెపుతాను. మీరు పదాలకు అర్థాలు ఏమిటో చెప్పాలి.

**జట్టుపని ప్రదర్శన :**

మీరు రాసిన వాటిని ప్రదర్శించండి.

పిల్లలూ! వెరీగుడ్. చాలా బాగా రాసారు.

## III. పిల్లల అవగాహన పరిశీలన

పిల్లలూ! గేయంలో రాసేటప్పుడు ఏయే విషయాలు తెలుసుకొన్నారు? ఏయే ఇబ్బందులు ఎదుర్కొన్నారు?

- ఇప్పుడు గేయం ఎలా రాయాలో తెల్సిందా! ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి? ఎటువంటి పదాలనుపయోగించాలి?

## IV. ఇంటిపని

పాఠం చదవండి పాఠంలోని సంయుక్తాక్షర, ద్విత్వాక్షర పదాలు రాయండి.

# 1. ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా

| 6వ తరగతి | 9వ పీరియడ్ |
|---|---|
| ప్రథమభాష | 45 ని॥లు |

## I. ఉపోద్ఘాతం

**1. పలకరింపు :**

పిల్లలూ! ఎలా ఉన్నారు? పాఠం బాగా నేర్చుకున్నారు. అభ్యాసాలు బాగా చేస్తున్నారు. వెరీగుడ్.

**2. పునశ్చరణ :**

పిల్లలూ! మీకునిన్న ఇంటిపనిగా ఇచ్చినది పూర్తిచేసారా? సంయుక్తాక్షర, ద్విత్వాక్షర పదాలు రాసుకొని వచ్చారా?

## II. సామర్థ్యాల సాధన - అభ్యాసం

- పిల్లలూ! మీరు రాసిన సంయుక్తాక్షర, ద్విత్వాక్షర పదాలను నల్లబల్లపై రాయండి.
- పై పదాలలో సంయుక్తాక్షర పదాలేవో గుర్తించి వాటికి సున్న చుట్టండి.
- ఇప్పుడు ద్విత్వాక్షర పదాలేవో గుర్తించి వాటికి సున్న చుట్టండి.
- పిల్లలూ! ఇప్పుడు ఈ సంయుక్తాక్షర, ద్విత్వాక్షరపదాలకు తేడా గుర్తించండి.
- పిల్లలూ! సంయుక్తాక్షర పదాలు చెప్పండి.

  పుస్తకం, భాగ్యం, వాక్యం.

  *(పిల్లలు, చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)*
- పిల్లలూ! ఇలా ఒక హల్లుకు వేరొక హల్లు తాలూకు ఒత్తు చేరితే దాన్ని "సంయుక్తాక్షరం" అంటారు.
- పిల్లలూ! ఇప్పుడు ద్విత్వాక్షర పదాలు చెప్పండి.

  ఎత్తండి, మత్తు, కొత్త, గొప్ప.

  *(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాయాలి.)*
- వెరీగుడ్.
- పిల్లలూ! ఇలా ఒక హల్లుకు అదే హల్లు వచ్చి ఒత్తుగా చేరితే దాన్ని "ద్విత్వాక్షరం" అని అంటారు.
- పిల్లలూ! పేజి నెం.5, 6 లలో చూడండి.
- 5వ పేజీలో భాషను గురించి తెల్సుకందాం అనే అభ్యాసంలో మొదట భాషాధ్వనులకు సంబంధించిన అక్షరపు గుర్తుల పట్టికను 'వర్ణమాల' లేదా 'అక్షరమాల' అంటారు అని ఉంది కదా!
- మీకు వర్ణమాల, అక్షరమాల అంటే తెలుసునా?
- వెరీగుడ్, అందరికీ తెలుసుకదా!
- మరి అచ్చులు, హల్లులు అని వేటినంటారో తెలుసునా?

- వెరీగుడ్.
- ఇప్పుడు ఇక్కడ ఉన్న ద్విత్వాక్షర, సంయుక్తాక్షర సూత్రాలు చూసారు. ఇవి ఇంతవరకు మంన చెప్పుకున్నాం కదా!
- పేజినెం. 6 చూడండి.
- 'వర్ణాక్షరాలు' అని ఉంది కదా. చదవండి.
- మీకు వర్ణాక్షరాలంటే ఏమిటో తెలుసునా!
- వెరీగుడ్. ఇవన్నీ ముందు తరగతిలో తెలుసుకున్నారుకదా! అందుకే చదవగానే చకచకా చెప్పేస్తున్నారు.

పిల్లలూ! ఈ పాఠంలోని అన్ని అభ్యాసాల గురించి సాధన చేసాం కదా! ఇప్పుడు చివరివైనటువంటి 'నేనవి చేయగలనా?' అభ్యాసం కూడా చేద్దామా!

- పిల్లలూ! 6వ పేజీలో చివర బాక్సులో ఉన్నటువంటి ప్రశ్నలు చదవండి.
- ఇవి ఎవరికి సంబంధించినవి? దీన్ని బట్టి మీకేం తెలిసింది?
- 'నేనివి చేయగలనా?' మీరు చేయగలరా? లేదా? అవి మీకు మీరే తెల్సుకోవాల్సినవి. అంటే ఈ పాఠ్యపుస్తకం పూర్తయేసరికి మీరు ఇవి చేయగలరా? లేదా? చెప్పండి.

**పరిశీలన :**

మొదటి వాక్యం చదవండి. గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగలను. దీని గురించి మీరు ఎవరెవరు చక్కగా పాడగలరో చేతులెత్తండి. చేతులెత్తినవారు ఔను వద్ద '✓' పెట్టండి.

***(చేతులెత్తిన వారిని లెక్కించాలి.)***

- అట్లాగే రెండవ వాక్యం చదవండి. మీరు చేయగల్గిన వారు ఔను వద్ద చేయలేనివారు కాదు వద్ద '✓' పెట్టండి.

***(ఎంత మంది చేతులెత్తారో లెక్కపెట్టండి.)***

***(వారిలో ఇలా అన్నింటిని అడిగి 80% మంది చేయగల్గినవి గుర్తించాలి.)***

- పిల్లలూ! మీలో ఏ అంశాన్ని ఎక్కువ మంది చేయలేకపోయారు?

***(ఇలా అడిగి 80% కంటె తక్కువ మంది చేయలేనిదానిపై పునరావగాహన కల్పించాలి.)***

## III. పిల్లల అవగాహన పరిశీలన

- పిల్లలూ! నేనిప్పుడు ఒక వాక్యం రాస్తాను. దానిలో ద్విత్వాక్షర, సంయుక్తాక్షర పదాలను వేరు చేసి విడిగా రాసి చూపాలి.

ఉదా: డబ్బు కూడబెట్టడం కన్న, మంచి పనులు చేస్తున్నప్పుడు ఆనందం కల్గుతుంది.

## IV. ఇంటిపని

కింది వాక్యంలో ఒక వర్గపు అక్షరాలు దాగి ఉన్నాయి. వాటిని గీత గీసి గుర్తించండి.

"బలరాం మంచి ఫలాల కోసం పల్లెలో తోటకు వెళ్ళాడు. తోటలో పామును చూసి భయపడ్డాడు."

- పిల్లలూ! మీరు చేయలేని అంశంపై దాన్ని మీరు ఇంటివద్ద అభ్యాసం చేసుకునిరండి.

# 5

# కొరియోగ్రఫీ

కొరియోగ్రఫీ అనేమాట ఈనాడు నృత్య రూపకల్పన (Designing of dance) అనే అర్థంలో ఉపయోగింపబడుతున్నా, అసలు అర్థం 'రూపకల్పన' మాత్రమే. ఇది 1950 ప్రాంతంలో మొట్టమొదటిసారి ప్రయోగింపబడినా, ఇటీవలి కాలంలో బహుళ ప్రచారంలోకి వచ్చింది. విస్తృతార్థంలో చూసినప్పుడు వివిధ భంగిమలు ఏర్పరచడం, చిత్రాలు నిర్మించడం, అభినయం రూపొందించడం, దృశ్యాలు కల్పించడం అని నైఘంటుకార్థం.

సినిమాల్లో నృత్యదర్శకులు పరిమితార్థంలో ఉపయోగిస్తున్న ఈ కొరియోగ్రఫీని తరగతి గదికి ప్రత్యేకార్థంలో అన్వయించి ప్రయోగిస్తే, అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చు. పిల్లల్లోని సృజనను, కళాభినివేశాన్ని ప్రోత్సహిస్తూ, భాషా సామర్థ్యాల సాధనకు దీన్ని పనిముట్టుగా ఉపయోగించుకోగలమేమో పరిశీలిద్దాం.

- *కొరియోగ్రఫీ / కొరియోగ్రాఫర్ లక్షణాలు ఏవి?*
- *తరగతి గదికి దీన్ని ఎట్లా అన్వయించవచ్చు?*
- *ఎటువంటి పాఠాలకు దీన్ని జోడించవచ్చు?*
- *ఏ ఏ రకాలుగా వినియోగించగలం?*

కొరియోగ్రఫీ అంటే కేవలం నృత్యరూపకల్పన కాదు. రచన, సంగీతం, మాటలు, భావాలననుసరించి చేసే అభినయ రూపకల్పన. ఇది చేసేవారినే కొరియోగ్రాఫర్ అని వ్యవహరిస్తారు.

ఏదైనా ఒక పాఠంలోని ప్రధానాంశాన్ని ముందుగా గేయం రూపంలోకిగాని, సంభాషణల రూపంలోకిగాని, రూపకంగాగాని మార్చి, ఆయా మాటలకు, పాటలకు, పద్యాలకు అనుగుణమైన అభినయాన్ని, దృశ్యాలను రూపొందించడం కొరియోగ్రఫీద్వారా పాఠ్యబోధనను సాధించే మార్గం.

కొంచెం సృజనాత్మకంగా, కొత్తకోణంలో, పరిశోధనాత్మకంగా ఆలోచించినప్పుడు ఇది సాధించడం కష్టంకాదు. పైగా విద్యార్థుల నుండి దీనికి సంపూర్ణ సహకారం లభిస్తుంది. ఫలానా పాఠానికే ఇది సరిపోతుందని పరిమితం చేయలేం. ఏ పాఠానికైనా (పద్య / గద్య / ఉపవాచక) దీన్ని రూపొందించవచ్చు.

అభినయం, మూకాభినయం, దృశ్యరూపమివ్వడం, మాస్కులను ఉపయోగించడం వంటి రకరకాల ప్రయోగాల ద్వారా మనం కొరియోగ్రఫీని తరగతి గదిలో విజయవంతంగా ప్రవేశపెట్టవచ్చు.

## కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం

1. **8వ తరగతిలో (1) దుందుభి పాఠం (గేయం) :** ఇది ఖండగతి నడకను కల్గి ఉంది. అంటే తత్తకిట – తత్తకిట – తత్తకిట – తత్తకిట అనే లయ. ఈ లయలో ఐదు మాత్రల చొప్పున మాత్రాగణాలుంటాయి. పాట నది లయను అనుకరిస్తూ సాగుతుంది. నేపథ్యంగా పాట వినిపిస్తుంటే తెరముందు రకరకాల దృశ్యాలు కదుల్తాంటాయి. నీలం రంగు చీరలు నదీ ప్రవాహానికి ప్రతీకగా కదిలిస్తూంటే రకరకాల చెట్లు, పుట్టలు, పాములు, చీమలు వగైరా మాస్కులతో, శివలింగం, తపస్సు... తదితరాంశాలను దృశ్యీకరించవచ్చు.
2. **8వ తరగతిలోనే (9) చిన్నప్పుడే (కథానిక) :** ఇది స్వాతంత్ర్యోద్యమం నేపథ్యంగా సాగే కథానిక. తెరవెనుకనుండి గంభీర స్వరంతో కథ వినిపిస్తూంటుంది. ముందర దృశ్యాలు కదుల్తాంటాయి. పాత్రలు అభినయిస్తూంటాయి. దృశ్యాలు వేగంగా మారుతుంటాయి. సహజత్వం కోసం సంభాషణలకు వేర్వేరు గొంతుకలను (కంఠస్వరం) ఇవ్వొచ్చు.
3. **8వ తరగతిలో (13) సంస్కరణ (లేఖ) :** ఇది ఒక లేఖ. లేఖ ఆవిష్కరణకు ఒక సన్నివేశాన్ని చిత్రించి, ఆ తర్వాత నేపథ్యంగా లేఖ వినిపిస్తూ, తెరముందు దృశ్యాలను (సరోజినీదేవి ప్రసంగం, వరకట్నానికి వ్యతిరేకంగా ఉద్యమం) ప్రదర్శించవచ్చు.
4. **9వ తరగతిలో (4) ప్రేరణ (ఆత్మకథ) :** అబ్దుల్ కలామ్ ఆత్మకథ ఇది. ఇది ఉత్తమ పురుషలో తెర వెనుక వినిపిస్తూంటుంది. తెర ముందు దృశ్యాలు కదులుతూ ఉంటాయి. సహజత్వం కోసం సంభాషణలనూ జోడించవచ్చు. విద్యార్థి జీవితం నేపథ్యంగా సాగే కొరియోగ్రఫీ పిల్లలను అమితంగా ఆకట్టుకుంటుందనడంలో సందేహమేలేదు.
5. **9వ తరగతిలో (7) ససేమిరా (పద్యం) :** ఇది ప్రాచీన పద్యం. పద్యాలను రాగభావయుక్తంగా, పాత్రోచితంగా తెరవెనుక నుండి పాడిస్తూ పిల్లలకు జంతువుల మాస్కులువేసి, అద్భుతంగా కథ రక్తి కట్టించవచ్చు.

కొంచెం ఆలోచిస్తే, శ్రమ తీసుకుంటే, గట్టిగా ప్రయత్నిస్తే – కొరియోగ్రఫీని అద్భుతంగా పాఠ్యబోధనకు వినియోగించవచ్చని అర్థమవుతున్నది కదా! ఇందులో పాట, ఆట, అభినయం, చిత్రం, దృశ్యం... అందంగా ఆవిష్కృతమై విద్యార్థులను తన్మయులను చేసి, బోధనను విజయవంతం చేస్తుంది. మరెందుకాలస్యం? ప్రయత్నించండి!

## ఒక పాఠానికి ప్రయోగపూర్వకంగా కొరియోగ్రఫీ ఎలా నిర్వహించవచ్చో పరిశీలిద్దాం!

✦ పాఠాన్ని కొరియోగ్రఫీకి ఎంపిక చేసుకోవడానికి ముందు దృశ్యీకరణకు అది సరిపోతుందా, పాత్రలు ఏమేమున్నాయి? అభినయానికి గల అవకాశమెంత, తరగతి గదిలో / వేదిక మీద ప్రదర్శించడానికి వీలుందా.... అనే అంశాల గురించి ఉపాధ్యాయులు ఒక స్పష్టమైన అవగాహనకు రావాలి.

✦ ఉపాధ్యాయుడు తానే స్వయంగా కొరియోగ్రఫీ చేయకుండా, విద్యార్థులకే ఆబాధ్యతను అప్పగించాలి.

✦ పాఠం విద్యార్థులకు బాగా అర్థమయ్యేటట్లు చెప్పడమేగాక, వాళ్ళు స్వయంగా చదువుకొని, సన్నివేశాలు, పాత్రలపట్ల స్పష్టమైన అవగాహన పెంచుకునే అవకాశం కల్పించాలి.

✦ పిల్లలు పాఠం బాగా చదివి, పాత్రలు, సన్నివేశాల పట్ల అవగాహన పెంచుకొని, వాటి స్వరూప స్వభావాలను తమదైన శైలిలో ప్రదర్శించేలా ప్రోత్సహించాలి.

✦ ఉపాధ్యాయులు పిల్లల దోషాలను సవరిస్తూ, మెరుగైన ప్రదర్శన రూపొందించడంలో సహకరించాలి.

ఉదా: 8వ తరగతి : “అమ్మకోసం” అనే పద్యభాగ పాఠం

✦ ముందుగా కథ చెప్పి, పాత్రల స్వరూప స్వభావాలపట్ల స్పష్టమైన అవగాహన కల్పించాలి.

✦ పాత్ర స్వభావాన్ననుసరించి పద్యాలు పలికించాలి.

✦ పాత్రలకు తగిన విద్యార్థులను ఎంపిక చేయాలి / ఎంపిక చేసుకునే వెసులుబాటు విద్యార్థులకు కల్పించాలి.

✦ నేపథ్యంగా వినిపించాల్సిన కథ, మాటలు; పాత్రలకు సంబంధించిన మాటలు – విడివిడిగా రాయాలి.

- పద్యాలు యథాతథంగా ఉపయోగించవలసిన వాటిని గుర్తించాలి.
- పాత్రలకు తగిన మాస్కులను, దృశ్యాల్లోని చెట్లు, పుట్టలు, శివలింగం మొదలైనవి థర్మాకోల్, అట్టలు మొదలైన వాటితో తయారు చేసుకోవాలి / చేయించాలి.
- సంగీతం (అవకాశమున్నట్లయితే) ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువ మంది విద్యార్థులు ప్రదర్శనకు ఉత్సాహం చూపితే రెండు / మూడు బృందాలుగా చేసి, వారి మధ్య పోటీ నిర్వహించాలి.
- అన్నీ యోగ్యంగా ఉంటే, ఒకరి తర్వాత ఒకరికి ప్రదర్శనకు అవకాశం ఇవ్వాలి.
- వీలైతే బహుమతినిచ్చే ఏర్పాటు చేయవచ్చు.

*కళలు - ప్రాధాన్యత -*

*సమాజంలో సాంస్కృతిక అంశాలు, కళలు మొదలగువాటిని తరువాతి తరాలకు అందించడం పాఠశాలల యొక్క బాధ్యత. కళాత్మక ఉత్పాదనలో మిళితమైన నైపుణ్యాలు పిల్లల యొక్క సంపూర్ణ భావావేశ మరియు జ్ఞానాత్మక అభివృద్ధికి అత్యవసరం. ఇందుకోసం కళలను నేర్చుకోవడం, కళల ద్వారా నేర్చుకోవడం అనేవి బోధనాభ్యసన ప్రక్రియలతో మమేకం కళల ద్వారా నేర్చుకోవడం అనేవి బోధనాభ్యసన ప్రక్రియలతో మమేకం కావాలి. కళాత్మక ఆసక్తులు, సామర్థ్యాలను పెంపొందించడం, అభ్యసనం, జ్ఞానాలలో అంతర్భాగంగా ఉంటాయి. పిల్లలకు సంగీతం నేర్పితే శారీరక జ్ఞానాత్మక రంగాలలో చాలా పెద్దమార్పులు వస్తాయి. బహుముఖప్రజ్ఞ అభివృద్ధి పరచుటకు నాటకాలు, పాత్రపోషణలు, అభినయాలు మొదలగునవి బాగా తోడ్పడతాయి. ఇవి పిల్లలను తదాత్మ్యకత చెందేలా చేస్తాయి. వీటి ద్వారా పిల్లలు స్థానిక, ప్రాంతీయ దేశీయ భిన్న కళావారసత్వాన్ని తెలుసుకోగలుగుతారు. ఆ సమాజ సాంస్కృతిక వారసత్వంతో అనుబంధాన్ని ఏర్పరుచుకోగలుగుతారు.*

*- ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం - 2011*

# 6 పాఠ్య బోధనకు భాషోపాధ్యాయుడు ఎలా తయారుకావాలి?

యుద్ధానికి వెళ్ళే సైనికుడు అవసరమైన ఆయుధాలతో రణక్షేత్రంలోకి దూకుతాడు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారుడు అవసరమైన పరికరాలతో మైదానంలోకి దిగుతాడు. సైనికుడు యుద్ధం జరిగినప్పుడు కూడా ఆయుధాలకు మెరుగుపెట్టుకుంటూ దాని పదునును పరీక్షిస్తుంటాడు. క్రీడాకారుడు పోటీలు లేనప్పుడు కూడా సాధన చేస్తూనే ఉంటాడు. వీళ్ళిద్దరూ నైపుణ్యాలు పెంచుకునే ప్రయత్నంలో ఉంటూ విజయాలకోసం ఉవ్విళ్ళూరుతుంటారు. మరి వాళ్ళను తీర్చిదిద్దే శిక్షకుడు మరెంతగా సంసిద్ధుడై ఉంటాడో కదా! అలాగే మనమీద ఎంతో నమ్మకంతో తమ పిల్లవాడి భవిష్యత్తును మన చేతుల్లో పెట్టిన తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టడానికి ఉపాధ్యాయుడిగా మనమెలాంటి శిక్షణ పొందాలి? ఎలా తయారుకావాలి? పాఠశాల విద్యలో మనమందరం వేసుకోవాల్సిన కీలకమైన ప్రశ్నలు ఇవి – తమ వృత్తిధర్మానికి ఎంతమేరకు న్యాయం చేకూరుస్తున్నామని ఆత్మవిమర్శనాత్మకంగా విశ్లేషించుకోవలసిన పరిస్థితిలో నిలబడింది మన ఉపాధ్యాయ లోకం!

*1. పాఠ్యబోధనకు తయారుకావడం అంటే ఏమిటి?*

*2. భాషోపాధ్యాయుడు ఏ ఏ అంశాల్లో తయారుకావాలి?*

*3. తయారుకావడం ఎందుకు?*

ఈ నేపథ్యంలో భాషోపాధ్యాయుడి బరువు బాధ్యతలు మరింత పెరిగాయి. డిగ్రీ స్థాయికి వచ్చిన విద్యార్థి తెలుగు చదవడంలో తడబడుతున్నాడు. రాతలో అనేక భాషాదోషాలు దొర్లుతున్నాయి. కనీస భావప్రకటనా సామర్థ్యం లేక పోటీ ప్రపంచంలో వెనకబడిపోతున్నాడు. తన వెనకబాటుతనానికి కారణం ఎవరు అని వెనకకు చూసుకుంటే ప్రాథమిక పాఠశాల స్థాయిలో భాషను బోధించిన ఉధ్యాయుడు కనిపిస్తాడు. ఇది నిజంగా నమ్మలేని చేదునిజం. ఎందుకంటే పాఠశాల విద్యలో కీలకమైన వ్యక్తి ఉపాధ్యాయుడు. అందులో పిల్లలపై అమితమైన ప్రభావాన్ని కలగజేసేవారిలో భాషను బోధించే ఉపాధ్యాయుడి పాత్ర శక్తివంతమైనది. సహజవాతావరణంలో పెరుగుతూ వినడం, మాట్లాడడం నేర్చుకునే పిల్లలు పాఠశాలలో ప్రవేశించగానే వారిలో పలు గుణాత్మక మార్పులను గమనించవచ్చు. ఇవన్నీ భాషకు సంబంధించినవే కావడం గమనార్హం. పిల్లవాడి తరగతి పెరుగుతున్న కొద్దీ అతడి ఆలోచనాత్మకత విస్తరిస్తుంది. అనేక సందేహాలను మోసుకొస్తాడు. ఎన్నో ప్రశ్నలను సంధిస్తాడు. అతడిలో ఊహాశక్తి, సృజనాత్మకత పురివిప్పుతుంది. ఈ సందర్భంలో ఒక ప్రాథమికోన్నత మరియు సెకండరీ స్థాయిల్లోని భాషోపాధ్యాయుడే కీలకమైన ఆధారంగా కనిపిస్తాడు. మట్టిలోంచి విత్తనం మొలకెత్తినప్పుడు ఆదృశ్యం ఎంతో అపురూపంగా ఉంటుంది. ఆ మొలకలను ఎంతో జాగ్రత్తగా కాపాడుకుంటాం. అంత అపురూపంగా, జాగ్రత్తగా చూసుకోవాలి ఆ పిల్లవాడిని. అందుకే భాషోపాధ్యాయుడు నిరంతరం జాగరూకతతో నిత్య విద్యార్థిగా, అధ్యయనశీలిగా, తన జ్ఞాన పరిధిని విస్తృతపరచుకుంటూ చైతన్యవంతుడిగా ఉండాలి. ఆ క్రమంలో భాషోపాధ్యాయుడు ఈ విధంగా తయారుకావాలి.

భాషోపాధ్యాయుడు మొట్టమొదటగా చేయవలసిన నిరంతర అధ్యయన కార్యక్రమం ఒకటుంది. భాషోపాధ్యాయ ఉద్యోగం కోసం రేయింబవళ్ళు అనేక పుస్తకాలు, విషయవిస్తృత సామగ్రి చదివి ఈ ఉన్నతస్థాయికి చేరుకున్నాం. ఇంతటితో చదవడం అనే పని ముగిసిపోలేదు. ఇక్కడి నుండే విభిన్నమైన పుస్తకాలతో విస్తృతమైన పఠనం మొదలుకావాలి. సాహిత్యాభిరుచిని పెంపొందించుకోవాలి. జ్ఞానసంపదను పెంచుకోవాలి. ఉన్నతమైన వైఖరిని అలవరచుకోవాలి. సామాజిక స్పృహలో మానవతా విలువలను, మానవ సంబంధాలను అభివృద్ధిపరచుకోవాలి. ఏ విషయంలోనైనా ఒక్క పిల్లవాడి దృష్టిలోనేకాదు సమాజంలో తమదైన అస్తిత్వంతో గౌరవాభిమానాలు దక్కుతాయి. అందులోంచి వచ్చే సంతృప్తికి, అనుభూతికి వెలకట్టలేం!

ఇటీవల SCERT వారు నూతన తెలుగు పాఠ్యపుస్తకాల అమలు అవగాహన తీరుతెన్నులపై ఒక సర్వే నిర్వహించారు. అందులో భాగంగా భాషాబోధకలను కొన్ని ప్రశ్నలు అడిగారు. అవి పాఠ్యపుస్తకంలో 1. "పాఠాలు ఇతివృత్తాల కనుగుణంగా ఉన్నాయా?', 2. 'అన్ని ప్రక్రియల్లో పాఠాలున్నాయా?', 3. 'సూచనలను పిల్లలు అర్థం చేసుకుంటున్నారా?' ఈ ప్రశ్నలకు చాలామంది భాషోపాధ్యాయులు 'ఇతివృత్తం' 'ప్రక్రియ' 'సూచన' అంటే ఏమిటి? అని తిరిగి ప్రశ్నించారు. ఇలా చెప్పడానికి ప్రధానకారణం అధ్యయన లోపం.

✦ భాషోపాధ్యాయుడు తయారుకావడంలో అనుసరించవలసిన క్రమం :

- ఎనిమిది, తొమ్మిది తరగతుల ప్రారంభంలోనే పిల్లలందరూ చదవడం – రాయడం చేయగలరా లేదా అని నిర్ధారించుకోవాలి.
- చదవడం – రాయడంలో వెనకబడిన పిల్లలకు మూడు వారాలపాటు చదవడం, రాయడం అభ్యాసం చేయించాలి.
- పిల్లలో పఠనాశక్తి కలిగించడానికి బాలసాహిత్యం తరగతిగదిలో అందుబాటులో ఉంచాలి.
- మౌన పఠనం ద్వారా భావాన్ని గ్రహించే అలవాటు చేయాలి.
- పాఠ్యాంశాలు చదవడం, అర్థం చేసుకోవడం గురించి తరగతి గదిలో జట్టు కృత్యాలు, వ్యక్తిగత కృత్యాలు నిర్వహించాలి.
- పిల్లలు పద్యాలను కంఠస్థం చేయడంతోపాటు రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలిగేలా శిక్షణ ఇవ్వాలి.
- ఏపాఠమైనా పిల్లలచే వ్యక్తిగతంగా మొదట చదివించాలి. కొత్తపదాలను గుర్తించేలా చేసి వాటి అర్థాలకోసం నిఘంటువును పరిశీలించమనాలి.
- తరగతి గదిలో పాఠ్యాంశాల గురించి చర్చించడం, అభిప్రాయాలు చెప్పడం, పిల్లలు వాటిపై ప్రతిస్పందించడం బోధనాభ్యసన ప్రక్రియలో భాగం చెయ్యాలి.
- పాఠ్యాంశాల్లోని సమాసపదాలు, జంటపదాలు గుర్తించి వాటిని విడదీయడం, కలపడంలో మధ్య వచ్చే మార్పులను చర్చద్వారా అవగాహన చేయించాలి.
- పాఠ్యాంశాల కింద అభ్యాసాలు సొంతంగా చేయించడం, వాటి గురించి చర్చించడం జరిగేలా చూడాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల్లో ముఖ్యంగా పాత్రపోషణ, నాటకీకరణ, మూకాభినయం, చిత్రాల ద్వారా వ్యక్తీకరణ చర్చలు, సంవాదాలు, పత్రికా క్లిప్పింగులు మొదలగునవి చదవడం, వాటిపై చర్చించడం తప్పనిసరిగా నిర్వహించాలి.
- పిల్లలచేత వారి నోటుపుస్తకాలలో సొంతంగా రాయించడం, పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాలను సొంతంగా రాయించడం చేయాలి.
- ప్రతిరోజూ తాము చదివిన, విన్న, చూసిన అంశాల గురించి, పాఠశాలలో అనుభవాల గురించి తమ డైరీలో పిల్లలతో రాయించాలి.

✦ భాషోపాధ్యాయుడి విధులు – బాధ్యతలు :

- 8, 9 తరగతుల పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదవాలి.
- పాఠ్యపుస్తకంలోని ముందుమాట, ఉపాధ్యాయ సూచనలను ప్రత్యేకంగా అవగాహన చేసుకోవాలి.

- అన్ని పాఠ్యాంశాలను పాఠాలవారీగా, యూనిట్లవారీగా, వార్షిక పథకాలుగా తయారుచేసుకోవాలి.
- పద్యభాగానికి చెందిన పాఠాలను రాగయుక్తంగా, భావయుక్తంగా చదవగలగాలి. పిల్లలతో అభ్యాసం చేయించాలి.
- గద్యభాగంలోని పాఠ్యాంశాలను తామే వివరించకుండా పిల్లలచేత చదివింపజేయడం, చర్చింపజేయడం వాటి సారాంశం చెప్పించడం, వర్ణనాత్మకంగా మాట్లాడించడం చేయాలి. ఒక రూపం నుండి మరొక రూపంలోకి మార్చడం వంటి కృత్యాలను నిర్వహించాలి.
- భాష, భాషాధ్యయనం గురించిన పూర్వజ్ఞానం పిల్లల్లో ఉంటుంది కాబట్టి వాక్యనిర్మాణం, రచనాశైలిపట్ల వారికి అవగాహన కల్పించాలి.
- పిల్లలకు ఇంటిపని పేరుతో చూసిరాసే అభ్యాసాలకు బదులు వారు సొంతంగా రాసేలా ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై స్వీయరచనా అభ్యాసం కల్పించాలి.
- పిల్లలు స్వయంరచనలలో తమమాటల్లో, సమాధానాలు మరొక పిల్లవాడి సమాధానానికి భిన్నంగా ఉండాలి.
- మార్కెట్లో లభ్యమయ్యే గైడ్లు, ప్రశ్నానిధులు, స్టడీమెటీరియల్స్ వంటి వాటిని పిల్లలు ఉపయోగించకుండా చూడాలి.
- పిల్లల నోటుబుక్కులను యాంత్రికంగా చూడకుండా వారు రాసిన విధానం గురించి ఆ నోట్‌బుక్కులలో రిమార్కులు రాయాలి. తేదీతో సంతకాన్ని చేయాలి.
- సొంతంగా ప్రశ్నాపత్రాలను తయారుచేసుకొని పరీక్షలు నిర్వహించాలి.
- పిల్లల ప్రగతిపత్రంలో గ్రేడింగ్ నమోదుచేసి పిల్లల తల్లిదండ్రులతో సంతకాలు చేయించాలి.
- సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి. పునఃసమీక్ష చేయాలి.

✦ సమర్థమైన బోధనకు సమకూర్చుకోవలసిన సామగ్రి.

- పాఠ్యాంశాలకు సంబంధించిన మూలగ్రంథాలు.
- పాఠ్యాంశకవులు, రచయితలు, రచనలు సాహిత్య పరామర్శ గ్రంథాలు.
- నిఘంటువులు, సాహిత్య పత్రికలు, దినపత్రికలలో, ఆదివారం అనుబంధాలలో వివిధ మ్యాగజైన్‌లలో వచ్చే సాహిత్య, భాషాసంబంధ పేజీలు.
- తరగతి గది గ్రంథాలయ పుస్తకాలు, బాలసాహిత్యం.
- పండుగల విశిష్టతలు తెలిపే గ్రంథాలు.
- సంస్కృతి సంప్రదాయాలపై వచ్చిన గ్రంథాలు.
- దర్శనీయ స్థలాలు, స్థలాల గొప్పదనం వివరించే పుస్తకాలు.
- ప్రముఖుల జీవిత చరిత్రలు.
- ప్రామాణికమైన వ్యక్తిత్వ వికాస గ్రంథాలు.
- వివిధ భాషల్లోని ప్రముఖ గ్రంథాలు.
- టీవి, డి.వి.డి., టేప్‌రికార్డర్, రేడియో.

✦ (ఎలక్ట్రానిక్ మీడియా) ఆధునిక సాంకేతిక ప్రసార సాధనాలు.

- వివిధ టెలివిజన్ ఛానళ్ళలో వచ్చే భాషా, సాహిత్య కార్యక్రమాలు.
- ఇంటర్‌నెట్‌లోని తెలుగుసాహిత్య వెబ్‌సైట్లు, బ్లాగులు, e-పత్రికలు.
- యూట్యూబ్‌లో ఉండే తెలుగు భాష, సాహిత్య కథనాలు.

- సప్తగిరి ఛానెల్‌లో ప్రసారమయ్యే భాషా సాహిత్య ప్రత్యేక కార్యక్రమాలు.
- ప్రముఖ కవులు, రచయితలు ముఖాముఖి కార్యక్రమాలు.
- మార్కెట్‌లో దొరికే పాటలు, సాహిత్య సీ.డీ.లు.

✦ భాషోపాధ్యాయుడు పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ చూపాల్సిన అంశాలు.

- బడిబయట పిల్లలు పాఠశాలలో వయసుకి తగిన తరగతులలో చేరినప్పుడు వారికి ప్రత్యేక సామగ్రి సహాయంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.
- తరగతిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చెందిన ఉపకరణాలు, సౌకర్యాలు అందుబాటులో ఉండాలి.
- తరగతి గదిలో బహుభాషా వాతావరణం ఉంటుంది. కాబట్టి పిల్లలను వారివారి మాతృభాషల్లో మాట్లాడడం ద్వారా తెలుగుభాషతో పోల్చడం సారూప్యతను గుర్తింపజేయడం జరగాలి.
- పిల్లలు తమ సొంత శైలిలో మాట్లాడడాన్ని, పాడడాన్ని ప్రోత్సహించాలి.
- పిల్లల్లోని సృజనాత్మక శక్తిని, కళాభిమానాన్ని గుర్తించి వారిని ఆయా కళల్లో ఎదిగేటట్లుగా సూచనలు చేస్తూ ప్రోత్సహించాలి.
- పాఠ్యాంశాల ఇతివృత్తాంతాల కనుగుణంగా సామాగ్రిని – అంశాలను సేకరించడం, రాయడం వంటి ప్రాజెక్ట్ పనులను నెలకు ఒకటి చొప్పున పిల్లలకిచ్చి వీటి నివేదికలను తరగతిగదిలో ప్రదర్శించాలి.
- పిల్లలు రాసిన కవితలు, కథలు, గేయాలు, జోకులు వ్యాఖ్యలు మొదలైనవాటిని గోడపత్రికలో ప్రదర్శించాలి.

ఇటీవల SCERT వారు కొన్ని పాఠశాలల్లో తెలుగు పాఠ్యాంశ బోధన ఎలా జరుగుతుందనే పరిశీలనకు నేరుగా తరగతిగదిలోకే వెళ్ళారు. ఒక పాఠశాలలో భాషోపాధ్యాయిని టేబుల్ మీద పాఠ్యపుస్తకం, గైడ్ పక్కపక్కనే పెట్టుకుని పాఠం చెబుతూ కనిపించారు. పిల్లలు గైడ్స్ ఉపయోగించకుండా చూడాలన్న మనమే ఇలాంటివి చేయడం సమంజసమేనా?

✦ ముగింపు

పైన పేర్కొన్న విషయాలన్నిటిని అనుసరిస్తూ, సామగ్రిని సమకూర్చుకుని భాషోపాధ్యాయుడు తరగతి గదిలో కర్తవ్యం నిర్వహిస్తే ఒక అద్భుతాన్ని ఆవిష్కరించవచ్చు. నాలుగుగోడల తరగతి గదిలోంచి ఒక సరికొత్త రేపటి తరానికి ఊపిరిలు ఊదవచ్చు. ముఖ్యంగా పిల్లలు ఉన్నత విద్యాస్థాయి ప్రమాణాలను అందుకోవడంలో మాతృభాష కీలకమైన సాధనం. మాతృభాషలో సాధించిన జ్ఞానం, విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సానుకూల దృక్పథంలో మిగతా విషయాల పట్ల ఆసక్తి, శ్రద్ధ పెరుగుతాయి. విద్యార్థులు విషయ తీవ్రతతో కూడిన అధ్యయనానికి, అవగాహనకు స్పష్టమైన పునాదులు నిర్మించుకుంటారు. తమ అత్యుత్తమ భవిష్యత్ విద్యాసౌధానికి, సమగ్ర మూర్తిమత్వానికి నిర్మాణాత్మకమైన బాటలు వేసుకుంటారు. ఆ ఉత్తమ మార్గంలో భాషోపాధ్యాయుడు ఒక విశ్వసనీయమైన, ప్రామాణికమైన దిక్సూచిగా, దీపస్తంభంగా నిలబడుతాడు. నిజంగా భాషోపాధ్యాయుడిది ఎంత అదృష్టం. ఆ అదృష్టమార్గంలోకి వెళ్ళడానికి తయారవుదాం రండి!

# 7 నూతన పాఠ్యపుస్తక బోధనలో ఉపకరించే వనరులు

విద్యార్థులలో భాషా సామర్థ్యాల సాధనకు భాషోపాధ్యాయునికి ప్రధాన సహాయకారిగా నిలబడేది పాఠ్యపుస్తకం. నిరంతర బోధన, సాధన, అధ్యయనాల ద్వారా అంకితభావం గల ఉపాధ్యాయులు స్వప్రయత్నంతో పాఠాలన్నీ ముందుగా చదువుకొని, తగు విధంగా సంసిద్ధులవుతారు. పాఠాన్ని రమ్యంగా, అర్థవంతంగా, వైవిధ్యభరితంగా, సమర్థంగా బోధించడానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటారు. వ్యక్తిగత శ్రద్ధ చూపి, ఆ విధంగా తయారై పాఠ్యబోధన చేసే ఉపాధ్యాయులు సదా అభినందనీయులు.

- నూతన పాఠ్యపుస్తకం బోధించడానికి ఏ ఏ వనరులు అవసరమని మీరనుకుంటున్నారు?
- వనరుల ఉపయోగం ఎంతమేర ఉంటుంది?
- ఏ ఏ వనరులు ఉండాలి?
- బోధన పరిపుష్ఠం కావాలంటే ఇంకా ఏమేం అవసరం?

భాషాబోధనలో భాషాశాస్త్ర, వ్యాకరణ గ్రంథాల ఆవశ్యకత తప్పనిసరి అవుతుంది. అట్లాగే పాఠ్యబోధన, తరగతిగది నిర్వహణ అర్థవంతం, ఆసక్తికరం, ఫలవంతం కావడానికి మరికొంత సామగ్రి అవసరమవుతుంది.

భాషా సామర్థ్యాల సాధనకు, వ్యక్తివికాసానికి, విలువల స్థాపనకు, మానవ సంబంధాలను పటిష్ఠం చేయడానికి తెలుగు (భాషా) బోధన ఉపయోగపడుతుంది. దీనికి ప్రధాన సాధనం పాఠ్యపుస్తకమే. కాని పాఠ్యపుస్తకంలోని విషయాలన్నీ సమగ్రంగా అవగాహన చేసుకొంటేనే సమర్థంగా బోధన నిర్వహించడానికి వీలవుతుంది. అట్లా అవసరమయ్యే వస్తువులు, వనరులు ఏమేముంటాయో ఒక్కసారి ఆలోచిద్దాం.

పాఠశాలలో వివిధ కార్యక్రమాల నిర్వహణలో, విద్యార్థుల మానసిక, మేథోవికసనంలో భాషోపాధ్యాయులదే ప్రధాన భూమిక. అందుకు కారణం వారికి భాషపైన పట్టు ఉండటం, వాక్పటిమ ఉండటం, వివిధ అంశాల పట్ల సదవగాహన ఉండటం, సంస్కృతీ సంప్రదాయాల గురించి అవగాహన ఉండటం, విద్యార్థుల పట్ల వాత్సల్యం కల్గి ఉండటం మొదలైన అనేక అంశాలుంటాయి. ఎప్పటికప్పుడు ఈ శక్తియుక్తులకు సానపెడుతూ తన ప్రతిభను ఇనుమడించుకుంటూ, నూతన విధానాలను గ్రహిస్తూ, ప్రయోగిస్తూ, నిత్య విద్యార్థిగా తనను తాను మలచుకున్నప్పుడే ఉపాధ్యాయుడు సరియైన గుర్తింపు పొందుతాడు. వృత్తికి వన్నెతెస్తాడు. ఈ నేపథ్యంలో పాఠ్యబోధనను, విధి నిర్వహణను మరింత గొప్పగా నిర్వహించడానికి అవసరమయ్యే వనరులలో ఈ కింద పేర్కొన్నవి దోహదపడగలవు.

1. పాఠశాల గ్రంథాలయం
2. పరామర్శ గ్రంథాలు
3. సాంకేతిక విజ్ఞానం
4. ఉత్సవాల నిర్వహణ
5. ప్రదర్శనలు
6. యాత్రలు - సందర్శనలు - వనభోజనాలు
7. పాఠశాల సంచిక
8. వార్తా పత్రికలు, సంచికలు (వార, మాసపత్రికలు)
9. ఇతరములు

1. **పాఠశాల గ్రంథాలయం :** ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన పాఠశాల గ్రంథాలయాలు తదనంతరకాలంలో క్షీణదశకు చేరుకొని, ఇటీవలే మళ్ళీ ప్రాణం పోసుకుంటున్నాయి. రాజీవ్ విద్యామిషన్ (SSA) సహకారంతో ప్రతి ఏటా వేలకొలది ధనం ఈ వ్యవస్థకు వినియోగించబడుతున్నది. విద్యార్థుల విస్తార పఠనానికి, మౌన పఠనానికి, వ్యక్తిగత అధ్యయనానికి గ్రంథాలయం చక్కని వేదిక. భవిష్యత్తులో సార్వత్రిక గ్రంథాలయాలను వినియోగించుకునే విధానం అలవడి, విజ్ఞానార్జనకు దోహదం చేస్తుంది. అందుకే ఉన్నంతలో సువ్యవస్థితమైన గ్రంథాలయ నిర్వహణ ద్వారా విద్యార్థులకు గ్రంథాలయ వినియోగాన్ని అలవాటుచేయాలి. పుస్తకాలను పద్ధతి ప్రకారం అమర్చడం, కేటాలాగులు తయారుచేయడం; పుస్తకాలు ఇచ్చిపుచ్చుకునే పట్టికను నిర్వహించడం; మౌన పఠనాన్ని అలవాటుచేయడం; ముఖ్యాంశాలను రాసుకోవడం వంటి పనులకు పాఠశాల గ్రంథాలయం మార్గదర్శనం చేయాలి.

2. **పరామర్శ గ్రంథాలు :** పాఠ్యబోధనను సమగ్రంగా నిర్వహించడానికి పరామర్శ గ్రంథాలు తప్పనిసరి. పాఠ్యపుస్తకంలో ఎన్ని వివరణలున్నా అవి పరిమితంగానే ఉంటాయి. పదవిజ్ఞానం, పూర్వగాథలు. వ్యాకరణాంశాలు, అదనపు సమాచారాలు... ఇవి ఎంత విరివిగా సంపాదించగలిగితే ఉపాధ్యాయులకు అంత సౌకర్యంగా, విద్యార్థులకు ఉత్సాహభరితంగానూ ఉంటాయి. ఈ కింద కొన్ని ముఖ్యమైన పరామర్శ గ్రంథాలు సూచింపబడ్డాయి. పాఠశాల అవసరాన్ని బట్టి వీటి విస్తరణ, కుదింపూ సంభవం.

1. శబ్దరత్నాకరము - బహుజనాపల్లి సీతారామాచార్యులు
2. బ్రౌణ్యనిఘంటువు - తెలుగు - తెలుగు
3. మాండలిక పదకోశాలు - తెలుగు అకాడమి
4. ఆంధ్రనామ సంగ్రహము
5. విద్యార్థి కల్పతరువు
6. విజ్ఞాన సర్వస్వం (3, 4, 6 భాగాలు) - తెలుగు భాషాసమితి
7. బాల విజ్ఞాన సర్వస్వం - ఖాసింఖాన్
8. విశ్వవిజ్ఞాన దర్శిని - ఆచార్య నరేంద్రదేవ్
9. భాష - సమాజం - సంస్కృతి - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలుగు భాషా చరిత్ర - భద్రిరాజు కృష్ణమూర్తి
11. వ్యావహారిక భాషా వికాసం - బూదరాజు రాధాకృష్ణ
12. మాటలు - మాటలు - బూదరాజు రాధాకృష్ణ
13. మాటల వాడుక - వాడుక మాటలు - బూదరాజు రాధాకృష్ణ

14. తెలుగు వాక్యం – చేకూరి రామారావు
15. పూర్వగాథాలహరి – వేమూరి శ్రీనివాసరావు
16. పురాతన నామకోశం – బూదరాజు రాధాకృష్ణ
17. సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ – డా।। ఎస్. నళిని
18. పాలమూరు జిల్లా దేవాలయాలు – కపిలవాయి లింగమూర్తి
19. దుందుభి (గేయకావ్యం) – గంగాపురం హనుమచ్ఛర్మ
20. రామరాజీయం – బిరుదురాజు రామరాజు
21. శ్రీమదాంధ్ర మహాభారతం (ఆది, సభా, అరణ్య) – నన్నయ
22. శతక సాహిత్యం (1, 2 భాగాలు) – సాహిత్య అకాడమి.
23. మహాప్రస్థానం – శ్రీశ్రీ
24. దర్శనీయ స్థలాలు (అజంతా, ఎల్లోరా...)
25. హరిశ్చంద్రోపాఖ్యానం (ద్విపద) – గౌరన
26. నార్ల రచనలు (ఐదవ సంపుటి) – నార్ల వేంకటేశ్వరరావు
27. వట్టికోట ఆళ్వార్‌స్వామి కథలు
28. తెలుగు గజళ్ళు (సమగ్రాంధ్రసాహిత్యం – 6వ సంపుటి) – డా।। సి.నారాయణరెడ్డి
29. రామాభ్యుదయం – అయ్యలరాజు రామభద్రుడు
30. నండూరి రామమోహనరావు వార్తావాఖ్యలు
31. సమైక్యభారతి (కవితా సంకలనం) – రాష్ట్ర సమాచారశాఖ
32. శ్రీమదాంధ్ర మహాభారతం (ఉద్యోగపర్వం) – తిక్కన
33. వచన రామాయణం
34. వచన మహాభారతం
35. సాక్షివ్యాసావళి (3వ సంపుటి) – పానుగంటి లక్ష్మీనరసింహారావు
36. శివతాండవం – పుట్టపర్తి నారాయణాచార్యులు
37. ఒక విజేత ఆత్మకథ – ఎ.పి.జె.అబ్దుల్ కలామ్
38. శారద లేఖలు – కనపర్తి వరలక్ష్మమ్మ
39. సింహాసన ద్వాత్రింశిక – కొరవి గోపరాజు
40. నూరేళ్ళపంట – డా।। భార్గవీరావు
41. రుబాయిలు – డా।। సామల సదాశివ
42. అనాది స్రోతస్సు – జిడ్డు కృష్ణమూర్తి
43. నా గొడవ – కాళోజీ
44. సావిత్రి సమగ్ర రచనా సంపుటి – అరణ్య కృష్ణ (సంపాదకులు)
45. కృషీవలుడు – దవ్వూరి రామిరెడ్డి
46. ప్రాచీన గాథాలహరి – పిలకా గణపతిశాస్త్రి
47. పారమార్థిక పదకోశం – పొత్తూరి వేంకటేశ్వరరావు
48. వ్యాకరణ పదకోశం – తెలుగు అకాడమి
49. సాహిత్య పదకోశం – తెలుగు అకాడమి

3. **సాంకేతిక విజ్ఞానం (Technology) :** ఆధునిక కాలంలో సాంకేతిక విజ్ఞానం విరివిగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా (Electronic media) విశేషంగా వాడుకలో ఉంది. విద్యారంగానికి సంబంధించినంత వరకు దృశ్యశ్రవణ ఉపకరణాలు చాలా కాలంగా వినియోగిస్తున్నాం. అయినా కొంతమంది ఈ విషయంలో నిర్లిప్తంగా ఉన్నారు. 'తెలుగు బోధన'కు వాటితో పనేంటి?' అనేవాళ్ళూ కనిపిస్తున్నారు ఇప్పటికీ. ఇది అభిలషణీయంకాదు. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణా సంస్థ (SCERT), రాష్ట్ర విద్యా సాంకేతిక సంస్థ (SIET), మనటీవీ వంటి సంస్థలు విద్యార్థుల కోసం రేడియో పాఠాలను, టీవీ పాఠాలను రూపొందించి ప్రసారం చేస్తున్నారు. ఆడియో, వీడియో సి.డి.లను అందజేస్తున్నారు. అవన్నీ విద్యార్థులకు అందుబాట్లోకి తెచ్చే ప్రయత్నం జరగాలి. అలాగే అంతర్జాలం (INTERNET) ద్వారా భాషా అవసరాలకు సరిపడిన ఎంతో సమాచారాన్ని, చిత్రాలనూ పొందవచ్చు.

4. **ఉత్సవాల నిర్వహణ :** పాఠశాలలో నిర్వహించే వివిధ ఉత్సవాల ద్వార విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలను పెంపొందించడమేగాక మూర్తిమత్వ నిర్మాణానికి బాటలు వేయవచ్చు. ఈ సందర్భంగా విద్యార్థులను కార్యక్రమ యోజనలో, నిర్వహణలో భాగస్వాములను చేయవచ్చు. భాషా సంబంధమైన రకరకాల పోటీలు (పద్యపఠనం, వ్యక్తృత్వం, వ్యాసరచన, క్విజ్...) నిర్వహించి విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టవచ్చు. ఆహ్వాన పత్రికలు, ప్రకటనలు రాయించడం, నివేదికలు తయారు చేయించడం పిల్లల్లోని భాషా సామర్థ్యాలను పెంపొందింపజేస్తుంది.

5. **ప్రదర్శనలు :** పాఠశాలలో నిర్వహించే రకరకాల ప్రదర్శనలు విద్యార్థులలో కొత్త స్ఫూర్తిని నింపి, భాషావగాహనను, వినియోగాన్ని ఇతోధికం చేస్తాయి. వీటిలో సాంస్కృతిక ప్రదర్శనలు, పద్య పఠనాలు, పాటల పోటీలు, అంత్యాక్షరి కార్యక్రమాలు, నృత్యాలు, అభినయగేయాలు, విజ్ఞాన ప్రదర్శనలు, ఎగ్జిబిషన్లు తదితర కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేటట్లు చేయాలి. తద్వారా అప్రయత్నంగానే భాషా కౌశలాలు వెలుగులోకి వస్తాయి.

6. **యాత్రలు – సందర్శనలు – వనభోజనాలు :** ప్రతి ఏటా పాఠశాల చేపట్టే కార్యక్రమాల్లో విద్యా విజ్ఞాన విహార యాత్రలు, తీర్థ, క్షేత్రాల సందర్శనలు, వనభోజనాదులు చోటు చేసుకుంటాయి. యాత్రల ప్రాథమిక లక్ష్యం విజ్ఞాన సముపార్జనే అయినా, భాషా సంబధమైన సామర్థ్యాల సాధనలోనూ అవి ప్రముఖ భూమిక వహిస్తాయి. తాము చేసిన ప్రదేశాలను వర్ణించడం, ప్రతిస్పందించడం, దర్శించిన వాటిని రికార్డు చేయడం, బొమ్మలు గీయడం, అనుభవాలు అక్షరబద్ధం చేయడం, స్వగతాలుగా రాయడం, కవితలు, కథలు, గేయాలు రాయడం వంటి సామర్థ్యాలను ఇవి పెంపొందిస్తాయి. విభిన్న సంస్కృతీ సంప్రదాయాల అధ్యయనానికి ఇవి బాటలు వేస్తాయి. ప్రకృతి ఆరాధన, కళారాధన, సున్నితత్వం, సృజనాత్మకత వంటి భాషా సామర్థ్యాలు సహజంగా వికసించడానికివి ఉపకరిస్తాయి.

7. **పాఠశాల సంచిక :** విద్యార్థులలోని సృజనాత్మకు పదునుపెట్టి ప్రోత్సహించడానికి ఉపకరించే మేలైన సాధనం పాఠశాల సూచిక. కనీసం సంవత్సరానికి ఒక సంచిక విడుదల చేసే ప్రయత్నం జరగాలి. రచనలు, చిత్రాలు, కల్పనలు, ఊహలు, కథలు, ఆలోచనలు, ఆశయాలు ప్రతిబింబించే విధంగా పిల్లల కళలను అద్దంలో చూపినట్లు సంచికను రూపొందించాలి. ఇందుకు సంపాదక బాధ్యతలు నిర్వహించే తెలుగు ఉపాధ్యాయులు ఎంతో ఓపికను, విజ్ఞతనూ ప్రదర్శించాలి. పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. రచనలను సరియైన దారిలో నడిపించాలి. అవసరమైన ఆర్థిక వనరులను సేకరించడంలో, పత్రిక ముద్రణ విషయంలోనూ తగిన శ్రద్ధ చూపాలి. ఇది తప్పకుండా పిల్లలలో స్ఫూర్తి నింపుతుంది.

8. **వార్తా పత్రికలు, వార, మాస పత్రికలు :** ఈనాడు మార్కెట్‌లోకి వస్తున్న ప్రతి పత్రిక కూడా భాషాక్రీడలకు, సాహితీ విషయాలకూ ప్రాధాన్యత నిస్తున్నది. సాహితీ వేత్తల పరిచయాలు, పుస్తక పరిచయాలు, భాషా సంబంధ విషయాలు, పదక్రీడలు, ఆధునిక సాహిత్యం పోకడలు తదితరాంశాలు ఏ ఏ పత్రికల్లో ఎప్పుడెప్పుడు ప్రచురితమవుతున్నాయో గమనించి, వాటిని సేకరించి రికార్డు చేయడం, అవసరాన్ని, సందర్భాన్ని బట్టి పిల్లలకు పరిచయం చేయడం, భాషా క్రీడల్లో పాలుపంచుకునేట్లు చేయడం, ప్రాజెక్టు పనులు లాంటివి కల్పించడం, విస్తార పఠనాన్ని ప్రోత్సహించడం వంటివి చేయవచ్చు.

**9.** **ఇతరములు :** పైన పేర్కొన్న అంశాలేగాక, టీవీలో వివిధ ఛానెళ్ళలో భాషా సాహిత్యాంశాలు, సమీక్షలు, పరిచయాలు, విశ్లేషణలు వంటి అంశాలు అనేకం ప్రసారమవుతున్నాయి. వాటిని రికార్డుచేసిగాని, సి.డి.లు సేకరించిగానీ విద్యార్థులకు ప్రదర్శించడం, అటువంటి కార్యక్రమాలు చూసేటట్లు ప్రోత్సహించడం. అలాగే సినిమా పాటల్లోనూ, మంచి సాహిత్యం ఉంటే గ్రహించుమని, సంభాషణల్లోనూ విలువైన, చమత్కారపూరితాలైన మాటల్ని సేకరించుమని విద్యార్థులను ప్రోత్సహించవచ్చు. అట్లాగే నాటక ప్రదర్శనలను, జానపదకళలను వీలైనప్పుడల్లా చూసి, వాటి మంచి చెడులను విశ్లేషించడం, ప్రోత్సహించడం, అభ్యసించడం వంటి వాటిని పిల్లల్లో ప్రేరేపించవచ్చు.

ఇక భాషోపాధ్యాయుడు భాష తప్ప మరో విషయం బోధించడానికి అర్హుడుకాదని, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రాల బోధనతో అతడికి సంబంధం లేదని, ఆ బోధనకు అతడు అంతగా న్యాయం చేయదని పలువురు భావిస్తారు. అట్లే ఇతర భాషలపై కూడా అంతగా అధికారముందన్న అపవాదు కూడా ఉంది. అందువల్ల భాషోపాధ్యాయుడు పాఠశాలల్లో బోధించే అన్ని విషయాలతో తన పరిచయాన్ని పెంచుకోవాలి. వాటిని ప్రత్యేకంగా చదవాలి. అందుకు అంతగా సమయం కూడా వెచ్చించాల్సిన అవసరంలేదు. ఒకటో తరగతి నుండి ఇంటర్‌మీడియట్ స్థాయి పాఠ్యపుస్తకాలు చదివితేచాలు. ఇక భౌతిక రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రాలు, సాంఘికశాస్త్రాలు, గణితశాస్త్రాల్లోని కీలకభావనలను గ్రహిస్తేచాలు. ఇందుకోసం అందుబాటులో ఉన్న పరామర్శగ్రంథాలు చదవండి. ఆయా శాస్త్రాల పారిభాషిక నిఘంటువులతో పరిచయం పెంచుకోండి. పాఠశాలలో ఆయా విషయాలు బోధించే ఉపాధ్యాయులు సెలవుపై వెళ్ళినప్పుడు వారిస్థానంలో భాషోపాధ్యాయులు తాత్కాలికంగా ఆ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ పీరియళ్ళలో భాషాబోధనకు వినియోగించకుండా ఆయా అంశాల బోధనకు వినియోగిస్తే పిల్లలకు భాషోపాధ్యాయుల యందు గౌరవం ఇనుమడిస్తోంది. ఉపాధ్యాయబృందానికి ఆదర్శంగా నిలువవచ్చు. తమ పిల్లలకు కూడా ఇంటివద్ద ఆయా అంశాలను విపులంగా చెప్పుకోవచ్చు. సొంత లాభానికి, సమూహ లాభానికి అన్ని విషయాలను తెలుసుకొనియుండడం ఈ నాటి వైజ్ఞానిక యుగంలో అవసరమన్న విషయం విస్మరించరానిది. ఉపాధ్యాయుడు అందునా భాషోపాధ్యాయుడు 'భాషాంశాలు' అన్న విషయాన్ని వాస్తవంచేద్దాం. అందుకు ప్రయత్నిద్దాం.

**"అలసతకూడదించుకయు – అధ్యయనంబున బోధనంబునన్"**

**"స్వాధ్యాయప్రవచనాభ్యాం అప్రమదితవ్యమ్"**

*విమర్శనాత్మక బోధనా విధానం*

***విమర్శనాత్మక బోధన విధానం విద్యార్థులు తమపైచేసే పెత్తనాన్ని ప్రశ్నించేటట్లు చేసి సందేహాలను, అపనమ్మకాలను నివృత్తి చేయడానికి దోహదపడుతుంది. విద్యార్థిలో విమర్శనాత్మక చేతనకు దోహదకారి అవుతుంది. విద్యార్థి మాట్లాడటం, రాయడం వంటి వాటికే పరిమితం కాకుండా అర్థాల పరిధిని దాటి తులనాత్మకంగా చైతన్యంతో ఆలోచించగలగాలి. అపోహలు, ఊహాజనిత భావనల నుంచి బయటపడి తెలివిని పెంచుకోవాలి. ఇందుకు విమర్శనాత్మక బోధనాశాస్త్రం దోహదపడుతుంది. ఇది విద్యార్థిని సమర్థవంతంగా శక్తివంతులుగా తయారుచేయడానికి ఉపయోగపడుతుంది. ఇతరుల సంస్కృతిని గౌరవించడం ద్వారా తనకు తాను ప్రపంచాన్ని విభిన్న దృక్కోణాలలో విమర్శనాత్మకంగా వీక్షించడంలో ఈ బోధనా విధానం ఉపాధ్యాయులకు కూడా ఉపకరిస్తుంది.***

*– ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం – **2011***

# 8 నూతన పాఠ్యపుస్తకంలోని పాఠాలకుపకరించే విశేషాంశాలు

## విశేషాంశాలు - 8వ తరగతి

### 1. దుందుభి

ప్రకృతిని దైవంగా భావించే జాతి మనది. అందుకే మనకు నదులు, పర్వతాలు, చెట్లు మొదలైనవాటిని స్తుతిస్తూ ఎన్నో కావ్యాలు, గేయాలు, పాటలు, రచనలు వచ్చాయి. విశ్వనాథ సత్యనారాయణగారు కెన్నెరసాని అనే వాగును గురించి రాసిన పాటలు చాలా ప్రాచుర్యం పొందాయి. అబ్బూరి రామకృష్ణరావు గారి 'నదీసుందరి', బేతవోలు రామబ్రహ్మంగారి 'క్రొత్త గోదావరి', డా॥ యన్ గోపి గారి 'జలగీతం', డా॥ నాగభైరవ కోటేశ్వరరావు గారి 'నదిచెప్పని కథ' ఈ కోవలో వచ్చిన రచనలే.

### 2. మన సంస్కృతి

సంస్కృతి అనే భావనకు నిర్వచనాలనేకం. ఒక జాతి అనూచానంగా పాటిస్తున్న ఆచారాలు, విలువలు, సమాహార స్వరూపం - సంస్కృతి అనేది చాలామంది అంగీకరించిన విషయం "అంత కడివెడు పాలపై ఒక్కింత మీగడ పేరినట్లు మనకు మిగులును గతములోని మంచి అదియే సంప్రదాయము / సంస్కృతి. - అన్నది. సి.నా.రె.గారి మాట

### 3. అమ్మకోసం

**అమృతం** - క్షీరసాగర మథనంలో అమృతం పుట్టింది. ఇంద్రుడు దూర్వాసుడు బహూకరించిన పారిజాతం పూల దండను నిర్లక్ష్యం చేస్తాడు. దూర్వాసుడు ఆగ్రహించి దేవలోకమంతా కాంతివైభవహీనమయ్యేటట్లు శపిస్తాడు. దేవతలందరూ విష్ణువును ప్రార్థిస్తారు. విష్ణువు ఓషధులన్నీ తెచ్చి పాలసముద్రంలో వేసి చిలికితే అమృతం పుడుతుంది. దాన్ని సేవిస్తే కాంతి, వైభవం వచ్చి మరణం లేనివారమవుతారమని చెప్తాడు. ఈ పని దేవాసురులు కలిసి చేసినా, దేవతలే అమృతం స్వీకరిస్తారు.

**గరుత్మంతుడు** - పక్షిరాజు. అనూరుడి సోదరుడు. తల్లి వినత. కాబట్టి వైనతేయుడంటారు. తండ్రి కశ్యపుడు. ఇంద్రుణ్ణి ఓడించి, అమృతం తెచ్చి తల్లిని దాస్య విముక్తురాల్ని చేస్తాడు. ఇతడి రెక్కల గట్టితనంవల్ల సుపర్ణుడనే పేరు కూడా వచ్చింది. ఇతడు విష్ణువుకు వాహనం.

## 4. ఇల్లు – ఆనందాల హరివిల్లు

**మాతృస్వామ్యవ్యవస్థ** – తల్లి కుటుంబ యజమానిగా ఉండే వ్యవస్థని మాతృస్వామ్యవ్యవస్థ అంటారు. ఆదిమ సమాజంలో మాతృస్వామ్య వ్యవస్థ ఉండేది. ఆస్ట్రేలియా, సుమాత్ర, మెలానేసియా, ఫర్మోసా, మైక్రోనేసియా ప్రాంతాల్లో ఈ సంస్కృతి ఎక్కువ. భారత దేశంలో అస్సాం ప్రాంతంలోనూ, మలబార్ తీర ప్రాంతంలోను; ఉత్తర అమెరికాలోని దేశీయ తెగల్లో ఈ ఆచారం ఇప్పటికీ ఉంది.

**ఆశ్రమ ధర్మాలు** – ఇవి నాలుగు – బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాలు. బ్రహ్మచర్య వ్రతాన్ని ఉపనయనం అయినవాడు ఆచరించాలి. గురువు దగ్గర వేదాధ్యయనం చేయాలి. ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండాలి. ప్రాతస్సాయంసంధ్యలలో సూర్యాగ్నులనుపాసిస్తూ గురుపూజ చేస్తూండాలి. యాచించడం ద్వారా దొరికిన ఆహారాన్ని స్వీకరించాలి. గురువు అనుజ్ఞతో గృహస్థాశ్రమం స్వీకరించాలి. పితరులను–పిండదానంతో దేవతలను–యాగాలతో, ఋషులను–స్వాధ్యాయంతో, ప్రజాపతులను–సంతానాన్ని పొందడంతో, భూతాలను–బలులతో, ప్రపంచాన్ని–ప్రేమతో సంతోషపరచే గృహస్థు స్వర్గాన్ని పొందుతాడు. బ్రహ్మచారులకు, సన్న్యాసులకూ గృహస్థే ఆధారం. కాబట్టి వారిని గృహస్థు తప్పక ఆదరించాలి. గృహస్థాశ్రమం తర్వాత భార్యతో గాని, ఒంటరిగా గాని వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాలి. ఆహారంగా ఆకులూ, దుంపలూ, పళ్లు మాత్రమే స్వీకరించాలి. నేలమీదే నిద్రించాలి, చర్మాంబరధారి కావాలి, రోజుకు మూడుసార్లు స్నానం చేయాలి. దీని తర్వాతది సన్న్యాసాశ్రమం. ఈ దశకొచ్చేటప్పుడు భార్యను, ధనాన్ని వదిలేయాలి. సర్వజీవులను ఒకే రకంగా చూడగలగాలి. మనోవాక్కాయకర్మలతో ఏ జీవినీ హింసించకూడదు. బంధవిముక్తుడై సంసార జీవితం గడపాలి. గ్రామంలో ఒక రాత్రికి మించి, పట్టణంలో ఐదు రాత్రులకు మించీ ఉండకూడదు.

## 5. నీతిపరిమళాలు

**ఆదిశేషువు** – కద్రువ–కశ్యపుల సంతానంలో మొదటివాడు. తన తల్లి కద్రువ వినతపట్ల చేసే అక్రమానికి ఓర్చుకోలేక అనేక పుణ్య క్షేత్రాలలో తపస్సు చేసి బ్రహ్మవల్ల 'భూభారాన్ని వహించే శక్తి' మొదలైన వరాల్ని పొందుతాడు. ఇతడు భృగు మహర్షి శాపంవల్ల బలరాముడిగా అవతరిస్తాడు. శ్రీమహావిష్ణువు పానుపుగా ఉంటాడు. తెలుపు రంగులో ఉంటాడు.

**రసజ్ఞత** – సాహిత్యంలో ప్రతిపాదింపబడిన రసాన్ని గ్రహించగలిగిన నేర్పు.

**ఇంద్రియములు** – ఇవి రెండు రకములు – జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు. జ్ఞానేంద్రియాల నైదింటిని జ్ఞాన ద్వారాలుగా భావిస్తారు. ఇవి–చర్మం, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు. కర్మేంద్రియాలు ఐదు – ఇవి వాక్కు(మాట), పాణి(చేతులు), పాదం(కాళ్లు), పాయువు(మలమార్గం), ఉపస్థ (మూత్రమార్గం). మనస్సుతో కలిపి ఇవి ఏకాదశేంద్రియాలని పిలుస్తారు.

## 6. ప్రతిజ్ఞ

**శ్రమైక జీవన సౌందర్యం** – కష్టపడి పనిచేయడంలో ఉండే తృప్తి, సుఖం, సౌందర్యం.

**స్వస్తివాక్యములు** – శుభం కోరుతూ పలికే మాటలు. 'స్వస్తి తే మనుజవరేణ్య' అంటే రాజా నీకు శుభమగుగాక! 'స్వస్త్యస్తు! సుగుణోస్తు!' మొదలైనవి.

సూచన :– స్వస్తి చెప్పడం అనే పదబంధాన్ని 'ముగించడం / సగంలోనే ముగించడం' అనే అర్థంలో ఇప్పుడు వాడుతున్నారు.

**ధనిక స్వామి** – డబ్బున్నవాడు.

**యంత్రభూతం** – పారిశ్రామికీకరణలో భాగంగా కార్మిక వర్గం ఎక్కువ సమయం యంత్రాల దగ్గరే గడపాల్సి వచ్చినందువల్ల వాళ్ల పాలిట అవి భూతాల్లా / పీడించేవిగా మారాయి. ఆ అర్థాన్ని చెప్పటానికి ఈ పదాన్ని ప్రయోగించారు.

## 7. అజంతా చిత్రాలు

**అజంతా ఎల్లోరా గుహలు–**

_అజంతా_ – ఇది ఇరవై తొమ్మిది గుహల సముదాయం. మహారాష్ట్రలో అజంతా అనేది ఒక గ్రామం పేరు. ఆ గ్రామం దగ్గర ఈ గుహలున్నాయి. 1819 లో వీటిని కనుక్కొన్నారు. ఈ గుహలు కుడ్యచిత్రాలకు ప్రసిద్ధి చెందాయి. బౌద్ధ జాతక కథలు ఇతివృత్తంగా అనేక వర్ణచిత్రాలు కనిపిస్తాయి. ఇందులోని చిత్రాలు క్రీ॥పూ॥ 200 నుండి క్రీ॥శ॥ 650 మధ్యకాలంనాటివి. పూర్వం ఈ ప్రాంతాన్ని కుంతల దేశం అని పిలిచే వారు. వాతాపిని రాజధానిగా చేసుకొని సత్యాశ్రయ పులకేశి ఈ రాజ్యాన్ని పరిపాలించాడు.

_ఎల్లోరా_ – మహారాష్ట్ర లోని ఔరంగాబాద్ దగ్గర ఉన్న గ్రామం. గుహాలయాలకు ప్రసిద్ధి. ఇవి క్రీ॥శ॥ 5వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం మధ్యకాలంనాటివి. హిందూ, బౌద్ధ, జైన మతాలకు సంబంధించిన 19 దేవాలయాలు అక్కడ ఉన్నాయి. కైలాస దేవాలయం ప్రసిద్ధి చెందిన ఒక హిందూ దేవాలయం.

**జాతక కథలు** –మౌఖిక సంప్రదాయంలో పుట్టి లిఖిత సంప్రదాయంలోకి వచ్చిన కథలు జాతక కథలు. ఇవి బుద్ధుడి పూర్వజన్మల గురించి చెబుతాయి. వ్యక్తి పూర్ణ జ్ఞానాన్ని పొందడానికి ఒక జన్మ చాలదని బౌద్ధుల నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ కథలు ప్రతిఫలిస్తాయి. దాదాపుగా 500 జాతక కథలు ప్రస్తుతం లభ్యమౌతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ కథల్లో ప్రక్షిప్తాలు (చేర్పులు) అనేకం.

**వాఘోరా / వాఘిరా నది** – వింధ్యపర్వతశ్రేణిలో అజంతా పర్వతాన్ని రెండుగా చీలుస్తూ వాఘిరానది

ప్రవహిస్తూంటుంది. కొండమీదినుంచి కిందికి దూకేటప్పుడు ఇది వ్యాఘ్రాన్ని (పులిని) తలపిస్తూ ఉంటుంది. అందుకని వ్యాఘ్రానది అన్నారు. కాలక్రమంలో ఇది వాఘిరా, వాఘోరా గా మారింది. ఇది చేసే శబ్దం పులి గాండ్రింపులను గుర్తుకు తెస్తూంటుంది. దీని కెరటాలమీది వెలుగునీడలు బెబ్బులి చారలను తలపిస్తూంటాయి. దీనినుంచి వచ్చే సప్త జలపాతాలు పులిగంతుల (దూకుడు)లాగ ఉంటాయి. అలా ప్రవహించి ఇది తపతీనదిలో కలుస్తుంది.

## 8. హరిశ్చంద్రుడు

**షోడశ దానాలు** – గో, భూ, తిల, హిరణ్య, రత్న, విద్య, కన్యా, దాసీ, శయ్య, గృహ, అగ్రహార, రథ, గజ, తురగ, ఛాగ, (మేక) మహిషీ దానాలు.

**షట్చక్రవర్తులు** – హరిశ్చంద్రుడు, నలుడు, పురూరవుడు, పురుకుత్సుడు, సగరుడు, కార్తవీర్యుడు.

**బ్రహ్మరాత** – ప్రతిజీవినీ సృష్టించే బ్రహ్మ ఆ జీవుల జీవన విధానం, ఆయుర్దాయం మొదలైనవి నుదుట రాస్తాడని మన భారతీయుల విశ్వాసం. బ్రహ్మ ఏం రాశాడో ఆ జీవికి తెలియదు. ఎవరికీ తెలియదు. '*హరిణాపి హరేణాపి బ్రహ్మణాపి సురైరపి, లలాట లిఖితా రేఖా పరిమార్తుం న శక్యతే* అనేది పండిత వాక్యం. ఎంత జాగ్రత్తగా పరిశీలించినా బ్రహ్మరాతను ఎవరూ చదవలేరు, తప్పించలేరు. అది ఏ లిపో కూడా ఎవరికీ తెలియదు. అందుకే అర్థంకాని రాతను బ్రహ్మరాత అనడం పరిపాటి.

**మేరుపర్వతం** – బంగారు పర్వతం. ఇది భూమి చుట్టూ ఒడ్డాణంలా ఉంటుంది. దీని చుట్టూ సూర్యచంద్రులు తిరుగుతూంటారు. దీని శిఖరాలపై దేవతలు విహరిస్తూంటారు. (బ్రహ్మాండ పురాణం)

మేరుపర్వతం కులపర్వతాలలో ఒకటి. ఉదయ, అస్త, హిమ, వింధ్య, మేరు, త్రికూట, లోకాలోక పర్వతాలు అనేవి సప్త కుల పర్వతాలు.

*శ్లో॥ మహేంద్రో మలయస్సహ్యః, శ్శుక్తిమాన్ గంధమాదనః*
*వింధ్యశ్చ పారియాత్రశ్చ, సప్తైతే కులపర్వతాః ॥ (త్రికాండశేషము)*

మరొక అభిప్రాయం ప్రకారం - మహేంద్రము, మలయము, సహ్యము, మాల్యవంతము, ఋక్షము, వింధ్యము, పారియాత్రము అనేవి సప్త కులపర్వతాలు.

**వజ్రాయుధం** - ఇంద్రుడి ప్రసిద్ధ ఆయుధం. వృత్రాసురుణ్ణి చంపడానికి బ్రహ్మ సలహా ప్రకారం దధీచిని ఆశ్రయిస్తారు దేవతలు. దధీచి అంతకు మునుపు తను ఉంచిన ఆయుధాలన్నీ తపశ్శక్తితో జీర్ణించుకొని ఉంటాడు. అప్పుడు దేవతల కోసం దధీచి తన శరీరాన్ని త్యజించి, శక్తిమంతమైన తన వెన్నెముకను ఆయుధంగా చేసుకొమ్మంటాడు. అదే వజ్రాయుధం.

## 9. చిన్నప్పుడే

**దండమండే** - దండము + అండి = దండమండి. నమస్కారమండీ అని అర్థం. అండి అనేది మాండలిక ప్రయోగంలో 'ఏ' చేరి 'అండే'గా మారి దండమండే అనే వచ్చింది.

**బందెలదొడ్డి** - పశువులను బంధించే దొడ్డి. అక్రమంగా ఎవరి పంటలనైనా, మొక్కలనైనా పశువులు మేస్తే వాటిని బంధిస్తారు. యజమాని గ్రామాధికారికి జరిమానా కడితేనే వాటిని విడిచిపెడతారు.

**సర్కారీ రకం** - ప్రభుత్వానికి కట్టే భూమి శిస్తు (భూమి పన్ను); సర్కార్ అంటే ప్రభుత్వం; రకం అంటే రొక్కం; అంటే ప్రభుత్వ ధనం (ఖజానా).

**శేగిదారు** - గుమాస్తా (LDC)

**గిర్దావరుబరులు** - రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అనే పేరుతో ఇప్పుడు చలామణి అవుతున్నారు. గతంలో గిర్దావర్ అని వ్యవహరించేవారు. గిర్దావరు బరులకు గతంలో గిర్దావర్ అని వ్యవహరించేవారు.

**సేక్‌సింది** - సుంకరి. పట్వారీ (గిర్దావర్) వద్దకు అని అర్థం.

**జంగల్** - అడవి; పశువులను మేపే ప్రాంతం.

## 10. ప్రాచీన సాహిత్యాధ్యయనం- ఆవశ్యకత

**కథాసరిత్సాగరం** - గుణాఢ్యుడు పైశాచిక భాషలో బృహత్కథను రాశాడు. దీన్ని బృహత్కథామంజరి పేరుతో సంస్కృతంలోకి క్షేమేంద్రుడు అనువాదం చేశాడు. దీనికి సోమదేవుడు చేసిన అనువాదాన్ని కథాసరిత్సాగరం అని పిలుస్తున్నారు. గుణాఢ్యుడు శివుడి పారిషదుడైన (ప్రమథగణంలోనివాడు) మాల్యవంతుని అవతారమని నమ్ముతారు.

**తూష్ణీంభావం** - తిరస్కార భావం.

**చక్రవర్తుల రాజగోపాలాచారి** *- (1879-1972)* కర్ణాటక రాష్ట్రం - బెంగళూరు వద్ద నున్న హొసూరులో జన్మించారు. 1921లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కు సెక్రటరీగా పనిచేశారు. భారత స్వాతంత్ర్యానంతరం 1948-1950 మధ్య భారతదేశానికి చివరి గవర్నర్‌జనరల్‌గా ఈయన పనిచేశారు. కేంద్రంలో హోం శాఖా మంత్రిగా (1950-1951), మద్రాసు ముఖ్యమంత్రి (1952-1954)గా పనిచేశారు. 1959లో 'స్వతంత్ర' పార్టీ స్థాపించారు.

**డిస్కవరీ ఆఫ్ ఇండియా** - ప్రజాస్వామ్య వాది, భారత తొలి ప్రధాని అయిన జవహర్‌లాల్ నెహ్రూ ఆంగ్లంలో అనేక గ్రంథాలు రచించాడు. తను రాసిన స్వీయచరిత్రకు కొనసాగింపుగా మరో రచనకు సిద్ధమయ్యారు. తను ప్రేమించే భారతదేశాన్ని గురించి రాస్తే బాగుంటుందని '*ద డిస్కవరీ ఆఫ్ ఇండియా*' రచనకు పూనుకున్నారు. ఈ గ్రంథరచనలో అబుల్ కలాం ఆజాద్, గోవింద్ వల్లభ పంత్ వంటి స్వాతంత్ర్యసమరయోధులు తమ తోడ్పాటునందించారు. ఈ పుస్తకాన్ని గురించి నెహ్రూగారే ఇలా చెప్పారు. 'నేనీపుస్తకాన్ని అహమ్మద్ నగర్ కోటలో ఉండగా 1944 ఏప్రిల్ నుంచి

సెప్టెంబరు వరకు ఐదు నెలల్లో వ్రాశాను. ఖైదులో ఉన్న సహచరులు కొందరు అనేక సూచనలు చేశారు. వీటన్నిటి ఫలితంగా భారతీయ చరిత్ర సంస్కృతుల వివిధ దృక్పథాల గురించి నా మనసులో మసక మసకగా ఉన్న రూపాలు విశిష్ట రూపం దాల్చాయి'.

**కబంధహస్తాలు** – ఒకరి బంధనాలలో చిక్కుకోవడం

**పరశురామ ప్రీతి** – అగ్నికి ఆహుతి కావడం

**చుప్పనాతి** – ఓర్వలేని తనమున్న (స్త్రీ) వ్యక్తి

**హనుమంతుని తోక** – ఎడతెగని విషయం

**రామబాణం** – తిరుగులేని సాధనం లేదా ఉపాయం.

**విశ్వామిత్ర సృష్టి** – కృత్రిమ కల్పన

**భగీరథ ప్రయత్నం** – అతికష్టంమీద చేసే పని

**బలి** – అన్యాయానికి గురికావడం

**నైవేద్యం** – నివేదించడం – భోజనంచేసేముందు ఆహారపదార్థాలను దైవానికి నివేదించడం / అక్రమంగా కేటాయించడం / తినటం (ఆధునికార్థంలో)

**యజ్ఞం** – దేవతలను గురించి చేసే విశేష అగ్నికార్యం

**సర్పయాగం** – ఒక్కడిగురించి చాలామందిని బలితీసుకోవడం

**మారణహోమం** – భీతావహ వాతావరణం కల్పించి, విధ్వంసం సృష్టించడం

**స్వర్గం–నరకం** – సుఖదుఃఖాలు / మంచిచెడులు

**రావణాసురుడి కాష్ఠం** – అంతులేని, రగులుతూ ఉన్న వివాదం

**చిదంబర రహస్యం** – అంతుచిక్కని విషయం

**లక్ష్మణరేఖ** – ఎదుటివారి శ్రేయస్సుకొరకు హద్దులేర్పరచడం

**హిరణ్యాక్షవరాలు** – గొంతెమ్మ కోరికలు, అత్యాశాపూరితాలైన కోరికలు

**నల–భీమ పాకం** – రుచికరమైన వంట (మగవారు చేసినది)

**భీష్మప్రతిజ్ఞ** – దృఢమైన / వీగిపోని/ ఆడినమాట తప్పని ప్రతిజ్ఞ లేదా శపథం

**కుబేరసంపత్తి** – అపారమైన ధనం కలిగి ఉండటం

ఇం**ద్రభవనం** – అన్ని సౌకర్యాలూ ఉన్న భవనం

**లక్ష్మీపుత్రుడు** – సహజంగానే ధనవంతుడు

**దేవేంద్ర పదవి** – ఉన్నతమైన, వైభవోపేతమైన పదవి

**పుష్పకవిమానం** – ఎందరికైనా చోటుండే ప్రదేశం

**ఘోషయాత్ర** – చెరపకురా చెడేవు అనే అర్థంలో దీన్ని వాడతారు.

పాండవులను అవమానపరచాలనే ఉద్దేశ్యంతో బయలుదేరిన దుర్యోధనుడు తానే అనేక సందర్భాలలో భంగపడ్డాడు, గంధర్వుల చేతిలో ఓడిపోయాడు.

**ధర్మరాజు** – ధర్మాన్ని తప్పక చరించేవాడు, ఆడినమాట తప్పనివాడు, అధర్మానికి తావివ్వనివాడు. మంచివాడు / అమాయికుడు.

**ధర్మవ్యాధుడి కథ** – మిథిలా నగరంలో బోయవాడు. కసాయి వృత్తిలో ఉండికూడా ధర్మంగా వ్యవహరించాడు. ధర్మాచరణకీ, కులవృత్తికీ సంబంధం లేదని నిరూపించాడు. కర్తవ్యనిర్వహణ అతిముఖ్యమైన విషయం అని ఇతడి జీవితం తెలుపుతుంది. కౌశికుడనే బ్రాహ్మణుడు కూడా ఇతడి దగ్గర ధర్మోపదేశం పొందాడు. –భారతం.

## 12. సముద్రలంఘనం

**రామాయణ కథ సంగ్రహంగా** – రామాయణం మహర్షి వాల్మీకి రాసిన ఆదికావ్యం. ఇక్ష్వాకు వంశంలో దశరథ మహారాజుకు పెద్ద కొడుకుగా శ్రీరామచంద్రుడు పుట్టాడు. విశ్వామిత్రుని శిష్యునిగా బల, అతిబల విద్యలు నేర్చి, తాటకను పరిమార్చి, జనక కన్య సీతను వివాహమాడాడు. పినతల్లి కైక ఆజ్ఞ మేరకు 14 సంవత్సరాలు అరణ్యవాసం చేశాడు. ఈ సమయంలో రావణుడు సీతను లంకకు ఎత్తుకు పోయి చెరలో బంధించాడు. కపివరులు, హనుమంతుని సహాయంతో సముద్రానికి వారధి నిర్మించి, లంకలోకి ప్రవేశించి రావణుని చంపి చెరలోఉన్న సీతను విడుదల చేశాడు. ఏకపత్నీ వ్రతం, పితృవాక్య పరిపాలన, చక్కటి రాజ్యపాలన మొదలైన విషయాలను ఆచరణలో పెట్టి మానవాళికి ధర్మమూర్తిగా, ఆదర్శమూర్తిగా, పురుషోత్తముడిగా నిలిచాడు శ్రీరాముడు.

**హనుమంతుడు** – అంజనీ–కేసరుల పుత్రుడు. శ్రీరామచంద్రుని నమ్మిన బంటు. లంకను కాల్చి, జంబుమాలినిని, రావణకుమారుడైన అక్షకుమారుణ్ని మొదలైన వారిని సంహరించాడు. లంకలో సీతమ్మ జాడ తెలిసికొని, శ్రీరామచంద్రుని అంగుళీయకాన్ని సీతమ్మకూ, సీతమ్మ చూడామణిని శ్రీరామచంద్రునకు ఇచ్చాడు. రామరావణ యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛాగ్రస్తుడైనప్పుడు సంజీవిని పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుని ప్రాణాలు కాపాడాడు. నిరంతర రామనామజపపరాయణుడు, చిరంజీవి, భవిష్యద్బ్రహ్మ.

ఏ అక్షరాన్ని పలకడానికి ఎంత గాలిని వాడాలో, ఎంత అల్పంగా లేదా ఎంత దృఢంగా ఆ అక్షరాన్ని పలకాలో ఆ విషయం తెలిసి, అంత గాలినే వాడుతూ, అంతసేపటిలోనే స్ఫుటంగా విస్పష్టంగా మళ్లీ మళ్లీ వినాలనిపించేలా ప్రతి అక్షరాన్నీ పలికేందుకు సహకరించే ఉత్తమ హనువులు (దౌడలు) కలవాడని 'హనుమాన్' అనే పదానికి అర్థం. దీన్ని రాముడు కూడా అంగీకరించినట్లు ఆధారాలున్నాయి.

# విశేషాంశాలు - 9వ తరగతి

## 1. శాంతి కాంక్ష

**విదురుడు** – అంబిక పరిచారికకు, వ్యాసుడికి పుట్టినవాడు. మాండవ్యుని శాపం వల్ల యముడే విదురుడిగా పుడతాడు. పాండవుల పట్ల కౌరవులు చేసే దురాగతాలు తెలిసికూడ మౌనంగా ఉండేవాడు. పాండవులను లక్క ఇంటినుండి రక్షిస్తాడు. మాయా ద్యూతానికి అంగీకరించడు. కాని, ధృతరాష్ట్రాదులు వినకపోవడంతో వెళ్లి పాండవులను తీసుకువస్తాడు. ద్రౌపదిని సభకు తీసుకునిరావడానికి తిరస్కరిస్తాడు. యుద్ధ సమయంలో తీర్థయాత్రలకు వెళ్తాడు. తపస్సు చేసి యమధర్మరాజులో లీనమౌతాడు.

**పాండురాజు** – అంబాలికా వ్యాసుల కొడుకు. పాండవుల తండ్రి. మాద్రి కుంతుల భర్త. వేటకు వెళ్లి మృగాల రూపంలో ఉన్న కిందముడనే మునిని, అతని పత్నిని చంపుతాడు. ముని మరణిస్తూ 'నీ భార్యను తాకితే చనిపోతా'వని శాపమిస్తాడు. ఇతడు అరణ్యంలోనే తపస్సు చేసుకుంటూంటాడు. సంతానాన్ని పొందమని కుంతిని ఆజ్ఞాపిస్తాడు. ఆమె పాండవులలో ధర్మరాజు, భీముడు, అర్జునులకు జన్మనిస్తుంది. మాద్రికి కూడ అశ్వినీ దేవతలవల్ల నకుల సహదేవులు పుడతారు. ఒకసారి మాద్రిని తాకడం వల్ల పాండురాజు మరణిస్తాడు.

**సుయోధనుడు** – దుర్యోధనుడి అసలు పేరు. గాంధారి ధృతరాష్ట్రుల కొడుకు, కలి అంశతో పుడతాడు. భీముడిని తిప్పలు పెడతాడు. కర్ణుడికి అంగరాజ్యాన్నిస్తాడు. పాండవులను లక్క ఇంటిలో చంపాలని ప్రయత్నిస్తాడు. రాజసూయానికి వెళ్లి

మయసభలో భంగపడతాడు. మాయా ద్యూతంతో ధర్మరాజునోడించి పాండవులను అరణ్యానికి పంపిస్తాడు. కురుక్షేత్ర యుద్ధంలో భీముని చేతిలో మరణిస్తాడు. ఇతడు దురహంకారి, దురభిమాని, ఈర్ష్యాసూయలకు నిలయుడు.

**2. స్వభాష**

**బర్కు** - ఎడ్మండ్ బర్క్ (1729-1797). ఐర్లాండు కవి. వక్త. రాజకీయ సిద్ధాంత కర్త. తాత్త్వికుడు. ఇంగ్లండులో స్థిరపడ్డాడు. బ్రిటన్ పార్లమెంటులో విగ్ పార్టీ తరపున చాల కాలం సేవలందించాడు.

**సిసిరో** - (106 బి.సి. - 43 బి.సి.) రోమ్ దేశపు తాత్త్వికుడు, న్యాయవాది, వక్త, రాజకీయ సిద్ధాంతవేత్త.

**డిమాస్థనీసు** - (384 బి.సి. - 322 బి.సి.) ప్రసిద్ధ గ్రీకు వక్త. ఉపన్యాస రచయితగా (లోగోగ్రాఫర్) జీవితం సాగించాడు.

**గ్లాడ్టన్** - (విలియమ్ ఇవార్ట్ గ్లాడ్‌స్టన్) (1809-1898). ఒకప్పటి ఇంగ్లండు ప్రధాని.

**కాలాంబర కవచ ధారి** - నల్ల కోటు వేసుకున్న వ్యక్తి. లాయరు. న్యాయవాది.

**సాబాలైన** - సగము పాలైన, సగమైనా

**ప్యారడైజ్ లాస్ట్** - 17 వ శతాబ్ది కవి జాన్ మిల్టన్ రాసిన ఇతిహాస రచన. 1667లో అచ్చయింది. బైబిలు లోని ఒక కథాంశం దీని ఇతివృత్తం. సాతాను ప్రభావం వల్ల ఆదాము, అవ్వలు పతనం కావడం, ఈడెన్ గార్డెన్ నుంచి బహిష్కరింప బడటం ఇందులో వర్ణించబడింది.

**యంబ్రహ్మవేదాంత** - దీని పూర్తి పాఠం.

> యం బ్రహ్మ వేదాంత విదో వదంతి
> పరే ప్రధానం పురుషం తతన్యే
> విశ్వోద్గతే కరణం ఈశ్వరం వా
> తస్మై నమో విఘ్న వినాశాయ.

**అయాంబిక్ మీటర్** - (I - amb) - a metrical foot consisting of an un stressed syllable followed by a stressed syllable or a short syllable followed by a long syllable as in ‘delay’.

**హగుంసస్శుచిష** - వేదమంత్రం. సంధ్యావందనంలో ఈ మంత్ర ప్రసక్తి కనిపిస్తుంది. దీని పూర్తి పాఠం ఇది -

“ *హగ్ం స శ్శుచిష ద్వసు రంతరిక్షస ద్ధోతా వేదిష దతిథిర్దురోణసత్ నృషద్వరసదృతసద్వ్యోమసదబ్జా గోజా ఋతజా-ద్రిజా ఋతమ్ బృహత్* ”

శుచిషత్ = పరిశుద్ధమైనదానియందుండువాడు; వసుః = జగమంతా ఉండేవాడు; అంతరిక్షసత్ = ఆకాశంలో ఉండేవాడు; హెూతా = అగ్ని రూపంలో తేజంగా ఉండేవాడు; వేదిషత్ = పరిష్కృత ప్రదేశాలయిన వేదులయందుండేవాడు; అతిథిః దురోణసత్ = బ్రహ్మాండములనెడి గృహములకు అతిథిగా ఉండేవాడు; నృషత్ = వైశ్వానర రూపంలో ప్రజలయందుండేవాడు; వరసత్ = శ్రేష్ఠములయిన తీర్థాదులలో ఉండేవాడు; ఋతసత్ = యజ్ఞములయందుండేవాడు; వ్యోమసత్ = ఆకాశంలో సూర్యరూపంలో ఉండేవాడూ; అబ్జాః = నీటియందుండేవాడూ; గోజాః = గోవులయందుండేవాడూ; ఋతజాః = యజ్ఞాలలో భోక్తగా ఉండేవాడూ; అద్రిజాః = పర్వతములయందుండేవాడూ అయిన ; హగ్ం సః = సర్వ వ్యాపకుడయిన పరమాత్మ; బృహత్ = అధికమయిన; ఋతమ్ = ఉపాసనాత్మకమయిన సత్యము.

**ఇన్మెమోరియం / మ్యూజిక్** – ఇది ఇన్‌మెమోరియం ఎ.హెచ్.హెచ్., అనేది ఆల్‌ఫ్రెడ్ లార్డ్ టెన్నిసన్ రాసిన కవిత. 1849లో దీని రచన పూర్తయింది. కవి స్నేహితుడు ఆర్థర్ హెన్రీ ఆత్మ శాంతికోసం రచయిత సంగీతాత్మకంగా రాసిన విషాదగీతమిది. దీని అసలు పేరు 'ద వే ఆఫ్ ద సోల్'.

✦ **కంకంటివారు : కంకంటి పాపరాజు**

పదిహేడో శతాబ్ది తెలుగు కవి. ఉత్తర రామాయణాన్ని ప్రౌఢ ప్రబంధంగా రచించి పండితుల ప్రశంసలందుకున్నాడు. ఈ గ్రంథం తెలుగు దేశంలో చాలా కాలంగా పఠన పాఠనాదులలో ఉంది.

✦ **జనక చక్రవర్తి**

హ్రస్వరోముడి కొడుకు. శీరధ్వజుడనే పేరుకూడ ఉంది ఇతనికి. మిథిలకు రాజు. రత్నమాలకు భర్త. కుశధ్వజుడి సోదరుడు. కొడుకుకోసం యజ్ఞం చేయదలచి భూమిని దున్నుతుంటే సీత దొరుకుతుంది. రాజర్షి.

✦ **సీతారామాంజనేయ కవి**

పరశురామపంతుల లింగమూర్తికి మరోపేరు సీతారామాంజనేయ కవి.

18వ శతాబ్ది పూర్వార్థంలోనివాడు. భక్తుడు, యోగి, మహాకవి, వేదాంత ప్రబంధ రచయిత. మహారాష్ట్ర నుంచి ఇక్కడకు వచ్చిన పరశురామ పంత్ అనే వంశంలో జన్మించిన వాడు లింగమూర్తి. లింగమూర్తి, గురుమూర్తి ఇతని బిరుదులు. భారద్వాజస గోత్రుడు. ఓరుగల్లులోని మట్టివాడ ఈయన స్వస్థలం. దత్తాత్రేయ గురు పరంపరలో చివరివాడైన మహాదేవయోగి అనే సిద్ధుడి శిష్యుడు ఈ లింగమూర్తి. ఈయన సీతారామాంజనేయ సంవాదం రాశాడు. బ్రహ్మాండపురాణంలో ఉన్న అధ్యాత్మరామాయణము బాలకాండలోని శ్రీరామ హృదయానికి మహాభాష్యరూపం సీతారామాంజనేయ సంవాద ప్రబంధం. మొదటి 3 ఆశ్వాసాలు తారక, సాంఖ్య, అమనస్క యోగాలను వివరిస్తాయి. ఈ కావ్యంలో సారాలంకార ప్రయోగం ఎక్కువ – భాగవతంతో సమానంగా ఈ గ్రంథం పల్లెటూళ్లలో కూడ వ్యాపించి విశేష ఆదరణ పొందింది.

**3. తాండవం**

ఒక ఉద్ధత నృత్య రీతి. పురుషులు చేస్తారు. పాద తాడనం తీవ్రంగా ఉండటం దీని లక్షణాలలో ఒకటి. కృష్ణుడు కాళీయుడి పడగల మీదా, శివుడు ప్రళయ కాలంలోను చేసిన నృత్యాన్ని పేరుతోనే పిలుస్తారు. ఆనంద తాండవం... ఇత్యాది భేదాలు కూడా ఉన్నాయి.

**4. ప్రేరణ**

**టాల్‌స్టాయ్** – (1829–1910) –రష్యన్ రచయిత. మహాత్మా గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ లాంటి వాళ్లను కూడ ఇతని రచనలు ప్రభావితం చేశాయి. 'వార్ అండ్ పీస్' (యుద్ధము – శాంతి), అన్నా కెరీనా ఇతని ప్రసిద్ధ రచనలు.

**స్కాట్** – మెలీసా స్కాట్ (1960–2006) సైన్స్ ఫిక్షన్ రాయడంలో ప్రసిద్ధురాలు. 'నైట్ స్కై మైన్' 'డ్రీమ్ షిప్స్' మొదలైనవి ఈమె రచనలు.

**హార్డే** – 1840–1928 (థామస్ హార్డీ), ఆంగ్ల నవలా రచయిత. వర్డ్స్‌వర్త్ ప్రాకృతికవాదానికి బాగా ప్రభావితుడయ్యాడు. దాన్ని బాగా ప్రచారం చేశాడు. 'ఫార్ ఫ్రమ్ మాడింగ్ క్రౌడ్' ఇతని రచన.

**కంచిపరమాచార్య** – జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి (1894 – 1994) కంచి కామకోటి పీఠానికి 68వ జగద్గురువు. ఈయనను పరమాచార్య / మహాస్వామి అని పిలుస్తుంటారు. తమిళనాడులోని విలిప్పురంలో కన్నడ బ్రాహ్మణ దంపతులకు అనురాధా నక్షత్రంలో జన్మించారు. తల్లిదండ్రులు స్వామినాథన్ అని పేరు పెట్టారు. స్వామివారి జాతకాన్ని చూసిన ఒక జ్యోతిష్కుడు పిల్లవాడని కూడా చూడకుండా సాష్టాంగనమస్కారం చేశారుట. భవిష్యత్‌లో ప్రపంచం మొత్తం

ఇతని కాళ్ళముందు సాష్టాంగ పడుతుంది. నేనప్పుడు ఉండను కాబట్టి ఇప్పుడే ఆ పని చేస్తున్నాని చెప్పారుట. స్వామివారు తమ 13వ ఏటనే కంచి పీఠాధిపతి అయ్యారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి అనే ఆశ్రమనామాన్ని స్వీకరించారు.

**ఏరోనాటికల్ ఇంజనీరింగ్** – ఏరోనాటిక్స్ పౌర, సైనిక విమానాల రూపకల్పన, తయారీ, నిర్వహణ, పరీక్షలకు సంబంధించినది. ఏరో డైనమిక్స్ అంశాలయిన స్ట్రక్చరల్ డిజైనింగ్, ప్రపల్షన్ ఇంజన్స్, నావిగేషన్, కమ్యూనికేషన్ మొ॥వి కూడ ఇందులో భాగాలే.

## 5. పద్యరత్నాలు

**గజస్నానం** – ఏనుగు చాల సేపు చెరువులో స్నానం చేసి బయటికి వస్తుంది. వెంటనే తలపై మట్టిని, దుమ్మును చల్లుకుంటుంది. అంటే ఫలితం లేని పని. అలాగే భక్తి లేనివాడు ఎన్ని నదుల్లో స్నానం చేసినా ఫలితం ఉండదు. ఎన్ని మంత్రాలు జపించినా నిష్ప్రయోజనమే. ఎన్ని హోమాలు చేసినా నిరర్థకమే.

## 6. ప్రబోధం

**తెలుగు అంకెలు – 1 –** ౧; **2 –** ౨; **3 –** ౩; **4 –** ౪; **5 –** ౫ **6 –** ౬; **7 –** ౭; **8 –** ౮; **9 –** ౯;

## 7. సీతక్క పెండ్లి

**అష్రఫీ –** అరబ్బుల చలామణిలో ఉన్న బంగారు నాణెం; మేలిమి గుణాలున్న వ్యక్తిని ఇలా పిలవడం పరిపాటి.

## 8. రుబాయీలు

**అద్వైతం –** జీవుడు దేవుడు ఒకటే అని చెప్పేదే అద్వైతం. ప్రాణశక్తి విశ్వమంతా వ్యాపించి ఉంటుందని అదే భగవత్స్వరూపమని దానివల్లే ప్రాణి కదలికలు ఏర్పడుతున్నాయని అద్వైతం చెబుతుంది. సకల ప్రాణులలో ఉన్న చైతన్య శక్తినే పరమాత్మగా / భగవంతుడిగా అద్వైతము గుర్తిస్తుంది. అద్వైత సిద్ధాంత కర్త శ్రీ ఆదిశంకరులు.

## 9. చూడడమనే కళ

**జంభోరి** – స్కౌట్ కార్యక్రమాల్లో ఒకటి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు ఒకచోట చేరడం.

## 11. ఊప్స

**భావుకుడు –** సాధారణ వ్యక్తికి కనిపించని కొన్ని సామ్యాలను, వైరుధ్యాలను భౌతిక ప్రపంచంలో చూడగలిగిన వాడిని భావుకుడు అంటారు. భావుకుడికి ఊహాశక్తి ఎక్కువ. (సంస్కృతంలో భావుకుడంటే బావమరది అని అర్థం.)

**తార్కికుడు/తర్కం –** ఇది తర్క శాస్త్ర ముఖ్య అంశాలలో ఒకటి. పాశ్చాత్య తర్కం అరిస్టాటిల్‌తో ప్రారంభమయిందని భావిస్తున్నారు. దీనిలోని గమనాత్మకంగా సాగే అనుమాన ప్రక్రియ ప్రాధాన్యం వహిస్తుంది. ఇది ఆకృతిక తర్కం. దీనిలో న్యాయ ప్రయోగ విషయం కంటె ఆకృతి ముఖ్యం. నిగమన తర్కం విజ్ఞానశాస్త్ర సముపార్జనకు వినియోగంచేదని భావించిన బేకన్ ఆగమన తర్కాన్ని అభివృద్ధి చేశాడు. ఇది అనుభవాత్మకంగా సాగుతుంది. దీనిలో విషయం ప్రాముఖ్యం వహిస్తుంది. తరువాత తర్కం గణితాత్మకమయి సాంకేతిక తర్కంగా అభివృద్ధి చెందింది. భారతీయ దర్శనంలో తర్కాన్ని న్యాయమంటారు. షడ్దర్శనాలలో న్యాయ దర్శన మొకటి. నైయాయికులు న్యాయాన్ని బాగా అభివృద్ధి చేసారు. బౌద్ధంలోను, జైనంలోను తర్కం ప్రముఖస్థానమాక్రమిస్తుంది. మాధ్యమికుల శూన్య వాదంలోనూ, జైనుల సప్త భంగినయంలోనూ శంకరుని అద్వైత ప్రతిపాదనం లోను భారతీయ తర్కం పరాకాష్ఠనందింది.

**సంజీవిని –** ఓషధి. మరణించిన వారిని బ్రతికించగలదు. ద్రోణ, చంద్ర పర్వతాలపై ఉంటుంది. సుషేణాదులకు ఈ విషయం తెలుసు. రామ రావణ యుద్ధంలో లక్ష్మణాదులు మూర్ఛిల్లినపుడు హనుమంతుడు దీనిని తీసుకువచ్చి వారిని బ్రతికిస్తాడు.

**గుదిబండ –** చెప్పినమాట వినని పశువుల మెడకు ఒక కఱ్ఱ తగిలిస్తారు. ఇదే గుదిబండ. తన అభివృద్ధికి అడ్డం వచ్చే వారిని, పనులను ఆటంకపరచేవారిని గుదిబండలాగ తయారయ్యాడు అని చెప్పడం పరిపాటి.

**శిబిశరీరం –** త్యాగానికి, దానానిని ప్రతీక. శిబి ఉశీనరుడి కొడుకు. ఇతడి పరిపాలనలో రాజ్యం సుభిక్షంగా ఉండేది. శరణాగత రక్షణకు ప్రసిద్ధి చెందాడు. ఇంద్రుడు డేగగాను, అగ్ని పావురంగాను మారి ఇతని త్యాగ నిరతిని పరీక్షించారు. ఇతడు తన శరీరాన్ని కూడ కోసి ఇవ్వడానికి వెనకాడకపోవడంతో సంతోషించి అనేక వరాలనిచ్చి వెళ్లారు. – భారతం / భాగవతం.

**బలిత్యాగం –** ఇతడికే మహాబలి అనే పేరుకూడ ఉంది. రాక్షసుల రాజు. విరోచనుడి కొడుకు. భార్య అశన. కొడుకు బాణుడు. కూతురు రత్నమాల. ఇతనికి నివాత కవచులనే నాలుగు కోట్లమంది రాక్షసులు పుడతారు. వామనుడివల్ల పరాజితుడై పాతాలంలో నివసిస్తాడు. ఆడినమాట తప్పకపోవడానికి, దానానికి బలి ప్రసిద్ధి చెందాడు. తన గురువైన శుక్రాచార్యుడు వద్దని చెబుతున్నా వినకుండా వామన రూపంలో వచ్చిన విష్ణువుకు మూడడుగుల నేల ధారపోశాడు. వామనుడు త్రివిక్రముడై ఒక అడుగు భూమిమీద, మరొక అడుగు ఆకాశం మీద వేసి, మూడో అడుగు ఎక్కడ పెట్టాలంటాడు. తన నెత్తిపై పెట్టమని చెప్పాడు బలి. దానికోసమే ఎదురు చూస్తున్న వామనుడు బలిని పాతాళానికి అణగదొక్కుతాడు. – భాగవతం.

**పాతాళం –** పాతాళం (భూమికింద ఉన్న) ఏడు అధో లోకాలలో చివరిది. నాగుల నివాస స్థానం. అతల, వితల, సుతల, తలాతల, రసాతల, పాతాళ లోకాలు భూమి కింద ఉన్నాయి. వీటిని మయుడు నిర్మించాడు. – దేవీ భాగవతం.

## 12. బతుకు పుస్తకం

**అతడు – ఆమె –** ఉప్పల లక్ష్మణ రావుగారు రాసిన నవల.

**రీడబిలిటీ –** పుస్తకం మొదటినుంచి చివరివరకు ఆగకుండా చదివించే గుణాన్ని పఠనీయత (రీడబిలిటీ) అంటారు.

**రికామి –** ఏ విధమైన బరువు బాధ్యతలు లేకుండా స్వేచ్ఛగా తిరిగేవాడు.

**జిజ్ఞాసువు –** తెలుసుకోవాలనే కోరిక కలవాడు. 'జ్ఞాతుం ఇచ్ఛ జిజ్ఞాస'. జిజ్ఞాస కలవాడు జిజ్ఞాసువు.

**సహృదయుడు –** సహృదయుడనగా సమానమైన (కవి, నాయకుల హృదయంతో సమానమైన) హృదయం కలవాడని అర్థము. అభినవగుప్తుడు ధ్వన్యాలోక లోచనంలో సహృదయ పదాన్ని ఇలా నిర్వచించారు. 'ఏషాం కావ్యానుశీలనవశాత్ విశతీభూతే మనో ముకురే వర్ణనీయ తన్మయీభవన యోగ్యతా తే హృదయ సంవాద భాజః సహృదయాః' – అనగా దృశ్య / శ్రవ్య కావ్యాలను పరిశీలించడం వల్ల హృదయం బాహ్య విషయ జ్ఞానం నుంచి ముక్తమై శుద్ధమైన అద్దంలాగ భాసిల్లుతుంది. అప్పుడు ఆ కావ్యంలో వర్ణితములయిన విభావాదులు సూటిగా దాంట్లో ప్రతిఫలిస్తాయి. అప్పుడు సహృదయుడికి కావ్యగత నాయకాదులతో తన్మయత్వము (అభేద ప్రతిపత్తి) కలుగుతుంది. అలాంటివారే సహృదయులు.

> "యస్తుష్టౌ తుష్టిమాప్నోతి శోకే శోకముపైతి చ
> క్రోధే కృద్ధో భయే భీరుస్సశ్రేష్ఠః ప్రేక్షకః స్మృతః" – కావ్యాలంకార సంగ్రహం

–ఎవడు నాయకుని తుష్టియందు తాను తుష్టినందునో, శోకమునందు శోకము చెందునో, క్రోధమున కృద్ధుడగునో, భయమున భయపడునో వాడు శ్రేష్ఠుడయిన ప్రేక్షకుడు. వాడే సహృదయుడు.

**ఆస్తికులు –** భగవంతుడు ఉన్నాడని నమ్మేవారు.

**హేతువాదులు –** హేతువే జ్ఞానానికి మూలం అని చెప్పే వాదం. సత్యాన్ని తెలుసుకోవాలంటే హేతువే మార్గం. హేతువే వాస్తవం ఏమిటనే విషయాన్ని నిర్ణయిస్తుంది. అన్నిటికన్న ఆలోచన, తర్కం ముఖ్యం. కేవలం ఇంద్రియాల ద్వారాను,

సంప్రదాయాలద్వారాను, దేవదూతల జ్ఞాన బోధ ద్వారాను, జ్ఞానం వస్తుందని భావించి దానిమీదే ఆధారపడకుండా, దానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, 'హేతువు' 'తర్కం' అనే అంశాలకే ప్రాధాన్యత ఇవ్వాలనే ధోరణి. హేతువాద దృక్పథంతో సంప్రదాయ భావాలనూ, సాహిత్య ప్రక్రియలనూ విలువలనూ తిరస్కరించిన రచయితలను హేతువాద రచయితలు అన్నారు. వీళ్లు ముఖ్యంగా మత గ్రంథాలనూ, ప్రాచీన కావ్యాలనూ, సంప్రదాయ గ్రంథాలనూ, సమస్తాన్నీ హేతువాద దృష్టితో విమర్శించడమో; తిరిగి రాయడమో చేశారు. అలా, హేతువాదం కూడ ఆధునికసాహిత్యంలో ఒక ముఖ్య భాగం అయింది.

**పెట్టుబడిదారీ వ్యవస్థ –** ఇది ఒక ఆర్థిక వ్యవస్థ. దీంట్లో ఉత్పత్తి సాధనాలు వ్యక్తిగత యాజమాన్యంలో ఉంటాయి. 'లాభం'కోసం పనిచేస్తాయి. ఈ వ్యవస్థలో ఆదాయం రెండు రూపాల్లో ఉంటుంది. ఒకటి లాభం, రెండోది వేతనాలు. సహజ వనరులపై నియంత్రణ ద్వారా, వడ్డీ రూపంలో కూడ పెట్టుబడిదారు లాభాన్ని పొందుతుంటాడు.

**సోషలిష్టు సమాజం / సోషలిజం –** పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా వచ్చిన సిద్ధాంతం. వర్గ రహిత సమాజం దీని లక్ష్యం. ఆ లక్ష్యం దిశగా పెట్టుబడి దారీ వ్యవస్థ లోనే సంస్కరణలకోసం కృషి చేస్తుంటారు.

## 13. భూమిపుత్రుడు

**బోడితలకు, మోకాలికి ముడిపెట్టడం –** సంబంధం లేని విషయాల మధ్య సమన్వయం కుదర్చాలని ప్రయత్నించడం.

**చిటికెల పందిళ్లు –** అరిచేతిలో స్వర్గం చూపించడం. ఆచరణకు దూరంగా ఉంటూ మాటల్లో గొప్పగా ఉండటం. పందిరి వేయాలంటే గుంజలు, తాళ్ళు, మొదలైనవి కావాలి. అలాకాకుండా చిటికెలో పందిరి వేస్తానని కొందరు గొప్పలు చెబుతుంటారు. వాళ్ళను బట్టి ఏర్పడిందే ఈ జాతీయం.

## 14. ధర్మదీక్ష

**గోధూళివేళ –** సాయం సమయం. ఆవులు పొలాల్లో గడ్డిమేసి ఇంటికి తిరిగి వచ్చే సమయం. ఆ సమయంలో గోవుల గిట్టల వల్ల ధూళి ఎగిసి శోభావహంగా ఉంటుంది.

**తీర్థప్రజ –** జాతరకు, ఉత్సవాలకు ఒకచోట గుమికుడిన ప్రజా సముదాయం.

**గౌతమబుద్ధుడు, తథాగతుడు, గౌతమ దేవుడు –** (క్రీ.పూ. 573–493) బౌద్ధ ధర్మ ప్రతిపాదకుడు. మాయా, శుద్ధోధనుల కుమారుడు. శాక్యముని, సిద్ధార్థుడు అనే ప్రసిద్ధ నామాంతరాలున్నాయి. యశోధరను వివాహమాడాడు. రాహులుడనే కుమారుడు కలిగినాడు. 'దుఃఖమయమయిన సాంసారిక జీవితం మీద విరక్తి చెంది సన్న్యాసం స్వీకరించాడు. సాంప్రదాయిక బోధనలతో శరీర శోషణ విధానాలతో తృప్తి చెందక స్వయంగా సంపూర్ణ జ్ఞానం పొంది బుద్ధత్వమందాడు. దుఃఖం, అనిత్య, అనాత్మ భావాలు బుద్ధుని ప్రవచన సారాంశాలుగా పరిగణిస్తున్నారు. ప్రాపంచిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వటం, కార్యకారణాత్మకంగా సమస్యలను పరిశీలించడం, దేవుని ప్రస్తావించక పోవడం బుద్ధుని విశేషం. అతని బోధనలద్వారా బౌద్ధ ధర్మము అభివృద్ధి చెందింది.

**యామము –** జాము అంటే మూడు గంటల కాలం, ఏడున్నర గడియల కాలం. గడియ అంటే 24 నిమిషాల కాలం.

**పంచప్రాణాలు –** ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలు; ప్రాణం = గాలి, వాయువు, హృదయమందలి గాలి; అపానం = పిత్తు (గుదం నుండి వెలువడే గాలి); వ్యానం = శరీరమంతటను వ్యాపించిన వాయువు; ఉదానం = కంఠమునందుండునట్టి వాయువు; సమానం = నాభియందలి వాయువు;.

**నవనాడులు –**

| నాడులు | స్థానాలు | అధిదేవతలు |
|---|---|---|
| ఇడ, | కుడి | శివుడు |
| పింగళ, | ఎడమ | విష్ణువు |
| సుషుమ్న, | మధ్యమ | బ్రహ్మ |
| గాంధార, | నేత్ర | ఇంద్ర |
| హస్తిని, | జిహ్వ | వరుణ |
| పుష (పూషా), | కుడి | దిగ్దేవత |
| పయస్విని, | ఎడమ | సద్యోద్భవుడు |
| అలంబస, | లింగ | వాయు |
| కుహు, | గుద | భూమి |

**నిర్వాణం –** బౌద్ధమతంలో ప్రాచుర్యం పొందిన పదం నిర్వాణం. మోక్షానికి సమానంగా ఈ పదాన్ని వాడతారు. నిశ్వసించటమని, చల్లారటమని, ఏమి లేకుండా పోవటమని, ఆర్పివేయటమని నిర్వాణానికి మరికొన్ని అర్థాలు. రాగ ద్వేష మోహాలు లేకుండా యోగ ముద్రతో సమాధి అవస్థలో ఉండటాన్నే నిర్వాణమన్నారు బౌద్ధులు. కామ క్రోధాదులు పూర్తిగా ఉపశమించిన అవస్థ నిర్వాణం. నింద్యమయిన కోరికలు, భావాలు, తృష్ణ వేదన, కామము – అన్నీ దానిలో నశిస్తాయి. శూన్యత, అనిమిత్త, అప్రణిహితాలు నిర్వాణ మార్గాలు. వాటి ద్వారా నిర్వాణం సిద్ధిస్తుంది. అర్హతుడు ఈ మూడు ద్వారాల ద్వారా ప్రయత్నించి నిర్వాణం పొందుతాడు. అర్హతావస్థనందుకొన్న వారికి పునర్జన్మ ఉండదు. బౌద్ధులు రెండు రకాల నిర్వాణాన్ని గుర్తించారు. ఉపాధి శేష నిర్వాణం, అనుపాధి శేష నిర్వాణం. ఉపాధిశేషనిర్వాణంలో రాగద్వేషాలు నిరోధితాలయిన వ్యక్తి జీవించే ఉంటాడు. పంచ స్కంధాలు పవిత్రరూపంలో ప్రకాశిస్తాయి. అనుపాధిశేష నిర్వాణంలో అమరత్వం శాంతి నిర్భయత్వం ఉంటాయి. దీనిలో వ్యక్తి మరణంతో బాటు స్కంధ జీవితం కూడ పూర్తవుతుంది. ఈ నిర్వాణంలో నాలుగు దశలున్నాయి. స్రోతాపన్నులు, సకృదాగాములు, అణగాములు, అర్హులు.

**క్రోశము –** రెండువేల విండ్ల పట్టు కొలది, కోసు.

*ఉపాధ్యాయుల బాధ్యత*

***పాఠశాల సమాజం యొక్క సూక్ష్మరూపం. సమాజంలోని అనిశ్న వైవిధ్యాలు పాఠశాలలో కూడా ప్రతిబింబిస్తాయి. వైవిధ్యం ఒక సహజ దృగ్విషయం. ఈ సామాజిక వైరుధ్యాలను అభ్యసనను అడ్డంకిగాను, బలహీనతలను ఉపాధ్యాయులు భావించరాదు. పిల్లల విభిన్న నేపథ్యాలను, వారి భాషలను, కళలను, సంస్కృతులను బోధనావనరులుగా ఉపయోగించుకోగలగాలి. ఉపాధ్యాయులు పరిశోధకులుగా, ప్రతిస్పందిత సాధకులుగా, భాగస్వామ్య అభ్యాసకులుగా కీలక పాత్రను పోషించాలి.***

***– ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం – 2011***

# 9 నిరంతర, సమగ్ర మూల్యాంకనం - నమూనా ప్రశ్నలు - ప్రశ్న పత్రాలు

నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం 2009 మన రాష్ట్రంలో 2010 ఏప్రిల్ మాసం నుండి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు జరగాలి. ఆర్.టి.ఇ.2009 చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించే సామర్థ్యాన్ని లేదా అన్వయించే సామర్థ్యాన్ని నిరంతరంగా, సమగ్రంగా మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. పిల్లల యొక్క శారీరక, మానసిక శక్తులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది తద్వారా పిల్లలు సర్వతోముఖాభివృద్ధి జరగాలని చట్టం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో నిరంతర, సమగ్ర మూల్యాంకనాన్ని అన్ని విషయాలు అనగా పాఠ్య, సహపాఠ్య విషయాల్లో పూర్తిస్థాయిలో అమలుపరచాల్సి ఉంటుంది.

**భావనల అవగాహన**

అ) **నిరంతర మూల్యాంకనం :** పిల్లల అభివృద్ధిని, ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనావేసి అవసరమైన చర్యలు చేపట్టడం ఎప్పుడూ కొనసాగాలి. పిల్లల ప్రగతిని కేవలం పరీక్షల ద్వారానే కాకుండా ఇతర సాధనాల ద్వారా ఎప్పటికప్పుడు అంచనావేయాల్సి ఉంటుంది. తరగతిలో, తరగతి గది బయట, బోధనాభ్యసన ప్రక్రియల సమయంలో కూడా పిల్లల ప్రగతిని తెల్సుకోవడం మరింత పురోభివృద్ధి సాధించడం అనేది నిరంతరం జరగాలి.

ఆ) **సమగ్ర మూల్యాంకనం :** పిల్లల అభివృద్ధిని అంచనావేయడం కేవలం పాఠ్య విషయాలకే పరిమితం కారాదు. పాఠ్య విషయాలతోపాటు సహ పాఠ్య విషయాలు అనగా కళలు - సాంస్కృతిక విద్య, పని-కంప్యూటర్ విద్య, వ్యాయామ ఆరోగ్య విద్య, విలువల విద్య మొదలగువాటిని కూడా మూల్యాంకనం చేయాలి. ఇలా పిల్లల సర్వతోముఖాభివృద్ధితో సంబంధం ఉన్న పాఠ్య, సహపాఠ్య విషయాల మూల్యాంకనం చోటుచేసుకోవడాన్ని సమగ్ర మూల్యాంకనం అంటారు. పాఠ్య విషయాలలో ఆయా సబ్జెక్టుకు సంబంధించిన సామర్థ్యాలు / అభ్యసనాఫలితాలు / ఆశించేఫలితాలు / నైపుణ్యాలు మొదలగు వాటిని మూల్యాంకనం చేస్తాం. అట్లే సహపాఠ్య విషయాలలో కూడా పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు / నైపుణ్యాలు / ఆశించిన ఫలితాలు / అభ్యసనా ఫలితాలను కూడా మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఐతే సహపాఠ్య విషయాలను ప్రత్యేకంగా బోధించి మూల్యాంకనం చేయాల్సి ఉన్నప్పటికీ ఇవి ఆయా సబ్జక్టులలో కూడా అంతర్లీనంగా ఉంటాయి. కాబట్టి పిల్లల యొక్క శక్తి సామర్థ్యాలు, వైఖరులు, నైపుణ్యాలు, జ్ఞానాత్మక అంశాలను ఇలా అన్నింటినీ కలిపిచేసిన మూల్యాంకనాన్ని సమగ్ర మూల్యాంకనమని భావిస్తారు.

ఇ) **నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు – మూల్యాంకనం రకాలు :** నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని అమలుజరపడానికి ప్రధానంగా మూల్యాంకనాన్ని రెండు విధాలుగ నిర్వహిస్తారు. వాటిలో మొదటిది నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation), రెండవది సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Evaluation).

ఈ) **నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation) :** పిల్లలు ఎలా నేర్చుకొంటున్నారు? ఏమి నేర్చుకొంటున్నారు? ఎక్కడ వెనుకబడుతున్నారు? దీన్ని ఎలా సరిదిద్దాలి? అనే అంశాలను ఎప్పటికప్పుడు అంచనావేస్తూ, అవసరమైన చర్యలను చేపట్టి ప్రగతిని సాధించడానికి తోడ్పడేదే నిర్మాణాత్మక మూల్యాంకనం. ఇది నిరంతరం జరుగుతూ ఉంటుంది. బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ సమయంలో, తదనంతరం, పిల్లలూ తోటి వారితో కల్సి పనిచేస్తున్నప్పుడు, కృత్యాలు / ప్రాజెక్టులు / అన్వేషణలు వంటి కార్యకలాపాలలో పాల్గొంటున్నప్పుడు నిర్మాణాత్మక మూల్యాంకనం చోటుచేసుకొంటుంది. ప్రధానంగా ఇది నేర్చుకోడానికి తోడ్పడేది. (Evaluation for learning) అనగా పరీక్షించడానికి లేదా అంచనావేయడానికి పరిమితంకాకుండా, తదుపరి అభివృద్ధికి లేదా ప్రగతికి తోడ్పడుతుంది.

**సాధనాలు :–** నిర్మాణాత్మక మూల్యాంకనం అనేది కేవలం పరీక్షలకే పరిమితం కాదు. ఇతర ప్రత్యామ్నాయ సాధనాలపై ఆధారపడుతుంది. నిర్మాణాత్మక మూల్యాంకనం స్వభావరీత్యా నిరంతరం జరుగుతుంటుంది కాబట్టి కింది సాధనాలను నిర్మాణాత్మక మూల్యాంకనంలో వినియోగిస్తారు.

సాధనాలు :–

i) **పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు (Participation & reflections)**

ii) **పిల్లలు రాసిన అంశాలు (నోటుబుక్కులు, అసైన్‌మెంట్లు మొదలగునవి) (Children Written Works)**

iii) **లఘు పరీక్ష (Slip Test)**

iv) **ప్రాజెక్టు పనులు (Project Works)**

## నిర్మాణాత్మక మూల్యాకనం నిర్వహణ :

నిర్మాణాత్మక మూల్యాకనంలో భాగంగా పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అంచనావేస్తున్నప్పటికీ, వారి ప్రగతిని మాత్రం ఒక విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు మాత్రమే నమోదుచేస్తాం. అది **జూలై, సెప్టెంబర్, డిసెంబర్, ఫిబ్రవరి మాసాల్లో** నమోదుచేయాలి. ఇంతకు ముందు తెల్పిన సాధనాల ప్రకారం వివరాలు నమోదుచేయాలి. నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని **50 మార్కులకు** నిర్వహిస్తారు. వాటి వివరాలు :

| క్ర.సం | అంశం | కేటాయించిన మార్కులు | ఆధారాలు |
|---|---|---|---|
| 1. | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు | 10 మార్కులు | ఉపాధ్యాయుడి డైరీ, తోటి పిల్లల ప్రతిస్పందనలు |
| 2. | పిల్లలు రాసిన అంశాలు | 10 మార్కులు | నోటుబుక్కులు, అసైనుమెంట్లు, పోర్టుఫోలియోలు |
| 3. | లఘుపరీక్ష (స్లిప్‌టెస్టు) | 20 మార్కులు | పిల్లలు రాసిన జవాబు పత్రాలు / జవాబులు రాసిన నోటుబుక్కు |
| 4. | ప్రాజెక్టుపనులు | 10 మార్కులు | ప్రాజెక్టుపని నివేదికలు |
| 5. | మొత్తం | **50 మార్కులు** | – |

- **పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు :** పిల్లలు వినడం, విన్నదాన్ని అర్థం చేసుకోవడం, చదివిన దాన్ని అర్థం చేసుకోవడం, తమ ఆలోచనలను వ్యక్తం చేయడం, ప్రశ్నించడం వంటివి చేయడానికి మాట్లాడాల్సి ఉంటుంది. పిల్లలు వివిధ రకాలైన కృత్యాలలో, బోధనాభ్యస ప్రక్రియల్లో పాల్గొనాల్సి ఉంటుంది. తమ తోటి వారితో, సామగ్రితో, ఉపాధ్యాయులతో ప్రతిచర్యలు జరపాల్సి ఉంటుంది. పిల్లలను ప్రశ్నిస్తున్నప్పుడు, పిల్లలే ప్రశ్నిస్తున్నప్పుడు, జట్టు పనుల్లో పాల్గొంటున్నప్పుడు, ప్రాజెక్టు పనుల్లో పాల్గొనేటప్పుడు పిల్లల భాగస్వామ్యాన్ని పరిశీలించడం ద్వారా వారి భాషాస్థాయిని అంచనావేయవచ్చు. ప్రధానంగా భాషలో విన్నదాని గురించి, తెల్సినదాని గురించి, చదివిన దాని గురించి ప్రశ్నించినప్పుడు వారి ప్రతిస్పందనల ద్వారా అవగాహన స్థాయిని అంచనావేయవచ్చు. ఇది నిరంతరం రోజువారీగా జరిగే ప్రక్రియలు. ఆయా సందర్భాలలో ప్రతిస్పందన ద్వారా పిల్లలు వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం, అర్థంచేసుకోవడం వంటి సామర్థ్యాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం ఉపాధ్యాయులు తమ పరిశీలనలపై ఆధారపడాలి. పిల్లల యొక్క భాగస్వామ్యం తీరుతెన్నుల గురించి, ప్రతిస్పందనాశక్తి గురించి తమ పరిశీనలను ఉపాధ్యాయులు తమ డైరీలో నమోదుచేసుకోవడం ద్వారా వారి స్థాయిని మూల్యాంకనం చేయవచ్చు.

- **పిల్లలు రాసిన అంశాలు :** భాషాసామర్థ్యాలలో రాయడం ఒక ముఖ్యమైన సామర్థ్యం. ప్రాథమికంగా పిల్లలు తప్పుల్లేకుండా రాయడం, అందంగా రాయడంతో మొదలైన ఈ సామర్థ్యం క్రమేణా సొంతంగా రాయడం, క్రమపద్ధతిలో రాయడం, విశ్లేషణాత్మకంగా రాయడం, నివేదికలు రాయడం, అభిప్రాయాలు రాయడం, విమర్శనాత్మకంగా రాయడం, సృజనాత్మకంగా రాయడం వంటి సామర్థ్యాల స్థాయికి చేరుతుంది. 'రాయడం' లో సామర్థ్యం రాస్తూ ఉంటేనే వృద్ధి చెందుతుంది. ఇందుకోసం కేవలం పరీక్షలప్పుడు రాసే జవాబు పత్రాలపైననే ఆధారపడడం ద్వారా పిల్లల రాసే సామర్థ్యాన్ని పూర్తిగా అంచనావేయలేం. ఇది నిరంతరం జరగాలి. ఇందుకోసం పిల్లలు ప్రతి రోజూ ఏదో ఒకదాన్ని గురించి ఎంతో కొంత రాయాల్సి ఉంటుంది.

  పిల్లల నోటుబుక్కులు, ప్రాజెక్టుపని నివేదికలు, సేకరించిన అంశాలు, పిల్లలు రాసే కవితలు, కథలు, గేయాలు, అసైన్‌మెంట్లు వంటివన్నీ కూడా పిల్లల రాత పనులకు నిదర్శనాలు. వీటిని పిల్లలు రాసే విధానాన్ని నిరంతరం అంచనావేయాల్సి ఉంటుంది. పిల్లలు రాసిన అంశాలతో పోర్టుఫోలియోలు తయారుచేయడం, పుస్తకసంకలనాలు తయారుచేయడం ద్వారా తరగతిలో భద్రపరచవచ్చు. వీటి ఆధారంగా పిల్లలు రాసే సామర్థ్యాన్ని అంచనావేయవచ్చు. ఈ ప్రగతిని నమోదుచేయవచ్చు.

- **లఘు పరీక్ష (స్లిప్ టెస్టు) :** ఇది సాధారణంగా నిర్వహించే రాతపరీక్షకాదు. దీన్ని నిర్వహించడానికి నిర్దిష్ట సమయం కానీ, ముందస్తు ప్రణాళికగానీ, పిల్లలకు ముందే తెలపాల్సిన అవసరంకానీ ఉండదు. అప్పటికప్పుడు పిల్లల స్థాయిని అంచనావేయడానికి నిర్వహించేపని. చదివింది అర్థంచేసుకోవడం గురించి లేదా సొంతంగా సొంతమాటల్లో రాయడం గురించి లేదా పదజాల వినియోగం గురించి లేదా వ్యాకరణాంశాల గురించి లేదా సృజనాత్మకత గురించి లేదా ప్రశంస గురించి .... ఇలా ఏ సామర్థ్యం గురించైనా కావచ్చు, పిల్లల సామర్థ్యాన్ని అప్పటికప్పుడు పరీక్షించడానికి ఉద్దేశించినది లఘుపరీక్ష. ఒక పాఠం పూర్తయిన తర్వాతకూడా నిర్వహించుకోవచ్చు. ఐతే సి.సి.ఇ. పేరుతో చీటికి మాటికి పరీక్షించి పిల్లలను మరింత ఒత్తిడికి లేదా ఆందోళనకు గురిచేయరాదు. సాధారణంగా ఇచ్చే ఇంటిపని లాగానే పీరియడ్‌లో అప్పటికప్పుడు నిర్వహించుకోవచ్చు.

- **ప్రాజెక్టుపనులు :** భాషానైపుణ్యాలు అనగా వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం గురించి అందరికీ తెల్సు. ఐతే భాషా బోధన వీటి సాధనకే పరిమితం కాకుండా సృజనాత్మకత, కల్పనాశక్తి, ప్రశంసా పూర్వకమైన వైఖరి నిర్మాణం, మానవ సంబంధాల మెరుగుదల, మానసికోల్లాసం వంటి సాధనకు కూడా తోడ్పడాలి. తరగతి గదుల్లో భాషా నైపుణ్యాల సాధనకు అభ్యాసం కల్పించినా, సందర్భోచితంగా వీటిని వినియోగించే సమర్థత, కల్పనచేయడం, ఆలోచించడం, నిర్ణయాలు గైకొనడం, వాటికి కట్టుబడడం, నివేదికలు రాయడం, వాటిని చక్కగా ఎదుటివారికి వివరించగల్గడం వంటి అనేక సామర్థ్యాలు సాధింపబడడానికి భాషలో కూడా ప్రాజెక్టుపనులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఎ.పి.ఎస్.సి.ఎఫ్. 2011 పేర్కొన్నట్లు అభ్యసనం పాఠ్యపుస్తక పరిధి దాటాలి. అదనపు పఠన సామగ్రిని పిల్లలు చదవాలి. పిల్లల్లో భాషాభిమానం, భాషాభిరుచి పెరగాలి. పఠనాశక్తి పెరిగి స్వతంత్ర్య పాఠకులుగా ఎదగాలి. ఇందుకోసం అనేక కృత్యాలు, సామర్థ్యాల సమాహారమైన ప్రాజెక్టుపనులను నిర్వహించాలి. నూతన భాషా వాచకాలలో ప్రతి పాఠంలో ఒక ప్రాజెక్టుపనిని ఇచ్చారు. వీటిని పిల్లలతో చేయించాలి. నివేదికలు రాయించాలి. ఈ నివేదికలను పోర్టుఫోలియోల రూపంలో భద్రపరచాలి. వీటి ఆధారంగా పిల్లల ప్రగతిని అంచనావేసి నమోదుచేయాలి.

ఉ) **సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Evaluation) :** నిర్దిష్ట కాలపరిమితికి నిర్ధారించిన అంశాల ఆధారంగా ఆశించిన భాషా సామర్థ్యాలను ఎంతమంది పిల్లలు సాధించగల్గుతున్నారు? లేదా ఒక విద్యార్థి ఎంతమేరకు సామర్థ్యాలను

పొందాడో తెల్సుకోడానికి దోహదపడేది సంగ్రహణాత్మక మూల్యాంకనం. సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని సాధారణంగా రాతపరీక్షల ద్వారా, మౌఖిక పరీక్షల ద్వారా నిర్వహిస్తారు. ఒక విద్యా సంవత్సరంలో దీన్ని రెండుసార్లు నిర్వహించాల్సి ఉంటుంది. **మొదటిది అక్టోబర్ మాసంలో, రెండవది మార్చి లేదా ఏప్రిల్ మాసంలో** నిర్వహించాలి.

## సంగ్రహణాత్మక మూల్యాంకనంలో వేటిని మూల్యాంకనం చేయాలి?

భాషాబోధన యొక్క లక్ష్యం భాషా సామర్థ్యాలను సాధింపచేయడమే! అందుకే నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించేటపుడు సాధించాల్సిన సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకొన్నారు. విద్యాసంవత్సరం పూర్తయ్యేనాటికి ఏఏ సామర్థ్యంలో ఎంతవరకు వేటిని సాధించాలో పాఠ్యపుస్తకాలలో వివరాలు పొందుపరచారు. వీటికి అనుగుణంగా పాఠ్యపుస్తకంలో ప్రతి పాఠం చివర **'ఇవి చేయండి'** పేరుతో అభ్యాసాలను పొందు పర్చారు. సంగ్రహణాత్మక మూల్యాంకనంలో ఏ ఏ భాషా సామర్థ్యాలను మూల్యాంకనం చేయాలో తెల్సుకొందాం.

### 1. వినడం, ఆలోచించి మాట్లాడడం

పిల్లలు గేయాలు, పాటలు, కథలు, సంభాషణ అన్ని అర్థంచేసుకోవాలి. విన్న అంశాన్ని / సారాంశాన్ని క్రమ పద్ధతిలో సొంతమాటల్లో చెప్పగలగాలి. పిల్లలు తాము విన్న వాటి గురించి అభిప్రాయాలు చెప్పగలగడం, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడాలి. కారణాలు చెప్పగలగాలి. చిన్న చిన్న ప్రసంగాలు ఇవ్వగలగాలి. చర్చించడం, వాదించడం, వివరించడం, వ్యాఖ్యానించడం మొదలగునవన్నీ మాట్లాడడానికి ప్రతి రూపాలు. ఈ సామర్థ్యాన్ని పిల్లలు పొందాలి.

### 2. ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం.

వివిధ ప్రక్రియలు అనగా కథలు, గేయాలు, పాటలు, వార్తలు, సంభాషణలు వంటివి చదివి అర్థం చేసుకోవాలి. దీని ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడం, విషయాలను క్రమపద్ధతిలో పట్టికలో రాయడం, చదివిన అంశం ఆధారంగా ప్రశ్నలురాయడం, తప్పొప్పులు గుర్తించడం, పాత్రలు, స్వభావాల పట్టికతయారు చేయడం వంటివి చేయగలగాలి. ఉన్నత స్థాయిలో పరిచిత అంశాలతోపాటు అపరిచత పద్యం, గద్యం, వ్యాసం ..... వంటివి చదివి అర్థంచేసుకోగలగాలి. విశ్లేషించగలగాలి. కీలకాంశాలు గుర్తించగలగాలి.

### 3. ఆలోచించి రాయడం / స్వీయరచన : –

పిల్లలు తమకుతెల్సిన, విన్న చూసిన, చదివిన అంశాల గురించి సొంతంగా ఒకటి, రెండు పేరాలు రాయగల్గాలి. అభిప్రాయలను, ఆలోచనలను రాయగలగాలి. సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి. సొంతమాటల్లో వివరిస్తూ రాయడం, వ్యాసరూపంలో రాయగలగడం జరగాలి.

### 4. పదజాలం :–

పాఠంలోని పదాలకు అర్థాలు గ్రహించగల్గాలి. వాటితో వాక్యాలు రాయగల్గాలి. వీటిని సందర్భోచితంగా వినియోగించగల్గాలి. నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్తి అర్థాలు, ప్రకృతి – వికృతి పదాలు, వచనాలు జాతీయాలు మొదలగు వాటిని సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలి. వినియోగించగలగాలి.

### 5. సృజనాత్మకత :–

కథలు, కవితలు, గేయాలు పొడించగలగడం, సొంతంగా రాయగలగలడం, పోస్టరు, కరపత్రం, గ్రీటింగ్‌కార్డులు, నినాదాలు, సూక్తులు, సంభాషణలు రాయగలగాలి. కథలు, చిత్రాల ఆధారంగా సంభాషణలు రాసి అభినయించగలగాలి. వర్ణనలు, ప్రసంగ పాఠాలు, సంపాదకీయం, పీఠిక, సమీక్ష, ఆత్మకథ, యాత్రావర్ణన వంటివి రాయగలగాలి.

### 6. ప్రశంస :–

ఇతరులు అనగా బాలికలు, ఇతర మతాలు, వర్గాలు, వికలాంగులు మొదలగువారిలోని గొప్పతనాన్ని గుర్తించి ప్రశంసించగలగాలి. ఇతరుల సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించగల్గాలి. పిల్లలో ఇతరులను అభినందించేవైఖరి పెంపొందాలి. తెలుగుభాషపై అభిమానాన్ని ప్రదర్శించడం, ప్రశంసించడం, కవుల రచనాశైలిని ప్రశంసించడం వంటివి చేయగలగాలి.

**7. భాషను గురించి తెల్సుకోవడం :-**

కాలాలు, క్రియలు, క్రియల్లో భేదాలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, వాక్యనిర్మాణరకాలు మొదలగువాటిని చేసుకోవాలి. వాటిని వివరించగలగాలి.

## సంగ్రహణాత్మక మూల్యాంకనం, ప్రశ్నపత్రం రూపొందించడానికి సూచనలు

- సంగ్రహణాత్మక పరీక్షకోసం ఉపాధ్యాయుడే ప్రశ్నపత్రం తయారుచేసుకోవాలి.
- పూర్తయిన పాఠాల ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి. అక్టోబర్ వరకు పూర్తయిన పాఠాల ఆధారంగా మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఉండాలి.
- రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నపత్రంలో మొదటి టర్మ్ అనగా అక్టోబర్ వరకు నేర్చుకొన్న వాటిలో 30% ప్రశ్నలు ఉండాలి.
- బట్టీపట్టి రాయడానికి, జ్ఞాపకం ఉంచుకొని రాయడానికి బదులు సొంతంగా ఆలోచించి రాసేలా ప్రశ్నలు ఉండాలి.
- పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో అన్వయించి జవాబులు రాసేలా ప్రశ్నలు ఉండాలి.
- రెండున్నర గంటల సమయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రం తయారు చేసుకోవాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం 100 మార్కులకు ఉంటుంది.
- సామర్థ్యాల వారీగా కేటాయించిన భారత్వం ప్రకారం రాతపరీక్షకు ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి.
- మౌఖిక పరీక్షకు కేటాయించిన మార్కులను మినహాయించి భారత్వపట్టిక ప్రకారం రాత పరీక్షకు ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి.
- మౌఖిక పరీక్షకు 10 మార్కులు, రాత పరీక్షకు 90 మార్కులు ఉంటాయి.
- వినడం, ఆలోచించి మాట్లాడడం, ప్రశంస వంటి సామర్థ్యాలలో పిల్లలస్థాయిని మౌఖిక పరీక్షద్వారా అంచనావేయాలి. లేదా నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Evaluation) లోని పిల్లలస్థాయిని పరిగణనలోకి తీసుకొని నమోదుచేయాలి.
- ఒక సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలన్నిటినీ ప్రశ్నపత్రంలో ఒకే దగ్గర ఇవ్వాలి.
- ప్రాజెక్టు పనులను ప్రశ్నపత్రంలో ఇవ్వరాదు.

## 6 నుండి 8 తరగతులు - సామర్థ్యాలవారీగా భారత్వం - ప్రశ్నల రకం, స్వభావం

| సామర్థ్యం | మార్కులు | ప్రశ్నలు - రకం | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|
| 1. చదవడం | 20 | 4 రకాలు | 1. అపరిచిత గద్యం / పద్యం ఇచ్చి 5 లక్ష్యాత్మక ప్రశ్నలు ఇవ్వాలి. (5 మార్కులు)<br>2. పరిచిత గద్యం / పద్యం ఇచ్చి 5 ప్రశ్నలు తయారు చేయించాలి. (5 మార్కులు)<br>3. పరిచిత పద్యం /గేయం ఇచ్చి అవగాహనను పరీక్షించాలి. 5 లక్ష్యాత్మక ప్రశ్నలు ఇవ్వాలి, భావం / సారాంశం రాయమనాలి. (10 మార్కులు) |
| 2. రాయడం (స్వీయరచన) | 30 | 2 రకాలు | ఇందులో 2 విభాగాలు ఉండాలి.<br>1. 2 వ్యాసరూప ప్రశ్నలు 2 × 10 = 20 మార్కులు.<br>2. 5 లఘురూప ప్రశ్నలు 5 × 2 = 10 మార్కులు. |

| సామర్థ్యం | మార్కులు | ప్రశ్నలు – రకం | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|
| | | | * పిల్లలు బట్టీపట్టి రాయడానికి బదులు సొంతంగా రాసే విధంగా ప్రశ్నలు ఇవ్వాలి. |
| 3. సృజనాత్మకత | 20 | పిల్లలు అభ్యాసం పొందిన వ్యవహార రూపాలు | ఇందులో 3 ప్రశ్నలు ఇవ్వాలి. విద్యార్థులు 2 ప్రశ్నలకు జవాబు రాయాలి. 2 × 10 = 20 మార్కులు.<br>* పిల్లలు అభ్యాసం పొందిన వ్యవహార రూపాలను ఇవ్వాలి. బట్టీపట్టి రాయకుండా ఆలోచించి రాసేలా ఇవ్వాలి. |
| 4. పదజాలం / భాషాంశాలు | 20 | 2 రకాలు | * పదజాలానికి సంబంధించి 2 విభాగాల ప్రశ్నలు ఇవ్వాలి.<br>* భాషాంశానికి సంబంధించి 2 విభాగాల ప్రశ్నలు ఇవ్వాలి.<br>* ఇవి లక్ష్యాత్మక ప్రశ్నలు ఉండాలి. |

**9వ తరగతి సామర్థ్యాలవారీగా భారత్వం – ప్రశ్నల రకం, స్వభావం**

| సామర్థ్యం | మార్కులు | ప్రశ్నలు – రకం | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|
| 1. అవగాహన – ప్రతిస్పందన (చదవడం, అర్థంచేసుకోవడం) | 20 | 3 రకాలు | 1. అపరిచిత గద్యం / పద్యం ఇచ్చి 5 ప్రశ్నలు ఇవ్వాలి. (5 మార్కులు)<br>2. పరిచిత గద్యం / పద్యం ఇచ్చి 5 ప్రశ్నలు తయారు చేయించాలి. (5 మార్కులు)<br>3. పాఠ్యపుస్తకంలోని చుక్క (*) గుర్తు గల పద్యాలలో ఒకటి ఇచ్చి ప్రతి పదార్థం రాయించాలి. (10 మార్కులు). |
| 2. వ్యక్తీకరణ సృజానాత్మకత (స్వీయరచన, సృజనాత్మకత) | 50 | 3 రకాలు | 1. వ్యాసరూప ప్రశ్నలు 4 ఇవ్వాలి. 2 ప్రశ్నలకు జవాబు రాయించాలి. 2 × 10 = 20 మార్కులు.<br>2. లఘురూప ప్రశ్నలు 6 ఇవ్వాలి. 5 ప్రశ్నలకు జవాబు రాయించాలి. 5 × 2 = 10 మార్కులు.<br>3. సృజానాత్మకత ప్రశ్నలు. 3 ఇవ్వాలి. 2 ప్రశ్నలకు జవాబు రాయించాలి. (ఇవి వివిధ వ్యవహార రూపాలలో రాసేటట్లుగా ఉండాలి). 2 × 10 = 20 మార్కులు.<br>* వ్యక్తీకరణ – సృజనాత్మకత సామర్థ్యాలలో ఇచ్చే ప్రశ్నలు పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలలోనివి కాకుండా పాఠానికనుగుణంగా విద్యార్థులు సొంతంగా రాసే విధంగా ప్రశ్నలు ఇవ్వాలి. |

| | | | |
|---|---|---|---|
| 3. భాషాంశాలు (పదజాలం, వ్యాకరణాంశాలు) | 20 | 2 రకాలు | 1. పదజాలానికి సంబంధించి 2 విభాగాలలో లక్ష్యాత్మక ప్రశ్నలు ఉండాలి. ఒక్కొక్క విభాగంలో 5 మార్కులు 2 విభాగాలు కలిపి 10 మార్కులు ఉంటాయి.<br>2. భాషాంశాలకు సంబంధించి 2 విభాగాలలో లక్ష్యాత్మక ప్రశ్నలు ఉండాలి. ఒక్కొక్క విభాగానికి 5 మార్కులు చొప్పున 2 విభాగాలకు 2 × 5 = 10 మార్కులు. |

♦ **ప్రశ్నల స్వభావం:**

**I. చదవడం :**

- పిల్లలు చదివిన దాన్ని అర్థం చేసుకోవాలి. ఇందుకోసం పరిచిత, అపరిచిత గద్య పద్య అంశాలను పరీక్షలో ఇవ్వాలి.
- వీటిని చదివి శీర్షిక పేరు పెట్టడం, ప్రశ్నలకు జవాబులు రాయడం, ప్రశ్నలు తయారుచేయడం, కీలక పదాలు గుర్తించడం, సారాంశం రాయడం, భావం రాయడం, బహుళైచ్ఛిక ప్రశ్నలు, చదివిన అంశం ఆధారంగా తప్పొప్పులు గుర్తించడం, సవరించి రాయడం, సంక్షిప్తంగా రాయడం వంటి మొదలగు ప్రశ్నలను ఇవ్వాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా అడిగే ప్రశ్నలు లక్ష్యాత్మకంగా ఉండాలి.

**II. రాయడం :**

- రాయడం అంటే సొంతంగా, ఆలోచనలను, భావాలను రాయగలగడం. కాబట్టి బహుళ సమాధానాలు వచ్చేలా సమాధానాలు ఉండాలి. (Open ended Questions).
- ప్రశపత్రంలో ఇందుకోసం రెండు రకాల ప్రశ్నలు ఇవ్వాలి.
- మొదటి రకం ప్రశ్నలు వ్యాస రూప సమాధానాలు రాయాలి. అనగా 10, 12 వాక్యాల్లో సమాధానాలు రాయగలగాలి. అనగా 2, 3 పేరాలు రాయగలగాలి.
- భావం, సారాంశం, అభిప్రాయాలు, ఇష్టాఇష్టాలు, స్వభావం, వివరించి రాయడం మొదలగు ప్రశ్నలను ఈ విభాగంలో అడగాలి. పాఠంలోని ప్రశ్నలను ఉన్నదున్నట్టుగా ఇవ్వకుండా మార్చి ఆలోచించి రాసేలా ఇవ్వాలి.
- రెండవ విభాగంలో లఘు సమాధానాలు రాసేలా ప్రశ్నలుండాలి. అనగా రెండు మూడు వాక్యాల్లో జవాబులు రాసేలా ప్రశ్నలుండాలి. ఇవి కూడా ఆలోచించి రాసేలా ఉండాలి.

**III. సృజనాత్మకత :**

- పాఠ్యపుస్తకంలో పాఠాలలో సృజనాత్మకత గురించి అభ్యాసాలున్నాయి. వీటిని పిల్లలు తరగతి గదుల్లో అభ్యాసం చేస్తారు. వీటి ఆధారంగా సొంతంగా రాయడం అభ్యసిస్తారు. అయితే వీటినే ఉన్నదున్నట్లుగా ప్రశ్నలుగా ఇచ్చినప్పుడు పిల్లలు బట్టీపట్టిరాయడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి పిల్లలు అభ్యాసం పొందిన వ్యవహార రూపాలను మార్చి పరీక్షలో ప్రశ్నలుగా ఇవ్వాలి.
- కరపత్రాలు రాయడం, నినాదాలు రాయడం, సన్నివేశం ఆధారంగా సంభాషణలు రాయడం, పోస్టరు తయారుచేయడం, లేఖలు రాయడం, ప్రతిలేఖలు రాయడం, పత్రికలకు వ్యాసాలు రాయడం, ప్రసంగ వ్యాసాలు రాయడం మొదలగునవి పరీక్షా సమయంలో రాయగలిగేవాటిని ప్రశ్నలుగా ఇవ్వాలి.

**IV. పదజాలం / భాషాంశాలు :**

- పదజాలంలో ఇచ్చే అంశాలు అన్వయించి రాసేలా ఉండాలి.
- వాక్యాల రూపంలో ఇచ్చి అర్థాలు రాయమనడం, వ్యతిరేకపదాలు రాయమనడం, వచనాలు మార్చి రాయమనడం, ఇవ్వవచ్చు.
- భాషాంశాలకు సంబంధించినవి లక్ష్యాత్మక ప్రశ్నల రూపంలో ఉండాలి.

## 8వ తరగతి – రాత పరీక్షకు సంబంధించి సామర్థ్యాల వారీగా కొన్ని నమూనా ప్రశ్నలు

### I. చదవడం

**1 కింది పద్యాన్ని చదివి దాని కింద ఇవ్వబడిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

జ్ఞానుల చరితము వీనుల
నానుచు సత్పురుష గోష్ఠి ననఘుంబనుచున్
బూనుము ధర్మపథంబును
దా నెరిగిన యంత మరువ దగదు కుమారా!

ప్రశ్నలు:–

అ) ఎవరి చరిత్రలను వినాలి?
ఆ) పాపములు నశింపజేసేది ఏది?
ఇ) దేనిని మరువకూడదు?
ఈ) ఈ పద్యంలోని మకుటం ఏది?
ఉ) దీనికి ఒక శీర్షిక పెట్టండి.

**2. కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అపరచిత గద్యం – ప్రశ్నలు –

జనపదం అంటే పల్లెటూరు జనపదాలలో ఉండేవారు జానపదులు. జానపదులు పాడే పాటలు లేక గేయాలను జానపద గేయాలంటారు. వీటిని ఆంగ్లంలో ఫోక్ సాంగ్స్ అని, ఉత్తర భారతదేశంలో లోక్‌గీత్ అంటారు. జానపద సాహిత్యం సమష్టి సంపద. శిష్ట సాహిత్యం లాగా కాకుండ జానపద సాహిత్యం పలువురి చేతిలో పెరిగింది. ఇది దాని మొదటి లక్షణం. గేయరచనాకాలం స్పష్టంగా ఉండకపోవడం మరో లక్షణం.

ప్రశ్నలు:–

అ) జానపద సాహిత్యం మొదటి లక్షణం ఏమిటి?
ఆ) జానపదులు అంటే ఎవరు?
ఇ) ఆంగ్లంలో జానపద గేయాల్ని ఏమంటారు?
ఈ) జానపద సాహిత్యం ఎవరి సంపద?
ఉ) జానపద సాహిత్యం మరో లక్షణం ఏమిటి?

**3. కింది పేరా చదివి 5 ప్రశ్నలు తయారు చేయండి.**

రైతు దేశానికి వెన్నెముక వంటివాడు. వ్యవసాయం ఒకప్పుడు స్వయం ఆధారితంగా ఉండేది. ఇంట్లో ఉన్న గొడ్డూ గోదా రైతుకు కావలసిన ఎరువును అందించేవి. సేంద్రియ ఎరువులతో పంటలు పండేవి. ఆహార ధాన్యాలు ఆరోగ్యాన్ని ఇచ్చేవి రసాయనిక ఎరువులు రాగానే పరిస్థితులు మారిపోయాయి. వాటిలోని విషపదార్థాలు ఆహారధాన్యాలు, ఆకుకూరలు మొదలైన వాటిలోకి ఇంకి మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రసాయనిక ఎరువులు వాడడంవల్ల భూసారం క్షీణించిపోతుంది.

ప్రశ్నలు:-

అ)

ఆ)

ఇ)

ఈ)

ఉ)

**4. కింది పద్యాన్ని చదవండి. భావం రాయండి.**

చదువు జీర్ణమైన స్వాంతంబు పండును
తిండి జీర్ణమైన నిండు బలము
చెఱుపు గూర్చు జీర్ణముల్ గాకున్న
విశ్వహిత చరిత్ర వినరమిత్ర

**5. కింది పద్యాన్ని చదవండి. ప్రశ్నలు రాయండి.**

చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణ సంయుతులెవ్వరు మెచ్చరెచ్చటం
బదునుగ మంచికూర నలపాకము చేసిననైన నందు ని
పొదవెడు నుప్పులేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా!

**6. కింది పద్యాన్ని చదవండి. భావం రాయండి.**

తన చూపంబుధి మీద జూచి శ్రవణ ద్వంద్వంబు రిక్కించి వం
చిన చంచద్భుజముల్ సముత్కటకటీసీమంబులన్ బూన్చితో
క నభో వీథికిఁ బెంచి యంఘ్రు లిఱయంగాఁ బెట్టి బిట్టాదిగ్ర
క్కున నక్కొండ యదంగఁ ద్రొక్కి పయికిం గుప్పించి లంఘిచుచోన్

## II. రాయడం (స్వీయరచన) (1వ రకం ప్రశ్నలు)

**(అ) వ్యాసరూప ప్రశ్నలు:**

1. ప్రాచీన చారిత్రక కట్టడాలను కాపాడడం మన బాధ్యత. ఎందుకు? రాయండి.
2. భారతదేశం గూర్చి కవి ఏమని ప్రతిజ్ఞ చేయమన్నాడు? ఎందుకు చేయాలి?
3. త్రికూట పర్వతం మీద హనుమంతుడు దిగిన విధానాన్ని కవి ఎలా వర్ణించాడో సొంతమాటల్లో రాయండి.
4. "గ్రామాలు స్వయం సమృద్ధికాలు" - ఎలాగో మీ మాటల్లో రాయండి.
5. వ్యష్టి కుటుంబాలవల్ల వృద్ధులు పడుతున్న ఇబ్బందులు ఏవి? వారిని ఆదుకోవాలంటే ఏమి చేయాలి?

**(ఆ) లఘురూప ప్రశ్నలు: (2వ రకం ప్రశ్నలు)**

1. షట్చక్రవర్తులు ఎవరు?
2. పురాణేతిహాసాలు అంటే ఏమిటి? వాటిలో ఏముంది?
3. పెళ్లిళ్లు ఆడంబరంగా జరుపుట సమంజసమేనా? ఎందుకు? కారణాలు తెల్పండి.
4. మనిషికి చదువే నిజమైన అలంకారం. సమర్థిస్తూ సొంతమాటల్లో మీ అభిప్రాయం రాయండి.
5. మీ అమ్మకు కలిగిన బాధను నువ్వు ఎప్పుడైనా తీర్చావా? ఎలా తీర్చావో రాయండి.

## III. సృజనాత్మకత (నమూనా ప్రశ్నలు)

1. మన సంస్కృతిలో వస్తున్న మార్పులపై ఒక వ్యాసం రాయండి.
2. కలుషితమైపోతున్న చెరువు / కాలువ / నది బాధను ఆత్మకథగా రాయండి.
3. వరకట్నం అమానుషం. దానిని నిర్మూలించాలి. ప్రజలలో మార్పురావాలని ఒక వచన కవిత / గేయం రాయండి.
4. తల్లిదండ్రుల సేవలో తరించిన వారిని గూర్చి మీకు తెలిసిన ఒక కథను రాయండి.
5. హరిశ్చంద్రుని గుణగణాలను గూర్చి వశిష్టుడు, ఇంద్రుడు మధ్య సంభాషణను ఊహించి రాయండి.

## IV. పదజాలం (నమూనా ప్రశ్నలు)

**(అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

1. హనుమంతుడు <u>పారావారం</u> దాటాడు.
2. పౌర్ణమినాటి రాత్రి <u>చంద్రిక</u> చల్లగా ఉంది.
3. వర్షం పడేటప్పుడు మధ్యమధ్యలో <u>నభము</u>లో మెరుపులు మెరుస్తున్నాయి.
4. నేను బాగా చదివాను. పరీక్షలంటే నాకు <u>ఫికరు</u> లేదు.
5. <u>రైతు</u> <u>హలం</u> చేతబట్టి పొలం దున్నాడు.

**(ఆ) నానార్థాలు, వ్యుత్పత్తి అర్థం, పర్యాయ పదాలు.**

1. రాజు <u>క్షమ</u>తో, <u>క్షమ</u>ను కాపాడుకోవాలి.

   క్షమ – నానార్థాలు రాయండి.
2. వేటగాడు చెట్టుమీద వాలిన <u>ఖగము</u>ను చూసి, <u>ఖగము</u>తో కొట్టాడు.

   ఖగము – నానార్థాలు రాయండి.
3. దేవతలు <u>అమృతం</u> తాగడంవల్ల మరణం లేనివారైనారు.

   వ్యుత్పత్త్యర్థం రాయండి.
4. <u>కంఠీరవం</u> మృగాలకు రాజు లేదా అపారమైన తీరంగలది. ఈ వ్యుత్పత్తికి పదాన్ని రాయండి.

   వ్యుత్పత్త్యర్థం రాయండి.
5. స్వాతంత్ర్య దినోత్సవంనాడు పతాకం ఎగురవేసాము. ఆ కేతనం చూడగానే దేశభక్తి పొంగింది. మన జాతి గొప్పతనం తెలిపే ఆధ్వజమును ఎప్పుడూ గౌరవించాలి.

   ఇందులో జెండా అనే అర్థం పదాలు ఏమేమి ఉన్నాయో రాయండి.

(లేదా)

- స్వాతంత్ర్య దినోత్సవంనాడు <u>పతాకం</u> ఎగురవేసాం.

  పర్యాయపదాలు వాడి ఒక వాక్యం రాయండి.

6. <u>వారిజ గర్భుడు</u> అందరి తలరాత రాస్తాడు.

   పర్యాయపదాలు -

7. నాకు ఎంతో <u>సంతోషం</u>గా ఉంది. ఈ సంతకం ఎల్లకాలం ఉండాలని కోరుకుంటున్నాను.

   ఇందలి ప్రకృతి - వికృతులను గుర్తించి రాయండి.

8. హరిశ్చంద్రుడు ఎప్పుడూ అబద్ధమాడలేదు. <u>నిక్కమే</u> పలికేవాడు.

   ప్రకృతి రాయండి -

9. ఇంటిల్లిపాది -

10. పెద్ద మలుపు -

**V. భాషాంశాలు (నమూనా ప్రశ్నలు)**

**1. నేను ప్రతిరోజు దైవారాధన చేస్తాను.**

ఇందలి సంధి పదాన్ని గుర్తించి సంధి కార్యం రాయండి.

(లేదా)

దైవారాధన, సంధికార్యం రాయండి.

(ఇలా పాఠ్యపుస్తకంలో ఇచ్చిన ఏ సంధులైనా ఇవ్వవచ్చు.)

**2. రామబాణం తిరుగులేనిది.**

- సమాస పదం గుర్తించి విగ్రహవాక్యం రాసి అది ఏ సమాసమో రాయండి.

  (లేదా)

- షష్ఠీ తత్పురుష సమాసానికి ఉదాహరణ తెల్పండి.

  (లేదా)

  రాముని యొక్క బాణం

- సమాసం చేయండి. ఏ సమాసమో తెల్పండి.

పై మూడు రకాలలో ఏదో ఒక రకమైన ప్రశ్న సమాసానికి సంబంధించి అడగాలి.

**3. కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యంగా రాయండి.**

రవి ఇంటికి వచ్చాడు. రవి అన్నం తిన్నాడు.

**4. కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యంగా రాయండి.** (లేదా)

రైలు వచ్చింది. చుట్టాలు రాలేదు.

**5. కింది కర్మణి వాక్యాన్ని కర్తరి వాక్యంగా రాయండి.**

ప్రజలచేత శాంతి కోరబడుతున్నది.

(లేదా)

**కింది కర్తరి వాక్యాన్ని కర్మణి వాక్యంగా రాయండి.**

వాల్మీకి రామాయణాన్ని రచించాడు.

ఇవే కాకుండా పాఠ్యపుస్తకంలో చెప్పబడిన వాక్యభేదాలను అంటే క్త్వార్థం, శత్రర్థం, చేదర్థకం, మొదలగు వాటిని గూర్చి కూడా అడుగవచ్చు. పేరాలో కర్తరి కర్మణీ వాక్యాలనిచ్చి వాటిని గుర్తించమని కూడా అడగవచ్చు.

**6. కింది పద్య పాదానికి గురు లఘు విభజన ఉంది. అది సరిచేసి గణాలను గుర్తించి ఏ పద్యపాదమో తెల్పండి.**

I I I I U I U I I IUU I I U I U U U U U

చదువ ది యెంత గల్గిన రసజ్ఞ త యించు క చాల కున్న నా

**7. కింది వాక్యంలో / పద్యపాదంలోని అలంకారాన్ని గుర్తించి రాయండి.**

మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబుతోవునే మదనములకు.

**8. కింది అలంకార లక్షణం రాయండి.**

ఉపమ–

(పాఠ్యపుస్తకంలో చెప్పబడిన ఏ అలంకారమైనా అడుగవచ్చు)

**9. కింది పద్యపాదానికి గురులఘువులు గుర్తించి, గణవిభజన చేయుము.**

తనకు ఫలంబు లేదని మొదందలపోయదు కీర్తి, గోరునా

**10. కింది పద్య లక్షణాలు రాయండి.**

ఉత్పలమాల –

*మూల్యాంకనం – సంస్కరణలు*

*అభ్యసన మాపనం బోధనాభ్యసన ప్రక్రియలకు అంత్యకార్యక్రమం కాదు. అభ్యసన లోపాలను, దీనికి సంబంధించిన ఇతర సూచికలను గుర్తించి పరిహరించగల కృత్యం. ఇది సమగ్రంగా ఉండాలి. పిల్లలు సరైన మార్గంలో ఉన్నారో లేదో తెలుసుకునేందుకు ఉపాధ్యాయులకు ఉపకరించాలి. జ్ఞానం నైపుణ్యాలు, వైఖరులు, విశ్లేషణా సామర్థ్యాలు, నైతికత మొదలైనవి నిరంతరంగా, సమగ్రంగా మూల్యాంకనం చేయబడాలి. ఇందుకోసం కేవలం రాతపరీక్షలకే పరిమితం కాకుండా ఇతర సాధనాలతో కూడి ఉండాలి. పిల్లల జ్ఞాపక శక్తిని పరీక్షించడానికి పరిమితం కాకుండా ఉన్నతస్థాయి ఆలోచనా నైపుణ్యాలను, విశ్లేషణాశక్తిని, విమర్శనాత్మక ఆలోచనాధోరణిని మొదలగునవి మూల్యాంకనం చేయబడి తదుపరి అభివృద్ధికి దోహదపడాలి.*

*– ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం – 2011*

# సంగ్రహణాత్మక ప్రశ్నపత్రం - తెలుగు

**విద్యార్థి పేరు :** ______________________ **తరగతి : 8వ తరగతి**

**క్రమసంఖ్య :** ______________________ **మార్కులు : 90**

## రాత పరీక్ష

## I. చదవడం

**1. కింది పద్యాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.** (5 మార్కులు)

రాజు చేతి కత్తి రక్తంబు వర్షించు
సుకవి చేతి కలము సుధలు కురియు
ఆతడేల గలుగు యావత్ర్పపంచంబు
నీతడేల గలుగు ఇహము పరము

ప్రశ్నలు:-

అ) రాజు చేతి కత్తి దేన్ని వర్షిస్తుంది?

ఆ) సుధలు కురిపించేది ఏది?

ఇ) ఇహము పరము ఏలేది ఎవరు?

ఈ) రాజు దేనిని పరిపాలిస్తాడు?

ఉ) ఈ పద్యానికి ఒక శీర్షిక సూచించండి.

**2. కింది పేరా చదవండి. 5 ప్రశ్నలు తయారుచేయండి.** (5 మార్కులు)

సమాజంలో కుటుంబమే అత్యంత కీలకమైంది. ప్రప్రథమ సమూహం పరివారమే. వ్యక్తి సమాజంలో ఒంటరిగా మనజాలడు. కుటుంబంతో తాను మమేకమై జీవించడం ద్వారా ఆనందాన్ని పొందుతాడు. అందుకే పుట్టుకతోనే మనిషికి కుటుంబంతో విడదీయలేని అనుబంధం ఏర్పడుతుంది. పోషణ, భద్రత కల్పించడం కుటుంబ వ్యవస్థలో మౌలికాంశాలు.

ప్రశ్నలు:-

అ)

ఆ)

ఇ)

ఈ)

ఉ)

**3. కింది పద్యాన్ని చదవండి. భావం రాయండి.** (10 మార్కులు)

ఘోర వికార సన్నిహిత కోపముఖంబులు దీప్తవిద్యుదు
ల్కారుణ దారుణాక్షములునై, నిజదృష్టి విషాగ్నిన నన్యులం
జారగనీక యేర్చుచుఁ బ్రసిద్ధముగా నమృతంబు చుట్టు ర
క్షారతి నున్న యుగ్రభుజగంబుల రెంటిని గాంచి చెచ్చెరన్

## II. రాయడం (స్వీయరచన) (30 మార్కులు)

**(అ) వ్యాసరూప ప్రశ్నలు**

**కింది ప్రశ్నలలో 2 ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** (2 × 10 = 20)

1. "గ్రామాలు స్వయం సమృద్ధికాలు" – ఎలాగో మీ మాటల్లో రాయండి.
2. ప్రాచీన చారిత్రక కట్టడాలను కాపాడడం మన బాధ్యత. ఎందుకు? రాయండి.
3. త్రికూట పర్వతంపై హనుమంతుడు దిగిన విధానాన్ని కవి ఎలా వర్ణించాడో మీ సొంతమాటల్లో రాయండి.
4. "ఇల్లే స్వర్గసీమ" ఎలాగో తెలియజేయండి.

**(ఆ) లఘురూప ప్రశ్నలు**

**కింది ప్రశ్నలలో 5 ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** (5 × 2 = 10)

1. పురాణేతి హాసాలు అంటే ఏమిటి? వాటిలో ఏముంది?
2. షట్చక్రవర్తులెవరు?
3. పెళ్లిళ్లు ఆడంబరంగా జరుపుట సమంజసమేనా? ఎందుకు? కారణాలు రాయండి.
4. మీ తల్లి బాధను ఎప్పుడైనా తీర్చారా? దాని గూర్చి రాయండి.
5. "మనిషికి చదువే నిజమైన అలంకారం" – సమర్థిస్తూ రాయండి.
6. భారతదేశం గూర్చి కవి ఎందుకు ప్రతిజ్ఞ చేయమన్నాడు?

## III. సృజనాత్మకత (20 మార్కులు)

**(అ) కింది వానిలో 2 ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** (2 × 10 = 20)

1. కలుషితమైపోతున్న నది / చెరువు / కాలువ బాధను ఆత్మకథగా రాయండి.
2. మన సంస్కృతిలో వస్తున్న మార్పులపై ఒక వ్యాసం రాయండి.
3. వరకట్నం అమానుషం – దీనిపై ఒక గేయం / వచన కవిత రాయండి.

## IV. పదజాలం / భాషాంశాలు (20 మార్కులు)

**(అ) కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.** (5 × 1 = 5)

1. అమావాస్యనాడు అంతా <u>అంధకారం</u> అలుముకొంది.
2. గంగానదిలో స్నానం చేసి <u>పునీతం</u> అయ్యాను.
3. <u>గిరి</u>పై ఆలయం ఉంది.
4. తూర్పున <u>దినకరుడు</u> ఉదయించాడు.
5. చెట్ల నుండి చల్లని <u>పవనం</u> వీస్తుంది.

**(అ) కింది వాటిని తెల్పండి.** (5 × 1 = 5)

1. జ్వరంతో నా <u>శరీరం</u> కాలిపోతుంది. (పర్యాయపదాలతో వాక్యం రాయండి.)
2. తూర్పుదిక్కున ఉదయించే సూర్యుని సాక్షిగా నీవే నాకు <u>దిక్కు</u> (నానార్థాలు రాయండి.)

3. నందనుడు - వ్యుత్పత్త్యర్థం రాయండి.
4. అగ్ని చేత దహించబడింది. (వికృతి రాయండి)
5. ఎగరడానికి పక్కి ప్రయత్నిస్తుంది. (ప్రకృతి రాయండి)

## V. భాషాంశాలు

**(అ) కింది వాటిని తెల్పండి.** (5 × 1 = 5)

1. అత్యుగ్రము - (విడదీసి రాయండి)
2. బుద్ధిచేతహీనుడు - (సమాసం చేయుము)
3. రాము బస్సు ఎక్కాడు. రాము పట్నం వెళ్ళాడు. (సంశ్లిష్ట వాక్యంగా రాయండి)
4. ఆయన రచయితా? ఆయన గాయకుడా? (సంయుక్త వాక్యంగా రాయండి)
5. పోతనచే భాగవతం రచించబడింది. (కర్తరి వాక్యంగా రాయండి)

**(అ) కింది వాటిని తెల్పండి.**

1. కింది వాక్యంలోని అలంకారం గుర్తించి రాయండి. (1 మార్కు)
   - నంద నందన నీకు ప్రణామము.
2. కింది అలంకార లక్షణం రాయండి. (1 మార్కు)
   - రూపకాలంకారం.
3. కింది పద్యపాదానికి గురు లఘువులు గుర్తించి గణవిభజన చేయండి. (1 మార్కు)
   - అయత పక్షతుండహతి నక్కుల శైలములెల్ల నుగ్గుగా.
4. కింది పద్య లక్షణాలు రాయండి. (2 మార్కులు)
   - చంపకమాల

# సంగ్రహణాత్మక ప్రశ్నపత్రం - తెలుగు

విద్యార్థి పేరు : ________________ తరగతి : 7వ తరగతి

క్రమసంఖ్య : ________________ మార్కులు : 90

## రాత పరీక్ష

### I. చదవడం

**1) కింది పద్యాన్ని చదవండి. పద్యం ఆధారంగా 5 ప్రశ్నలను తయారుచేయండి.** **(5 మార్కులు)**

సీ. వేణువులూదుచు వివిధ రూపములతో
గంతులు వైతురు కౌతుకమున,
గురుకంబళాదుల గోవృషంబులుబన్ని
పరవృషభము లని ప్రతిభటింతు
రల్లులు దట్టించి యంగ్రుల గజ్జెలు
మెరయు దన్నుదు రోలి ముమ్మరముగఁ
బన్నిదంబులు వైచిఫలమంజరులఁ గూర్చి
ప్రేటులాడుదరు ప్రావీణ్యమొప్ప.

1వ ప్రశ్న ________________

2వ ప్రశ్న ________________

3వ ప్రశ్న ________________

4వ ప్రశ్న ________________

5వ ప్రశ్న ________________

**2) కింది పేరాను చదవండి. తప్పు (✗) ఒప్పు (✓) లను గుర్తించండి.** **(5 మార్కులు)**

శంకరాచార్యులు, మహావీరుడు, బుద్ధుడు, కబీర్, చైతన్యుడు, నామదేవ్ వంటివాళ్ళు భారతదేశంలో కాలినడకన తిరిగారు. వారు కావాలనుకొంటే గుర్రాలమీద తిరగగలిగేవారే. కాని వారంతా వేగంగా నడిచే వాహనాన్ని అభిలషించలేదు. ప్రజల ఆలోచనా ప్రక్రియలో మార్పు తేవాలని వారందరు అనుకోవడమే అందుకు కారణం. పాదయాత్రే తగిన యాత్రా సాధనమని వారు విశ్వసించారు. దేశమంతా కాలినడకన తిరిగారు. అయితే ఈనాటి యుగంలో పాదయాత్రని గురించి యోచించడమే విడ్డూరంగా ఉంటుంది. కాని ప్రశాంతంగా యోచిస్తే అంతకంటే మించిన మంచి సాధనం మరొకటి లేదని చెప్పక తప్పదు.

అ) ప్రజల ఆలోచనా ప్రక్రియలో మార్పుతేవడానికే పాదయాత్రను ఎంచుకున్నారు. ( )

ఆ) పై పేరాలోని అంశాన్ని శంకరాచార్యుడు చెప్పాడు. ( )

ఇ) ఈనాడు పాదయాత్ర గురించి ఆలోచించడం విడ్డూరమేమీ కాదు. ( )

ఈ) ప్రజల మధ్య తిరిగినప్పుడే ఆత్మవిశ్వాసం కలుగుతుంది. ( )

ఉ) మహావీరుడు, బుద్ధుడు, కబీరు, చైతన్యుడు, గుర్రాల మీదనే తిరిగారు. ( )

**3) కింది పేరాను చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి. (10 మార్కులు)**

ఆసియా దేశాల్లో పేదలు తమ రోజువారీ ఆదాయంలో సుమారు 60 శాతం మేరకు ఆహారంపై ఖర్చుచేస్తారు. అందువల్ల ఆహారధరలు పెరిగితే ఆకలి సమస్య తీవ్రం కావడంతోబాటు, తమ పిల్లల విద్య, ఆరోగ్యంపై ఖర్చుచేయగల సామర్థ్యాన్ని కూడా వారు కోల్పోతారు. వాస్తవానికి ఇటీవలి కాలంలో సహస్రాభివృద్ధి లక్ష్యాల్లో ముఖ్యమైన పేదరికాన్ని తగ్గించుకునే దిశగా ఆసియా దేశాలు మంచి ఫలితాలను సాధించాయి. ఇందుకు కారణం ఆర్థిక వృద్ధి రేటును పెంచుకోవడమే. కానీ, ఇటీవల భారీగా పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణం ఈ విజయాలను దెబ్బతినే అవకాశం ఉంది.

ఆ) పై పేరాలో ఏ విషయం గురించి చెప్పబడింది?

ఆ) ఆహార ధరలు పెరిగితే కలిగే నష్టాలు ఏంటి?

ఇ) ఆసియా దేశాలు మంచి ఫలితాలను సాధించడానికి కారణం ఏంటి?

ఈ) పై పేరాలో మీరు ముఖ్యమని భావించిన 3 అంశాలు ఏవి?

ఉ) పై పేరాకు మీరైతే ఏమి శీర్షికను నిర్ణయిస్తారు?

## II. రాయడం

**1) కింది ప్రశ్నలలో ఏదైనా 2 ప్రశ్నలకు సమాధానాలు రాయండి. (వ్యాసరూప ప్రశ్నలు) (2 × 10 = 20 మార్కులు)**

అ) తెలుగు భాష గొప్పదనం గురించి మీ సొంతమాటల్లో రాయండి.

ఆ) పేదలకు ఉపకారం చేయడానికి ఏ ఏ దానాలు చేయవచ్చు. మీరైతే ఏం చేస్తారు? ఎలా చేస్తారు?

ఇ) బలరామకృష్ణుల ఆటల గురించి పాఠంలో చదువుకున్నారా? మీరు మీ మిత్రులతో కలిసి ఇష్టపడి ఆడే ఆట ఏది? ఎలా ఆడతారో రాయండి.

ఈ) ఆవు, పులి కథకు 'ఆడినమాట' అనే పేరు సరైనదేనా మీ అభిప్రాయం రాయండి.

**2) కింది లఘుప్రశ్నలలో ఏదైనా 5 ప్రశ్నలకు 3 వాక్యాలలో సమాధానాలు రాయండి. (5 × 2 =10 మార్కులు)**

అ) 'దయ కలిగి ఉండడం' అంటే ఏమిటి? దాని వల్ల మనకు కలిగే ప్రయోజనం ఏంటి?

ఆ) ప్రకృతితో స్నేహం చేయడంవల్ల మీరు ఏమి గ్రహించారు?

ఇ) మిమ్మల్ని 'ప్రకటన' తయారుచేయమంటే దేని గురించి తయారుచేస్తారు? ఏమని చేస్తారు?

ఈ) "ఆడపిల్లలు, మగపిల్లలు అందరూ సమానమే" దీన్ని మీరు ఎలా సమర్థిస్తారు?

ఉ) 'శిల్పకళ' గురించి మీ సొంత మాటల్లో రాయండి.

ఊ) కరపత్రం తయారుచేయమంటే మీరైతే దేని గురించి తయారుచేస్తారు? అందుకు ఏ ఏ అంశాలు మీకు తెలియాలి?

## III. సృజనాత్మకత (2 × 10 = 20 మార్కులు)

**1) కింది వాటిలో ఏదైనా రెండిటి గురించి రాయండి.**

అ) 'ఆడపిల్లల చదువు' గురించి 5 నినాదాలను తయారుచేయండి.

ఆ) ఆవు-పులి కథ ఆధారంగా ఆవు ఏకపాత్రను (ఆత్మకథ) రాయండి.

ఇ) పుస్తకాల గొప్పతనాన్ని తెలుపుతూ ఒక కవిత రాయండి.

## IV. పదజాలం / భాషాంశాలు

**1) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు సమానార్థాలతో, సొంతవాక్యాలు రాయండి.** (1 × 5 = 5 మార్కులు)

అ) సాగర తీరంలో సూర్యోదయం అద్భుతంగా ఉంటుంది.

______________________________

ఆ) శిల్పి అంత బాగా శిల్పాలు చెక్కడం పూర్వజన్మ సుకృతం.

______________________________

ఇ) ఈ ఆట ఆడడం రాజేష్‌కు కొట్టినపిండి.

______________________________

ఈ) కార్యదీక్షుడు ఎన్ని అవరోధాలు ఎదురైనా లెక్కచేయడు.

______________________________

ఉ) మనకు మంచి మార్గం చూపేవాళ్ళే మార్గదర్శకులు.

______________________________

**2) కింది పేరాను చదవండి. సూచించిన విధంగా రాయండి.** (1 × 5 = 5 మార్కులు)

ఇసుకవేస్తే రాలనంతగా ప్రజలు గుంపులు గుంపులుగా వస్తున్నారు. కంగారుతో, భయంతో, ఏవేవో అనుమానాలతో గుసగుసలాడుతున్నారు. నిత్యం సహృదయులను, కళాభిమానులను ఆకర్షించే సాహిత్య చర్చలు, కళా ప్రదర్శనలు ఎవర్నీ ఆకర్షించడం లేదు. తమ స్వార్థం కోసం ఆలోచించే మనుషులు మాత్రం గుండెలు బాదుకుంటున్నారు.

అ) పై పేరాలో 'గుంపు' అనే పదానికి నానార్థాలను రాయండి.

______________________________

ఆ) పేరాలో రెండు జాతీయాలు ఉన్నాయి. అవేంటో రాయండి.

______________________________

______________________________

ఇ) 'ప్రతిరోజూ' అనే అర్థం ఇచ్చే పదం పై పేరాలో ఏది ఉంది? దాన్ని ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.

______________________________

ఈ) పేరాలో స్వార్థం అనే పదానికి వ్యతిరేకార్థక పదంలో తిరిగి వాక్యం రాయండి.

______________________________

______________________________

ఉ) గుసగుసలాడుతున్నారు. ఇలా పునరావృత పదాలను ఏవేని రెండింటిని ఉపయోగించి వాక్యాలు రాయండి.

______________________________

______________________________

**3) కింది పదాలను విడదీయండి. సంధి పేరు రాయండి. (1 × 5 = 5 మార్కులు)**

అ) 'పట్టపగలు' ______________________________

ఆ) మధువొలికె ______________________________

ఇ) రాజేంద్రుడు ______________________________

ఈ) సమైక్యం ______________________________

ఉ) చిట్టడవి ______________________________

**4) కింది ప్రశ్నలను సూచించిన విధంగా రాయండి. (5 మార్కులు)**

అ) ప్రకృతిలో రంగు రంగుల సీతాకోక చిలుకలు, పచ్చని చెట్లు చూడడం వల్ల మనకు ఆనందం కలుగుతుంది. ఈ వాక్యాలలోని విభక్తి ప్రత్యయాల కింద గీత గీయండి. విభక్తిపేరు రాయండి. (2 మార్కులు)

______________________________

______________________________

ఆ) కింది సమాస పదాలకు విగ్రహవాక్యం రాయండి. సమాసం పేరు రాయండి. (2 మార్కులు)

రెండు జడలు ______________________________

కూరగాయలు ______________________________

ఇ) అంత్యానుప్రాస అలంకారానికి ఉదాహరణ రాయండి. (1 మార్కు)

______________________________

# సంగ్రహణాత్మక ప్రశ్నపత్రం - తెలుగు

విద్యార్థి పేరు : ______________________ తరగతి : 6వ తరగతి

క్రమసంఖ్య : ______________________ మార్కులు : 90

## రాత పరీక్ష

### I. చదవడం

**1. కింది పద్యం చదవండి. పద్యం ఆధారంగా ఇచ్చిన బహుళైచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** (5 మార్కులు)

నీరము తప్తలోహమున నిల్చి యనామకమై, నశించు నా
నీరమె ముత్యమట్లు నళినీదళ సంస్థితమై తనర్చు నా
నీరమె శుక్తిలో బడి మణిత్వము గాంచు సమంచిత ప్రభన్
పౌరుష వృత్తులిట్లధము మధ్యము నుత్తము గొల్చు వారికిన్!

(అ) కాలిన ఇనుము మీద నీళ్ళు పడితే ఏమౌతుంది? ( )

(A) గడ్డకట్టును (B) ఆవిరగును (C) మండును

(ఆ) తామరాకు అనే అర్థం ఇచ్చే పదం పద్యంలో ఉంది, ఏమిటది? ( )

(A) నీరము (B) శుక్తి (C) నళినీదళం

(ఇ) ముత్యపు చిప్పలో పడిన నీరు ఎలా మారుతుంది? ( )

(A) ముత్యాలుగా (B) పగడాలుగా (C) వజ్రాలుగా

(ఈ) ఈ పద్యము ఎవరితో చేరవద్దని చెబుతుంది? ( )

(A) నీచులతో (B) ఉత్తములతో (C) అధములతో

(ఉ) ఈ పద్యంలో ఉత్తములను దేనితో పోల్చడం జరిగింది. ( )

(A) తామరాకు (B) ముత్యపుచిప్ప (C) కాలిన ఇనుము

**2. కింది పేరాను చదవండి పేరా ఆధారంగా 5 ప్రశ్నలు తయారుచేయండి.** (5 మార్కులు)

సోమనాద్రి 'పూదూరు'ను రాజధానిగా చేసుకొని ఆ ప్రాంతాన్ని కొంత కాలం పాలించాడు. నేడు గద్వాల పట్టణంగా ప్రసిద్ధికెక్కిన ఆ ప్రదేశమంతా ఆ రోజుల్లో దట్టమైన అరణ్య ప్రాంతంగా ఉండేది. ఒకసారి వేటాడటానికి అటుకేసి వెళ్ళిన సోమనాద్రి ఆ ప్రాంతాన్ని చూసి అది తన రాజధానికి అన్ని విధాలా అనుకూలమైనదిగా ఉంటుందని భావించాడు. వెంటనే అక్కడ కోట నిర్మాణం చేపట్టాడు. అయితే ఆ ప్రదేశానికి సమీపంలోనే ఉన్న 'ఉప్పేరు' కోటను సయ్యద్ దావుద్ మియా పాలిస్తున్నాడు. అతడు గోల్కొండ కోట పాలకుడు నిజాం నవాబు నసీరుద్దీలాకు ఆప్తుడు. దావుద్ మియా సోమనాద్రి కోట నిర్మిస్తున్న స్థలం తన ఏలుబడిలో ఉన్నదని అందువల్ల కోట కట్టడానికి వీలు లేదని అడ్డు చెప్పాడు.

1 ప్ర: ______________________

2 ప్ర: ______________________

3 ప్ర: ______________________

4 ప్ర: ______________________

5 ప్ర: ______________________

**3. కింది పేరాను చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** (10 మార్కులు)

"మనం రోజూ చూస్తున్న సూర్యబింబంలో కొన్ని విశిష్ట లక్షణాలు గోచరిస్తాయి. సూర్యుడు తాను నిర్విరామంగా దహనమవుతూ లోకానికి వెలుగునిస్తున్నాడు. సూర్యకాంతి సామాన్యమైనది కాదు. అది ప్రాణికోటికి జీవన రసం. అది లేకుండా ప్రాణులు బ్రతకజాలవు. అలాంటి వెలుగు నివ్వడానికి సూర్యబింబం ఆత్మాహుతి అవుతున్నది.

తాను చేసే పనిలో ఎన్నడూ విశ్రాంతి అనేది లేకుండా ఉండడం సూర్యుని రెండవ గుణం. నిజానికి వ్యక్తి ఆఫీసుకు పోకుండా సెలవు పెట్టడం చూస్తాం. కాని సూర్యుడు సెలవు పెట్టిన రోజు లేదు గదా! అంతేగాక సూర్యుడు ఆలస్యమనేది ఎరుగడు. ఎంత కర్తవ్య తత్పరత!

ఇంతటి ఘనకార్యాన్ని చేస్తూగూడా "నేను కొంత పనిచేస్తున్నా"ననే అహంకారం లేకపోవడం సూర్యుని గొప్ప గుణం.

1 ప్ర: ఈ పేరా ఎవరి గురించి తెలియజేస్తున్నది?

జ: ______________________

2 ప్ర: సూర్యుని నుండి మనం ఏ లక్షణాలను నేర్చుకోవాలి?

జ: ______________________

3 ప్ర: ప్రాణకోటి జీవన రసం ఏది?

జ: ______________________

4 ప్ర: సూర్యుడు విశ్రాంతి తీసుకుంటే ఏమి జరుగుతుందో ఆలోచించి వ్రాయండి?

జ: ______________________

5 ప్ర: సూర్యునిలా తనను తాను దహించుకుంటూ వెలుగునిచ్చేది ఏది? ఉదా॥ ఇవ్వండి.

జ: ______________________

## II. రాయడం

**1. కింది ప్రశ్నలలో ఏవైనా 2 ప్రశ్నలకు సమాధానాలు రాయండి. (వ్యాసరూప ప్రశ్నలు)** 2 × 10=20 మార్కులు

(అ) వార్తాపత్రికల వల్ల కలిగే ప్రయోజనాలను మీ సొంత మాటల్లో రాయండి.

(ఆ) 'స్నేహబంధం' కథలోని పాత్రల స్వభావాన్ని తెలియజేయండి.

(ఇ) "మ్రోగిన గంటలు" గేయకథలోని భావాన్ని వివరించండి.

(ఈ) 'ఇతరులను విమర్శించడం, మనను మనం పొగడుకోవడం మంచిది కాదు' ఎందుకో రాయండి.

**2. కింది లఘు ప్రశ్నలలో ఏవైనా 5 ప్రశ్నలకు 3 వాక్యాలలో సమాధానాలు రాయండి.** 5 × 2= 10 మార్కులు

(అ) ఎక్కువ భాషలు నేర్చుకోవడంవల్ల వ్యక్తికి కలిగే లాభమేమిటి?

(ఆ) ఇతరులకు బాధ కలిగించేలా పనులు చేయకూడదు? ఎందుకు?

(ఇ) మంచి వారితోనే స్నేహం చేయాలి? ఎందుకో మీ సొంతమాటల్లో రాయండి.

(ఈ) సామాజిక స్పృహ అంటే ఏమిటో తెలియజేయండి.

(ఉ) పూలను ఏయే సందర్భాలలో, ఏయే అవసరాలకు ఉపయోగిస్తారు?

(ఊ) సోమరితనం ఎందుకు పనికిరాదు?

## III. సృజనాత్మకత

**1. కింది వాటిలో ఏవైన రెండింటి గురించి రాయండి.** 2 × 10 = 20 మార్కులు

(అ) మీ పాఠశాలలోని ఓ జట్టు క్రీడా పోటీలలో పాల్గొనడానికి వెళ్తున్నారు. వారిని ఉత్తేజ పరుస్తూ ఒక స్ఫూర్తిదాయక సందేశాన్ని రాయండి.

(ఆ) స్నేహం యొక్క గొప్పదనాన్ని వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

(ఇ) వృద్ధులకు చేయూత నివ్వడం, దాని అవసరాన్ని వివరిస్తూ, వృద్ధాశ్రమానికి విరాళాలు సేకరించడానికిగాను ఒక కరపత్రాన్ని రూపొందించండి.

## IV. పదజాలం / భాషాంశాలు

**1. కింది వాక్యాలను చదవండి. ప్రతి వాక్యంలోనూ ఒక పదానికి అదే అర్థం వచ్చే మరొక పదం ఉన్నది. ఆ పదాల కింద గీత గీయండి.** (5 మార్కులు)

(అ) వసంత కాలంలో కొత్త పరిమళాల పూమొగ్గల కోసం అన్వేషిస్తారు. వాటి వాసన పీలిస్తే చెప్పలేనంత ఆనందం కలుగుతుంది.

(ఆ) మామూలు మనుషులకు కళ్ళు రెండే, కానీ హెలెన్‌కు శరీరమంతటా స్పర్శరూప నేత్రాలున్నాయి.

(ఇ) సూర్యుడు మరీ వెలుగులు విరజిమ్ముతున్నాడు. ఇంతటి మిరుమిట్లుగొలిపే కాంతి భరించలేను.

(ఈ) మూర్ఖుడు హితము వినడు, చెడ్డవాడు ఇతరుల మంచి కోరడు.

(ఉ) గులాబీ సుమాలను దారంతో గుచ్చి ఆ పూలదండను దేవునికి సమర్పించారు.

**2. కింది పదాలను చదవండి, ఈ పదాలతో ఒకే వాక్యంలో రెండు పదాలు వచ్చేటట్లు రాయండి.** (5 మార్కులు)

ఊహలు, తేలిపోవచ్చు, మహాచిరాకు, పరుగెత్తాలని, పరవశిస్తూ, చరిత్రసాక్షి ప్రేరణ, వృధా

(అ) ____________________

(ఆ) ____________________

(ఇ) ____________________

(ఈ) ____________________

(ఉ) ____________________

**భాషాంశాలు**

1. **కింది కవితల్లో ఏ అలంకారాలున్నాయో గుర్తించండి.** (10 మార్కులు)

(అ) భాగవతమున భక్తి ______________

(ఆ) 'గుండెలో శూలమ్ము గొంతులో శల్యమ్ము ______________

(ఇ) కాకి కోకిల కాదు కదా? ______________

(ఈ) లచ్చి పుచ్చకాయ తెచ్చి ఇచ్చింది. ______________

2. **కింది ప్రశ్నలను సూచించిన విధంగా రాయండి.**

(అ) అన్నదమ్ములు ఇద్దరు కలిసిమెలిసి ఉండేవారు. వారి మధ్య ఈర్ష్యాసూయలు లేవు. ఇద్దరూ కూరగాయలు అమ్ముకునేవారు.

ఇందులో ద్వంద్వ సమాస పదాలను గుర్తించి వాటి కింద గీత గీయండి.

(ఆ) ఈ కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి.

(i) శైలాగ్రం ______ + ______ ( )

(ii) అతడెక్కడ ______ + ______ ( )

(iii) ఆద్యంతం ______ + ______ ( )

(ఇ) కింది వాక్యాలలో గీతగీసినవి ఏ విభక్తులో తెలుపండి.

(i) ప్రపంచకప్ క్రికెట్‌లో భారత్ ఆరు వికట్ల<u>తో</u> కప్ గెలిచింది. ( )

(ii) గాంధీజీ <u>గురించి</u> నీకు తెలిసిన విషయాలు ఏమిటి? ( )

## 9వ తరగతి – రాత పరీక్షకు సంబంధించి సామర్థ్యాల వారీగా నమూనా ప్రశ్నలు

### I. అవగాహన ప్రతిస్పందన

**1. కింది పద్యాన్ని చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి. (అపరిచిత పద్యం)**

అనగననగ రాగ మతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ!

ప్రశ్నలు:–

అ) అంటూ ఉంటే అభివృద్ధి చెందేది ఏది?

ఆ) వేపాకు ఎప్పుడు తియ్యగా ఉంటుంది?

ఇ) లోకంలో పనులు దేనివల్ల సమకూరుతాయి?

ఈ) పై పద్యానికి శీర్షికను సూచించండి.

ఉ) ఈ పద్యం రాసిందెవరు?

**2. కింది పేరాను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి. (అపరిచిత గద్యం)**

కథానికకు కావలసిన మొట్టమొదటిది వస్తువు. వస్తువు లేకపోతే కథే లేదు. సరిగమపదనిసలు లేనట్లయితే సంగీతమే లేదు. రచయిత శిల్పి అయితే వస్తువు బండరాయి. లోకంలో బండరాళ్ళకి ఎలా కొరత లేదో వస్తువులకి కూడా కొరతలేదు. మనిషి జీవితం నిండా అవే. మనిషి జీవితమే ఒక గొలుసు. సంఘటనల గొలుసు. ఒక దానికి ఒకటి కలుపుకుంటూ ఎన్నెన్నో సంఘటనలు బ్రతుకంతా ఉంటాయి.

ప్రశ్నలు:–

అ) కథానికకు మొట్టమొదట కావలసినదేమిటి?

ఆ) లోకంలో కొరతలేని రెండు అంశాలు ఏవి?

ఇ) వస్తువు బండరాయి అయితే మరి రచయిత ఏమిటి?

ఈ) ఏమి లేకపోతే సంగీతమే లేదు?

ఉ) ఈ పేరాకు ఒక శీర్షికను సూచించండి.

**3. కింది పేరా చదవండి. ప్రశ్నలు రాయండి. (పరిచిత గద్యం)**

కాళోజీ నారాయణరావు 9 సెప్టెంబరు, 1914న వరంగల్ జిల్లా మడికొండలో జన్మించారు. అణా కథలు, కాళోజీ కథలు, తెలంగాణ ఉద్యమ కవితలు మొదలైనవి వీరి రచనలు. ఖలీల్‌జిబ్రాన్ "దప్రాఫెట్"ను జీవన గీతిగా తెలుగులోకి అనువదించారు. వీరి రచనల్లో "నా గొడవ" సుప్రసిద్ధం. వ్యావహారిక భాషను తన కవితను జీవభాషగా మార్చుకున్నాడు. 1992లో భారత ప్రభుత్వం "పద్మవిభూషణ్" అవార్డుతో వీరిని సత్కరించింది. వీరి జన్మదినోత్సవాన్ని మాండలిక భాషా దినోత్సవంగా జరుపుకుంటారు.

ప్రశ్నలు:-

అ)

ఆ)

ఇ)

ఈ)

ఉ)

**4. కింది పద్యం చదవండి. ప్రశ్నలు రాయండి. (పరిచిత పద్యం)**

ఆచార్యున కెదిరింపకు
బ్రోచిన దొర నింద సేయఁ బోకుము కార్యా
లోచనము లొంటిఁ జేయకు
మాచారము విడువ బోకుమయ్య కుమారా!

ప్రశ్నలు:-

అ)

ఆ)

ఇ)

ఈ)

ఉ)

**5. కింది పద్యాన్ని చదవండి. ప్రతిపదార్థం రాయండి.**

ఆ దుర్యోధనుడంత మాత్రమును జేయంజాలడో కాని, పెం
పేదం గ్రూరత కోర్వరాదు సిరినాకేలందునే, గ్రాస వా
సోదైన్యంబులు వచ్చు నాయరయునీ చుట్టాల కుం, గావునన్
మోదంబందుట గల్గు, గౌరవులు నేముం బొంది శ్రీ విందినన్

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (1వ రకం ప్రశ్నలు - నమూనాలు)

**(అ) వ్యాసరూప ప్రశ్నలు:**

1. తెలుగు భాషను మనం ఏ విధంగా కాపాడుకోవాలో రాయండి.
2. రచయితల వల్ల సమాజానికి జరిగే మేలు ఏమిటి? ఉదాహరణ పూర్వకంగా వివరించండి.
3. "రైతే దేశానికి వెన్నెముక" అని అంటారు కదా! ఎలాగో మీ సొంతమాటల్లో వివరించండి.
4. స్త్రీలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించారు. సాధిస్తున్నారు. ఎలాగో మీ అభిప్రాయాన్ని రాయండి.
5. యుద్ధాలు ఎందుకు వస్తాయి? వాటి వల్ల లాభమా? నష్టమా? యుద్ధాలను ఎలా నివారించవచ్చు. వీటి గూర్చి సొంతంగా రాయండి.

**(ఆ) లఘురూప ప్రశ్నలు: (2వ రకం ప్రశ్నలు – నమూనాలు)**

1. "ముందు నుయ్యి వెనుక గొయ్యి" అనే మాటను ఏ సందర్భంలో వాడతామో రాయండి.
2. కవిత్వం ఎలా ఉండాలో కాళోజీ చెప్పారు గదా! కవిత్వం ఎలా ఉండాలని నీవు అనుకుంటున్నావు?
3. అష్టాంగ ధర్మ ప్రవచనాలు ఏమిటి? ఇవి ఎవరు చెప్పారు?
4. విద్యార్థులకు ఉండవలసిన ముఖ్య లక్షణాలు ఏమిటి?
5. "వివేకం లేని విజ్ఞానం శూన్యం" – దీనిని సమర్థిస్తారా? ఎందుకు?

**(ఇ) సృజనాత్మకత (3వ రకం ప్రశ్నలు – నమూనాలు)**

1. నీవు చూసిన ఏదైనా ఒక నాట్యాన్ని (కూచిపూడి / భరతనాట్యం / బృందనాట్యం మొదలైన వాటిని గూర్చి) వర్ణిస్తూ వచనకవిత / గేయం / వర్ణనాత్మక పేరా రాయండి.
2. ప్రపంచ శాంతి ఆవశ్యకతను గూర్చి వ్యాసం రాయండి.
3. ఎలాంటి కష్టాలు వచ్చినా చలించక భగవంతుడినే నమ్మిన భక్తులు చాలామంది మన చరిత్రలో ఉన్నారు. అలాంటివారిలో ఏ ఒక్కరి గురించియైన ఒక కథ రాయండి.
4. ససేమిరా పాఠంలో పులి, ఎలుగుబంటి మధ్య జరిగిన సంభాషణను సంభాషణ రూపంలో రాయండి.
5. అబ్దుల్ కలాం గూర్చి మీ మిత్రునికి ఒక లేఖ రాయండి.

## III. భాషాంశాలు

**అ) పదజాలం : పదజాలానికి సంబంధించిన నమూనా ప్రశ్నలు**

**పదజాలానికి 2 భాగాలు ఉంటాయి.**

### <u>మొదటి భాగం</u>

**1. కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు అర్థాలు రాసి మరో వాక్యంలో దాన్ని ప్రయోగించండి.**

అ) పుట్టలో నుండి <u>భుజంగం</u> బయటకు వచ్చింది.

ఆ) కష్టమైన పదాలకు <u>కోశం</u> చూసి అర్థం తెలుసుకుంటాను.

ఇ) రాముడు దశరథుని <u>ఆత్మజుడు.</u>

ఈ) మల్లెపువ్వును ముక్కు దగ్గర పెట్టుకొని <u>ఆఘ్రాణించాను.</u>

ఉ) వినాయకుడు <u>మాతంగ</u> ముఖం కలిగినవాడు.

### <u>రెండవ భాగం</u>

**1. కింది వాటిని తెల్పండి.**

అ) మన జాతీయ పక్షి <u>నెమలి.</u> (పర్యాయపదాలు రాయండి.)

ఆ) రాకుమారుని చూచి <u>పులి</u> గాండ్రించింది. (పర్యాయపదాలు రాయండి.)

ఇ) ఆ <u>గజం</u> <u>గజం</u> కూడా జరగలేదు. (నానార్థాలు రాయండి.)

ఈ) దేవతల <u>గురువు</u> గూర్చి మా <u>గురువు</u>గారు చెప్పారు. (నానార్థాలు రాయండి.)

ఉ) <u>ముత్యం</u> బాగా మెరుస్తుంది. (వికృతి పదం రాయండి.)

ఊ) గురువు <u>ఆజ్ఞను</u> దిక్కరించకూడదు. (వికృతి పదం రాయండి.)

(పదజాలంలో పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి వికృతులు, సొంతవాక్యాలు, జాతీయాలు మొదలైనవి అడుగవచ్చు. ఇవేకాక పదజాలాభివృద్ధికి వచ్చే అన్ని అంశాలను అడుగవచ్చును.)

5 ప్రశ్నలు 5 అంశాలకు సంబంధించినవై ఉండాలి.

**ఆ) వ్యాకరణం – నమూనా ప్రశ్నలు**

**ఇందులో 2 భాగాలుంటాయి. ఒక్కొక్క భాగం 5 మార్కులకు ఉంటుంది.**

**మొదటి భాగం**

**1. కింది వాటిని తెల్పండి.**

అ) సదాచారం పాటించాలి. (విడదీయండి)

(లేదా)

సదాచారం – (సంధికార్యం రాయండి)

ఆ) ఎర్రనైన కలువ (సమాసం రాయండి)

(లేదా)

సమాసానికి ఉదాహరణ రాయండి.

(లేదా)

విగ్రహవాక్యం రాయండి.

ఇ) రామయ్య ప్రొద్దునే లేచాడు. రామయ్య ఊరికి బయలుదేరాడు. (సంశ్లిష్ట వాక్యంగా రాయండి.)

ఈ) అతడు తగిన సమయానికి రాలేదు. రైలు అందుకోలేక పోయాడు. (సంయుక్త వాక్యంగా రాయండి.)

ఉ) సదాశివగారిచేత సూక్తులు చెప్పబడ్డాయి. (కర్తరి వాక్యంగా రాయండి.)

**రెండవ భాగం**

**1. కింది వాటిని తెల్పండి.**

అ) శార్దూలము – (పద్య లక్షణాలు రాయండి)

ఆ) కింది పరోక్ష కథనాన్ని ప్రత్యక్ష కథనంలోకి మార్చండి.

- తనకు ఆవేశము, కోపము ఎక్కువని అంబేద్కరు అన్నాడు.

ఇ) దృష్టాంతాలంకార లక్షణం రాయండి.

(ఇవి కాకుండా వ్యాకరణాంశాలలో, ఛందస్సులో గురులఘువులను గుర్తించి, గణవిభజన చేయుట, అలంకారం గుర్తించుట, క్రియను మార్చి వ్యతిరేకార్థక వాక్యాలు రాయడం, ఛేదర్థక, శత్రర్థక, క్త్వార్థక వాక్యాలు మొదలైనవి అన్నీ అడుగవచ్చు.)

# సంగ్రహణాత్మక ప్రశ్నపత్రం - తెలుగు

**విద్యార్థి పేరు :** ______________________ **తరగతి : 9వ తరగతి**

**క్రమసంఖ్య :** ______________________ **మార్కులు : 90**

## రాత పరీక్ష

## I. అవగాహన - ప్రతిస్పందన (20 మార్కులు)

**1. కింది పద్యాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.** (5 × 1 = 5)

కమలములు నీట బాసిన
కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
తమ తమ నెలవులు దప్పిన
దమ మిత్రులే శత్రువులవుట తథ్యము సుమతీ!

ప్రశ్నలు:-

అ) కమలాలు నీటిని వదిలి పెడితే ఏమవుతాయి?

ఆ) ఎప్పుడు మిత్రులు కూడా శత్రువులవుతారు?

ఇ) తామరలకు మిత్రుడు ఎవరు?

ఈ) ఈ పద్యానికి శీర్షికను సూచించండి.

ఉ) దీనిలోని మకుటం ఏది?

**2. కింది పేరా చదవండి. 5 ప్రశ్నలు తయారుచేయండి.** (5 మార్కులు)

1893వ సంవత్సరం, సెప్టెంబరు 11వ తేదీ సోమవారం నాడు విశ్వమత మహాసభలు మొదలైనాయి. కొలంబస్ హాల్ అనే పెద్ద భవనంలో అవి జరిగాయి. వివేకానంద స్వామి ఇతర వ్యక్తులతోపాటు వేదికపై ముందు వరుసలో కూర్చున్నారు. శ్రోతలు దాదాపు నాలుగు వేలమంది. వివేకానందస్వామి మాట్లాడడానికి సిద్ధపడి “నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా” అని మొదలు పెట్టాడు. అంతే కరతాళధ్వనుల వర్షం కురిసింది.

ప్రశ్నలు:-

అ)

ఆ)

ఇ)

ఈ)

ఉ)

**3. కింది పద్యాన్ని చదవండి. ప్రతిపదార్థం రాయండి.** (10 మార్కులు)

మనమునఁబక్షపాతగతి మాదెస మానుము ధర్మనీతి వ
ర్తనముల రెండు దిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున విదురాది సజ్జనుల బుద్ధికి రానుచితంబు తొడి మె
ల్పునఁ బరుసందనంబునను భూపతులెల్ల నెఱుంగ నాడు మీ!

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (50 మార్కులు)

**1. వ్యాసరూప ప్రశ్నలు**

**అ) కింది ప్రశ్నలలో 2 ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** (2 × 10 = 20)

1. తెలుగు భాషను కాపాడుకోవాలంటే మనం ఏం చేయాలో రాయండి.
2. "రైతే దేశానికి వెన్నెముక" ఎలాగో సమర్థిస్తూ రాయండి.
3. స్త్రీలు సాధిస్తున్న అభివృద్ధి, ఇంకా ఏయే రంగాలలో వాళ్ళు అభివృద్ధి సాధించాలో సొంతమాటల్లో రాయండి.
4. యుద్ధాలు ఎందుకు వస్తాయి? వాటి వల్ల లాభమా? నష్టమా? యుద్ధాలను ఎట్లా నివారించవచ్చు? రాయండి.

**2. లఘురూప ప్రశ్నలు**

**ఆ) కింది ప్రశ్నలలో 5 ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** (5 × 2 = 10)

1. "ముందు నుయ్యి వెనుక గొయ్యి" అనే మాటను ఏ సందర్భంలో వాడతారో రాయండి.
2. కవిత్వం ఎలా ఉండాలో నీ మాటలలో రాయండి.
3. విద్యార్థులకు ఉండాల్సిన ముఖ్యలక్షణాలు ఏమిటి?
4. "వివేకంలేని విజ్ఞానం శూన్యం" - ఎలాగో రాయండి.
5. అష్టాంగ ధర్మ ప్రవచనాలు ఏమిటి? అవి ఎవరు చెప్పారు?
6. రచయిత వల్ల సమాజానికి ఎటువంటి మేలు జరుగుతుందో రాయండి.

**3. సృజనాత్మకత** (20 మార్కులు)

**(అ) కింది వానిలో 2 ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** (2 × 10 = 20)

1. నీవు చూసిన ఏదైనా నాట్యం (కూచిపూడి / భరతనాట్యం / కోలాటం / దరువు మొదలగునవి) గూర్చి వర్ణిస్తూ వచన కవిత / గేయం / వర్ణనాత్మక పేరా రాయండి.
2. ప్రపంచ శాంతి ఆవశ్యకతను గూర్చి ఒక కరపత్రం తయారుచేయండి.
3. అబ్దుల్ కలాం గూర్చి మిత్రునికి లేఖ రాయండి.

## III. భాషాంశాలు (20 మార్కులు)

### పదజాలం

**1. కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.** (5 × 1 = 5)

అ) విహారయాత్రకు వెళ్దామనగానే నాకెంతో మోదం కలిగింది.

ఆ) వినాయకుని తండ్రి ధూర్జటి.

ఇ) హాలికుడు కష్టపడి పొలం దున్నుతాడు.

ఈ) నేను పరుగెత్తి పరుగెత్తి డస్సి పోయాను.

ఉ) రామచిలుక చక్కని పులుగు.

**2. కింది వాటిని తెల్పండి.** (5 × 1 = 5)

అ) సర్వేంద్రియానాం నయనం ప్రధానమంటారు. (పర్యాయపదాలు రాయండి.)

ఆ) నాకు ఆశ లేదు. ఆ పరమాత్ముడే ఆశ. (నానార్థాలు రాయండి.)

ఇ) <u>అంబుజనాభుడు</u> దశావతారాలు ఎత్తాడు. (వ్యుత్పత్త్యర్థం తెల్పండి.)

ఈ) నీవు చేయదలచిన <u>కర్జము</u> వెంటనే చేయి. (ప్రకృతి రాయండి.)

ఉ) <u>సముద్రం</u> అలలతో ఉప్పొంగుతుంది. (వికృతి పదం రాయండి.)

## <u>వ్యాకరణాంశాలు</u>

**1. కింది వాటిని తెల్పండి.** (5 × 1 = 5)

అ) <u>రవీంద్రుడు</u> గొప్పకవి (విడదీయుము)

ఆ) విజ్ఞానము కొరకు యాత్ర. (సమాసం చేయుము)

ఇ) శారద బాగా చదివింది. శారద పరీక్ష రాసింది. (సంశ్లిష్ట వాక్యం రాయండి.)

ఈ) విమల పాడగలదు. నాట్యం చేయబడింది. (సంయుక్తవాక్యం రాయండి.)

ఉ) సాంబయ్య చేత వస్త్రం నేయబడింది. (కర్తరివాక్యం రాయండి.)

**2. కింది వాటిని తెల్పండి.** (5 మార్కులు)

అ) "ఉత్ప్రేక్ష" అలంకార లక్షణాన్ని తెల్పుము. (1 మార్కు)

ఆ) "నేను ఏ ప్రయోజనం కోసం ఎవరినీ మోసం చేయలేదు" అని శ్రీధర్ అన్నాడు. (2 మార్కులు)
(పరోక్ష కథనంలోకి మార్చి రాయండి.)

ఇ) "చంపకమాల" - పద్య లక్షణాలను రాయండి. (2 మార్కులు)

# తప్పొప్పుల పట్టిక

**పాఠ్యపుస్తకంలోని కింది దోషాలను సవరించుకొని చదవాలి. తదుపరి ముద్రణలో తప్పుల సవరణ జరుగుతుంది.**

**9వ తరగతి (ప్రథమభాష)**

| పేజి నం. | పంక్తి నెం. | దోషం | సవరణ |
|---|---|---|---|
| 7 | 12 | నాన్ + అరయు | నా + అరయు |
| 12 | 8 | అనిష్ఠత | అనిష్టత |
| 12 | 15 | అనురాగ సూచకములగున నసందర్భాలాప | అనురాగ సూచకములగు నసందర్భా |
| 13 | 14 | పారణమొనర్చి వాడే | పారణమొనర్చిన వాడే |
| 15 | 10 (3వపేరా) | కస్వతంత్ర యేమి | కస్వతంత్రత యేమి |
| 15 | 1 (చివరిపేరా) | నాయనాలారా! | నాయనలారా! |
| 16 | 2 | చిత్తగింపవలయున | చిత్తగింపవలయును |
| 28 | 14 | గంగా అను పేరు గల నది | గంగ అను పేరుగల నది |
| 28 | 15 | భారత అనే | భారతం అనే |
| 40 | 4వ పద్యంలో 3వ లైను | దింగంతంబులనే | దిగంతంబులనే |
| 46 | | దు_ఖం | దుఃఖం |
| 59 | టైటిల్ | "ససేమిరా" (ఇన్వర్టెడ్ కామాలుండగూడదు) | ససేమిరా |
| 57 | | సబంధించిన | సంబంధించిన |
| 66 | Blue Boxలో3 | భీమాకారమైన ఆకృతి | భీమమైన ఆకృతి |
| 58 | పద్యాదిసంధిలో5 | పట్టె | పట్టు |
| 42 | 9 | సీతా సుందరీ | నీలా సుందరీ |
| 75 | 2 (రచయిత్రి పరిచయం) | కఠినాంశాలు | హరివంశాలు |
| 127 | శీర్షిక | స్పూర్తిదాతలు | స్ఫూర్తిదాతలు |
| 168 | 4 | ఉంగరపు వ్రేలు | వ్రేలు |
| 170 | తలో-7 | స్వచ్ఛమైన | ఉపేక్ష |
| 171 | మలో-3 | (తేనెటీగ) | తుమ్మెదలలో శ్రేష్ఠమైనది |
| 173 | 2వ వరుసలో-3 | మెయిలు | మొయిలు |
| 174 | 23 | సుక్తి | శుక్తి |
| ix | 6,7 | అక్టోబర్ సెప్టెంబర్ | సెప్టెంబర్ అక్టోబర్ |
| 131, 135, 137 | చిత్రాల కింద | వివేకనంద | వివేకానంద |

## 8వ తరగతి (ప్రథమభాష)

| పేజి నం. | పంక్తి నెం. | దోషం | సవరణ |
|---|---|---|---|
| 10 | 11 (.ఏ) | లేఖ + ఆవళి | లేఖా + ఆవళి |
| 12 | 8 | స్తోమత | స్థోమత |
| 23 | 2 (7ప.లో) | దాస్యముcవాపి | దాస్యము_వాపి |
| 26 | 2 | దాస్యముcవాపి | దాస్యము_వాపి |
| | 10(ప్రతిపదార్థం) | పాచి కొనంగ | పాపి కొనంగ |
| | 11(ప్రతిపదార్థం) | నీకు | నీకున్ |
| 36 | 12 | బద్ధకస్తుడౌతున్నాడు | బద్ధకస్థుడౌతున్నాడు |
| | 29 | బద్ధకస్తులు | బద్ధకస్థులు |
| 37 | 2(II. 2. 1లో ఆ) | అంతస్థుల భవనం | అంతస్తుల భవనం |
| 43 | 3 | క్షమcయుండునో | క్షమయుండునో |
| 48 | 15 | సంశ్లేష | సంశ్లేషలు |
| 57 | 8 (ఈ) | నోరు జూపు | నోరు సూపు |
| 58 | 9 (సప్తమీ) | దేశముయందు | దేశమునందు |
| 60 | 6 | దిశ్చక్రాన్ని | దిక్చక్రాన్ని |
| 70 | 3 | విశ్వంబుcనందు | విశ్వంబు_నందు |
| 73 | 4 (3. IV) | శరథి | శరధి |
| 74 | 4 (3. ఆ) | వారథి | వారధి |
| 75 | 2 (VII. 1.ఆ) | గుణములుబొగడు | గుణములు వొగడ |
| 77 | 4వ ప్రశ్నలో | స్వాతంత్ర్యోద్యమ | సాతంత్ర్యోద్యమ |
| 79 | 10 | ప్రశ్ని_చాడు | ప్రశ్నించాడు |
| 81 | 5 | ప్రశ్ని_చాడు | ప్రశ్నించాడు |
| 85 | 3 (2. ఆ) | వైఢూర్యము | వైడూర్యము |
| 89 | 15 (సారాంశం) | ప్రతిష్టాత్మక | ప్రతిష్ఠాత్మక |
| 92 | VII లో 2వలైను | యేరవుతుంది | ఏరవుతుంది |
| 105 | టైటిల్ | "సముద్రలంఘనం" | సముద్రలంఘనం |
| 108 | 1 | మాదానాయకుడు పరిపాలించిన దేవరకొండ ప్రాంతంవాడు | రామభద్రకవి పూర్వులు తరతరాలనుండి నేటి కడప మండలంలోని ఒంటిమిట్టలో నివసిస్తున్నారు. ఈ కవీశుని బాల్యమంతా ఒంటిమిట్టలోనే గడిచింది. |

| పేజి నం. | పంక్తి నెం. | దోషం | సవరణ |
|---|---|---|---|
| 111 | 2(IIలో 2లో ఆ) | దక్షిణ దిక్కు | దక్షిణ దిశ |
| | 4 (IV.3.ఈ) | చేసినది | చేయబడినది |
| | 2 (IV.3.2) | నుండి | నందు |
| | 3 (IV.3.3) | కలిగినవాడు | కలది |
| | 8 (IV.3.8) | ధరచేతదరింపబడేది | ధరను ధరించునది |
| | (IV.3.ఋ) | పారావార | పారావారము |
| 119 | 1 (ప్రక్రియ) | సంఘటనలతో | సంఘటనలలో |
| 120 | 4 (2లో) | అత్యాచారారాలు | అత్యాచారాలు |
| 123 | 2 (4లో2) | పూర్వకాలము | పూర్వకాయము |
| 130 | 48 (IV.లోఇ) | మచ్చగించు | మచ్చరించు |
| 126 | 1(6వ పద్యంలో) | మచ్చరకించి | మచ్చరికించి |
| 171 | ఉ-లో2 | బాగా వెలుగు ఉన్న | బాగా వెలుగు తున్న |
| 172 | 6 | తిరస్కారం | మౌనం |
| 172 | పలో 17 | పృథితయశం | ప్రథితయశం |
| 172 | లలో 1 | దూకడ, దుమకడం, దాటివెళడం | దూకు, దుముకు, దాటివెళ్ళు |
| 172 | వలో 18 | దుఃఖం | దుఃఖం తోడి మాలు |
| 172 | వలో 21 | రంధ్రం | రంధ్రం |
| 173 | 21(పర్యాపదాలు) | పతాకం | పతాక |
| 173 | 24(పర్యాయ.ప.) | గిరి, కొండ, నగం | కొండకొమ్ము, శిఖరం |
| 173 | 30(పర్యాయ.ప) | కకుత | కకుత్తు |
| 173 | 9(పర్యాయ.ప. 2వ వైపు | కలధాతం | కలధౌతం |
| 173 | 13(పర్యాయ.ప. 2వ వైపు | శరథి | శరధి |
| 173 | 14(పర్యాయ.ప. 2వ వైపు | వారథి | వారధి |
| 173 | 3 (నానార్థాలు) | దేవత | రెప్పపాటులేనిది |
| 174 | 2 | అజ్ఞానం, పట్టకారు, వ్యర్థపుమాట | వర్షాకాలం, కాలం |
| 174 | 9 | సమూహం | శిఖరం |

| పేజి నం. | పంక్తి నెం. | దోషము | సవరణ |
|---|---|---|---|
| 174 | 24 | వాక్యము | కీర్తన |
| 174 | 25 | కుండదెబ్బ | కుండ, దెబ్బ |
| 174 | 10 (2వ వైపు) | (ఆవాసం) | జన్మస్థానము |
| 174 | 2 (ప్రకృతి) | నిముషము | నిమిషము |
| 174 | 12 (వికృతి) | గోవం | గారవం |
| 174 | 24 (ప్రకృతి) | దక్షిణం | దక్షిణ |
| 174 | 26 (వికృతి) | కుండ | కడవ |